# మార్కు సువార్త

# మార్కు సువార్త
# విభజన - విశ్లేషణ

మార్కు సువార్త సారాంశమంతా ఒకే వచనంలో ఇమిడి వున్నది. "మనుష్య కుమారుడు పరిచారము చేయించ కొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెను" (10:45). ఒక్కో అధ్యాయం చదివే కొద్దీ మనకు యేసుక్రీస్తు జీవితంలోని సేవ, బలిదానం అనే రెండు పార్శ్వాలు అవతరిస్తాయి.

తండ్రి చిత్తానికి లోబడి, నిరంతరము పరిశ్రమిస్తున్న సేవకుడిగా యేసును మార్కు మన ఎదుట సాక్షాత్కరింప జేశాడు. ఆయన తన బోధనలు, ఉపదేశాలు, స్వస్థతల ద్వారా మరణమయ్యే దాకా ఇతరులకు సేవ చేస్తూనే వున్నాడు. పునరుత్థానం తరువాత తన శిష్యులు తన పనిని తన శక్తితో కొనసాగించాలని ఆదేశించాడు. సేవకులు పరిపూర్ణ సేవకుడి ఆదర్శం పాటించడమంటే ఇదే.

ఈ సువార్త ప్రాచీన శీర్షిక "కాటామార్కోస్" అంటే మార్కు తెలియజేసిన సువార్త. లాటిన్ భాషలో రచయిత పేరు "మార్కస్", హీబ్రూ వర్గాలలో అతడి పేరు జాన్, అపొ.కా. 12:12,25; 15:37లో 'మార్కు' అను మారు పేరుగల యోహాను అని ఇతడి పేరు ప్రస్తావించటం గమనిస్తాం.

## రచయిత

అపొ.కా. 12:12 ప్రకారం మార్కు తల్లి మరియకు యెరూషలేములో విశాలమైన ఇల్లు వున్నది. దానిని యెరూషలేములోని విశ్వాసులు ప్రార్ధన కూడిక కేంద్రంగా వినియోగించుకొనేవారు. పేతురు ఈ ఇంటికి తరచు వెళ్లేవాడని అర్థమవుతుంది. ఎందుకంటే గడప దగ్గర పనిపిల్ల అతడి స్వరం విని గుర్తుపట్టింది (అపొ.కా. 12:13-16). బర్నబా మార్కుకు మేనమామ (కొలస్సీ 4:10). అయితే అతణ్ణి ప్రభువులోకి నడిపింది పేతురు. (ఎందుకంటే పేతురు అతణ్ణి "నా కుమారుడు మార్కు" అని పేర్కొన్నాడు. 1పేతురు 5:13). పేతురుతో వున్న ఈ సాన్నిహిత్యమే మార్కు సువార్తకు అపొస్తలిక అధికారం కలగటానికి ముఖ్య కారణం. ఎందు కంటే మార్కు తన సువార్త వివరాలన్నీ పేతురు నుండే సేకరించాడు. గెత్సెమనే తోటలోని సంఘటనలో కనిపించే "ఒక పడుచు వాడు" మార్కు అని కొందరు పండితుల అభిప్రాయం (14:51,52). శిష్యులంతా ప్రభువును విడిచి వెళ్లిపోయినందున (14:50) ఈ చిన్న సంఘటన సాక్షి కథనం అని భావించడానికి అవకాశం ఉంది.

బర్నబా, పౌలులు యెరూషలేము నుండి అంతియొకయ కు తిరిగి వెళ్లినప్పుడు (అ.కా. 12:25), మరల మొదటి సేవా యాత్రలో మార్కును వెంటబెట్టుకొని వెళ్లారు (13:5). అయితే, మార్కు మధ్యలోనే వారిని విడిచిపెట్టి యెరూషలేము కు తిరిగి వచ్చాడు (13:13). రెండవ సేవా యాత్రలో బర్నబా మార్కును వెంటబెట్టుకొని వెళ్లాలని ప్రతిపాదిస్తే పౌలు దానికి ససేమిరా అన్నాడు. దానితో వారిద్దరి మధ్య భేదాభిప్రాయాలు పొడసూపాయి. ఫలితంగా బర్నబా మార్కును వెంటబెట్టుకొని కుప్రకు వెళ్లాడు. పౌలు సీలను వెంటబెట్టుకొని సిరియ, కిలికియ ప్రాంతాలకు వెళ్లాడు (అ.కా. 15:3-641). అయితే దాదాపు పన్నెండేళ్ల తరువాత తనను మొదటిసారి బంధించి నప్పుడు మార్కు తనతో వున్నట్టు పౌలు రాశాడు (కొలస్సీ 4:10; ఫిలేమోను 2:4). దీనిని బట్టి వారి మధ్య సయోధ్య కుదిరి వుంటుందని భావించవచ్చు. పౌలు తన జీవిత చరమాంకంలో మార్కు కోసం కబురుపెడుతూ "అతడు పరిచారము నిమిత్తము నాకు ప్రయోజనకరమైనవాడు" అన్నాడు (2తిమోతి 4:11).

అది సంఘ పితరులు ఈ సువార్తను మార్కు రాసినట్టు అంగీకరించారు. మార్కు కర్తృత్వాన్ని ఆమోదించిన అది సంఘ పితరులలో పాపియాస్, ఐరేనియస్, అలెగ్జాండ్రియా వాడైన క్లెమెంట్, ఓరిగెన్ మొదలైనవారు వున్నారు.

## రచనా కాలం

నాలుగు సువార్తలలో మొట్టమొదటిది మార్కు అని పండితుల అనేకుల అభిప్రాయం. అయితే తేదీ విషయం అస్పష్టత నెలకొని వున్నది. యెరూషలేం దేవాలయం నాశనం విషయమైన ప్రవచనాన్ని బట్టి (13:2), క్రీ.శ. 70 ముందే రాసి వుండాలి. అయితే ప్రాచీన సాంప్రదాయాలలో పేతురు హతసాక్షి కావటానికి (క్రీ.శ. 64) ముందు రాశాడో, లేక తరువాత రాశాడో అనే విషయంలో ఏకాభిప్రాయం లేదు.

బహుశ ఈ సువార్త క్రీ.శ. 55-65 మధ్యకాలంలో రాసి వుండవచ్చు.

మార్కు తన సువార్తను రోమ్ నగరంలో, రోమనుల నుద్దేశించి రాశాడు. యేసుక్రీస్తు వంశావళి, నెరవేరిన ప్రవచనాలు, ధర్మశాస్త్ర ప్రస్తావన, ఇతర సువార్తలలో కనిపించే కొన్ని యూదుల సాంప్రదాయాలను మార్కు తన సువార్తలో పొందుపరచకపోవడానికి కారణం అవి యూదేతరులకు అర్థవంతం కావు అనే ఉద్దేశం కాబోలు. మార్కు అనేక అరామీ పదాలను అనువదించాడు. (13:17; 5:41; 7:34; 15:22), అనేక గ్రీకు పదాల స్థానంలో లాటిన్ పదాలను వినియోగించాడు. (4:21; 6:27; 12:14,42; 15:15,16,39).

## మార్కు సువార్తలో క్రీస్తు

ప్రజల అధ్యాత్మిక, భౌతిక అక్కరలు నిరంతరము తీర్చే యెహోవా సేవకుడిగా యేసును మార్కు చూపెట్టాడు. ఇది సేవకుని గూర్చిన కథనం గనుక మార్కు యేసు వంశావళిని, జన్మను వదిలేసి వెంటనే ఆయన బహిరంగ సేవతో మొదలుపెట్టాడు. ఈ సువార్తలో మనకు కనిపించే ముఖ్యపదం యూతస్ దీనికి వెంటనే, మరుక్షణమే అని అర్థం. ఈ చిన్న సువార్తలో ఈ పదం చాలాసార్లు కనిపిస్తుంది (42 పర్యాయాలు). యేసుక్రీస్తు తన లక్ష్యం వైపు చకచకా కదిలి వెళ్లడం ఈ సువార్తలో చూస్తాం. ఈ అసమాన సేవకుడి బలము, అధికారం స్పష్టంగా చూపెట్టాడు మార్కు. ఆయన్ను దేవుని కుమారుడిగా గుర్తించాడు (1:1,11; 3:11; 5:7; 9:7; 13:32; 14:61; 15:39).

## మార్కు సువార్తలో కీలక అంశాలు

### కీలక పదం : సేవకుడు యేసు

మొట్టమొదటి వచనంలోనే దేవుని కుమారుడి జీవితం, సేవ ప్రస్తావించటం జరిగింది. అయితే ఈ సువార్త కీలకాంశం 10:45లో కనిపిస్తుంది. యేసుప్రభువును సేవకుడిగా, మానవుల విమోచకుడిగా మార్కు చిత్రీకరించాడు (ఫిలిప్పీ 2:5-11తో పోల్చండి). ఇతర సువార్తల లాగ మార్కు జీవిత చరిత్రగా గాక, కథాత్మకంగా వివరించాడు. క్రీస్తు బోధలను పనులను మార్కు ఒకచోట చేర్చి అవి ఒకదానిని మరొకటి ఎలా సమర్థిస్తున్నాయో చూపెట్టాడు. ఈ సువార్తలో అద్భుతాలు ప్రధాన భూమిక పోషించాయి. మొత్తం మీద 18 అద్భుతాలు ప్రస్తావనకు వస్తున్నావయి. యేసుప్రభువు అధికారాన్నే కాదు, ఆయన కనికరాన్ని చూపెట్టడానికి వీటిని వినియోగించాడు. దేవుని కుమారుడు తన మరణం ద్వారా అంతిమంగా ఎలా విజయం సాధించాడో మార్కు తన యూదేతర పఠితలకు వెల్లడించాడు.

**మూల వాక్యాలు :**
**మార్కు 10:43-45; 8:34-37**

### ముఖ్యమైన అధ్యాయం : 8

మత్తయిలో లాగే మార్కులో కూడా కీలకమైన అధ్యాయం వున్నది. మత్తయిలో 12వ అధ్యాయం, మార్కులో 8వ అధ్యాయం అలాంటివి. కీలకమైన సంఘటన "నీవే క్రీస్తువు" అనే పేతురు ఒప్పుకోలులో వున్నది. విశ్వాస పూరితమైన స్పందన ద్వారా యేసుప్రభువు సేవలోనే ఒక నూతన అధ్యాయం ఆరంభమైనట్టుంది. ఇంతవరకు తాను మెస్సీయానని ప్రకటించిన దాన్ని సమర్థించుకుంటూ వచ్చాడు. ఇక ఇప్పటి నుండి మతనాయకుల చేతుల్లో తన వారికి కల్గయైయున్న శ్రమలు, మరణం నుండి భద్రపరచ డానికి ఉపక్రమించాడు. యేసుప్రభువు అడుగులు రోజు రోజుకూ యెరూషలేము వైపు పడుతున్నాయి. అక్కడ పరిపూర్ణ సేవకుడు తన సేవకత్వాన్ని సంపూర్ణంగా వెల్లడించ బోతున్నాడు.

మొదటి పది అధ్యాయాల్లో ఆయన ఇతరులకు సేవ చేసిన వైనం గమనిస్తాం. 11-16 అధ్యాయాల్లో సేవకుడి విమోచన పరిచర్యలలో చివరి ఏడు రోజులు ఉన్నాయి. ఆయన యెరూషలేములో గడిపిన సందర్భంలో ప్రధాన యాజకులు, శాస్త్రులు, పెద్దలు, పరిసయ్యులు, హేరోదీయులు, సద్దూకయ్యుల నుండి విపరీతమైన వ్యతిరేకత వచ్చింది. ఎందుకంటే దేవాలయంలో యేసు వారి వాదనలను బహిరంగంగా ఖండించాడు. శిష్యులతో కడసారి రాత్రి భోజనం తరువాత తనను నిర్బంధించడానికి దూషించడానికి చివరకు హీనమైన సిలువ మరణానికి ఎలాంటి అడ్డు చెప్పలేదు. మానవజాతి అసంఖ్యాక పాపాలను భరించడానికి ఆయన ఇష్టపడటమే సేవకత్వంలో పరాకాష్ఠ.

మత్తయి సువార్త ప్రభువును రాజ సింహంగా, మార్కు సువార్త ఆయనను సేవక కోడెదూడగా, లూకా జ్ఞాన మానవునిగా, యోహాను గగనాన విహరించే పక్షిరాజు అంటే దేవునిగా చిత్రీకరించాయి.

# విభజన

**మొదటి భాగం :** సేవకుని ఆవిష్కరణ (1:1-2:12)

1. సేవకుడి ఆగమన దూత (1:1-8)
2. సేవకుడి బాప్తిస్మం (1:9-11)
3. సేవకుడి శోధన (1:12,13)
4. సేవకుడి పని (1:14-2:12)
   1. సేవకుడి పని (1:14,15)
   2. మొదటి శిష్యుల పిలుపు (1:16-20)
   3. మొదటి అద్భుతాలు (1:21-2:12)
   1) దయ్యాలను వెళ్లగొట్టాడు (1:21-28)
   2) పేతురు అత్తకు స్వస్థత (1:29-31)
   3) అనేక స్వస్థతలు (1:32-39)
   4) కుష్ఠరోగి శుద్ధుడయ్యాడు (1:40-45)
   5) పక్షవాత రోగికి స్వస్థత (2:1-2)

**రెండో భాగం :** సేవకుడికి వ్యతిరేకత (2:13-8:26)

1. సేవకుడికి ప్రారంభ వ్యతిరేకతలు (2:13-3:35)
   1) పాపులతో యేసు స్నేహం విషయం వివాదం (2:13-22)
   2) మత్తయి పిలుపు (2:13)
   3) బట్ట, ద్రాక్షతిత్తుల ఉపమానం (2:18-22)
   4). సబ్బాతు పని విషయం వివాదం (2:13-22)
   5). సబ్బాతు రోజు స్వస్థత విషయం వివాదం (3:1-5)
   6). యేసును నాశనం చెయ్యాలని పరిసయ్యుల ఆలోచన (3:6-12)
   7) పన్నెండుమంది ఎంపిక (3:13-19)
   8) ఆయన స్నేహితుల వ్యతిరేకత (3:22-30)
   9) శాస్త్రుల క్షమించరాని పాపం (3:22-30)
   10) నూతన నిబంధన నిర్వచనం (3:31-35)
2. సేవకుడి ఉపమానాలు (4:1-34)
   1) నేలల ఉపమానం (4:1-20)
   2) దీపం ఉపమానం (4:21-25)
   3) ఎదిగే విత్తనం ఉపమానం (4:26-29)
   4) ఆవగింజ ఉపమానం (4:30-34)
3. సేవకుడి అద్భుతాలు (4:1-34)
   1) సముద్రమును నిమ్మళింపజేయుట (4:35-41)
   2) దయ్యాలను పందుల మందలోకి వెళ్లగొట్టుట (5:1-20)
   3) యాయీరు తన కూతురు కోసం అభ్యర్థన (5:21-24)
   4) రక్తస్రావ రోగం గల స్త్రీకి స్వస్థత (5:25-43)
   5) యాయీరు కుమార్తెకు స్వస్థత (5:35-43)
4. సేవకుడికి వ్యతిరేకత ఎక్కువగుట (6:1-8,26)
   1) నజరేతులో యేసును తిరస్కరించుట (6:1-6)
   2) పన్నెండు మందిని సేవకు పంపించుట (6:7-13)
   3) బాప్తిస్మమిచ్చే యోహాను హతుడగుట (6:14-29)
   4) పన్నెండు మంది తిరిగి వచ్చుట (6:30,31)
   5) అయిదువేల మందికి ఆహారం (6:32-44)
   6) యేసు నీళ్లమీద నడచుట (6:45-52)
   7) గెన్నెసరేతులో యేసు స్వస్థపరచుట (6:53-56)
   8) పరిసయ్యులు, అపవిత్రత (7:1-23)
   9) అన్యుల యొద్దకు వెళ్లుట (7:24-8:90)
      1. సురోఫెనీకే స్త్రీ కుమార్తె స్వస్థత (7:24-30)
      2. మూగ, చెవిటి వ్యక్తికి స్వస్థత (7:31-37)
      3. నాలుగు వేలమందికి ఆహారం 98:1-9)
   10). పరిసయ్యులు సూచన అడుగుట (8:10-13)
   11) శిష్యులకు అర్థం కాలేదు (8:14-21)
   12) గుడ్డివాడికి చూపు (8:22-26)

**మూడో భాగం :** సేవకుడి హెచ్చరికలు (8:27-10; 10:52)

1. క్రీస్తును గూర్చిన పేతురు ఒప్పుకోలు (8:27-33)
2. శిష్యరికపు వెల (8:34-38)
3. రూపాంతరం (9:1-13)
4. దయ్యం పట్టిన కుమారుని విడిపించుట (9:14-29)
5. యేసు తన మరణాన్ని ముందే సూచించాడు (9:30-32)
6. శిష్యులను సిద్ధపరచడానికి యేసు బోధలు (9:33-10:45)

1) సేవ వైఖరి (9:33-41)

2) నరకాన్ని గూర్చి హెచ్చరిక (9:42-50)

3) వివాహం - విడాకులు (10:1-12)

4) చిన్న పిల్లలు - దేవుని రాజ్యం (10:13-16)

5) సంపద (10:17-31)

1. సంపన్న యువ అధికారి (10:17-22)

2. సంపదలోని సమస్య (10:23-27)

3. నిత్య ప్రతిఫలం (10:28-31)

6) రానైయున్న సిలువ మరణం (10:32-34)

7) గొప్పవారు కావాలని ఎవరైనా ఆశిస్తే (10:35-45)

7. గుడ్డి బర్తిమయికి స్వస్థత (10:46-52)

**నాలుగో భాగం :** సేవకుణ్ణి తిరస్కరించడం (11:1-15:47)

1. సేవకుడి ఆవిష్కరణ (11:1-19)

1) విజయ ప్రవేశం (11:1-11)

2) అంజూరపు చెట్టును శపించుట (11:12-14)

3). దేవాలయం శుద్ధి (11:15-19)

2. పస్కా పండుగలో హెచ్చరికలు (11:20-26)

1) విశ్వాసపు శక్తి (10:20-24)

2) క్షమాపణ ఆవశ్యకత (11:25,26)

3. నాయకుల వ్యతిరేకత (11:27-12:44)

1) అధికారాన్ని గూర్చిన ప్రశ్న (11:27-33)

2) ద్రాక్షతోట యజమాని ఉపమానం (12:1-12)

3) పన్నుల విషయం (12:13-17)

4) పునరుత్థానం విషయం (12:18-27)

5) గొప్ప ఆజ్ఞ విషయం (12:18-27)

6) యేసు మతనాయకులను ప్రశ్నించుట (12:35-37)

7) యేసు మతనాయకులను ఖండించుట (12:38-44)

4. భవిష్యత్తును గూర్చిన హెచ్చరికలు (13:1-37)

1) శిష్యులు అడిగిన ప్రశ్నలు (13:1-4)

2) శ్రమల కాలం (13:5-23)

3) రెండవ రాకడ (13:5-23)

4) అంజూరపు చెట్టు ఉపమానం (13:28-31)

5) మెలకువగా వుండునట్లు హెచ్చరికలు (13:32-37)

5. సేవకుడి శ్రమలు (14:1-15:47)

1) యేసును చంపటానికి నాయకుల కుట్ర (14:1,2)

2) మరియ యేసును అభిషేకించుట (14:3-9)

3). యేసును పట్టి ఇవ్వాలని యూదా పథకం (14:10,11)

4) పస్కా సిద్ధపరచుట (14:12-16)

5) పస్కా ఆచరించుట (14:17-21)

6) ప్రభురాత్రి భోజనము స్థాపన (14:22-25)

7) పేతురు అబద్ధమాడతాడని ముందే సూచించుట (14:26-31)

8) గెత్సెమెనే తోటలో యేసు ప్రార్థన (14:32-42)

9) యూదా యేసును పట్టి ఇచ్చుట (14:43-52)

10) యేసు విచారణ (14:53-15:14)

1. సన్‌హెడ్రిన్ సభ యేసును విచారించుట (14:53-65)

2. పేతురు యేసును కాదనుట (14:66-72)

3. పిలాతు యేసును విచారించుట (15:1-14)

4. యేసును కొట్టుట (15:15-23)

5. యేసును సిలువ వేయుట (15:24-41)

6. యేసు సమాధి 915:42-47)

**అయిదో భాగం :** సేవకుడి పునరుత్థానం (16:1-20)

1. యేసు పునరుత్థానం (16:1-8)

2. యేసు దర్శనం (16:9-18)

3. యేసు ఆరోహణం (16:19,20)

# సేవా ధర్మము - 1

## సేవకుడొచ్చాడు (మార్కు : 1)

యేసుక్రీస్తు ప్రభువును లోకానికి పరిచయం చేయడంలో పరిశుద్ధాత్ముడు నలుగురు సువార్త రచయితలను నాలుగు ఉద్దేశాలతో ఉపయోగించుకున్నాడు. రక్షకుని గురించి నాలుగు భావ చిత్రాలను ఆవిష్కరింపజేశారు.

మత్తయి తన సువార్త ఆరంభంలోనే యేసుక్రీస్తు వంశావళిని ఇవ్వడం ద్వారా దావీదు సింహాసనానికి ఆయన వారసుడన్న అంశాన్ని స్థిరం చేశాడు. లూకా అయితే మరియమ్మ తండ్రి హేలీ ద్వారా వంశవృక్షాన్ని ఆదాము వరకు తీసుకుపోవడంతో ప్రభువు యొక్క మానవత్వాన్ని వెల్లడిపరచాడు. యోహానైతే యేసుక్రీస్తు దేవుని కుమారుడనీ, ఆయనపై నమ్మక ముంచి మనమంతా నిత్యజీవం పొందాలన్న ఉద్దేశంతో తాను ఆ సువార్త వ్రాశాననీ చెప్పుకున్నాడు.



దేవుని ఏర్పాటు ప్రకారం యేసును దేవుని సంపూర్ణ సేవకునిగా చూపించే బాధ్యత మార్కుకు సంక్రమించింది. ఎక్కువ ఉపోద్ఘాతమేమీ లేకుండానే మార్కు తన కథనాన్ని ఆరంభించి 16 అధ్యాయాలలో ఈ సేవకుడు విరామం లేకుండా ఒకదాని వెంట ఒకటి కరుణా క్రియలు జరిగిస్తున్న వైనాన్ని మన కళ్లముందు ఉంచాడు. ఒకచోట నుండి మరొక చోటుకు వెళ్లిపోతూ సేవాధర్మంలో నిమగ్నమై ఉండడాన్ని చిత్రీకరించాడు. సేవకుని పుట్టు పూర్వోత్తరాల గురించి ఎవరికి కావాలి ? అందుకని మార్కు సువార్తలో యేసు వంశావళి గాని, ఆయన జన్మ వృత్తాంతం గానీ ఉండవు. మార్కు సువార్తలో 'వెంటనే', 'ఆ దినమే', 'ఇంకను మాటలాడుచుండగా', 'అక్కడి నుండి లేచి', 'అంతట', 'ఆ తరువాత' అనే పదబంధాలు తరచుగా కనిపిస్తుంటాయి. ఇలాంటి అర్థమిచ్చే మాటలు మార్కు 16 అధ్యాయాలలో 40సార్లు ఉన్నాయి. మిగతా కొత్త నిబంధన అంతటా వెదకి చూస్తే ఇలాంటి మాటలు మరొక 40సార్లు కనిపిస్తాయి. తాను నెరవేర్చడానికి వచ్చిన పనిని విసుగు విరామం లేకుండా ఒళ్లువంచి చాకిరీ చేయడానికి సమకట్టిన సేవకుడు మార్కు సువార్తలో కనిపిస్తున్నాడు.

నాలుగు సువార్తల పోలికలో మరొక అంశం, లేవీకాండం 1-7 అధ్యాయాలలో వివిధ బలి అర్పణల వివరాలు ఉన్నాయి. యేసుప్రభువు సిలువ మరణాన్ని యోహాను దహన బలిగా అభివర్ణించాడు. లూకా అయితే దానిని సమాధాన బలిగా మన ముందు ఉంచాడు. మానవుడు దేవునితో సమా ధానం పొందేందుకు జరిగిన బలియాగం గా లూకా సువార్తలో క్రీస్తు మరణం కనిపిస్తున్నది. మత్తయి రాజరికానికి సంబంధించినది గనుక క్రీస్తు సిలువ మరణం అపరాధ బలి. మార్కు సువార్తలో నైతే పాప పరిహారార్థ బలిగా ప్రభువు మరణం అవతరిస్తున్నది.

మార్కు కంటే ముందు యేసు ప్రభువును సేవకునిగా పరిచయం చేసి ప్రదర్శించే బాధ్యత యెషయాపై పడింది. యెషయా 52,53 అధ్యాయాలు చదవండి. శ్రమనొందిన సేవకునిగా మనమక్కడ రానున్న అభిషిక్తుణ్ణి చూస్తాము.

"పీటర్ ద గ్రేట్"గా ఖ్యాతి పొందిన రష్యా చక్రవర్తి తన సైన్యంలో నౌకాదళం ఏర్పరచుకోవాలని ఆశించాడు. అయితే రష్యాలో నౌకా నిర్మాణం, నౌకాయానం అనే విద్యలు ఎవరికీ తెలియవు. అందువల్ల పీటర్ చక్రవర్తి కొన్ని నెలలపాటు తన స్థానంలో తన భార్య కేథరిన్‌ను ఏలికగా నియమించి తన

రాజవస్త్రాలు విడనాడి సాధారణ కార్మికుని వేషంలో హాలెండు, ఇంగ్లండు దేశాల్లోని నౌకా నిర్మాణ కేంద్రాలలో పని నేర్చుకున్నాడు. ఈ నౌకా శ్రయాలలోని పనివారు తమతో కలిసి పనిచేస్తూ, నేర్చుకుంటున్న ఈ అగంతకుడు రష్యా చక్రవర్తి అని ఎంతమాత్రం గ్రహించలేకపోయారు. కాయకష్టం చేస్తూ పనిలోని మెళకువలు నేర్చుకుంటూ ఇతర కార్మికులతో కలిసి పేదరికంలో జీవిస్తూ వచ్చిన పీటర్ వాలకంలో ఏదీ ఠీవి, హుందాతనం కనిపించేవి గాని, అతడు చేసేది అందరిలాగా కాయకష్టమే. నౌకా నిర్మాణంలో లోతుపాతులు గ్రహించాక పీటర్ చక్రవర్తి తిరిగి తన రాజ్యానికి వెళ్లిపోయాడు.

సేవా ధర్మం జరిగిస్తున్నప్పటికీ యేసుప్రభువులోని రాచ ఠీవి, సార్వభౌమిక లక్షణాలు తేట తెల్లమవుతూనే వచ్చాయి. ఈ లక్షణం మార్కు సువార్తలో కనిపిస్తుంది.

ప్రవక్తగా మన ప్రభువు భూ ప్రపంచం యొక్క భవితను గూర్చి ప్రవచించే సందర్భంలో తన పునరాగమనం గురించి చెబుతూ ఆ గడియ, ఆ సమయం తండ్రికే తప్ప తనకు సైతం తెలియదన్నాడు (13:32). పరిపూర్ణ సేవకునిగా ఆయన విధేయత కలిగి తండ్రి వెల్లడించక దాచి ఉంచిన దాన్ని అలానే ఉంచెయ్యడానికి నిర్ణయించుకున్నాడు, దాన్ని తెలుసుకోకుండా ఉండడానికి తీర్మానించుకున్నాడు (ద్వితీ 18:15).

మార్కు భక్తునిది ముక్తసరిగా, సంక్షిప్తంగా వ్రాసే శైలి. బోధలను, కార్యాలను, చరిత్రను సాధ్యమైనంత సరళంగా, క్లుప్తంగా ఇవ్వగలగడం మార్కు ప్రావీణ్యత. అయితే తాను ఉపయోగించే పదాలు, ఉలిక్కిపడేలా చేసే ఒక్కమాట అక్కడక్కడా రాలిపడి ఎంత వివరణ ఇచ్చినా సమకూడని స్పష్టత అక్కడి సన్నివేశానికి కలిగించేలా చెయ్యడం మార్కుకే చెల్లింది. చిన్న చిన్న సంఘటనలు మార్కు రచనా కౌశల్యం వలన నిలువెత్తు వర్ణ చిత్రాలుగా పఠితకు కళ్లెదుట సాక్షాత్కరిస్తాయి.

సేవకునిగా సాక్షాత్కరిస్తున్న యేసుప్రభువు మాటల్లోనే ఈ సువార్త మూలవాక్యం కనిపిస్తుంది. "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని, పరిచారము చేయుటకుగాను, అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణము ఇచ్చుటకు వచ్చెను" (10:45).

## 1. సేవకుడొచ్చాడు

మార్కు మొదటి అధ్యాయంలో ఈ దైవ సేవకుణ్ణి మనకు పరిచయం చేస్తూ మార్కు సువార్త మూడు అంశాలు ప్రస్తావించాడు.

1. సేవకుని పరిచయం (1-11)
2. సేవకుని అధికారం (12-28)
3. సేవకుని సానుభూతి (29-45)

### సేవకుని పరిచయం (1:1-11)

మార్కు ఈ సేవకుణ్ణి ఎలా గుర్తుపట్టాడు?

ఈ గ్రంథకర్త జాన్ మార్కు ఈ సేవకుణ్ణి గుర్తించడంలో తానే మొదటి సాక్షి (1వ). యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని నిబ్బరంగా ప్రకటిస్తున్నాడు. మార్కు ఇల్లు యెరూషలేము లో ఉంది (అపో.కా. 12:1-9). ప్రభువు చేసిన అద్భుతాలు ఇతడు స్వయంగా చూచి ఉండవచ్చు. మార్కు 14:51-52లో ప్రస్తావించిన పడుచువాడు తానే అయి ఉండాలి.

సేవకుని గుర్తించడంలో మార్కు చూపిస్తున్న రెండవ సాక్ష్యం ప్రవక్తలు ఇచ్చినది (2-3వ), మలాకీ (3:1), యెషయా (40:3) ప్రవక్తల సాక్ష్యాలను మార్కు ఇక్కడ ప్రస్తావించాడు. ఇందులో చెప్పిన 'దూత', స్వరం బాప్తిస్మమిచ్చే యోహానును సూచిస్తున్నాయి. దేవుడు తన కుమారుని రాకకై మార్గం సిద్ధం చేసేందుకు ఈ ప్రవక్తను ముందుగా పంపాడు (మత్తయి 3; లూకా 3:1-18; యోహాను 1:9-34). యేసుక్రీస్తే యెహోవా దేవుడని సాక్ష్యమివ్వడంలో యోహానుతో బాటు మలాకీ యెషయాలు గొంతు కలిపారు.

తరువాతి సాక్షి బాప్తిస్మమిచ్చే యోహాను. ఇతడు ప్రవక్తలందరిలోకీ ఘనుడు (మత్తయి 11:1-15). ఏలీయా వాలకం పుణికి పుచ్చుకొన్నవాడు (2రాజులు 1:8; మలాకీ 4:5; మత్తయి 17:10-13; లూకా 1:13-17). ఇతడు యేసును తప్ప తనను తాను గొప్ప చేసుకోకుండా జాగ్రత్త పడ్డాడు. తానిస్తున్న బాప్తిస్మం సేవకుడివ్వబోయే బాప్తిస్మం ఎదుట దిగదుడుపేనని స్పష్టంగా చెప్పాడు (యోహాను 3:25-30). అయితే యోహాను ఇచ్చిన నీటి బాప్తిస్మం, అతడి సందేశం మనుషులను మెస్సీయను కలుసుకునేందుకు సిద్ధపరుస్తాయి. ప్రభువు శిష్యులంతా నిస్సందేహంగా యోహాను బాప్తిస్మం పుచ్చుకునే ఉంటారు.

దేవుని సేవకుణ్ణి గుర్తించటానికి మార్కు చూపుతున్న నాలుగవ సాక్ష్యం తండ్రి దేవుడు, పరిశుద్ధాత్మ దేవుడు. ఆత్మ

యేసుపై పావురం ఆకారంలో దిగివచ్చాడు. తండ్రి అశరీర వాణిగా మాట్లాడి తన ప్రియ కుమారుని గూర్చి సాక్ష్య మిచ్చాడు. ఈ సాక్ష్యం కీర్తన 2:7; యెషయా 4:21ని మనకు గుర్తు చేస్తున్నాయి.

అవును మన ప్రభువు సేవకుడు. చాలా అసాధారణ మైన సేవకుడు. నిజానికి సేవకుడు ఇతరులకోసం దారి సిద్ధం చేస్తాడు. ఇతరుల రాకను ప్రకటిస్తాడు. కాని ఈ సేవకుని రాకను ఇతరులు ప్రకటించారు. ఇతరులే ఈయన దారి సిద్ధపరిచారు. సాక్షాత్తు పరలోకమే సాక్ష్యమిచ్చింది.

## సేవకుని అధికారం (1:12-28)

సేవకుడంటే ఇతరుల అధికారం కింద ఉంటూ, ఇతరుల ఆజ్ఞాపాలన చేస్తూ ఉంటాడు. ఈయనైతే అధికారం ప్రదర్శిస్తున్నాడు, ఆజ్ఞలిస్తున్నాడు. దయ్యాలు సైతం ఈయనకు లోబడుతున్నాయి. ప్రభువు అధికారాన్ని కళ్లకు కట్టే మూడు సన్నివేశాలు ఈ అధ్యాయంలో ఉన్నాయి.

### 1. ఆయన ఎదుర్కొంటున్న విషమ పరీక్షలో వెల్లడైన ఆయన అధికారం (12-13వ)

మార్కు దీనిని వివరించలేదు గాని మిగతా ముగ్గురు రచయితలకు భిన్నంగా ఒక శక్తివంతమైన పదాన్ని ఉపయోగించాడు. పరిశుద్ధాత్మ ఆయనను అరణ్యములోనికి "త్రోసికొనిపోయెను", సాతానును ఎదుర్కోవడానికి యేసు జంకాడు అనేది కాదు, ఆ అనుభవం యొక్క తీవ్రతను తెలిపేందుకే మార్కు ఈ పదం వాడాడు. ఆకాశం నుండి వచ్చిన స్వరం అని ఆనందిస్తూ కూర్చునే తీరికలేదు. సేవకుడు ఎదుర్కోవలసిన సవాలు ఉంది.

ఇశ్రాయేలీయులు అరణ్యంలో 40యేళ్లు ఉన్న దానికి సరిపడినట్టు ప్రభువు 40 రోజులు అరణ్యంలో ఉన్నాడు, అరణ్యంలో ఎదురైన శోధనలో ఇశ్రాయేలీయులు ఘోరంగా విఫలమయ్యారు. ప్రభువు విజయం సాధించాడు. యెహోషువ జయశాలిగా తన ప్రజలకు వాగ్దాన భూమిని పంచినట్టే అదే పేరున్న యేసు ఆత్మ సంబంధమైన వారసత్వాన్ని తనవారికి కట్టబెట్టాడు.

మార్కు ఇక్కడ ఇచ్చిన మరొక శక్తివంతమైన చిత్రం ఆ సేవకుని అడవి మృగాల మధ్య ఉండడం. 'ఆదాము' జంతువుల మధ్య ఉంటూ, శోధనను అధిగమించలేక పోయాడు. రెండవ ఆదాము అడవి మృగాల మధ్య శోధనపై విజయం సాధించాడు. ఆదాము పాపం మూలంగా సృష్టిపై తన ఆధిపత్యాన్ని చేజార్చుకున్నాడు. క్రీస్తుపై నమ్మకముంచిన వారందరికీ ఆయనలో ఆ ఆధిపత్యం తిరిగి సమకూడింది (హెబ్రీ 2:6-8). యేదు అడవి మృగాల మధ్య ఉన్నాడు. అవి ఆయనకేమీ హానీ చేయలేదు. అవును! ఆయన అధికారమున్న సేవకుడు.

### ఆయన బోధల్లో వెల్లడైన ఆయన అధికారం (14-22వ)

దేవుని సత్యాన్ని అధికారంతో బోధించిన వారెవరన్నా ఉన్నారంటే అది యేసే (మత్తయి 7:28). ఆయన బోధించిన రాజ్యం ఇహలోక రాజకీయ, విప్లవం వల్ల రాదు. తన ప్రజల జీవితాల్లో ఆయన అధికారం పూర్తిగా నెలకొనాలి. సువార్త నమ్మి తిరిగి జన్మించడమొక్కటే ఆయన రాజ్యంలో ప్రవేశించే మార్గం (యోహాను 3:1-7).

మారుమనస్సు పొంది (అంటే మనస్సు మార్చుకుని, లేక పశ్చాత్తాపడి) నమ్మవలసిందని యేసు బోధించాడు (అపొ.కా. 20:21). పాపాల విషయం పరితాపమొక్కటే సరిపోదు. యేసుక్రీస్తులో నమ్మకముంచి ఆయన ఇస్తానన్న రక్షణను విశ్వసించాలి. విశ్వాసం లేని పరితాపం కేవలం దుఃఖభారం. దోషభరిత హృదయమున్న వారిని అది చితక గొట్టి వేస్తుంది (మత్తయి 27:3-5; 2కొరింథీ 7:8-10).

యేసు అధికారంతో బోధించాడు గనుక కొందరు మనుషులను వారి వృత్తులలో నుండి బయటికి రమ్మని పిలవగలిగాడు. చాలా నెలల క్రితమే పేతురు, అంద్రెయ, యోహాను, యాకోబులను యేసుప్రభువు కలుసుకున్నాడు. వారాయనపై నమ్మకముంచారు (యోహాను 1:35-49). "మనుష్యులను పట్టు జాలరులు" అనే మాట యేసుప్రభువు మొట్టమొదట కనిపెట్టి ఉపయోగించినది కాదు. ఆ రోజుల్లో వేదాంతులు తమ ఉపదేశాల ద్వారా మనుషుల మనసులను "పట్టుకొనే"వారు. బోధనలనే ఎరతో శిష్యులను వశం చేసుకునేవారు. యేసుప్రభువు శిష్యుల్లో ఏడుగురు జాలరులే (యోహాను 21:1-3). చేపలు పట్టడంలో ప్రవీణులైన వారికి మనుషులను పట్టుకోవడంలో శిక్షణనివ్వడం అంత కష్టం కాదు. వ్యాపారం చేసేవారు మంచి సువార్తికులుగా మారగలరు. తన షాపులోని వస్తువులో ఉన్న యోగ్యతలన్నిటినీ ఒప్పించగలిగేలా చెప్పి అవతలి వ్యక్తిచేత కొనేలా చేయడం వర్తకుని వృత్తి నైపుణ్యం. యేసుప్రభువును కూడా పాపియైన వ్యక్తి "కొనుక్కొనేలా" చేయడం సువార్తికుని బాధ్యత. పైగా జాలరులకు తెగువ, ఇతరులతో కలిసి పనిచేసే గుణం, ఓపిక, ఎక్కువ సమయం ఆగకుండా పనిచేయగల చేవ, విశ్వాసం ఉంటాయి.

యేసుప్రభువు బహిరంగ ప్రదేశాల్లోనే కాదు, సునగోగుల్లో కూడా బోధించాడు. పన్నెండేళ్లకు మించిన మగవారు

పదిమంది ఉంటే చాలు అక్కడ సునగోగు స్థాపించవచ్చు. ఇలాంటివి ప్రతి గ్రామంలోను ఉండేవి. ఇక్కడ జరిగే ప్రార్థనలు, ఉపదేశాలు శాస్త్రులు గాక సామాన్య యూదులే జరిగించేవారు. కొందరు పెద్దలు ఉండి వీటిని పర్యవేక్షించే వారు. సునగోగు అధికారిగా ఒక వ్యక్తి ఉండేవాడు (మార్కు 5:22). సంచార బోధకులు తమ గ్రామానికి వస్తే సాధారణం గా లేఖనం చదివి బోధించమని వారిని అడిగేవారు. పౌలు కూడా ఈ సంప్రదాయాన్ని అనేకమార్లు వినియోగించు కున్నాడు (అపొకా. 13:14-16; 14:1; 17:1-4).

కపెర్నహోములో యేసుప్రభువు బోధకు యూదులు అబ్బురపడ్డారు. ఇక్కడ కూడా మార్కు ఖచ్చితమైన పదాలు ఉపయోగించాడు. వారు "విస్మయ మొందారు" (1:27). ఆయన చేసిన అద్భుతాలకు ప్రజలు "విభ్రాంతి నొందారు" (2:12). ఆశ్చర్యం, విస్మయం, అపరిమితమైన ఆశ్చర్యం వంటి పదాలు మార్కు సువార్తలో కనిపిస్తాయి. మార్కు 6:6లో యేసు ఆశ్చర్యపడిన విషయం కూడా మార్కు వ్రాశాడు.

**ఆయన ఇచ్చిన ఆజ్ఞలలో వెల్లడైన అధికారం (23-28వ)**

దయ్యం పట్టినవాడు తనకు దయ్యం పట్టిందని ఇతరులకు తెలియకుండా ఎంత కాలం సునగోగు సమావేశాలకు రాగలడు? మనుష్యకుమారుడు అక్కడికి వచ్చేదాకా! యేసు ఎవరో దురాత్మకు తెలుసు (అపొ.కా. 19:13-17). దురాత్మ 'మేము', 'మాతో' అని మాట్లాడడం ద్వారా, తానూ, తాను పట్టి పీడిస్తున్న మనిషీ ఒకటేనన్నట్టు సూచిస్తున్నది. 'ఈ మనిషి నావాడు' అని దురాత్మ అభిప్రాయం. ఇదే దురాత్మ యేసు మానవత్వాన్ని ('నజరేయుడగు యేసూ'), దివ్యత్వాన్ని ("నీవు దేవుని పరిశుద్ధడవు") స్పష్టంగా గుర్తించాడు.

తెలుగు అనువాదాలలో "ఊరకుండుము" అనే మాట గ్రీకు మూలంలో "నోటికి చిక్కం పెట్టుకో" అనే అర్థమి స్తున్నది. ప్రభువు తుఫానును అణచిన సమయంలో కూడా ఇదే మాట ఉపయోగించాడు (మార్కు 4:39). యేసు ప్రభువు తన కాలంనాటి జనపదుల సజీవ భాషను, పద చిత్రాలను సహజంగా ఉపయోగించాడు. ప్రజలకు ఆశ్చర్యం కలిగింది. ఈ బోధ, ఈ చర్యలు కూడా కొత్తవే. ప్రభువు మాటలకు, క్రియలకు పొంతన ఉంది (యోహాను 3:2).

## సేవకుడి సానుభూతి (1:29-45)

సేవకుడు జనసమూహానికి పూర్తిగా అందుబాటులో ఉన్నాడు. ఆయన వలన స్వస్థతలు పొందడం తమ హక్కు అన్నట్టు పేదలు స్వతంత్రంగా గుంపులు గుంపులుగా వచ్చారు. అందరి అవసరాలు ఆయన ప్రేమతో తీర్చాడు.

సబ్బాతు భోజనానికై ప్రభువు పేతురు అంద్రెయల ఇంటికి వెళ్లాడు. మిగతా శిష్యుల విషయం తెలియదు గానీ, పేతురు వివాహితుడు. ఈ అన్నదమ్ముల ఇతర శిష్యులను, యేసుప్రభువును ఇంటికి తోడుకొని వచ్చారు. ఎంతమందికి అలవాటు ఉంది. యేసును చర్చిలోనే వదిలెయ్యకండి. ఇంటికి తీసుకు రండి. మీ ఇంటి సౌకర్యాలు, సమస్యలు ఆయన్ని కూడా పంచుకోనివ్వండి.

జ్వరం చాలా చిరాకు పెట్టే అనుభవం. జ్వరం తగ్గాక శక్తి పుంజుకునేందుకు కొంత సమయం పడుతుంది. పేతురు అత్తగారిని ప్రభువు స్వస్థపరచిన వెంటనే ఆమె లేచి వారికి వడ్డించసాగింది. ప్రభువు మనకోసం చేసిన దానికి మనం చూపగల సరియైన కృతజ్ఞత వెనువెంటనే ఆయనను సేవించడమే.

సబ్బాతు ఆ సాయంత్రానికి ముగిసింది. పేతురున్న వీధి అంతా స్వస్థత కోసం వచ్చిన జనంతో కిటకిటలాడిపోయింది. ఆ రాత్రి ప్రభువు, ఆ ఇంటివారూ నిద్రపోయే సరికి అర్ధరాత్రి దాటి ఉంటుంది. అందరినీ అలుపూ సొలుపూ లేకుండా సేవకుడు స్వస్థపరిచాడు.

ఆలస్యంగా పడుకోవడం యేసుకు తెల్లవారి పెందలకడనే లేచి తండ్రికి ప్రార్థించడానికి ఆటంకం కాలేదు (35వ), యెషయా 50:4 చదవండి. ఆయన ప్రార్థనా జీవితం అంత క్రమశిక్షణతో కూడి ఉంది గనుకనే ఆయనలో అంత అధికారం, శక్తి ఉన్నాయి.

ఆ ఊళ్లోనే ఉంటే స్వస్థతల్లో మునిగిపోయి, సువార్త ప్రకటించడానికి సమయం రాదు. అందుకని ఆయన వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడు.

కుష్ఠరోగులు మనుషుల్లోకి రాకూడదు (లేవి 13:45-46). 40 వచనంలో ఉన్న ఈ మనిషికి ప్రభువు తనను స్వస్థపరచగలడని తెలుసు. స్వస్థపరిచే ఇష్టం ఉన్నదా లేదా అని మాత్రమే సందేహం. నిరాశ నిస్పృహల మధ్య కొట్టు మిట్టాడే పాపులనేకమందికి ఈనాడు ఇదే సందేహం. ఈ సందేహం అనవసరం. ఏ ఒక్క పాపి కూడా నశించిపోవడం ఆయనకు ఇష్టం లేదు (2పేతురు 3:9).

ఇక్కడ పాపానికీ, కుష్ఠరోగానికీ ఉన్న పోలికలు చూద్దాం. చూసేముందు ఒక విషయం స్పష్టం చేయాలి. కుష్ఠరోగం వంశపారంపర్యంగా రాదు. పాపానికి ఫలితంగా, దేవుని శాపంగా వచ్చేది కాదు. ఒక రోగి నుండి ఎవరికైనా అంటువ్యాధిగా ఇది సోకవచ్చు. కుష్ఠువ్యాధి కేవలం చర్మానికే పరిమితం కాదు. అది మరింత లోతైనది. అది వ్యాపిస్తుంది

(లేవి 13:3-8). అది ఆ మనిషిని అపవిత్రం చేసి ఇతరుల నుండి వేరుచేస్తుంది (లేవి 13:47-59). పాపం కూడా అంతే ప్రభువు కుష్ఠరోగిని తాకాదు, మాటలు కూడా పలికాడు. ఎవరైనా అతణ్ణి తాకి ఎంత కాలమయిందో ! యేసు అతనిపై కనికరపడ్డాడు (మార్కు 6:34; 8:2; 9:22). స్వస్థపరచి లేవీ 14లో ఉన్న విధంగా మత కర్మకాండ జరిగించమన్నాడు. ఇది కూడా ప్రభువు విమోచన క్రియకు అందమైన సాదృశ్యమే. రెండు పక్షులు యేసుప్రభువు అవతారంలోని రెండు అంశాలు. ఆయన మరణం (చంపి వేసిన పక్షి), పునరుత్థానం (రక్తం పూసి వదిలేసిన పక్షి). రక్తాన్ని ఆ మనిషి కుడి చెవికి (దేవుని వాక్యం) కుడి బొటన వ్రేలికి (దేవుని పని), కుడికాలి బొటన వ్రేలికి (దేవుని నడత) పూయాలి. నూనెను రక్తంలో కలపడం పరిశుద్ధాత్మకు సూచన. రక్తం చిందకుండా పరిశుద్ధాత్ముడు ఒక వ్యక్తిలోకి రాడు. ఈ సేవకుడు గొప్ప కనికరం, సానుభూతి గలవాడు నీవు మేలు చేసేవాడివైతే సాయంకోసం మనుషులు నీ వద్దకు వస్తూనే ఉంటారు. నీకు అసౌకర్య మేమోనని చూడరు.

## సేవకుడు ఇచ్చే కానుకలు

అద్భుతాలు చేసే రబ్బీ మళ్లీ కపెర్నహూముకు వచ్చాడన్న వార్త కార్చిచ్చులా వ్యాపించింది. స్వస్థతకోసం కొందరు, ఆ స్వస్థతలు చూడాలని కొందరు తండోపతండాలుగా జనం వచ్చి చేరుతున్నారు. వీరంతా తన సందేశం పట్ల ఆసక్తి ఉన్నవారైతే ప్రభువుకు సంతోషమే. కాని ప్రజల కోరికలు వేరు. అయితే తానెందుకు వచ్చాడో ప్రజలకు తెలియజేయడం ఇక అవసరమని ఆయనకు అనిపించింది. అందుకు అవకాశం ఆనాడే వచ్చింది. స్వస్థతలకు మించిన భాగ్యం ఆయన తీసుకొచ్చాడు. శారీరక స్వస్థతల వెనుకనున్న ఆత్మ సంబంధమైన అంతరార్థాన్ని వారు గ్రహించాలి. ఈ అధ్యాయంలో సేవకుడు తెచ్చిన మూడు భాగ్యాలు ఉన్నాయి.

1. క్షమ (2:1-12)
2. సాఫల్యం, సంతృప్తి (2:13-22)
3. స్వేచ్ఛ (2:23-3:12)

**1. క్షమ (21-12) :** ఇది ఎవరి ఇల్లో తెలియదు. జనం కిటకిటలాడిపోతున్నారు. నిజంగా అవసరతలో ఉన్నవారు రావడానికి దారిలేదు.

స్వస్థపరిచే పనిలో ఉండి యేసు ఎందుకో పైకి తలెత్తి చూశాడు. పైకప్పును ఎవరో తొలగించి పెద్ద రంధ్రం చేస్తున్నారు. ఈ స్నేహితుల లక్షణాలు నిజంగా మెచ్చదగినవి. ఒకటి తమ స్నేహితునికి మేలు జరగాలని వారికి బలమైన కోరిక, ఆ అవసరాన్ని యేసు తీరుస్తాడని వారికి అచంచల మైన విశ్వాసం ఉంది. 'ప్రార్థన చేద్దాం' అని ఊరుకోలేదు. కలిసి సాహసంతో ప్రయత్నించారు. ఎవరెన్ని తిట్టినా ఊరుకోలేదు. వారి విశ్వాసం ఫలించింది. జనాన్ని చూసి ఈ రోజుకి కుదరదులే రేపు వద్దాం అనుకోలేదు.

పరుపు తాళ్లతో దిగితున్నప్పుడు పైకి చూసిన ప్రభువు ఇప్పుడు జాలిగా క్రిందికి ఆ పక్షవాయు రోగివైపుకు చూశాడు. అతని సమస్యకు ఆయువుపట్టు కనిపెట్టాడు. అతని అసలు సమస్య పాపం. వ్యాధులన్నీ పాపం మూలంగా వస్తాయని కాదు (యోహాను 9:1-3). శరీర స్వస్థత చేకూర్చక మునుపే అతని పాపాలను క్షమించాడు. యేసు చేసే అన్ని అద్భుతాల్లోకీ పాపిని క్షమించడం అత్యద్భుతం. మానవ జాతికి ఇది అత్యంత గడ్డు సమస్య. ఈ సమస్య తీరాలంటే దేవుని గొఱ్ఱెపిల్ల మహా యజ్ఞం జరగాలి. గొప్ప వెల చెల్లించాలి. అది మహోత్కృష్టమైన ఆశీర్వాదాలను తెస్తుంది.

సేవకుడు చుట్టూ చూశాడు. విమర్శకులు, ఆయన ఎప్పుడు ఏ పొరపాటు చేస్తాడా అని చూసేవారు కనిపించారు. కొత్తగా గురువునంటూ బయలుదేరిన ఎవరి పరిచర్యనైనా పరిశోధించి ఒక నిర్ణయానికి రావడానికి ఆ మతాచార్యులకు తప్పకుండా హక్కు ఉంది (ద్వితీ 13). అయితే వారు సత్యమేదో గ్రహించాలని నిష్కపటమైన మనస్సులతో వచ్చినవారు కారు. సేవకుడు వారి లోపలికి చూశాడు. దైవదూషణ నేరం ఆయనపై మోపడానికి వంకకోసం వారు ఎదురు చూస్తున్నారు. పాపాలు క్షమించగలిగింది దేవుడొక్కడే. పక్షవాయువు గల వాని పాపాలు క్షమించానని యేసు అంటున్నాడు. కాబట్టి తనను దేవునితో సమానం చేసుకుంటున్నాడు. వారి అంతరంగ తలంపులను గ్రహించడం ద్వారా తాను సర్వజ్ఞుడైన దేవుడని యేసు రుజువు పరచాడు (యోహాను 2:25; హెబ్రీ 3:13). వారు తర్కం, వాదం కోసం చూస్తున్నారు గనుక వారికొక ప్రశ్న ఇచ్చాడు. నీ పాపాలు క్షమించబడినాయని చెప్పడం తేలికా, పక్షవాయు రోగం స్వస్థపరచడం తేలికా ? చెప్పడమే తేలిక. ఎందుకంటే వాడి పాపాలు క్షమించబడినాయో లేదో ఎవరికి కనిపిస్తుంది? అందుకని యేసు కష్టమైన దాన్ని, కనిపించేదాన్ని చేసి చూపించాడు. అతనికి కలిగిన శారీరక స్వస్థత, అతని ఆత్మకు పాపరోగం నుండి కలిగిన స్వస్థతకు తార్కాణం (కీర్తన 103:3; యెషయా 1:5-6, 16-20).

**2. సాఫల్యం, సంతృప్తి (2:13-22) :** యేసు ఉద్దేశ పూర్వకంగా సుంకరులతో పాపులతో స్నేహంగా ఉంటున్నాడన్న సంగతి ఈ పాటికి అందరికీ అర్థమైపోయింది. యేసు లేవీని తన శిష్యునిగా పిలిచినప్పుడు అతడు తటాపటాయించ లేదు. పన్ను వసూలు బల్లను ఉన్నదున్నట్టు వదలి లేచి వెళ్లిపోతే ఉద్యోగం ఊడుతుందనీ, మళ్లీ ఇవ్వరనీ తెలుసు. విమర్శకులు ఇక్కడ కూడా తయారయ్యారు. మూడు ఉదాహరణల ద్వారా యేసు తాను వచ్చిన పనిని వివరించాడు.

డాక్టరు (16-17వ). నాయకులు సుంకరులను వెలివేశారు. అయితే యేసు దృష్టిలో మత్తయి స్నేహితులంతా వైద్యుని అవసరం ఉన్న రోగులు, తానే వైద్యుడు. అవసరంలో ఆయన సమీపించి, రోగ నిర్ధారణ చేసి, చికిత్స, స్వస్థత కలిగిస్తాడు.

ఈ వైద్యుడు బాగు చెయ్యలేని రోగులు మూడు రకాలు. (1) ఆయన గురించి ఎరగనివారు, (2) తెలిసి కూడా ఆయనపై నమ్మకం పెట్టుకోనివారు, (3) ఆయన అవసరం తమకు ఉన్నదని ఒప్పుకోనివారు. పరిసయ్యుల్లాగా స్వనీతిపరులైన పాపులు ఈనాడూ ఉన్నారు. మనం పాపులమనీ, రక్షకుని అవసరం ఉన్నదనీ ఒప్పుకోకుంటే యేసు మనకేమీ సహాయం చెయ్యలేడు.

ఆ దినాల్లోనూ, గతంలోనూ కూడా దొంగ వైద్యులు ఉన్నారు. వారు తమ బలహీనమైన మందును పైపైన పూస్తారు (యిర్మీయా 6:14; 8:11). లోపలున్న కారణాలు వారికి తెలియదు (యిర్మీయా 17:9).

## పెండ్లి కొడుకు (18-20వ)

విమర్శకులు అడిగిన మొదటి ప్రశ్న ఇలాంటి వాళ్లతో తిరుగుతున్నావేమిటి ? అని, రెండవ ప్రశ్న వీరితో కలిసి భోజనాల విషయంలో అంత సంతోషంగా ఉంటున్నావేమిటి? అని. బాప్తిస్మమిచ్చే యోహాను విరాగి, యేసైతే, భోజనానికి పిలిచింది ఎవరైనదీ చూడకుండా వెళ్తున్నాడు, ఆనందంగా పిల్లలతో గడుపుతున్నాడు. ఉత్సవాలలో పాల్గొంటున్నాడు (మత్తయి 11:16-19). పరిసయ్యులు నియమించిన అనేక ఆజ్ఞలు కట్టడలు సామాన్య ప్రజానీకానికి భారంగా తయారైనాయి. అయితే యేసే వారికి ఇలా సూచిస్తున్నాడు. జీవితమంటే శోకం, విషాదం కాదు. ఆనందంగా గడప వలసిన పెళ్లి విందులాంటిది. నేనే పెండ్లికుమారుణ్ణి, వీరంతా పెండ్లి విందులో అతిథులు. పెళ్లికి వచ్చినవారు సంతోషంగా ఉండరా?

యూదులకు వివాహ సాదృశ్యం పరిచయమే. యెహోవా తో ఇశ్రాయేలు జాతి సంబంధాన్ని తెలియ జేయడానికి వివాహ ఉపమానాన్ని పాత నిబంధన ఉపయోగించింది (యెషయా 54:5; యిర్మీయా 31:32). జాతి ఇతర దేవుళ్లవైపుకు తిరిగితే ప్రవక్తలు దాన్ని ఆధ్యాత్మిక వ్యభిచారంతో పోల్చారు. హోషేయ గ్రంథంలోని ప్రధానాంశం వ్యభిచారంలో పడిపోయిన భార్యను భర్త తిరిగి చేరదీయడమే.

బాప్తిస్మమిచ్చే యోహాను అంతకుముందే యేసును పెండ్లి కొడుకుగా ప్రకటించాడు (యోహాను 3:29). ప్రభువు కూడా తన మొదటి అద్భుతాన్ని పెండ్లి విందులోనే జరిగించాడు (యోహాను 2:1-11). క్రైస్తవుడుగా మారడానికీ, క్రీస్తుతో ఒక వైవాహిక సంబంధంలోకి ప్రవేశించడానికి పోలిక లున్నాయి.

మార్కు 2:20లో ప్రభువు తానెదురుచూస్తున్న మరణం, పునరుత్థానం, ఆరోహణల గురించి చూచాయగా చెప్పాడు. తాను వెళ్లిపోగానే ఇక తనవారంతా విషాదంలో మునిగి పోవాలని ప్రభువు అభిమతం కాదు. తాను వెళ్లిపోయిన తరువాత ఉపవాసముండి ప్రార్థించడం జరుగుతుందని చెప్పాడు. అయితే ఆనందిస్తూ ఉండడం విశ్వాసుల సహజ అనుభవమై యుండాలి. "ఆనందించుడి, మరల చెప్పుదును, ఆనందించుడి".

## బట్ట, ద్రాక్షరసం తిత్తి (21-22వ)

తాను పాతదానికి మాసికలు వేయడానికి రాలేదనీ కొత్తదాన్ని తీసుకువచ్చాననీ యేసు నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. మత నాయకులు యేసు బోధలు కొన్నింటికి ఆశ్చర్యపోయారు, ఆమోదించారు. అయితే యూదా మత బోధనల్లో ప్రభువు బోధనలు కూడా కలిపి మెరుగుపరచాలని ఉద్దేశం. కొత్త గుడ్డముక్కను పాత గుడ్డకు మాసిక వేస్తే ఒక్క ఉతుకుకే అది పాతగుడ్డను చింపేస్తుంది. లేక పులియని తీపి ద్రాక్షను సాగే గుణం కోల్పోయిన పాత తోలు తిత్తుల్లో పోస్తే అది పులిసి పొంగి, తిత్తి వ్యాకోచించడం లేదు గనుక దాన్ని చింపేస్తుంది. ద్రాక్షరసం, తిత్తీ రెండూ పాడైపోతాయి.

మోషే ధర్మశాస్త్ర విధానం పాతగిలిపోయి ఊడి రాలి పోవడానికి సిద్ధంగా ఉంది (హెబ్రీ 8:13). యేసు తన రక్తం ద్వారా కొత్త నిబంధన స్థాపించబోతున్నాడు (లూకా 22:19-20). ధర్మశాస్త్రం రాతి పలకలపై కాదు మానవ హృదయాలపై వ్రాయబడుతుంది (2కొరింథీ 3:1-3; హెబ్రీ 10:15-18). విశ్వాసుల్లో నివాసం చేసే పరిశుద్ధాత్మ ధర్మశాస్త్రంలోని నీతిని నెరవేర్చేందుకు తోడ్పడలేదు (రోమా

8:164). ప్రపంచ మతాలన్నిటిలోని మంచిని తీసుకుని, క్రైస్తవ మతంలోని నీతిని కలిపి మంచి జీవిత విధానం తయారు చేసుకుందామనడం ఇక్కడ ప్రభువు చెప్పిన మాటలతో పొసగదు.

పాపవిముక్తి అనేది జీవితానికి అక్కడొకటి, ఇక్కడొకటి మాసికలు వేయడం కాదు. అది సరికొత్త నీతిశాస్త్రం. పాత నీతి అనే చింపిరి పీలికలు పూర్తిగా తీసివేసి క్రీస్తు ఇచ్చే ఈ కొత్త బట్టలు కట్టుకోవాలి (యెషయా 61:10; 2కొరింథీ 5:21). క్రైస్తవ జీవితం పాత కొత్తల మేలికలయిక కాదు, కొత్త దానిలో పాతదాన్ని నెరవేర్పు. ఒక విత్తనాన్ని రెండు విధాలుగా రూపుమాపవచ్చు. సుత్తి తీసుకుని చితకగొట్టి వేయవచ్చు. లేదా దాని భూమిలో పాతిపెట్టి మొక్కగా మొలిపించవచ్చు. రెండవ పద్ధతిలో ఆ విత్తనం సాఫల్యం చెందడం ద్వారా సమసిపోయింది. యేసుప్రభువులో విశ్వాస ముంచితే నీవు నూతన సృష్టి అవుతావు. వాస్తవం వచ్చేశాక ఇంకా నీడలను పట్టుకుని వేలాడడం దేనికీ? (హెబ్రీ 10:1 నుండి) దేవుడు చేసిన వాగ్దానాలన్నిటికీ యేసుక్రీస్తులో సాఫల్యం చేకూరింది.

**3. స్వేచ్ఛ (మార్కు 2:23-3:12) :** దేవుడు తన ప్రజలకు ప్రత్యేకంగా ఇచ్చిన ఆజ్ఞ విశ్రాంతి దినం పాటించడం. అది వారికీ యెహోవాకూ మధ్య ఒక ప్రత్యేక చిహ్నం (నిర్గమ 13:13-17). అయితే యేసు బహిరంగంగా సబ్బాతు సంప్రదాయాలను ఉల్లంఘిస్తున్నట్టు కనబడేసరికి ఆయన మతంపై ఏదో విప్లవం ప్రకటిస్తున్నాడనుకున్నారు యూదులు.

సబ్బాతు దినాన చేయకూడదని పనులు 39 అని ధర్మశాస్త్రం ఖచ్చితంగా నిషేధిస్తున్నది. ఆ దినాన పనిచేయ కూడదని మోషే చెప్పాడు (నిర్గమ 20:10). కాని వివరాల్లోకి వెళ్లలేదు. వండుకునేందుకు పొయ్యి వెలిగించకూడదు (నిర్గమ 35:3), వంట చెరకు సేకరించకూడదు (సంఖ్యా 15:32 నుంచి), బరువులు మోయకూడదు (యిర్మీయా 17:21), వ్యాపారం చేయకూడదు (నెహెమ్యా 10:31; 13:15,19). అయితే యూదుల సంప్రదాయ గ్రంథాలు మరింత వివరాల్లోకి వెళ్లి ఎంత దూరానికి మించి ప్రయాణం చేయకూడదు అనేవి నిర్దేశించారు. మొత్తం మీద విశ్రాంతి దినాచారం యూదులకు మోయరాని బరువైపోయింది.

బెతెస్థ కోనేటివద్ద యేసు విశ్రాంతి దినాన ఒకణ్ణి అప్పటికే స్వస్థపరిచాడు. ఇప్పుడు ఆయన శిష్యులు విశ్రాంతి దినాన పంటచేలోబడి వెళ్తూ కంకులు చేత్తో నలుపుకోవడం (గింజలు తినడం కోసం) ద్వారా పనిచేస్తున్నారు (మత్తయి సువార్త బైబిలు గైడులో దీన్ని గురించిన వివరాలు వ్రాశాము. చూడండి). అదే సబ్బాతు దినాన యేసు కావాలని సునగోగులో ఒక వ్యక్తిని స్వస్థపరిచాడు (3:1-6). పరిసయ్యులను సవాలు చేయడానికే ఇది చేసినట్టు ఉంది. యేసు ఎప్పుడూ సుంకరులపై, వేశ్యలపై మండిపడలేదు. పరిసయ్యులను మాత్రం గద్దించాడు. ఒక మనిషి స్వస్థపడడం కంటే వారికి వారి సాంప్రదాయాలే ముఖ్యం.

నిష్టగల మత, జాతీయ వాదులైన పరిసయ్యులు హేరోదీయులతో చెయ్యి కలపడం విడ్డూరం (3:6) హేరోదీయులు మతావలంబులు కాదు, హేరోదు పరిపాలనకు నూటికి నూరుశాతం సమ్మతించడాన్ని బట్టి జాతీయవాదులూ కాదు.

ఈ సేవకుడు అర్థం పర్థంలేని మానవ కల్పిత ఆచారాల నుండి మనకు స్వేచ్ఛనిస్తున్నాడు.

## 3. సేవకుడు, పరలోక రాజ్యం (3:13 - 4:34)

ఆలోచిస్తున్నారు. ఒక వంక జనం ఆయనకు జేజేలు పలకడాన్ని బట్టి రాజకీయ విప్లవం రేకెత్తుతున్నదేమోనని కొందరికి అనుమానం పట్టుకుంది. ప్రజలను సంతోషపెట్టి పల్లకీలో ఊరేగాలంటే మరింతగా వారికి స్వస్థతలు జరిగించి ఆకట్టుకోవాలి. కాని సేవకుని ఉద్దేశం అది కాదు. అందుకని తన శిష్యుల చిన్నగుంపును వెంటతీసుకొని ఆయన కొండ ఎక్కి వెళ్లాడు (3:13). ఆయన ఆ శిష్యులకు (16-18వ) తన రాజ్య వివరాలు చెప్పవలసి ఉంది. తన రాజ్యవ్యాప్తికి వారిని వాడుకోవలసి ఉంది.

### సేవకుని కార్యకలాపాలు(3:13-19)

పన్నెండు మందిని ఎన్నుకోవడం వెనక అంతరార్థం ఉంది. దేవుడెన్నుకొన్న ఇశ్రాయేలు జాతిలో 12 గోత్రాలు ఉన్నాయి. అయితే ఇప్పుడా జాతి ఆధ్యాత్మిక పతనంలో ఉండి, తమ వద్దకు వచ్చిన తమ మెస్సీయనే తిరస్కరించే స్థితిలో ఉంది. దేవుడు "ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలను" (1పేతురు 2:8,9) తయారు చేసే పనిలో ఉన్నాడు. ఈ నూతన ఆధ్యాత్మిక జాతికి ఈ సన్నెండుమంది అపొస్తలులు కేంద్రకాలు. వారికి (1) శిక్షణ నివ్వడం, (2) సువార్త ప్రకటనకు పంపడం, (3) దయ్యాలు వెళ్లగొట్టడానికి అధికారమివ్వడం యేసు ముఖ్యోద్దేశాలు.

తద్వారా తాను తండ్రి వద్దకు తిరిగి వెళ్లిపోయిన తరువాత తన పనిని వారు కొనసాగిస్తారు. వేరొకరికి కూడా దానిని అప్పగిస్తారు (2తిమోతి 2:2).

మనం పరిశీలిస్తున్న ఈ భాగంలోనే యేసు కొండమీద ప్రసంగం చేశాడు. దానిని మార్కు ప్రస్తావించ లేదు. ఆయన మాటలను గాక, ఆయన చర్యలనే మార్కు వ్రాశాడు.

## సేవకుడొక కొత్త కుటుంబాన్ని స్థాపించాడు (3:20-21; 31-35)

సేవకుని స్నేహితులు బంధువులు ఆయన గురించిన వార్తలు వింటున్నకొద్దీ కంగారుపడ్డారు. ఆయన ఏదో ఉన్మాదంలో పడిపోతున్నాడని భయపడ్డారు. ఇల్లు వదలి ఊరూరా తిరగడం, జనం ఆయన వెంటబడడం ఇదంతా వారికి మింగుడుపడలేదు. ఆయన్ను బలవంతంగానైనా సరే తిరిగి ఇంటికి తీసుకువచ్చి మళ్లీ మామూలు జీవితం జీవించేలా చేద్దామని బయలుదేరారు (3:21). ఆయన తల్లి, సహోదరులు ఆయన్ను ఇంటికి తీసుకుపోయి విశ్రాంతిగా ఉంచాలన్న ఉద్దేశంతో వచ్చారు. జనంలో వారు ఆయన దగ్గర దాకా కూడా చేరలేకపోయాడు (3:31,32). మార్కు సువార్తలో మరియ కనిపిస్తున్నది ఇక్కడొక్కచోటే. ఆమె ప్రయత్నం ఫలించలేదు.

మూడీని చికాగోలో చాలామంది "క్రేజీ మూడీ" (పిచ్చి మూడి) అని పిలిచేవారు. పౌలును వెఱ్ఱివాడు, వదరుబోతు అన్నారు (అపొ.కా. 26:24-25). దేవుని సేవకులను తరచుగా లోకం పొరపాటు అంచనా వేస్తుంది.

సేవకుడు ఇంట్లోనే ఉండిపోయి తన కుటుంబాన్ని చూసేందుకు బయటికి రాకపోవడం వింతగా అనిపించవచ్చు. వారు రావడంలో వారి ఉద్దేశం మంచిదే, కాని వచ్చిన పని మంచిది కాదు. తన కుటుంబం వెంట ఇంటికి వెళ్లిపోయి నట్టయితే ఆయనకు నిజంగానే మతి చలించిందనీ, ప్రస్తుతం ఇంటికి వెళ్లిపోయి విశ్రాంతి తీసుకుంటున్నాడనీ అంతా భావించేవారు.

ఈ అత్యవసర స్థితిని ఆయన ఒక మంచి ఆధ్యాత్మిక పాఠం నేర్పించడానికి ఉపయోగించుకున్నాడు. దేవుని చిత్తప్రకారం జరిగించేవారే ఆయన కుటుంబం. ప్రభువు కుటుంబ సభ్యులు ఆయనపై విశ్వాసముంచిన వారు కాదు (యోహాను 7:1-5). నమ్మిన సుంకరులు, 'పాపులు', నమ్మని తన సోదరులకంటే మిన్న.

విశ్వాసులు దేవుని సేవకులు తమ కుటుంబాలను వదిలెయ్యమని యేసు చెప్పడం లేదు. జీవితంలో అన్నిటికన్నా పైస్థానాన్ని దేవుని చిత్తం ప్రకారం జరిగించడానికే ఇవ్వాలని మాత్రం చెబుతున్నాడు. ప్రభువు పట్ల మనకున్న ప్రేమతో పోల్చుకుంటే కుటుంబం పట్ల ఉన్న ప్రేమ ద్వేషంలా కనిపించాలి (లూకా 14:26). మనం మన కుటుంబాలను పోషించి శ్రద్ధ తీసుకోవాలన్నది తప్పనిసరిగా దేవుని చిత్తం (1తిమోతి 5:8). అయితే మనకెంత ప్రియమైన వ్యక్తి అయినా సరే దైవచిత్తం నుండి మనలను వేరుచేసే అవకాశం ఇవ్వకూడదు.

ఒక వ్యక్తి ఈ కొత్త కుటుంబంలోకి ఎలా చేరగలడు? నూతన జన్మ ద్వారానే (యోహాను 3:1-7; 1పేతురు 1:22-25). ఒక పాపి నూతన జన్మ మూలంగా దేవుని స్వభావంలో పాలు పొందుతాడు (2పేతురు 1:3-4). ఆయనను తండ్రీ అని పిలుస్తాడు (రోమా 8:15-16). ఇదంతా కేవలం దేవుని కృప మూలంగా కలిగినదే (ఎఫెసీ 2:8-9).

## సేవకుడొక కొత్త రాజ్యాన్ని ప్రకటించాడు (మార్కు 3:22-30; 4:1-34)

ఈ భాగంలో 'రాజ్యం' అన్నది మూలపదం (3:24; 4:11,26,30). బాప్తిస్మమిచ్చే యోహాను, యేసుప్రభువు కూడా ఈ రాజ్యం గురించి ప్రకటించారు. కొన్ని సూత్రాలు, రాజ్యాంగం, అంశాల వారీగా ఇవ్వడం గాక కొన్ని చిన్నకథలు చెప్పడం ద్వారా ఆ రాజ్యాన్ని వివరించాడు (ఇక్కడ 4వ అధ్యాయమంతటా ఉన్న ఉపమానాల భావాన్ని మత్తయి సువార్త బైబిలు గైడులో విపులంగా వ్రాశాము).

రాజ్యాన్ని గురించి వివరించడానికి యేసు "బలవంతుడు", "విత్తనాలు చల్లేవాడు", "దీపం", "మొలిచే విత్తనం", "ఆవగింజ" ఉపమానాలను వాడాడు. విత్తనాలు చల్లేవాడు, ఆవగింజ ఉపమానాల వ్యాఖ్యానానికై మత్తయి బైబిలు గైడు చూడండి.

బలవంతుని ఇల్లు (22-30వ). తన రాజ్యం ఎలాంటిదో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడానికి యేసు వాడిన అనేక ఉపమానాల్లో ఇది మొదటిది.

దయ్యం పట్టిన మూగ, గుడ్డి మనిషిని యేసు బాగుచేశాడు (మత్తయి 12:22-24). ఇది చూసి జనం "నిజమే" రానున్న మెస్సీయ ఈయనే కాబోలు" అనుకుంటుంటే మతపెద్దలు మాత్రం ఆయన చేసిన అద్భుతాన్ని కాదనలేక "వీడు బయెల్జబూలు మనిషి, సాతానుతో కుమ్మక్కై ఈ పనులు

చేస్తున్నాడు'' అన్నారు. బయెల్జబూలు అంటే ''ఇంటి యజమాని" అని అర్థం. దీన్ని తీసుకొని ప్రభువు తన ఇంటిని కాపాడుకునే బలవంతుడైన యజమాని గురించి చెప్పాడు. ఆ యింటిని దోచుకోవాలంటే ముందు ఆ మనిషిని లొంగ దీయాలి.

పరిసయ్యుల మాటల్లో అటు సరియైన వేదాంతము లేదు, మంచి తర్కం కూడా లేదు. తాను ఆ దయ్యాన్ని వెళ్లగొట్టింది సాతాను శక్తితోనైతే, దాని అర్థం సైతాను తన ఇంటిని తానే కూలదోసుకుంటున్నాడన్న మాట. సాతాను దయ్యం పట్టిన మనిషిని జాగ్రత్తగా కాపలా కాస్తున్నాడు. యేసు ఆ మనిషిని విడిపించాడంటే సాతానుకంటే మరింత ఎక్కువ బలాన్ని ఉపయోగించి జయించాడన్నమాటే గదా !

పరిసయ్యులు తప్పు అని నిరూపించమే గాక వారు అన్నమాటలు ఎంత తీవ్రమైనవో యేసు వివరించాడు. పరిశుద్ధాత్మ విషయము దూషణ (28,29వ) అంటే ఏమిటి ? 'పరిశుద్ధాత్మ చర్యలను సైతానుకు ఆపాదించడం', నిజమే. అయితే ఈ రోజుల్లో మనుషులు నిర్లక్ష్యంగా సాతానుకు ఆపాదిస్తున్నారు ?

రెండవదిగా అన్ని రకాల దైవదూషణకు, మనుష్య కుమారుణ్ణి దూషించడానికి కూడా క్షమాపణ ఉంది (మత్తయి 12:32). అంటే కుమారుడైన దేవుడు పరిశుద్ధాత్మ దేవుని కన్నా తక్కువ కాడా ? ఆయన్ను దూషిస్తే క్షమాపణ ఉంది గాని, ఆత్మను దూషించిన వారికి క్షమాపణ లేదు అంటే అర్థమేమిటి?

పశ్చాత్తాపానికై పిలుపునివ్వడానికి తండ్రియైన దేవుడు బాప్తిస్మమిచ్చే యోహానును పంపాడు. అతణ్ణి హేరోదు బంధిస్తే, చంపితే యూదా మతనాయకులు ఊరుకున్నారు. యేసుక్రీస్తును వారే రోమీయులకు పట్టి ఇచ్చి సిలువ వేయించారు.

సిలువపై వారికి క్షమాపణ కలగాలని క్రీస్తు ప్రార్థించాడు. పెంతెకొస్తునాడు పరిశుద్ధాత్ముడు వచ్చాడు. దేవుని శక్తి అనేక విధానాల్లో ప్రత్యక్షపరిచాడు. ప్రతిస్పందనగా మతాధికారులు అపొస్తలులను చెరసాలలో పెట్టించారు. స్తెఫనును వారే చంపారు. స్తెఫను "మీరు ఎల్లప్పుడు పరిశుద్ధాత్మను ఎదిరించు చున్నారు'' (అపొ.కా. 7:51) అని వారితో అన్నాడు. యూదులు తండ్రి, కుమారులకు విరోధంగా పాపం చేశారు. ఇప్పుడు పరిశుద్ధాత్మునికి వ్యతిరేకంగా పాపం చేస్తే ఇంకెవరూ మిగలలేదు. యూదులు పూర్తిగా హద్దు మీరినట్టు అయింది. అలాంటి వారికిక క్షమాపణ లేదు.

**విత్తనాలు చల్లేవాడు, నేలలు (4:1-20) :** మత్తయి సువార్త బైబిల్ గైడులో దీన్ని విశ్లేషించాము.

**దీపం (4:21-25) :** సేవకుడు తాను తీసుకువచ్చిన రాజ్యాన్ని గురించి వివరించడానికి ఇంట్లో మనం వెలిగించు కునే దీపాన్ని ఉదాహరణగా తీసుకున్నాడు. దీపమంటే ప్రమిదెవంటింది. దీపంపై గంప బోర్లిస్తే ఆ దీపం వల్ల ఏమి ప్రయోజనం ?

దీపంలో నూనె పోయాలి. పన్నెండుమంది అపొస్తలులు ప్రమిదెల్లాంటివారు. దేవుని సత్యాన్ని చీకటిలో వెలుగుగా వారు ప్రసరింపజేయవలసి ఉంది. వారు నింపుకోకపోతే వెలగరు. నూనె పోస్తూ ఉంటేనే దీపం వెలుగుతుంది (4:24-25). దేవుని వాక్యాన్ని ఎంతగా వింటూ ఉంటే అంతగా ఇతరులతో దానిని పంచుకోగలం. ఏమి వింటున్నామో (4:24), ఎలా వింటున్నామో (లూకా 8:18) జాగ్రత్తగా చూసుకోవాలి.

**మొలకెత్తే విత్తనం (26-34) :** విత్తనాన్ని నీవూ, నేనూ మొలిపించలేము - అదెలా పెరుగుతుందో వివరించలేము. విత్తనాలు చల్లిన రైతుకు విశ్వాసముండాలి, సహనముండాలి. పరలోకరాజ్యం ఎదుగుదల అంత మార్మికంగా ఉంటుంది.

సేవకునిపై విశ్వాసముంటే ఆయన స్థాపించిన జాతిలో, ఏర్పరచిన కుటుంబంలో, ప్రతిష్టించిన రాజ్యంలో మనకూ స్థానం ఉంటుంది.

## 4. సేవకుని విజయాలు (మార్కు 4:35-5:43)

దేవుని సేవకుడు యేసుక్రీస్తు అన్ని పరిస్థితులనూ అదుపు చేయగలిగినవాడు, అన్నిటా గెలుపొందినవాడు. 4:35-5:43 లో ముఖ్యాంశం సేవకుని విజయాలు. ఇందులో మార్కు 4 అద్భుతాలను వివరించాడు. ప్రతి దానిలోనూ శత్రువు ఓటమి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

**ప్రమాదంపై సేవకుని విజయం (4:35-41)**

'ఆ దినమే' అంటే ఈ ఉపమానాలన్నీ చెప్పిన రోజునే ఈ సంఘటన జరిగింది. దేవుని వాక్యం విస్తారంగా యేసు వారికి బోధించాడు. వినడం వల్ల విశ్వాసం కలగాలి (రోమా 10:17). శిష్యుల విశ్వాసమెంతవరకో ఇప్పుడొక పరీక్ష పెడుతున్నాడు ప్రభువు. విశ్వాసాన్ని పరీక్షించడం అవసరం. పాఠం నేర్చుకునేది పరీక్ష కోసమే. దేవుడు మన జీవితాల్లోకి

కష్టాలను అనుమతించేది ఈ కారణం వల్లనే, ఆ తుఫాను వస్తున్నదని యేసుకు తెలుసా ? తప్పకుండా. అది ఆయన పథకంలో భాగమే. వారొక పాఠం నేర్చుకోవలసి ఉంది. తమకు ఆ పాఠం అవసరమని కూడా వారికి తెలియదు. అదేమిటంటే జీవితపు పెను తుఫానుల్లో యేసుపై ఆధారపడితే సరిపోతుందన్నదే. దేవునిపట్ల అవిధేయంగా ఉంటే బ్రతుకులో తుఫానులు వస్తాయనుకుంటారు కొందరు. ఇది యోనా విషయంలో నిజమే. అయితే ఇక్కడ శిష్యులు తమ ప్రభువు మాట ప్రకారం చేశారు గనుక (4:35-36) వారు ఆ తుఫానులో ఇరుక్కున్నారు.

పేతురు వంటి కరడుగట్టిన జాలరినే వణికింప జేసిం దంటే ఆ తుఫాను ఎంత భీకరమైనదో ఊహించుకోవచ్చు. నిజానికి వారు భయపడవలసిన అవసరం లేదు. అవతలి తీరం చేరుకుంటామని ప్రభువు మాట ఇచ్చాడు (4:35). ప్రయాణం సౌకర్యంగా ఉంటుందని చెప్పలేదు గాని గమ్యానికి చేరుతారని మాత్రం చెప్పాడు. రెండవది, ఆయన వారితోనే ఆ నావలోనే ఉన్నాడు. మూడవదిగా వాతావరణం ఎంత చెలరేగిపోతున్నా ఆయన మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ప్రశాంతంగానే ఉన్నాడు. శిష్యులు భయపడవలసిన అవసరం లేదు. ప్రభువు తుఫాను మధ్యలో ప్రశాంతంగా ఉన్నాడు (కీర్తన 4:8). యోనా ప్రశాంతంగా నిద్రపోవడం వెనుక ఆత్మవంచన ఉంది.

ప్రభువా నీకు చింతలేదా, అని మొరపెట్టడం అవివేకం. ఆయన తప్పకుండా మనకోసం చింతిస్తున్నాడు. ఆయన తుఫానును నిమ్మళింపజేయడంతో ఊరుకోలేదు. అసలైన ప్రమాదం తుఫాను, పెనుగాలి వర్షం కాదు. వారి హృదయాల్లోని అపనమ్మకమే అసలు ప్రమాదం. భయాన్ని కలిగించేది అపనమ్మకమే. ఆ భయం "అసలు ప్రభువుకు మేము గుర్తున్నామా?" అని వారు ప్రశ్నించేలా చేసింది. "విశ్వాసములేని దుష్ట హృదయం" విషయం జాగ్రత్తగా ఉండాలి (హెబ్రీ 3:12). సేవకునికి పాపాలు క్షమించడానికి, దయ్యాలు వెళ్లగొట్టడానికీ అధికారమున్నదని శిష్యులు ఇంతకుముందే గ్రహించారు, వాతావరణంపై కూడా అధికారమున్నదని ఇప్పుడు గ్రహించారు.

## దురాత్మలపై విజయం (5:1-20)

యేసు, ఆయన శిష్యులు అవతలి ఒడ్డు చేరుకునేసరికి దయ్యంపట్టిన ఇద్దరు మనుషులు వారికి ఎదురు వచ్చారు (మత్తయి 8:28). పట్నాల్లో నివసించే వారికి ఇలాంటి సన్నివేశం తటస్థించడం అరుదు. కాని ఈ ఆధునిక ప్రపంచంలో క్రితం కంటే దయ్యాలు పట్టడం ఎక్కువైందని విజ్ఞులు అంటున్నారు.

ఇక్కడ మూడు ప్రభావాలు పనిచేస్తున్నాయి : సాతాను, సమాజం, సేవకుడు (లేక రక్షకుడు).

సాతాను మనుషులను ఎంత పీడించగలడో చూడండి. వాడి అంతిమ లక్ష్యం నాశనమే (యోహాను 10:10), దయ్యం పట్టడమనేది సాధారణంగా ఒక మనిషి పాపానికి ఇష్టపూర్తిగా లోబడినప్పుడు జరిగే అవకాశం ఉంది. ఈ ఇద్దరూ తమ కుటుంబాలను, మిత్రులను, హుందాతనాన్నీ, అదుపును కోల్పోయారు. నెమ్మది, బ్రతుకులో ఒక ప్రయోజనం అనేవి లేవు. ఒళ్లంతా గాయాలు, యేసుప్రభువు అటుగా రాకపోయినట్టయితే వారలానే మరణించేవారు. పాపం, దుర్మాతలు మనుషులకు సమకూర్చేవి ఇవే. అవిశ్వాసుల జీవితాల్లో పనిచేస్తూ వారిని అవిధేయులుగా మారుస్తూ వున్నది (ఎఫెసీ 2:1-3) సాతానే.

ఈ ఇద్దరిపై పనిచేస్తున్న రెండవ ప్రభావం సమాజం. సమాజం వారి విషయంలో చేయగలిగినదల్లా అప్పుడప్పుడూ కష్టపడి వారిని దొరక బుచ్చుకుని గొలుసులతో కట్టేయడం. ఊరివాళ్లు అటుపోగానే ఈ ఇద్దరూ దారాలను తెంపినట్లు ఈ గొలుసులను తెంపేవారు. సైన్సు ఎంత అభివృద్ధి చెందినప్పటికీ సాతాను, పాపం తెచ్చిపెట్టే సమస్యలను పరిష్కరించడం మానవ సమాజం వల్లకాదు.

మూడవ ప్రభావం సేవకుడైన యేసుప్రభువు. ఆయన వారికి చేయగలిగినదేమిటి? కృపతో ఆ ప్రాంతానికి వచ్చాడు. అలా రావడానికి తుఫానులను సైతం భరించాడు. అసలు యేసును రాకుండా చేయడానికి ఆ తుఫానును కలిగించినది సాతానే అని కొందరి వాదన. తుఫానును అణచడానికి ప్రభువు ఏ మాట ఉపయోగించాడో, దయ్యాలను వెళ్లగొట్ట డానికీ ఆ పదాన్నే ఆయన వినియోగించాడని నేర్చుకున్నాము.

## మరణంపై విజయం

యాయీరు బహిరంగంగా వచ్చి యేసును అర్థించడం అంత తేలిక కాదు. ఇతర సునగోగుల అధికారుల ముందు తన పరువు పోతుంది. సునగోగుల్లో యేసు చేసిన ఉపదేశాలు, పనులు మతనాయకులకు కోపాన్ని రగిల్చాయి. అయితే యాయీరు అత్యవసర స్థితిలో ఉన్నాడు. తన కూతురు బ్రతుకుతుందంటే తన పరువు, మంచి పేరు పోయినా ఫరవా లేదు. ప్రభువు ఇతనితో పలికిన మాటలు బహు రమ్యంగా ఉన్నాయి.

ఆయన విశ్వాస వాక్కులు (36వ) నా దగ్గరికి రావడంలో నీవు నీ విశ్వాసాన్ని కనపరిచావు. అదే విశ్వాసంతో ఉండు అన్నట్టుగా ఉన్నాయి ఈ మాటలు. అమ్మాయి చనిపోయింది. ఇక లాభం లేదని చెప్పారు. అంత దుఃఖంలో తన విశ్వాసాన్ని అంటిపెట్టుకుని ఉండమని యేసు చెప్పాడు. కూతురు బతికి ఉండగా విశ్వాసముంచడం తేలికే. యేసు తన ఇంటికి ప్రయాణంలో ఉంటే బాగానే ఉంటుంది. అటు కూతురు చనిపోయింది, యేసు వేరొక పనిలో ఉన్నాడు, కొన్నిసార్లు ఇలాంటి ఆలస్యాలు జరిగే సమయంలో ప్రత్యేకమైన 'విశ్వాస వాక్కులు' మనకి అవసరం.

ఆయన నిరీక్షణ వాక్కులు పలికాడు (39వ) యేసు, యాయీరు ఇల్లు చేరేసరికి ఇల్లంతా శోకాలతో దద్దరిల్లి పోతోంది. ఇక కొనప్రాణమైనా ఉందనుకొనే ఆశకూడా లేదు. "ఆమె చనిపోలేదు, నిద్రపోతున్నది" ఇవీ మన ప్రభువు మాటలు – నిజమే విశ్వాసికి మరణమనేది నిద్రే. అతడు పునరుత్థాన దినాన తిరిగి లేస్తాడు (1థెస్స 4:13–18). ఆత్మ నిద్రించదు, అది శరీరం నుండి వేరై క్రీస్తు చెంతకు వెళ్లి పోతుంది (యాకోబు 2:26; ఫిలిప్పీ 1:20–23).

ప్రేమ, ప్రభావ వాక్కులు పలికాడు (41వ) విశ్వాస మెప్పుడూ దేవుని వాక్కును గట్టిగా పట్టుకొని దేవుని ప్రభావాన్ని అనుభవిస్తుంది. సేవకుడు ఈ అద్భుతాన్ని ఒక ప్రదర్శనగా చేయలేదు. తల్లిదండ్రుల కడుపుకోతను అర్థం చేసుకున్నాడు. "తలి తాకుమీ" అంటే "అమ్మాయ్, లే" అని అర్థం. తన అధికారాన్ని ఉపయోగించి ఆత్మను తిరిగి ఆమె శరీరంలోకి రప్పించాడు (లూకా 8:55). ఆమె తిరిగి బ్రతకడమే కాదు, ఆమె వ్యాధి కూడా నయమయింది.

బయట నిలబడినవారూ, శోకిస్తున్నవారూ, ఆ అమ్మాయి నిజంగా చనిపోలేదనీ, కోమాలోకి వెళ్లి ఉండవచ్చనీ ఇప్పుడు మేలుకున్నదనీ భావించారు. కాని ఏ సత్యాన్నైనా స్థాపించా లంటే ఇద్దరు ముగ్గురు సాక్షులుండాలి (ద్వితీ 17:6; 19:15). ఈ అద్భుతానికి సాక్షులు ఐదుగురు.

**వ్యాధులపై విజయం (5:21–34)**

కపెర్నహూముకు తిరిగి వస్తున్న యేసు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న వారిలో యాయీరుతోబాటు ఒక పేరు తెలియని స్త్రీ కూడా ఉంది. యేసును ముందుగా యాయీరు అభ్యర్థించాడు. కాని ఆయన సహాయం చేసింది నోరు విప్పడానికి ధైర్యం లేని ఆ స్త్రీకే: యాయీరు ధనికుడు, సునగోగు అధికారి, పేరు ప్రతిష్ఠలు గలవాడు. ఆమె పేదరాలు, అనామకురాలు. ఇద్దరినీ సేవకుడు కనికరించాడు.

యాయీరుకు పన్నెండేళ్లపాటు అతని కూతురు కన్నుల పండుగ చేసింది, ఆనందాన్నిచ్చింది (మార్కు 5:42). పన్నెండేళ్ల దుఃఖకారణంగా వేధించిన వ్యాధితో ఆ స్త్రీ ఉంది. తన డబ్బంతా వైద్యానికి ఖర్చు చేసింది. ఇద్దరి సమస్యకూ యేసే జవాబిచ్చాడు.

దిన దినం రక్తస్రావం ఆమె బలాన్ని, శుభ్రతను హరించి వేస్తున్నది. డబ్బంతా అయిపోతున్నా నివారణ కలగకపోవడం మానసికంగా ఆమెనెంత కృంగదీసిందో ! అంతేగాక ధర్మశాస్త్ర నిషేధం ప్రకారం ఆమె తన సాంఘిక, మత జీవనాలలో ఎంతో పరిమిత జీవితం గడపాలి (లేవీ 15:19 నుండి).

అయినా ఆమె జనాన్ని నెట్టుకుంటూ ముందుకు వచ్చింది. ఆమె విశ్వాసమెలాంటిది ? బలహీనమైనది, సందేహపూరితమైనది. ఆయన కొంగు తాకితే చాలనుకుంది. బలహీనమైన ఆమె విశ్వాసానికి సేవకుడు ప్రతిఫలమిచ్చాడు. మనందరికీ ఒకే రకమైన విశ్వాసం ఉండదు. అయితే ఎంత బలహీనమైనప్పటికీ ప్రభువు మన విశ్వాసానికి స్పందిస్తాడు. ఆ గుంపులో చాలామంది ఉన్నారు. ఆయన మీద పడుతున్నారు. వారికి అద్భుతం జరగలేదు. వారికి విశ్వాసం లేదు.

ఆమె చడీచప్పుడూ కాకుండా వెళ్లిపోదామనుకుంది. అయితే యేసు మృదువుగా ఆమె నుండి చిన్న సాక్ష్యాన్ని రాబట్టాడు. ఆమెను యేసు ఎందుకు బట్టబయలు చేశాడు?

1. ఆమె కోసమే. తాను ఆమె పాలిట కేవలం స్వస్థపరిచే వాడుగానే కాక రక్షకునిగా, స్నేహితునిగా ఉండదలుచు కున్నాడు. ఆమె తన ముఖంలోకి చూసి అందులో ఉట్టిపడుతున్న ఆప్యాయతను వీక్షించి, తన ప్రేమను అనుభవించాలని కోరాడు. శారీరక స్వస్థతకంటే మరింత గొప్పభాగ్యం ఆమెకు కలిగించాలనుకున్నాడు. ఆమెను "కూతురా" అని పిలిచాడు. శాంతి ఆశీర్వాదంతో సాగనంపాడు (మార్కు 5:34).
2. తన వెంట ఉన్న యాయీరు కోసం. అతని కుమార్తె చావు బ్రతుకుల మధ్య ఉంది. అతనికెంతో ప్రోత్సాహం అవసరం. యేసు ఆమెతో పలుకుతున్న శాంతి వచనాలు యాయీరును కూడా ఆదరించి ఉంటాయి.
3. ఆమెకు తన సాక్ష్యం వినిపించే అవకాశం ఇవ్వడం కోసం, ఆమె దేవుణ్ణి అందరి ఎదుటా మహిమపరచడం కోసం (కీర్తనలు 107:2, 20–21).

అవును, దేవుని సేవకుడు ప్రమాదం పైనా, వ్యాధుల పైనా, మరణం పైనా అధికారమున్న విజేత. ఆయన అన్ని

తరగతుల ప్రజలనూ కలుసుకున్నాడు. కాబట్టి నీవెవరివైనా ఆయన నీకు పరిచర్య చేయగలడు, అలాగని అస్తమానం అందరినీ ఆయన ప్రమాదం నుండి తప్పించకపోవచ్చు (2కొరింథీ 12:1–10 చూడండి). అయితే జరుగుతున్న ప్రతి దానిమీదా ఆయనకు అంతిమ అధికారం ఉంది. మనలను ప్రేమించిన ఆ సేవకుని ద్వారా మనం విజేతలం (రోమా 8:37).

## 5. సేవకునిపై నమ్మకముంచేదెవరు? (మార్కు 6:1-56)

దేవుని సేవకునితో సంబంధం కలిగిన వారనేకమంది ఆయనపై నమ్మకం పెట్టలేదని ఈ భాగం తెలియపరుస్తున్నది. వీరంతా ఆయనను విశ్వసించడానికి మంచి కారణాలు ఉన్న వ్యక్తులే. అయితే వారంతా అలా చేయలేకపోయారు. ఈ భాగాన్ని ధ్యానిస్తుండగా హెబ్రీ 3:12 మదిలో ఉంచుకోండి. "సహోదరులారా, జీవముగల దేవుని విడిచిపోవునట్టి దుష్ట హృదయము మీలో ఎవనియందైనను ఒకవేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి." అపనమ్మకాన్ని దేవుడు చూసీ చూడనట్టు పోనియ్యడు.

### పరిచయస్థుల అపనమ్మకం (6:1-6)

ఆయన వారిపట్ల చూపిన అనుగ్రహం ఇదే – వారు నమ్మి, రక్షణ పొందుతారని ఆశించాడు.

అయితే ఈసారి ఆయనపై వారు కోపించలేదు. దానికి బదులు వారు ఆయన మాటే పట్టించుకోలేదు. నజరేతులో ఆయన 30 యేళ్లు నివసించాడు. ఆయనెవరో ఏమిటో వారికి బాగా తెలుసు. ప్రవక్తను స్వగ్రామంలో గౌరవించరని గతంలో చెప్పినమాటే వారికి మరలా చెప్పాడు (మార్కు 6:11; లూకా 4:24; యోహాను 4:44).

రెండు సంగతులు వారిని ఆశ్చర్యంలో ముంచెత్తాయి. ఆయన్ను "ఏరా యేసూ !" అని పిలిచే చనువున్నవారు ఆ ఊర్లో ఉండి ఉంటారు. ఆయన చేసిన అద్భుత కార్యాలు, ఆయన మాటల్లో కనిపించే జ్ఞానం వారిని ఆశ్చర్యచకితులను చేసింది. అయితే వారి మధ్య మాత్రం ఆయన అలాంటివేమీ చేయలేదు. వారి అపనమ్మకమే అలా జరగకుండా అడ్డు పడింది. ఏమిటి సమస్య ? "మన వాడే గదా" అనే చులకన భావం. వడ్రంగిగా వారాయన్ను బాగా ఎరుగుదురు. తమలో ఒకణ్ణి గౌరవించడం వారికి సాధ్యం కాలేదు.

"అతి పరిచయం వెగటు పుట్టిస్తుంది" అంటారు. అయితే ఇది అన్ని సందర్భాలకూ సరిపోతుందా, చాల కాలం ప్రేమించుకుంటూ కలిసి కాపురం చేసే భార్యా భర్తలు ఒకరినొకరు అసహ్యించుకుంటారా? చాలా ఏళ్లు స్నేహితులుగా ఉన్నవారికి కాలం గడుస్తున్న కొద్దీ మొహం మొత్తుతుందా? వెగటు పుట్టించే విషయాలలో వెగటు మనుషులకీ అతి పరిచయం వెగటు కలిగిస్తుంది. నజరేతు వారికి యేసుపట్ల ఉన్న చులకన భావం యేసు ఔన్నత్యాన్ని ఏమీ తగ్గించదు. వారెలాంటివారో అది తెలుపుతుంది.

ఒక పెద్ద మ్యూజియంలోని కళా ఖండాలన్నిటినీ ఒక గంటలో చూసెయ్యాలని బయలుదేరి టూరిస్టు హడావిడిగా ఆ గదులన్నిటినీ దాటుకుని ముగింపు బయటికి వచ్చి అన్నాడు. "అంత ప్రత్యేకమైనదేమీ అందులో నాకు కనిపించలేదు !" అందుకు కళ విలువ తెలిసిన వ్యక్తి "ఈ కళాఖండాలెలాంటివో ఎవరూ తీర్పు తీర్చనక్కరలేదు. చూడ్డానికి వచ్చిన వారెలాంటివారో ఇక్కడ అర్థమవుతూ ఉంటుంది" అన్నాడు.

వడ్రంగి మొదలైన పనివారికి ఆ సమాజంలో గౌరవం ఉంది. కాని ఒక వడ్రంగి స్వస్థతలు, నీతి బోధలు చేయాలని ఎవరు ఎదురు చూస్తారు ?

"ఇతడు మరియ కుమారుడు కదా !" అనడంలో ఈ ఊరివారు నిజానికి యేసును అవమానపరుస్తున్నారు. ఎందుకంటే యూదుల్లో మామూలుగా తండ్రి పేరుతో ప్రతివ్యక్తినీ పిలుస్తారు. వారు ఆయన విషయంలో తొట్రుపడ్డారు. వారికి ఆయన అర్థంకాలేదు. కాబట్టి ఆయన్ను తిరస్కరించారు. వారి అపనమ్మకంవల్ల వారి పాలిట ఆయన ఎదురు దెబ్బ తగిలే రాయిలాగా ఉన్నాడు (యెషయా 8:14; రోమా 9:32-33; 1పేతురు 2:8). యేసుప్రభువు ఆశ్చర్యపోయాడని రెండుచోట్ల రాసి ఉంది. ఒకటి ఇక్కడ (5వ). రెండవది రోమా శతాధిపతిలోని విశ్వాసాన్ని చూసి (లూకా 7:9).

### శత్రువుల అపనమ్మకం (మార్కు 6:7-29)

తన ఊరివారి అపనమ్మకాన్ని సేవకుడు చూశాడు. కానీ గలిలయ ఇతర గ్రామాల్లో గొప్ప అవసరత ఉంది. అందుకే తన శిష్యులకు అధికారమిచ్చి నలుమూలలకూ పంపాడు సేవకుడు.

తమకున్నది చేతబట్టుకుని వెళ్లమన్నాడు. అయితే ప్రత్యేకంగా అవీ ఇవీ తీసుకునిపోవడం ద్వారా బరువు పెంచుకో వద్దన్నాడు. చాలినంత తీసుకు వెళ్లాలి గానీ,

విశ్వాసంపై ఇక ఆధారపడనవసరం లేనంత సమృద్ధిగా కాదు. ఆహారం కోసం; డబ్బు కోసం అడుక్కోవడం ఎంతమాత్రం తగదు.

వారు అలా ఊరూరూ తిరిగి పరిచర్య చేస్తుంటే ఆతిథ్యం ఎదురవుతుంది. అదే సమయంలో అవరోధం ఎదురవుతుంది. ఏదో ఒక ఇల్లు ఎన్నుకుని అక్కడే ఉండిపోవాలి గాని, దీనికంటే అది బావుంది గదా అని మారుతూ ఉండకూడదు. వారు ప్రయోజనకరమైన సేవకులే గాని, సుఖాలు మరిగిన అతిథులు కారు. వారిని ఆహ్వానించని ఊరిలో పాదధూళి దులిపివేయాలి.

ఆ రోజుల్లోనే హేరోదు అంతిప బాప్తిస్మమిచ్చే యోహాను తలగొట్టించాడు. యేసు మరణం, స్తెఫను మరణం, యాకోబు మరణం ఇవన్నీ ఆ కాలంలో, ఒకదానివెంట ఒకటిగా జరిగిన విషయాలు. యేసు హేరోదును 'నక్క' అన్నాడు (లూకా 13:31-35).

**శిష్యుల అపనమ్మకం (మార్కు 6:30-56)**

సేవకుడు తన శిష్యులను విశ్రాంతికై ఒక ఏకాంత స్థలానికి తీసుకుపోయాడు. దైవ కుమారునికి సైతం శారీరక విశ్రాంతి అవసరం, తన స్నేహితులతో సమయం గడపడం అవసరం. బాప్తిస్మమిచ్చే యోహాను హత్య తరువాత వాతావరణం మారిపోయింది. యేసు బోధలు వింటున్న ప్రజల్లో రాజకీయ స్వేచ్ఛ గురించి వేరువేరు ఆలోచనలు పుట్టడం కూడా కలవరం కలిగించే అంశం (యోహాను 6:15 నుండి). అత్యుత్సాహంతో జనం ఆయనెక్కడికి వెళితే అక్కడికి వెళ్లారు. వారు తనకు ఆటంకంగా ఉంటున్నప్పటికీ యేసు వారిని ఆదరించాడు. వారికి బోధించాడు, స్వస్థపరిచాడు. పనిలో ఉన్నప్పుడు ఎవరైనా అడ్డుపడితే చిరాకుపడే మనకు సేవకుని సహనం, ప్రేమ గొప్ప గుణపాఠాలు.

యేసు చేసిన రెండు అద్భుతాలను మార్కు ఇక్కడ వివరించాడు.

**ఐదు వేలమందికి ఆహారం**

జనసమూహం గుంపులు గుంపులుగా ఆయన వద్ద సమకూడారు. శిష్యులు వారిని పంపివేయాలంటున్నారు. తమ గురువు కళ్లతో వారు జనసమూహాలను చూడలేక పోతున్నారు. వారికి జనాలు ఒక సమస్య. యేసుకైతే వారు కాపరిలేని గొఱ్ఱెలు.

ఎదురైన సమస్యకు శిష్యుల వద్ద రెండు పరిష్కారాలు ఉన్నాయి. వారిని పంపించి వేయడం ఒకటి. చాలినంత డబ్బు పోగుచేసి ఆహారం కొనుక్కురావడం రెండవది. వీరు ఈ రోజుల్లో ఉండే కమిటీల్లా ఉన్నారు. కమిటీలో వ్యక్తిగతంగా ఒక్కొక్క సభ్యుడూ 'నేనొక్కడినే ఏమీ చెయ్యలేను. కమిటీయే దీన్ని నిర్ణయించాలి' అంటాడు. కమిటీ అంతా కలిసి ఆ విషయంలో ఏమీ చేయలేమని తీర్మానిస్తుంది. అంతే తేడా.

సేవకుడైతే పరిస్థితిని ఒక సమస్యగా కాకుండా, ఒక అవకాశంగా, తండ్రికి మహిమ చేకూర్చే తరుణంగా చూస్తున్నాడు. 'నా దగ్గర చాలినంత డబ్బు ఉన్నట్టయితే దీన్ని పరిష్కరిస్తాను' అంటాము. అయితే మన వనరులను లెక్కించుకోవడం కాక, దేవుని చిత్తాన్ని గ్రహించడం మన మొదటి మెట్టు కావాలి.

ఈ అద్భుతాన్ని యేసు తన గురించి ప్రజలకు విశదపరచుకొనేందుకు ఉపయోగించుకున్నాడని యోహాను వ్రాశాడు. 5వేల మందికి ఆహారం పెట్టిన తరువాత తానే జీవాహారమన్న ఉపదేశం ప్రభువు చేశాడు (యోహాను 6:22). కేవలం మనుషుల అవసరాలు తీర్చడం కోసం మాత్రమే కాదు యేసు అద్భుతాలు. ప్రతి అద్భుతమూ ఆ దివ్య సేవకుని మహత్తు, వ్యక్తిత్వం మనకు అర్థం కావడానికి జరిగినవే. అయితే ఎక్కువభాగం మనుషులు అద్భుతాన్నే చూశారు గాని, తద్వారా వెల్లడి అయిన ఆధ్యాత్మిక సందేశాన్ని గమనించలేదు (యోహాను 12:37). కానుక కావాలి గాని, కానుక ఇచ్చేవాడు అక్కర్లేదు.

తుఫానును నిమ్మళింపజేయడం అనేక అద్భుతాల సముదాయం (45-56వ). యేసు నీళ్లపై నడవడం, పేతురు నీళ్లపై నడవడం, తుఫానును గద్దించడం, నావ ఒడ్డుకు చేరడం (యోహాను 6:21) ఇవన్నీ అద్భుతాలే.

యేసు తన శిష్యులను త్వరపెట్టి అక్కడ నుండి ఎందుకు బయలుదేరదీశాడు? ఎందుకంటే ఆయన్ను రాజుగా చేద్దామని అక్కడి జనం ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నారు (యోహాను 6:14-15). అలాంటి పరీక్షకు శిష్యులు త్వరగా లొంగి పోతారు. ఎందుకంటే యేసు రాజ్యం లౌకికం, రాజకీయం అని వారింకా నమ్ముతున్నారు. రెండవ కారణం వారికి విశ్వాసాన్ని అలవరచవలసి ఉంది. ఆ సమయంలో వారు ఐదువేల మందికి ఆహారం పంచిపెట్టిన ఉత్సాహంలో ఉత్సుకతలో ఉన్నారు. ఆత్మ సంబంధంగా శిఖరంపై ఉండడం మంచిదే. అయితే అక్కడ నుండి కాలుజారితే లోయలో పడిపోతాము. అటువంటి అత్యుత్సాహస్థితిలో వారి భావోద్రేకాలకు కళ్లెం వేయడం అవసరం.

సరస్సుపై తుఫాను పరీక్షలో శిష్యులు ఫెయిలయ్యారు.

పై రెండు అద్భుతాలలో సేవకుడు తనను పోషకుడుగా, రక్షకుడుగా కనపరచుకున్నాడు. "యెహోవా నా కాపరి. నాకు లేమి కలుగదు ... ఏ అపాయమునకు నేను భయపడను" (కీర్తన 23:1,4). ఆయన్ని నమ్ముకుంటే అవసరాలూ తీరతాయి, భద్రతా ఉంటుంది.

విశ్వాసం గలవారు ఆయన చెంతకు గుంపులుగా రావడం, వారందరినీ ఆయన స్వస్థపరచడంతో మార్కు ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాడు. 1యోహాను 5:4 ప్రకారం ఆ సేవకునిపై విశ్వాసముంచుదాం.

## 6. సేవకుని ఉపదేశం (మార్కు 7:1-8-26)

మార్కు సువార్త అంతటా సేవకుడు "చేసిన" వాటినే రచయిత నొక్కి చెప్పడం చూస్తాము. అయితే ఈ భాగంలో సేవకుడు "చెప్పిన" కొన్ని ముఖ్యమైన సంగతులను మార్కు వ్రాశాడు.

### 1.యూదులకు ఉపదేశం (7:1-23)

ఇక్కడ జరిగిన తతంగంలో మొదటి అంశం నేరారోపణ (మార్కు 7:1-5). యూదుల నాయకులు ప్రస్తుతం బాహాటంగానే యేసుకు వ్యతిరేకత కనబరుస్తున్నారు. ఆయనపై నేరం మోపాలని ఆయన వెంటే ఉంటున్నారు. యూదుల పారంపర్యాచారం ప్రకారం యేసు శిష్యులు చేతులు కడుక్కోకుండా భోజనం చేయడం వారి కంటబడింది. యేసు ఇంతకుముందే యూదుల సబ్బాతు ఆచారాన్ని మీరాడు (మార్కు 2:23-3:5).

ఈ చేతులు కాళ్లు కడుక్కోవడాలు, మడి కట్టుకోవడాలు అర్థం పర్థంలేని బాహ్యాచారాల స్థాయికి దిగజారిపోయాయి. పరిశుద్ధత అనేది అంతరంగానికి సంబంధించినదని యేసు బోధించాడు. బాహ్యమైన 'అంటు' సోకకుండా ఉంటున్నామని యూదులు సంతృప్తి పడుతున్నారు. ఆ ఆచారాలు పాటించని వారిని చిన్నచూపు చూస్తున్నారు. ఇక్కడ దేవుని కుమారునికి, దైవభక్తులమని విర్రవీగే వారికీ తలెత్తిన అభిప్రాయం భేదం ఏదో పైపై సంగతి కాదు మత భక్తికి అతికీలకమైన అంశం ఇది. ప్రతి తరంవారూ ఈ సంఘర్షణ అనుభవించవలసిందే. ఎందుకంటే మానవనైజం ఎలాంటిదంటే బూజుపట్టిపోయిన ప్రాచీన సంప్రదాయాలకు పెద్దపీట వేసి, అర్థం పర్థం లేకుండా వాటిని గుడ్డిగా ఆచరిస్తూ ఉండేది. అక్షరానికి ప్రాముఖ్యతనిచ్చి భావాన్ని, అంతరార్థాన్ని విస్మరిస్తారు. దేవుని వాక్యపు వెలుగులో మన సంప్రదాయాలను మనం ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం మంచిది. అపొస్తలులు నోటిద్వారా, వారి వ్రాతల ద్వారా మనకు అందిన పారంపర్యాలను మాత్రమే పాటించాలి (2థెస్స 2:15).

రెండవ అంశం నేరస్థునిగా నిర్ణయించడం (7:6-13). యేసు తన శిష్యుల ప్రవర్తనను సమర్థిస్తూ, తమపై నేరం మోసేవారిని విమర్శించడంతో ఈ రెండవ దశ ఆరంభమయింది. ప్రవక్తల నుండి (యెషయా 29:13), ధర్మశాస్త్రం నుండి (నిర్గమ 20:12; 21:17; లేవీ 20:9) వచనాలను ఉల్లేఖించాడు.

యూదు మతపెద్దలు ఏ ధర్మశాస్త్రాన్ని నిలబెడుతున్నామని అన్నారో ఆ ధర్మశాస్త్ర అధికారానికి గండికొడుతున్నారు.

వారు తమ స్వకపోల కల్పితాలను దేవుని వాక్యంగా చెబుతున్నారు (మార్కు 7:7).

దేవుని వాక్యాన్ని పక్కన బెడుతున్నారు (మార్కు 7:8).

దేవుని వాక్యాన్ని తిరస్కరిస్తున్నారు (మార్కు 7:9).

చివరికి వాక్యానికున్న ప్రభావాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారు (మార్కు 7:13).

యూదులు 5వ ఆజ్ఞను ఉల్లంఘించడంలో వారు చూపుతున్న తెలివితేటలను ప్రభువు బట్టబయలు చేశాడు. వారు ఆజ్ఞను అపహాస్యం చేస్తూ అదే సమయంలో దోషభరిత హృదయం కూడా లేకుండా చేసుకుంటున్నారు. అదెలాగంటే తమ ఆస్తిని దేవునికి సమర్పిస్తున్నట్టు శపథం చేస్తున్నారు (కొర్బాను అంటే 'దైవార్పణం' సంఖ్యా 30 చూడండి). ఇప్పుడు తమ ఆస్తిపాస్తులు దేవునికి చెందినప్పటికీ తాము అనుభవిస్తూ వాటిని వేరే విషయాలకు (వృద్ధ తల్లిదండ్రుల పోషణ నిమిత్తం) ఉపయోగించకూడదంటున్నారు.

ఇక్కడ జరిగిన సన్నివేశంలో మూడవ అంకం నేర ప్రకటన (7:14-16). శుద్ధ, అశుద్ధ జంతువుల గురించి వర్ణించిన మోషే ధర్మశాస్త్ర మీమాంస అంతటినీ ఒక మాటలో ఆయన మార్చేశాడు. 'వెలుపలి నుండి మనుష్యుని లోపలికి పోవునదేదియు వానిని అపవిత్రునిగా చేయజాలదని మీకు గ్రహింపకున్నారా?" (15,16,18వ). ఇలా అనడంలో యూదుణ్ణి యూదేతరుని నుండి వేరుచేస్తున్న ఒక బలమైన గోడను ఆయన కూలద్రోశాడని యూదులు గుర్తించారు. ప్రభువింకా సిలువపై మరణించలేదు గనుక ధర్మశాస్త్రమింకా నిర్వీర్యం కాలేదు (ఎఫెసీ 2:14-15; కొలస్సీ 2:14). అయితే ప్రభువు చెప్పినమాట ఆది నుండి కూడా సత్యమే. పవిత్రత అనేది హృదయంలో ఉండాలి గాని బాహ్యాచారాల వల్ల రాదు.

తనపట్ల ప్రేమ, విధేయత హృదయంనుండే రావాలని దేవుడు స్పష్టపరిచాడు (ద్వితీ 6:4-5; 10:12; 30:6,20).

యేసు తన మాటలకు వివరణ శిష్యులకు మాత్రమే ఇచ్చాడు (మార్కు 7:17-23). అపొ.కా. 10:14ను బట్టి చూస్తే పేతురు ధర్మశాస్త్రబద్ధమైన ఆహార నియమాలను చాలాకాలం వరకు పాటించినట్లు అర్థమవుతున్నది. మానవ హృదయం అన్ని రకాల వికారాలకూ పుట్టినిల్లు. మనిషి స్వతహాగా వాటిని అదుపులో పెట్టుకోలేదు.

ఇక్కడ యేసు చెప్పిన వివరణలో ఒక తేడా స్పష్టంగా అర్థమవుతున్నది. ఆహారం కడుపులోకి చేరుకుంటుంది. పాపపు ఆలోచనలు హృదయంలో పుట్టి బయటకు వస్తాయి. తిన్న అన్నం జీర్ణమైపోతుంది. పాపం మాత్రం మనలో నిలిచి చెడుకార్యాలు చేయిస్తూ ఉంటుంది.

ఈ సన్నివేశమంతటి ఫలితంగా యూదులు యేసును అపరాధిగా తీర్చి హాని తలపెట్టి ఉండవచ్చు. అందుకే అక్కడ నుండి తరలిపోయి యూదేతరుల ప్రాంతంలో ఆయన తలదాచుకున్నాడు. మానవ సంప్రదాయాలకు, దైవ సత్యానికి తేడాలు సమీక్షించుదాము.

| మానవ సంప్రదాయాలు | దైవ సత్యం |
|---|---|
| బాహ్యం, బానిసత్వం | అంతరంగం, స్వేచ్ఛ |
| హాస్యాస్పదమైన నిబంధనలు | పునాది సూత్రాలు |
| బహిరంగ భక్తి | ఆంతర్య పరిశుద్ధత |
| వాక్యంపట్ల నిర్లక్ష్యం | వాక్యానికి సన్మానం |

**2. యూదేతరులకు సహాయం (7:24-8:9)**

సేవకుడు తూరు, సీదోను ప్రాంతంలో యూదేతరుల మధ్య చేసిన మూడు అద్భుతాలను మార్కు వ్రాశాడు.

**దయ్యాన్ని వెళ్లగొట్టడం (24-30వ)**

ఎవరికంటా పడకుండా విశ్రాంతికోసం సేవకుడు పరదేశం వెళ్లినా బాధలో ఉన్న ఈ తల్లి ఆయనను వెదకి పట్టుకుంది. ఆమె ప్రభువు నుండి ఆ మేలు పొందడానికి అనేకమైన అడ్డుబండలున్నాయి.

1. ఆమె యూదురాలు కాదు
2. ఆమె స్త్రీ. అది పురుషాధిక్య సమాజం
3. ఆమె విరోధి సాతాను. ఎందుకంటే సాతాను అనుచరుల్లో ఒకడు ఆమె కూతుర్ని పీడిస్తున్నాడు.
4. యేసు శిష్యులు ఆమెకు అనుకూలంగా లేరు. ఆమెను పంపించి వెయ్యమని వారు యేసును కోరారు.
5. చివరికి యేసుప్రభువు సైతం ఆమెపట్ల వ్యతిరేకంగా ఉన్నట్టు అనిపించింది.

ఈ ప్రతికూల పరిస్థితులన్నింటినీ జయించిన శక్తి ఆమె అచంచల విశ్వాసమే !

మొదట అడిగినప్పుడు యేసు అసలు మాట్లాడలేదు. మళ్లీ అడిగినప్పుడు ఆమెకు వ్యతిరేకంగా అనిపిస్తున్న ఒక వాస్తవాన్ని, ఆమెకు నేరుగా కాక, ఆయన తన శిష్యులతో చెప్పాడు (మత్తయి 15:23,24). అయితే ఇవేవీ ఆమెను ఆపలేకపోయాయి. మొదటిసారి "దావీదు కుమారుడా" అని ఆయన యూదు నామంలోను, రెండవసారి ప్రభువా అనే పిలుపుతోను ఆయన్ను సమీపించింది. (ఈ సన్నివేశం గురించిన వివరాల కోసం మత్తయి సువార్త బైబిలు గైడు చూడండి.

'ఎంత గొప్ప విశ్వాసం' అంటూ యేసు మెచ్చుకున్నది ఈమెను, రోమా శతాధిపతినీ మాత్రమే (మత్తయి 8:5-18). ఈ రెండుసార్లూ ఆయన దూరం నుండే స్వస్థపరిచాడు. ఆ సమయంలో యూదులకు అన్యులకు మధ్యనున్న ఆత్మ సంబంధమైన దూరాన్ని ఇది సూచిస్తున్నది (ఎఫెసీ 2:11-22).

**చెవుడు, నత్తిగలవాడు (31-37వ)**

దెకపొలి ప్రదేశం ఆ రోజుల్లో రోమీయులకు అనువైన నివాస స్థానం. అందుకే మిగతా 3 సువార్తల్లో లేని ఈ సంఘటనను మార్కు మాత్రమే వ్రాశాడు. అతడు రోమ్ పఠితలను దృష్టిలో పెట్టుకుని తన సువార్తను వ్రాశాడు.

ఆ స్వస్థత ఒక ప్రదర్శనలా మారకూడదని యేసు ఆ వ్యక్తిని దూరంగా తీసుకుపోయాడు. అతడు చెవిటివాడు గనుక యేసు పలికే మాటలు వినలేడు. అయితే అతని చెవులపై, నాలుకపై ప్రభువు కరస్పర్శ గ్రహించగలడు. ఇది ఆ మనిషిలో విశ్వాసాన్ని పెంచగలుగుతుంది. యేసు నిట్టూర్చడం ఆయనలోని బాధను తెలియజేస్తున్నది. పాపమనేది ఈ లోకంలోని ఎలాంటి నొప్పిని, దుఃఖాన్నీ తెచ్చిందో చూసినప్పుడల్లా ఆయన చలించిపోయేవాడు.

'ఎప్పతా' అనే అరమేయిక్ మాట పాత నిబంధనలో 'యెఫ్తా' అనే పేరుకు సంబంధించినదే. 'తెరచుకో' అని దీని అర్థం. ఈ అద్భుతాన్ని రహస్యంగా ఉంచమన్న ఆజ్ఞను అక్కడి ప్రజలు లక్ష్యపెట్టలేదు. అక్కడ కూడా సేవకునికి విశ్రాంతి కరువైంది. అయితే దీని ఫలితంగా యూదేతరులు ఇశ్రాయేలీయుల దేవుణ్ణి మహిమపరిచారు (మత్తయి 15:31).

**నాలుగు వేలమందికి ఆహారం (8:1-9)**

ఇదీ, ఐదువేల మందికి ఆహారమియ్యడమూ వేరువేరు సంఘటనలు. ఇది మత్తయి, మార్కు సువార్తల్లో మాత్రమే కనిపిస్తుంది. ఐదువేలమంది అద్భుతం యూదుల మధ్య గలిలయ ప్రాంతంలో బేత్సయిదా వద్ద జరిగింది. ఇదైతే దెకపొలిలో ముఖ్యంగా యూదేతరుల మధ్య జరిగింది.

ఈ సంభవంలో కూడా ప్రభువు జాలిగుణం, పరిస్థితి పూర్తిగా ఆయన అదుపులో ఉండడం మనకు ప్రోత్సాహం కలిగిస్తాయి. అయితే శిష్యుల అపనమ్మకం కొంత నిరుత్సాహం కలిగిస్తుంది (8:4).

**3. శిష్యులకు హెచ్చరికలు (8:10-26)**

ఆవలి తీరానికి గలిలయ ప్రాంతానికి ప్రభువు తన బృందంతో చేరుకున్నారో లేదో పరిసయ్యులు ఒక డిమాండు తో ఎదురువచ్చారు. మనిషిని స్వస్థపరచడం వంటిది కాదు, "ఆకాశము నుండి" ఒక సూచకక్రియ వారికి కావాలి (యోహాను 6:30-31). సూచకక్రియ కోరడం వారి అపనమ్మకానికి సూచన. పరిపూర్ణ విశ్వాసం అద్భుతాలను కోరదు. ఇక్కడ మార్కు యూదేతరుల కోసం రాస్తున్నారు గనుక యోనా సూచన గురించి మార్కు వ్రాయలేదు. అక్కడి నుండి సాగిపోతూ యేసు తన శిష్యులకు ప్రాముఖ్యమైన ఆధ్యాత్మిక పాఠాలు నేర్పించాడు. శిష్యులేమో, ప్రయాణానికి రొట్టెలు తేవడం మర్చిపోయామని ఒకరిపై ఒకరు నింద మోపుకుంటున్నారు. ఇది ప్రభువును బాధపెట్టింది. వారికి గ్రహింపు లేదు, వివేచన లేదు. వారి హృదయాలు కఠినం, వారు అంధులు, చెవిటివారు, వారికేదీ జ్ఞాపకం ఉండదు (17,18వ). దేవుని ప్రజలు బహు తరచుగా ఆయన ఆశీర్వాదాలు మర్చిపోతుంటారు (కీర్తన 103:1-2).

అయితే ఇక్కడి ముఖ్యపాఠం రొట్టెను గురించి కాదు. పులిపిండిని గురించే. పులిపిండి దుర్మార్గతకు సాదృశ్యం; తప్పుడు సిద్ధాంతాలకు సాదృశ్యం (గలతీ 5:1-9). సంఘంలో బహిష్కరించకుండా ఉండిపోనిచ్చిన పాపానికి సాదృశ్యం (1కొరింథీ 5), వేషధారణకు సాదృశ్యం (లూకా 12:1). యేసు ఇక్కడ పరిసయ్యుల, హేరోదీయుల బోధ అనే పులిపిండి గురించి హెచ్చరిస్తున్నాడు.

ఇక్కడ మార్కు మరి ఏ ఇతర సువార్తలోనూ చెప్పని రెండు స్వస్థతలను వర్ణించాడు (7:31-37; 8:22-26). అసలు విశేషమేమిటంటే స్వస్థత క్రమేణా జరిగింది. ఒక్క చిటికెలో జరగలేదు.

ఆ సమయమంతటిలో శిష్యులు నేర్చుకొన్నదేమిటి ?

1. అద్భుతాల కోసం చూడవద్దు. దేవుని వాక్కుపై నమ్మకం ఉంచు.
2. అవసరాలు తీర్చాలని యేసువైపే చూడు.
3. తప్పు సిద్ధాంతమనే పులిపిండి దరిచేరనీయకు.
4. యేసు తన కిష్టం వచ్చిన పద్ధతిలో తన కార్యాలు జరిగిస్తాడు.

దేవుని సేవకుని జీవితంలో తీరికలేని కొన్ని దినాలను మార్కు వర్ణించాడు. తరువాతి అధ్యాయంలో సేవకుడు ఏకాంత సమయంలో తన శిష్య గణానికి ఏమేమి ఉపదేశిస్తున్నాడో తెలిపాడు.

## 7. సేవకుని రహస్యాలు 8:27-9:50)

రహస్యమంటే ఒక్కొక్కసారి ఒకొక్క వ్యక్తికి మాత్రమే చెప్పేది. యేసు ఇక్కడ కొద్దిమంది తన శిష్యులకు తన బోధనా రహస్యాలను వెల్లడిస్తున్నాడు. అవి మూడు.

**1. బాధలు మహిమకు దారి తీస్తాయి (8:27-9:13)**

యెరూషలేములో తనకు ఏమి సంభవించనున్నదో తన శిష్యులకు తెలియజేయాలని సమయం కోసం సేవకుడు ఎదురుచూశాడు. ఇంతకు ముందు చూచాయగా ఈ విషయం వారికి చెబుతూ వచ్చాడు. ఇప్పుడు తేటతెల్లంగా వారికి చెప్పాలి. ఇది చెప్పడానికి ఆయన కైసరయ ఫిలిప్పి ఊరి పరిసరాలలో రమ్య హెర్మోను పర్వతపాదం వద్ద ఒక స్థలాన్ని ఎన్నుకున్నాడు. ఈ ఊరికి సీజర్ ఆగస్టస్, హేరోదు ఫిలిప్పు అనే ఇద్దరు పాలకులను బట్టి పేరు పెట్టారు. ఇందులో సీజరు ఆగస్టస్ మహిమార్థం సుందరమైన పాలరాతి ఆలయం ఉంది. అది రోమ్ సామ్రాజ్య విఖ్యాతికి మహిమకు సాక్షీభూతంగా నిలిచిన ప్రాంతం. ఆ మహిమ అంతా ఇప్పుడు మసిబారి పోయింది. యేసుక్రీస్తు ప్రఖ్యాతి ఇప్పటికీ దేదీప్యమానంగా వెలుగొందుతున్నది.

**పేతురు ఒప్పుకోలు (27-30వ) :** నా గురించి అంతా ఏం చెప్పుకుంటున్నారు ? అని మనం అందరినీ అడుగుతూ పోతుంటే అది అహంకారమనుకుంటారు. ఇతరులు నా గురించి ఏమనుకుంటే ఏమిటి ? అయితే యేసును గురించి ఏమనుకుంటున్నారో, ఏమి నమ్ముతున్నారో అది అత్యంత ప్రాముఖ్యం. యేసును గురించి నీవు ఒప్పుకుంటున్న

విషయం, అది జీవన్మరణ సమస్య (యోహాను 8:21,24; 1యోహాను 2:22,27; 4:1-3). ఆ ఊరి ప్రజలు సీజర్ ఆగస్టస్ ప్రభువు అని చెబుతూ ఉండవచ్చు. అలా ఒప్పుకోవడం వారిని రోమా పౌరులుగా చూపించవచ్చు గాని పాప శిక్ష నుండి శాశ్వత నరకం నుండి వారిని అది తప్పించదు. అలా తప్పించే ఏకైక ఒప్పుకోలు "యేసే ప్రభువు, రక్షకుడు" అనేది (1కొరింథీ 12:1-3). ఆ ఒప్పుకోలు నిజంగా హృదయం నుండి వచ్చినదైతే ఆ వ్యక్తికి నూతన జీవం ఉంది (రోమా 10:9-10).

యేసును కొందరు బాప్తిస్మమిచ్చే యోహానుగా భ్రమించడం వింతగా ఉంది. అతడు ఏలీయా వాలకంతో తీర్పును ప్రకటించేవాడు (లూకా 1:17). సేవకుడు సాధుజీవిగా కృపాభరితుడుగా వచ్చాడు. యోహాను ఏ అద్భుతమూ చేయలేదు. సేవకుడు చేసినవి కోకొల్లలు. యోహాను ఏలీయావంటి వస్త్రాలు కూడా ధరించాడు.

యేసును యిర్మీయాగా పొరబడడంలో అర్థం లేకపోలేదు. యిర్మీయా విలాప ప్రవక్త. అతని ముఖ్య సందేశం జాతి పశ్చాత్తాపం. ఇద్దరినీ ఆ జాతి అపార్థం చేసుకుని తిరస్కరించింది. ఇద్దరూ మత జీవనంలోని కృత్రిమ విలువలను తెగనాడారు. ఆలయంలో దొంగపూజలను ఆక్షేపించారు. ఫలితంగా అధికారుల చేతిలో హింసలు పొందారు.

యేసును గురించి సత్యాన్ని గ్రహించక ఆ ప్రాంతాల ప్రజలంతా ఏవేవో అభిప్రాయాలతో ఉన్నారు. నమ్మకాలకు బదులు ఊహలకే పరిమితమైపోయారు. ఈ నేపథ్యంలో పేతురు ఒప్పుకోలు సాహసోపేతమైనది (మత్తయి 16:16). "నీవు క్రీస్తువు" క్రీస్తు అంటే ప్రవక్తలంతా ఎవరిని గురించి ప్రవచించారో ఆ అభిషిక్తుడు.

**గందరగోళం (31-38వ)**

ఇప్పుడు శిష్యులు క్రీస్తుపై విశ్వాసం వెల్లడించారు గనుక వారు రహస్యం తెలుసుకొనేందుకు సిద్ధంగా ఉన్నారు. తాను వారితో కలిసి యెరూషలేము వెళ్లనున్నాడు. అక్కడ తాను సిలువ నెక్కబోతున్నాడు (మార్కు 9:30-32; 10:32-34).

ఈ ప్రకటన శిష్యులను నిర్ఘాంతపోయేలా చేసింది. తాము ఒప్పుకున్నట్టుగా ఆయన దేవుని క్రీస్తు అయినట్టయితే మతనాయకులు ఆయననెందుకు తృణీకరిస్తారు? ఆయననెందుకు సిలువ వేస్తారు? ఎక్కడో తిరకాసు ఉంది. శిష్యులకు అంతా అయోమయం.

పేతురు ప్రభువును గూర్చి దైవ నడిపింపు మూలంగా గొప్ప సాక్ష్యమిచ్చాడు. మరు నిమిషమే సాతాను ప్రతినిధిగా మాటలాడుతున్నాడు. అపవిత్రాత్మలను గద్దించాడు అని చెప్పే గ్రీకు పదాన్నే (మార్కు 1:25) మార్కు ఇక్కడ పేతురును ప్రభువు గద్దించిన విషయాన్ని చెప్పడానికి ఉపయోగించాడు. పేతురు రాయి; మరుక్షణమే తొట్రుపడేలా చేసే రాయిగా కనిపిస్తున్నాడు.

బాధలకు, మహిమకు ఉన్న సంబంధాన్ని పేతురు అర్థం చేసుకోలేదు. తరువాత కాలంలో దీనిని పేతురు బాగా అర్థం చేసుకున్నాడు (1పేతురు 1:6-8; 4:13-5:10). పేతురునే గాక ప్రభువు "తన శిష్యులవైపు తిరిగి" అందరినీ గద్దించాడు.

శిష్యులకు ఒక సంగతి అర్థమై వుండాలి. తమ ప్రభువుకు, గురువుకు ఏమి జరుగుతుందో తమకూ అదే జరుగుతుంది. తమ భవితవ్యం ఆయనతో ముడిపడి ఉంది. ఆయనకు దక్కేది సిలువ అయితే, తమ గతీ అంతే, ఆయనకు దక్కేది కిరీటమైతే తమకూ అదే. అయితే ప్రస్తుతం వారు సాతాను వేదాంత పథంలో ఉన్నారు, "బాధలు లేకుండా మహిమ!" దేవుని పద్ధతి వేరు. బాధలే మహిమగా రూపాంతరం చెందుతాయి. ఏ పద్ధతిని నీవు నమ్ముతావో నీ జీవితం, సేవా ఆ ధోరణిలోనే ఉంటుంది.

తన శిష్యులకు చెప్పిన దానినే యేసు క్రమేణా అక్కడ గుమిగూడిన జనసమూహానికి చెప్పాడు. నిజమైన శిష్యరికానికి వెల చెల్లించవలసి ఉంటుంది. చాలామంది ఆయన చేసే అద్భుతాల కోసమే ఆయన్ను వెంబడిస్తున్నారు. నష్టం, కష్టం ఉన్నాయనుకుంటే వారంత ఉత్సాహంగా ముందుకు రారు.

నిజ శిష్యత్వానికై సేవకుడు మూడు షరతులు చెప్పాడు.

1. పూర్తిగా మనలను ఆయనకు సమర్పించుకోవాలి.
2. ఆయన హింసలు, మరణంలో సమానుభవం పొందాలి.
3. ఎక్కడికి తీసుకువెళ్లినా విధేయంగా అనుసరించాలి.

Denying Self కీ Self denial కీ తేడా ఉంది. Self denial అంటే ఏదో ఒక మంచికార్యం కోసం కొంత సౌకర్యాన్ని వదులుకుంటాము. మనకున్న దానిలో కొంత ఇస్తాము. అయితే మనలను మనం విస్మరించుకుని యేసు క్రీస్తు నడిపించినట్టు నడవాలని నిర్ణయించుకోవడం వేరు.

నిజమైన శిష్యులు ఇలా చేయడానికి వారికి ప్రేరణ ఏమిటి? "నా నిమిత్తమును, నా సువార్త నిమిత్తమును" (35వ). నిన్ను నీవు ఉపేక్షించుకోవడం అనేది ఇక గత్యంతరం లేక కాదు. నిన్ను నీవు సమర్పించుకోవాలన్న భక్తిభావాన్ని బట్టే.

అంతేకాదు, శిష్యత్వం అనేది లాభనష్టాలకు సంబంధించినది. మన జీవితాలను వ్యర్థం చేస్తున్నామా ? లేక పెట్టుబడిగా పెడుతున్నామా అనే దానికి చెందినది. “ప్రాణమును పోగొట్టుకొనుట” అంటే జీవితాన్ని వ్యర్థం చేయడంతో సమానం. నీవు లోకమంతా సంపాదించుకోవచ్చు. లోకం దృష్టిలో గొప్పవాడివనిపించుకోవచ్చు. అయితే దేవుని ఎదుట నిలబడినప్పుడు పనికిరాని వాడివిగా ఉండే అవకాశం ఉంది.

నిజమైన శిష్యునికి ప్రతిఫలమేమన్నా ఉందా ? ఉంది. నానాటికీ క్రీస్తు పోలికలోకి మారుతుంటాడు, ఒకనాటికి ఆయన మహిమలో భాగం లభిస్తుంది. మహిమ కలుగుతుందని సాతాను మాట ఇస్తాడు. కాని ఆ మాట వింటే చివరికి మిగిలేది బాధలే. దేవుడు ప్రస్తుతం బాధలనే నీకు వంతుగా నియమించాడు. అవి గొప్ప మహిమగా రూపుదిద్దుకుంటాయి.

## సేవకుని దివ్యరూపం (9:1-8)

శిష్యత్వం పాఠాలను అంగీకరించి అభ్యాసం చేయడానికి విశ్వాసం అవసరం. అందుకని యేసు తన శిష్యులకొక అద్భుత దృశ్యాన్ని కనపరచడం ద్వారా దేవుడు నిజంగా బాధలను మహిమగా మారుస్తాడని నమ్మకం కలిగించాడు. ముగ్గురిని వెంటబెట్టుకుని కొండపై తన దివ్యరూపాన్ని ప్రదర్శించాడు.

ధర్మశాస్త్రానికి ప్రతినిధి మోషే, ప్రవక్తల ప్రతినిధి ఏలీయా, ఈ ఇద్దరి మాటలూ యేసుక్రీస్తులో నెరవేరాయి (లూకా 24:25-27). మోషే చనిపోయి సమాధి అయ్యాడు. ఏలీయా సశరీరుడుగా పరలోకానికి వెళ్ళాడు. చనిపోయి సమాధుల్లో ఉన్నవారినీ, శరీరంతో ఉన్నవారినీ కూడా ఒక దినాన మధ్యాకాశానికి పిలుచుకుంటాడు (1థెస్స 4:13-18).

‘రూపాంతరం’ అనే దానిలో లోపలి నుండి కలిగే మార్పు కారణంగా బయటికి కనిపించే తేడా అనే భావం ఉంది. వేషం వేసుకోవడం వేరు. లోపల అలానే ఉండి బయట మార్పులు చేసుకొనేది రూపాంతరం కాదు. యేసు తన మహిమను తన శరీరంలో గుండా బయటకు ప్రసరించనిచ్చాడు. నేటి విశ్వాసులమైన మనకు కూడా ఈ మహిమ స్థితి ఉన్నది (రోమా 12:1-2; 2కొరింథీ 3:18).

రూపాంతరం, మోషే ఏలీయాల ప్రత్యక్షం సమయంలో శిష్యులు నిద్రపోతున్నారు (లూకా 9:32). అయితే మేలుకున్నప్పుడు పేతురు ఆ ముగ్గురినీ కలిపి ఒకే స్థాయిలో మాట్లాడాడు. అయితే పరలోకం నుండి వచ్చిన స్వరం ఆ అపార్థాన్ని సవరించింది. యేసు, మోషే, ఏలీయా కాదు. “యేసు ఒక్కడే”, “ఈయన” నా ప్రియ కుమారుడు “ఈయన” మాట వినండి.

ఈ సేవకుడు మహిమా స్వరూపి అనీ, తమకు మహిమను ప్రసాదించగలవాడనీ, ఆయన మార్గంలో వెళితే తమకు మహిమ అనీ ఆ ముగ్గురు శిష్యులకూ అర్థమయింది.

## దిద్దుబాటు (11-13వ)

అర్థమయింది గాని, మలాకీ 3:1; 4:5-6 ప్రకారం, మెస్సీయ ఆగమనానికి ముందు ఏలీయా రావాలి కదా అన్న సందేహం మిగిలిపోయింది. ఏలీయా వచ్చాడా ? తాము గమనించలేదా ? లేక ఆ పర్వతం పైకి ఏలీయా దిగిరావడమే మలాకీ ప్రవచించిన ఏలీయా రాకా ?

యేసు రెండు విషయాలు స్పష్టం చేశాడు.

1. తనను నమ్మినవారి విషయంలో బాప్తిస్మమిచ్చే యోహానే ఏలీయా. ఎందుకంటే తన రాకకు దారి సిద్ధపరచింది ఏలీయాయే. అతడు ఏలీయా ఆత్మతో, శక్తితో తన పరిచర్య జరిగించాడు (లూకా 1:16-17).
2. భావికాలంలో మహాబాధల కాలానికి ముందు ఏలీయా వస్తాడు. ప్రకటన 11:2-12 దీని నెరవేర్పుగా కొందరు అంగీకరిస్తారు.

ఇక్కడ వచ్చిన ఇబ్బంది ఏమిటంటే ఇశ్రాయేల్ ప్రజల యోహాను పరిచర్యను సమ్మతించలేదు. సమ్మతించినట్టయితే వారి పాలిట అతడు ఏలీయాగా ఉండేవాడే. అప్పుడు వారు యేసుక్రీస్తును కూడా అంగీకరించేవారు. అయితే ఇశ్రాయేల్ జాతి యోహానునూ, క్రీస్తునూ కూడా తృణీకరించారు.

## 2. విశ్వాసం మూలంగా ప్రభావం కలుగుతుంది (మార్కు 9:14-29)

క్రైస్తవ జీవితం కొండలు, లోయలు గలది (ద్వితీ 11:11). యేసు తన శిష్యులతో కొండపై నుండి దిగివచ్చాక తక్కిన శిష్యులు రెండు సమస్యలతో సతమతమవుతుండడం చూశారు. ఒక వంక దయ్యం పట్టిన పిల్లవాణ్ణి వారు బాగుచేయలేక పోయారు. అది చాలదన్నట్టు శాస్త్రులతో సహా జనమంతా ఆ శిష్యులను చుట్టుముట్టి పోట్లాడుతున్నారు.

అపవిత్రాత్మ ఆ బాలుడి బ్రతుకు సర్వనాశనం చేస్తున్నది. ఆ బాబును పెంచడానికీ, సంరక్షించడానికీ పాటుపడే ఆ తండ్రి ఆవేదన ఊహించుకోండి. తన శిష్యులకు దయ్యాలు వెళ్లగొట్టే అధికారం యేసు ఇచ్చాడు (మార్కు 6:7,13). అయితే వారు విఫలమయ్యారు. ప్రభువుకు బాధేసింది.

ప్రభువు తన వారికి ప్రదానం చేసిన ఆధ్యాత్మిక వనరులను వారు ఉపయోగించుకోలేకపోతే ఆయనకెంత బాధగా ఉంటుందో కదా.

నిరాశ చెందిన ఆ తండ్రి యేసు అయినా అది చెయ్యగలడో లేదోనన్న సందేహంలో ఉన్నాడు. "ఏమైనను నీవలననైతే..." (23వ). అయితే తన అపనమ్మకాన్ని ఒప్పుకోగలిగిన యధార్థత అతనిలో ఉంది. యేసు ఆ అపవిత్రాత్మను వెళ్లగొట్టాడు.

ఆ అద్భుతంలో మనం నేర్చుకుంటున్న ముఖ్యపాఠం శత్రువును ఓడించేది మన విశ్వాసమేనన్నది (మార్కు 9:19,23-24). మరి శిష్యులెందుకు ఇది చెయ్యలేకపోయారు ? వారు తమ వ్యక్తిగత జీవితంలో ఆత్మీయ స్థితిలో నిర్లక్ష్యంగా ఉన్నారు. ప్రార్థన, ఉపవాసం మానుకున్నారు (మార్కు 9:29). యేసు వారికిచ్చిన అధికారాన్ని వారు విశ్వాస సహితంగా ఉపయోగించాలి. ఆత్మ సంబంధమైన క్రమ శిక్షణతో దానిని పెంపొందించుకోవాలి. వారు ఆ దయ్యాన్ని వెళ్లగొట్టలేకపోవడం వారి ప్రభువుకు కూడా చెడ్డపేరు వచ్చింది. దేవుణ్ణి మహిమపరచేది, మనకు బలాన్ని ఇచ్చేదీ మన విశ్వాసమే (రోమా 4:20,21).

### 3. ఘనత అనేది సేవద్వారా కలుగుతుంది (మార్కు 9:30-50)

సేవకుని మరణం గురించి (మనకి కూడా) గుణపాఠం నేర్పడం కోసం యేసు ఒక చిన్న పిల్లవాణ్ణి వారిమధ్య నిలబెట్టాడు. మొదటివాడుగా ఉండడానికి మార్గం చివరివాడుగా ఉండడమే. అంటే అందరికీ సేవకుడుగా ఉండడం. చిన్నపిల్లవాడు విధేయతకు, వినయానికీ గొప్ప ఉదాహరణ. పసివాడు పసివాడుగా ప్రవర్తిస్తూ నిస్సహాయంగా ఉంటే అందరూ ఎత్తుకుని ముద్దాడతారు అందరూ వాడిచుట్టూ చేరుతారు.

తగ్గింపు గుణమంటే తనను తాను తెలుసుకోవడం, ఆవిధంగా సమ్మతించడం. క్రీస్తు ప్రభువు పరిభాషలో మనం ఇతరులకు పరిచర్య చేస్తే అందరికన్నా గొప్పవారమౌతాము. లోకమైతే అందరి సేవలూ అందుకుంటున్న వారిని గొప్పవారంటుంది. అరమేయిక్ భాషలో బాలుడు, సేవకుడు అనే రెండూ ఒకటే మాట. పసివాడికుండే మనసుంటే ఇతరులకు సేవచేయడం చాలా సులభంగా అలవడుతుంది.

మనం దేవుని కుటుంబంలోని ఇతర పిల్లల (విశ్వాసుల) విషయంలో ఎలా ప్రవర్తిస్తున్నామన్నది చాలా ప్రాముఖ్యం. మనం ఒకనితో ఒకడు సమాధానంగా ఉండాలి (9:50). ఆయనపట్ల విశ్వాసముంచే చిన్నవారిలో ఎవరికైనా ఆటంకం కలిగిస్తున్నామేమో జాగ్రత్త. ఇక్కడ చేతులూ కాళ్లూ నరికి వేసుకొమ్మని కాదు. ప్రభువు అభిప్రాయం (43,44వ). పాపమనేది హృదయంలో నుండి వస్తుందని ప్రభువే చెప్పాడు. మనలను పాపానికి నడిపించేది మనకెంత ప్రియమైనదైనా దాన్ని దూరం చేయాలని ఇందులోని భావం.

నరకం గురించి 45-46 వచనాలలో యేసు ప్రస్తావించాడు. నరకమనే స్థలం ఉన్నదని కొందరు నమ్మరు. యేసు ఇక్కడ యెషయా 66:24ను ప్రస్తావిస్తున్నాడు. బైబిలు ప్రకారం నరకం శాశ్వతం (ప్రకటన 20:10).

శిష్యులు ఇతరులను గద్దించి అవరోధించడానికి బదులు తాము ఉప్పుగా ఉండడం మానుకున్నామేమో చూసుకోవాలి. ఉప్పు నమ్మకత్వానికీ కుళ్లును నివారించడానికీ సూచన. పాత నిబంధనలో ఇద్దరిమధ్య ఒప్పందం చేయడానికి ఉప్పును సంకేతంగా వాడేవారు.

## సేవకుని సూక్తులు (అధ్యాయం 10)

ఈ అధ్యాయంలో సేవకుడు నేర్పించిన 3 పాఠాలు మన క్రైస్తవ జీవితానికి పట్టుగొమ్మలు.

ఇద్దరు ఒకరవుతారు (10:1-12)

పెద్దలు చిన్నలుగా అయిపోవాలి (10:13-16)

మొదటివారు చివరివారౌతారు (16:17-31)

సేవకులు పాలకులవుతారు (10:32-45)

బోధకునిగా ఈ సేవకుడు దేవుని వాక్యాన్ని వివరించ డానికి సంకేతాలను, సాదృశ్యాలను, ఉపమానాలను, సామెత లను వినియోగించాడు. అంతేగాక పరస్పరం విరుద్ధంగా కనిపించే మాటల ద్వారా తన సత్యాన్ని వివరించాడు. వీటిని పారడాక్సులంటారు. "నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను" (2కొరింథీ 12:10). అలాంటి పరస్పర వైరుధ్యం గల సత్యాన్ని వివరించడానికి ఉత్తమ మార్గం పేరడాక్స్.

విడాకుల గురించి బోధ. యేసు గలిలయలోని కపెర్నహూమును విడిచి యెరూషలేముకు ప్రయాణిస్తూ యొర్దాను తూర్పు ప్రాంతానికి వచ్చాడు. ఆ ప్రాంతానికి రాజు హేరోదు అంతిప. ఇతడు తన తమ్ముడి భార్యచేత అతనికి

విడాకులిప్పించి ఆమెను తాను వివాహమాడిన ప్రబుద్ధుడు. దీనిని ఆక్షేపించినందుకు బాప్తిస్మమిచ్చే యోహాను కూడా ప్రాణాలు పోగొట్టుకోవలసి వచ్చింది. ఇక్కడ విడాకుల గురించి యేసును ప్రశ్నించడం ద్వారా యేసును ఇరకాటంలో పెట్టాలని శాస్త్రుల పన్నాగం. అంతేగాక విడాకుల గురించి రబ్బీలు వివిధ అభిప్రాయాలు వెలిబుచ్చారు. యేసు ఎలా జవాబు చెప్పినా ఎవరికో ఒకరికి కోపమొస్తుంది. శాస్త్రులు యేసును గుచ్చి గుచ్చి అడుగుతూ ఆయన్ను విసిగించి ఆయనచేత ఏదో ఒక పొరపాటు మాట అనిపించుదామను కున్నారు.

ద్వితీ 24:1-4లో "ఇష్టము తప్పినయెడల" అనే మాటకు యూదా మత గురువులు రకరకాల వ్యాఖ్యానాలు ఇచ్చారు. రబ్బీ హిల్లేల్ దీనికి విస్తృతమైన అర్థం చెప్పాడు. భార్య ఆ రోజున వంట మాడబెట్టినా అది విడాకులు ఇవ్వడానికి సరైన కారణమే. రబ్బీ షమ్మయి వ్యాఖ్యానం ప్రకారం పెండ్లి చేసుకొన్నవాడు తన భార్య కన్యకాదని తెలిస్తే ఆమెకు విడాకులివ్వవచ్చు.

యేసుప్రభువు సాధారణంగా ఇలాంటి సిద్ధాంత చర్చల్లో దిగేవాడు కాదు. వాక్యం మీదనే దృష్టి కేంద్రీకరించేవాడు. ద్వితీ 24:1-4ను బట్టి చూస్తే రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి. విడాకులు ఇచ్చే హక్కు పురుషునికే ఉంది. రోమీయుల్లో స్త్రీలు కూడా విడాకులు ఇయ్యవచ్చు. రెండవది ఆమెకు కాగితం రాసి ఇయ్యాలి. ఆమె విడాకులు పొందిన స్త్రీ అనీ ఎవరైనా సరే స్వేచ్ఛగా ఆమెను వివాహం చేసుకోవచ్చనీ సమాజానికి తెలియడానికే ఈ ఏర్పాటు. ఇవి తప్ప ఆ ఆజ్ఞలో ఉన్న మరొక్క నిషేధం ఏమిటంటే రెండవ భర్త మరణం తరువాత, లేక అతనినుండి విడిపోవలసి వస్తే ఆమె మొదటి భర్త వద్దకు మళ్లీ వెళ్లకూడదు. విడాకులు పొందిన స్త్రీ పెళ్లాడవచ్చా అన్నది కాదు ప్రశ్న. "విడాకులు ఇవ్వడానికి సరైన కారణాలు ఏమిటి ?" అన్నదే.

మోషే ధర్మశాస్త్రంలో విడాకులు ఇవ్వడానికి తగిన కారణం వ్యభిచారం కాదు. వ్యభిచారానికి శిక్ష రాళ్లతో కొట్టి చంపడం. మరి విడాకుల పత్రం రాసివ్వడంలో అర్థం ఏమిటి? పత్రం రాసివ్వాలని మోషే ఆజ్ఞాపించినది మగవాడి పాపభూయిష్టమైన హృదయాన్ని బట్టే. పత్రం రాసివ్వకుండా భార్యను వదిలేస్తే ఆమె సామాజికంగా వెలివేతకు గురి అవుతుంది. ఆమెను ఇక వేరెవరూ పెళ్లిచేసుకోరు. వేశ్యగా చూస్తారు. భార్య భవిష్యత్తు భద్రంగా ఉంచడానికీ ఈ పరిత్యాగ పత్రిక. ఇశ్రాయేలీయులకు ఈ ఆజ్ఞ ఇవ్వడంలో పురుషులు ఎలాబడితే అలా తమ భార్యలకు విడాకులు ఇయ్యవచ్చని దేవుని ఉద్దేశం కాదు. విడాకులు ఇయ్యవలసి వస్తే ఆ స్త్రీకి అన్యాయం జరగకూడదన్నదే ఈ పరిత్యాగ పత్రికలో ఉద్దేశం. మరొక స్త్రీని మోహించి, ఇప్పుడున్న భార్యకంటే పడుచుదీ, అందమైనదీ అయిన వేరొక స్త్రీని పెళ్లి చేసుకొనేందుకు వీలుగా ఈమెకు విడాకులిచ్చే వీలును కట్టడి చేయడానికే ఈ ఏర్పాటు.

ఇది చెప్పాక ప్రభువు ఇంకా వెనక్కి వెళ్లి సృష్టి గురించి ఆదికాండంలో రాసి ఉన్నదాన్ని ప్రస్తావించాడు (1:27; 2:21-25). వివాహాన్ని స్థాపించింది దేవుడే. కనుక కొన్ని నియమ నిబంధనలు పెట్టడానికి ఆయనకే అధికారం ఉంది. వివాహ బంధం పవిత్రం, శాశ్వతం, మానవ జాతిలో ఉన్న అత్యంత సన్నిహిత బాంధవ్యం ఇదే. ఇద్దరు వ్యక్తులు ఒకటవుతారు. భార్యభర్తల సంబంధానికి మాత్రమే ఇది వర్తిస్తుంది.

వివాహంలో ఆత్మ సంబంధమైన అంశం అత్యంత ప్రాముఖ్యమైనప్పటికీ ఇక్కడ నొక్కి చెబుతున్న విషయం శారీరక కలయిక. ఇద్దరూ ఏక శరీరమవుతారు. ఒక ఆత్మగా అయిపోరు. వివాహం ఇద్దరు వ్యక్తుల శారీరక సంగమం గనుక శారీరక కారణాల వల్ల మాత్రమే అది భంగమవుతుంది. అవి మరణం (రోమా 7:13) లేదా వేరొక వ్యక్తితో కలయిక (మత్తయి 5:32; 19:9).

ఇదంతా విన్న శిష్యులకు అసలు పెళ్లి చేసుకోవడమే ప్రమాదకరమని అనిపించింది (మత్తయి 19:10). అందుకని ప్రభువు ప్రత్యేకంగా వారికి మరింత వివరణ ఇచ్చాడు. వ్యభిచార కారణం వలన గాక వేరే కారణాల వల్ల విడాకులిచ్చి వేరొక స్త్రీని పెళ్లి చేసుకునేవాడు వ్యభిచారి. పురుషుణ్ణి గురించి చెప్పిన మాటలే స్త్రీని గురించి చెప్పడం ద్వారా యేసు స్త్రీకున్న వ్యక్తిగత విలువను హెచ్చించాడు.

దేవుడు కలిపిన వారిని మనిషి వేరుచేయకూడదు (10:9). మరణం మూలంగా దేవుడే వేరుచేయవచ్చు. మన చట్టాల ప్రకారం విడాకులు చట్టబద్ధం అయి ఉండవచ్చు. దేవుని ప్రకారం అది చట్టవిరుద్ధమయ్యే అవకాశం ఉంది. దంపతులు ఒకరిపట్ల ఒకరు నిబద్ధత పాటించాలి (7వ). విడాకులనేవి తేలిక మార్గంగా చాలామంది ఈనాడు చూస్తున్నారు.

## 2. పెద్దలు చిన్నలుగా అయిపోవాలి (10:13-16).

ఆనాటి యూదులు పిల్లలను భారంగా కాక ఆశీర్వాదంగా ఎంచేవారు (కీర్తనలు 127,128).

తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశీర్వచనాల కోసం రబ్బీల వద్దకు తేవడం పరిపాటి. పిల్లల్ని యేసువద్దకు రానియ్యకుండా

శిష్యులు అడ్డగించడం దేనికీ ? (శిష్యుల హృదయ కాఠిన్యం కొరకు. మత్తయి 15:23; మార్కు 6:36 చూడండి). వారాయన్ను విసిగించకుండా అడ్డుకుని ప్రభువును విశ్రాంతిగా ఉండనిద్దామని అయి ఉండవచ్చు. అంటే పిల్లలను అంత ప్రాముఖ్యత లేనివారుగా వారు ఎంచారన్నమాట. ప్రభువు అంతకుముందే ఈ విషయం బోధించాడు (9:36 నుంచి).

వారు చేస్తున్న దానికి ఆయన కోప్పడ్డారు.

పిల్లలు చేసే పనులు చూసి మనం సాధారణంగా కోపగించుకుని "ఇంకెత కాలం ఈ పిల్ల చేష్టలు? ఎప్పుడు ఎదుగుతావు?" అని తిడతాము. పిల్లల్ని పెద్దవాళ్లవలె ప్రవర్తించమంటాము. ఇక్కడ యేసు పెద్దల్ని పిల్లలవలె ఉండమంటున్నాడు. ప్రవర్తన విషయం పిల్లలే మనకి ఆదర్శం అన్నమాట.

పిల్లలు పూర్తి నమ్మకంతో ఇతరులపై ఆధారపడతారు. దేన్నైనా స్వీకరిస్తారు. తమ పరిస్థితిని గురించి ఉన్నదాని కన్నా ఎక్కువగా ఊహించుకోరు. మనం కూడా విశ్వాసం మూలంగానే దేవుని రాజ్యంలో ప్రవేశించాలి. నిస్సహాయంగా, కేవలం దేవుని కృపమీదనే ఆధారపడుతూ ఉండాలి. అలా ప్రవర్తిస్తే దేవుడు మనల్ని ప్రేమించి మన అనుదిన అవసరతలు తీరుస్తాడు. పిల్లవాడికి దెబ్బ తగిలితే ఏం చేస్తాడు ? ఆ బాలలను యేసు ఎత్తుకుని దీవించాడు.

### 3. మొదటివారు చివరి వారౌతారు (10:17-31)

యేసు పాదాల చెంతకు వచ్చిన వారందరిలోకీ, వచ్చి ఏ మేలు పొందకుండా తిరిగి వెళ్లిపోయిన వారిలో ఇతడు ఒకడు. ఎంతో దుఃఖపడుతూ వెళ్లిపోయాడు. రాకముందే అతనికెన్నో అర్హతలు, యోగ్యతలు ఉన్నాయి. అతడు యువకుడు (మత్తయి 10:22), గౌరవనీయుడు, అధికారి, ధనికుడు, మంచి ప్రవర్తన, నీతిగల జీవితం ఉన్నాయి. ఆత్మ సంబంధమైన వాటిపట్ల ఆశ ఉంది. అతన్ని చూడగానే యేసుకు అతనిపై ప్రేమ కలిగింది.

అయితే నిత్యజీవాన్ని పొందడానికి తానేదో చెయ్యగలననే ఉద్దేశంలో ఇతడున్నాడు. ఆనాడూ, ఈనాడూ కూడా ఇది మనషుల్లో ఉన్నదే. చాలామంది ఏమనుకుంటారంటే చివర్లో దేవుడు తమ మంచి పనులన్నిటినీ ఒకవైపునా, చెడ్డ పనులన్నిటినీ ఒకవైపునా త్రాసులో తూకం వేసి చూస్తాడు; కాబట్టి మంచి పనుల బరువు కొంచెం ఎక్కువ ఉండేలా చూసుకుంటే చాలనుకుంటారు.

పాపం అనేది కేవలం ఒక క్రియ కాదు. అదొక తిరుగుబాటు మనస్తత్వం. ఈ యువకునికి పాపం, నిత్యజీవం మొదలైన వాటి విషయంలో తేలిక అభిప్రాయం ఉంది. యేసుప్రభువు విషయంలో కూడా తేలిక అభిప్రాయమే ఉంది. "సద్బోధకుడా" అని పిలుస్తున్నాడు. ఆయన్ను ముఖస్తుతి చేయడానికన్నట్టు ఉంది ఇతని వాలకం. యూదు రబ్బీలు 'మంచి' అనే మాటను తమకు తగిలించుకోవడానికి అంతగా ఇష్టపడరు. అది దేవునికి మాత్రమే సరిపడే విశేషమని వారు భావిస్తారు.

మోషే ధర్మశాస్త్రం ప్రకారం తాను పాపినని అతడు గుర్తించాలని యేసు ధర్మశాస్త్రం ప్రస్తావన తెచ్చాడు (గలతీ 2:16-21; 2:8-10). మనమెంత మురికిగా ఉన్నామో చూపే అద్దం ధర్మశాస్త్రం. అద్దం మనలను పరిశుభ్రపరచదు. క్రీస్తు వద్దకు మనిషిని పంపించే సాధనమే ధర్మశాస్త్రం. అయితే ఈ యువకుడు తననొక పాపిగా చూసుకోవడం లేదు. విధేయతను కేవలం బాహ్యాచారాల కొలమానంలోనే చూస్తున్నాడు. అంతరంగ పాపం గురించి ఆలోచించడం లేదు. చర్యలకు, ప్రవర్తనకు సంబంధించినంత వరకు అతడు నిర్దోషి (ఫిలిప్పీ 3:6 చూడండి).

అయితే అతని విశ్వాసం దేవునిపై లేదు. డబ్బు మీదనే ఉంది. దాన్నే నమ్ముకున్నాడు.

శిష్యుడు కాగోరే ప్రతివాడికీ మార్కు 10:21లోని మాటలు వర్తించవు. ఇక్కడ యేసు కేవలం ఒక యువ ధనికుని అవసరాన్ని బట్టి మాట్లాడుతున్నాడు. తన ధనాన్ని పేదల కియ్యాలి. అధికారాన్ని త్యజించి సిలువనెత్తుకొని తనను వెంబడించాలి. అతని ముఖంపై వానమబ్బులు అలుముకున్నాయి. అతడు తన పద్ధతుల ప్రకారం రక్షణ పొందాలనుకున్నాడు.

ఆస్తిపాస్తుల గురించి యేసు పలికిన మాటలు (23వ) శిష్యులను ఆశ్చర్యపరిచాయి. ఎందుకంటే సిరిసంపదలనేవి దైవానుగ్రహానికి సూచనలని ఆనాటి యూదులు నమ్మేవారు (ఈనాటికీ చాలామంది నమ్ముతున్నారు). యేసు, ఆయన అపొస్తలులు ఆస్తులు కూడబెట్టుకోలేదు. ఆస్తిపాస్తులు ఈ యువకుణ్ణి నిత్యజీవంలోకి ప్రవేశించకుండా అడ్డుపడ్డాయి.

డబ్బు మంచి సేవకుడు, కానీ క్రూరమైన యజమాని, నీకు డబ్బుంటే కృతజ్ఞత కలిగి దైవ సేవకై అది ఖర్చుపెట్టు. అయితే ఆ డబ్బే నీకు యజమాని అయితే జాగ్రత్త. డబ్బు కొనగలిగిన వస్తువులను కలిగి ఉండడం మంచిదే. కాని ఆ కారణంగా డబ్బు కొనలేని వాటిని దూరం చేసుకుంటావేమో జాగ్రత్త.

పేతురు ప్రశ్న అతని హృదయంలో కూడా ఈ బీజమే ఉన్నదని తెలుపుతున్నది. "మాకేం దొరుకుతుంది?" నీ కోసం

అన్నీ విడిచిపెట్టాము కాబట్టి మమ్మల్ని పరలోకం తీసుకుపో. ఇది వ్యాపార దృక్పథం. ఇదే పేతురు అపొ.కా. 3:6 "నా దగ్గర ఉన్నదే నీకు ఇస్తున్నాను" అనే స్థాయికి ఎదిగాడు.

తనను వెంబడించిన వారెవరూ కూడా నిజంగా అవసరమైన దానిని ఎన్నడూ పోగొట్టుకోరని యేసుప్రభువు హామీ ఇచ్చాడు. దేవుడు ప్రతి ఒక్కరికీ ప్రతిఫలమిస్తాడు.

అది నీకు లాభసాటి అనే కారణం వల్ల నీవు ఇస్తూ ఉన్నట్టయితే, అది నీకు లాభసాటి కాదు. తమ దృష్టిలో మొదటివారుగా తమను ఎంచుకొనేవారు దేవుని దృష్టిలో ఆఖరు వారు (10:31).

## 4. సేవకులు పాలకులౌతారు

సేవకుడు నిరంతరాయంగా యెరూషలేము వైపుకు ప్రస్థానం కొనసాగిస్తూనే ఉన్నాడు. యెషయా 42-53 అధ్యాయాలు, ముఖ్యంగా 50:7 వంటి వచనాలు ఆయన మదిలో దోబూచులాడుతూ ఉండవచ్చు.

ఆయన్ను అనుసరిస్తున్న వారి పాలిట ఆయన వెల్లడిస్తున్న ప్రతిమాటా ఆశనిపాతమౌతున్నది. ఎక్కడ (యెరూషలేములో) ఏమి (సిలువ) జరుగనుందో ఆయన వారికి స్పష్టంగా చెబుతున్నాడు. మానసికంగా వారిని సిద్ధపరుస్తున్నాడు. అయితే తాను తిరిగి బ్రతుకుతానని కూడా చెబుతున్నాడు.

ఈ నేపథ్యంలో యోహాను యాకోబుల తల్లి సింహాసనాల గురించి మాట్లాడటం (35-37వ) మనకు విచిత్రంగా ఇబ్బందికరంగా కనిపిస్తుంది. యేసు సిలువ బాధల సంగతి వీరికి అసలు అర్థం కాలేదా ? అలా కాదు, సలోమి, ఆమె ఇద్దరు కొడుకులు యేసు వారికిచ్చిన వాగ్దానం గురించే అడుగుతున్నారు (మత్తయి 19:28 చూడండి). ప్రభువు తాను మరణిస్తానని పదే పదే చెబుతున్నాడు గనుక వారు ఈ సంగతి ఆయనను అడగడం సమంజసమే.

అయితే తేడా ఎక్కడంటే వారి విన్నపం స్వార్థపూరిత మైనది. (యాకోబు 4:2-3). వారి విన్నపాల ప్రకారం చేయాలంటే అంతకు ముందుగా యేసు హింసలు పొంది మరణించాలి. మరణ పాత్రలోనిది ఆయన తాగాలి. ఆయన ప్రశ్నకు జవాబుగా తాము కూడా అది తాగగలమన్నారు. తరువాతి చరిత్ర సైతం వారు అదే బాప్తిస్మాన్ని పొందారనీ అదే పాత్రలోనిది తాగారనీ తెలుపుతున్నది. మొదటగా హతసాక్షి అయినది యాకోబే.

మిగతా శిష్యులకు ఇది కోపం తెప్పించింది. బహుశా వారి కోపంలో "మాకు ఈ ఆలోచన ముందుగా ఎందుకు రాలేదు ?" అనే చిరాకు కూడా ఉండేదేమో. గొప్పదనానికి లోకమిచ్చే నిర్వచనాన్ని పాటించడం అనేది ఈ శిష్యులూ, నేడు మనమూ కూడా చేసే పెద్ద పొరపాటు. మార్కు 10:43,44లో గొప్పవారం కావడానికి యేసు చూపిన మార్గం తేటతెల్లంగా ఉంది. దేవుడు ఒక వ్యక్తిని పరిపాలకునిగా హెచ్చించేవరకూ అతడు సేవకునిలా ఉండాలి. యోసేపు, మోషే, యెహోషువ, దావీదు, తిమోతి మొదలైనవారి విషయంలో ఇదే జరిగింది. ప్రభువు కూడా ఇంతే (ఫిలిప్పీ 2:1-11). ఇతరులకు లోబడడం మనకు తెలిసేదాకా ఇతరులకు ఆజ్ఞలిచ్చే హక్కు మనకి లేదు. అధికారం కింద ఉండడమేమిటో అర్థం చేసుకునే వరకూ అధికారం చెలాయించడం పనికిరాదు.

ఆ ప్రయాణంలో వారితోబాటు పస్కా పండుగకై యెరూషలేము వెళ్తున్న యాత్రికులు చాలామంది ఉన్నారు. యెరూషలేము ఇంకా 18 మైళ్ల ఉందనగా వారంతా యెరికో ప్రవేశించారు.

రహదారి పక్కన గుడ్డివాళ్లు ఇద్దరు (మత్తయి 20:30) కూర్చుని ఉన్నారు. వారిలో ఒకడి పేరు బర్తిమయి. స్వస్థతలు జరిగించే నజరేతువాడైన యేసు అటుగా వెళ్తున్నాడని వారు విన్నారు. ఆయన దృష్టిని ఆకర్షించాలని శాయశక్తులా కృషి చేశారు. మొదట్లో జనం వారిని ఊరుకోబెట్టాలని ప్రయత్నించారు. పైబట్ట కాళ్లకి అడ్డుపడుతుందేమోనని దాన్ని అవతల పారవేసి వారు గబగబా రక్షకుని వద్దకు వచ్చారు.

"నేను నీకు ఏం చెయ్యాలి ?" అని గుడ్డివాణ్ణి అడగడం వింతగా ఉంది. అయితే అతడు తనకు కావలసినది తన నోటితో చెప్పడం ద్వారా తన విశ్వాసాన్ని ప్రకటించడానికి అవకాశం ఇస్తున్నాడు యేసు. 51వ వచనంలో బోధకుడా అని అనువాదం చేసిన మాట 'రబ్బూనీ'. మగ్దలెనె మరియ ఒక్కతే ఈ పేరుతో యేసును సంబోధించింది. 'నా స్వామీ' అని దీని అర్థం.

యేసు కనికరంతో కదలిపోయి (మత్తయి 20:24) వారికి దృష్టినిచ్చాడు. వారిద్దరూ ఆనందంగా శిష్య బృందంతో కలిసి యెరూషలేము యాత్రకు బయలుదేరారు.

సిలువ బలియాగానికై బయలుదేరిన సేవకుడు ఆగి ఇద్దరు గుడ్డి బిచ్చగాళ్లకు పరిచర్య చేయడం నిజంగా ఆయన సేవావృత్తిని కళ్లకు కడుతున్నది. మార్కు సువార్తలో చెప్పిన ఆఖరు అద్భుతం ఇదే.

# 9. యెరూషలేములో సేవకుడు (మార్కు 11:1-12:44)

పండుగ సమయంలో యెరూషలేము జనాభా మూడింతలవుతుంది. పొంగిపొరలే జాతి, మతాభిమానాలతో యూదులు పరిశుద్ధ పట్టణానికి ప్రయాణం కడతారు. తీవ్రవాదులు ఈ సమయంలో రోమా సైనికాధికులను హత్య చేయడం, విప్లవం లేవదీయడానికి ప్రయత్నించడం పరిపాటే. దేవుని సేవకుడు ఈ సమయంలో యెరూషలేములో 3 పాత్రలలో పరిచర్య జరిగించడానికి వచ్చాడు.

### సేవక - పాలకుడు (11:1-11)

యెరూషలేము ప్రయాణంలో మొదట బేతని గ్రామం వస్తుంది. అక్కడి నుండి బేత్పగే చేరుకుంటారు. యెరూషలేముకు రెండు మైళ్లు దూరాన ఉన్న బేత్పగే సముద్ర మట్టం నుండి 2,600 అడుగుల ఎత్తున ఉంటుంది. ఇక్కడనుండి పరిశుద్ధ పట్టణం మొత్తం దిగువగా కనిపిస్తుంటుంది. ఇప్పుడు ప్రభువు ఇంతకుముందు తానెన్నడూ చేయనిదాన్ని చేయబోతున్నాడు. అది చేయవద్దని ఆయన పదే పదే అందరికీ చెప్పాడు. కాని ఇప్పుడు తన గౌరవార్థం బహిరంగ ప్రదర్శన నిర్వహించే అవకాశం తనవారికి ఇవ్వనున్నాడు.

ఈ ఊరేగింపు కోసం కావలసిన గాడిదపిల్ల కోసం ఇద్దరు శిష్యులను బేత్పగేకు పంపించాడు. గాడిద గురించి మనకు మంచి అభిప్రాయం ఉండదు. అయితే ఆ కాలంలో అది రాజవాహనం (1రాజులు 1:33). జెకర్యా 9:9లోని ప్రచవన నెరవేర్పుకు ఇది అవసరం. ఇలా చేయడంలో యేసు తనను ఇశ్రాయేలీయులు రాజు మెస్సీయగా ప్రకటించు కొంటున్నాడు. మతాధికారులను బుద్ధిపూర్వకంగా రెచ్చగొట్టి వారు తమ కుట్రకు తుదిమెరుగులు దిద్దేలా ప్రేరేపిస్తున్నాడు. దేవుని గొర్రెపిల్ల పస్కా పర్వదినాన బలి కావాలి. ఈ ఊరేగింపులో ముఖ్యంగా గలిలయ నుండి వచ్చిన యూదులు ఉన్నారు. మట్టలాదివారం నాడు 'హోసన్నా' అని అరచిన నోళ్లే మంచి శుక్రవారంనాడు "సిలువ వేయండి" అని అరిచాయి అనే మాట నిజం కాదు. సిలువ వేయమని కేకలు పెట్టింది ముఖ్యంగా యెరూషలేము నివాసులు. హోసన్నా అనే మాటకు 'మమ్మును రక్షించు' అని అర్థం. ఇది కీర్తన 118:25-26 నుండి వచ్చింది. వారు తనను దావీదు కుమారునిగా, మెస్సీయ రాజుగా ప్రకటిస్తున్నారని ఆయనకు తెలుసు. అలానే జరగనిచ్చాడు.

ఇది యెరూషలేము జయప్రవేశం. ఆయన అభిషిక్తుడైన రాజు. ఆయన విజయాలు సైనికమైనవి కావు. ఆధ్యాత్మిక మైనవి. త్వరలో ఆయన 500 మందిని పెంతెకొస్తునాడు తన స్వాధీనం చేసుకోనున్నాడు. యెరూషలేములో ప్రవేశించి ఆ రాత్రి గడిపేందుకు బేతనికి తిరిగి వచ్చాడు.

### సేవక న్యాయాధిపతి (12-14వ; 20-26)

అంజూరపు చెట్టును శపించడం, ఆలయాన్ని శుద్ధి చేయడం సేవకుడు తీర్పరిగా జరిగించిన కార్యాలు. వీటి అంతరార్థం ఇశ్రాయేలీయుల భ్రష్టస్థితిని యేసుప్రభువు న్యాయాధికారిగా తీర్పు తీరుస్తున్నాడు అన్నదే. ఇశ్రాయేలు బయటికి ఫలాలు లేని చెట్టు. లోపల చూస్తే దురాచారాలతో నిండిన గుడి.

### చెట్టుకు శాపం (12-16వ; 20-26)

అంజూరపు చెట్టుకు నిండుగా ఆకులుంటే సాధారణంగా కాయలు కూడా ఉంటాయి. చెట్టు వాడిపోయేలా శపించే శక్తి ఉన్నవాడు, కాయలు కాసేలా చేసి ఆ కాయలు తినవచ్చు కదా, గదరేను ప్రాంతంలో పందులు కొండ కొమ్ము పైనుండి పడి నాశనం కావడం గాక ఇదొక్కటే యేసుప్రభువు తన జీవితంలో జరిగించిన నష్టకరమైన పని. మనకు రెండు ముఖ్య పాఠాలు నేర్పించడం కోసం ఆయన ఈ వినాశనాన్ని జరిగించాడు.

ఒకటి వైఫల్యం. ఇశ్రాయేలు జాతి దేవుని కోసం ఫలించలేదు. అంజూరపు చెట్టు ఆ జాతికి గుర్తు (యిర్మీయా 8:13; హోషేయ 9:10; నహూము 3:12). శాపం పొందిన ఆ చెట్టులాగా ఇశ్రాయేలు జాతిలో కూడా ఫలాలు లేవు. ఆ చెట్టు "వేరుల నుండి" ఎండిపోయింది. ప్రభువు అంతకు ముందు చెప్పిన ఉపమానాన్ని (లూకా 13:1-9) శిష్యులు జ్ఞాపకం చేసుకుని ఉంటారు. ఈ అద్భుతంలో ఇశ్రాయేల్‌పై దేవుడు పంపిన శిక్షను గ్రహించి ఉంటారు. మీకా 7:1-6 కూడా వారు గుర్తు చేసుకుని ఉంటారు. ఫలాలు లేకుండా ఉండడం పాపం (యోహాను 15:16).

రెండవ పాఠం విశ్వాసం గురించి, విశ్వాసముంటే కొండలైనా కదులుతాయి. యూదుల దృష్టిలో కొండ అంటే అడ్డుగా ఉన్న సమస్య (జెకర్యా 4:7). నిజమైన విశ్వాసం దేవుని వాక్యంపై ఆధారపడి ఉంటుంది (యోహాను 15:7; రోమా 10:17). తన వాక్కులో ఆయన మనకు తన చిత్తాన్ని బయలుపరుస్తారు. ప్రార్థన పరమావధి మనిషి చిత్తం పరలోకంలో నెరవేరడం కాదు. దైవచిత్తం భూమిపై నెరవేరడమే.

### ఆలయ ప్రక్షాళన (15-19వ)

యేసు తన మొదటి పస్కా సమయంలో ఆలయాన్ని శుద్ధి చేశాడు (యోహాను 2:13-22). అయితే మళ్లీ మొదటికొచ్చింది. యాజకులకు కమిషన్లు ముదుతుండడంలో డబ్బు మారకం వర్తకులు మళ్లీ ఆలయ ప్రాంగణంలో దుకాణాలు తెరిచారు. ఈ మారకం దుకాణాలు ఆలయంలో అన్యజనుల ఆవరణంలో వెలిశాయి. నిజానికి ఈ ఆవరణం యూదులు అన్యజనులకు యెహోవా మహత్తును బోధిస్తూ ఉండవలసిన ప్రదేశం. అన్యుడెవరన్నా ఆ ఆవరణలోకి వస్తే దేవుని పేరుమీద యూదులు చేస్తున్న దోపిడిని చూస్తారు. ఇక యూదులు బోధించేదేదీ కూడా వారు తలదాల్చరు. ఆ ఆవరణం అన్యజనుల ప్రార్థనా ప్రదేశంగా ఉండవలసింది. దోపిడి స్థలంగా ఉంది.

తాను జరిగించిన అల్లకల్లోలానికి ఆధారంగా ప్రభువు యెషయా 56:17; యిర్మీయా 7:11లను ప్రస్తావించాడు. ఆలయం బలులర్పించవలసిన చోటు, ప్రార్థనా స్థలం. అసలు ప్రార్థన ఒక బలి అర్పణే (కీర్తన 141:1-2).

దొంగల గుహ అంటే దొంగలు పారిపోయి తలదాచుకునే స్థలం. శాస్త్రులు, పరిసయ్యులు తమ దురాగతాలను కప్పిపుచ్చుకునేందుకు మతమనే ముసుకు వేసుకొంటున్నారు. ప్రజల మధ్య ఆలయం ఉండడం వల్ల శారీరక ఆశీర్వాదాలు తప్పక కలుగుతాయన్న హామీ ఏమీ లేదని పాత నిబంధన ప్రవక్తలే హెచ్చరించారు (యెషయా 1:10-17; యిర్మీయా 7:1-16). తమ హృదయానుసారంగా ఆ ఆలయంలో మనుషులు ఏమి చేస్తారనే దానిపై వారికి అందే ఫలితం ఆధారపడి ఉంటుంది. మన పొరుగువారు మన చర్చిల గురించి, ప్రార్థన కార్యకలాపాల గురించి ఏమనుకుంటున్నారో ఒకసారి ఆలోచించుదాం.

## 10. సేవక ప్రవక్త (11:27-12:44)

యేసు ఆలయంలో ఉపదేశాలు ఇస్తుండగా వివిధ మత వర్గాలకు చెందిన అధికార ప్రతినిధులు తమ ప్రశ్నలతో ఆయన్ను ఇరుకున బెట్టాలని ఆ వారమంతా ప్రయత్నించారు.

### అధికారం గురించి (11:27-12:12)

దేవుడు తనను పంపాడని చెప్పుకొనే ఎవరినైనా పరీక్షించి వారి సంగతి తేటతెల్లం చేసే అధికారం, బాధ్యత ధర్మశాస్త్ర పరిరక్షకులుగా యెరూషలేము మత పెద్దలకు ఉంది (ద్వితీ 18:15-22). అయితే వారి పరీక్ష విధానంలో యథార్థత లేదు. వారు సత్యాన్ని అన్వేషించడం లేదు. ఆయన్ను నాశనం చేయగల మార్గాంతరాలే వెదకుతున్నారు (మార్కు 11:18). వారి కుతంత్రమెరిగిన ప్రభువు వారి ప్రశ్నలకు ప్రశ్నలతోనే జవాబిచ్చి వారి కపటాన్ని బయటపెట్టాడు.

బాప్తిస్మమిచ్చే యోహాను బోధను వారు అంగీకరించి నట్టయితే మరింత వివరమైన అవగాహనలోకి దేవుడు వారిని నడిపించేవాడే. ఈ మౌలిక సూత్రం యోహాను 7:17లో ఉంది. ఆధ్యాత్మిక పరిజ్ఞానానికి ముఖ్యమైన అర్హత విధేయతే. మత నాయకులు యోహాను బోధ తిరస్కరించారు. మరిన్ని సంగతులు దేవుడు వారికెందుకు చెబుతాడు ? యోహాను బాప్తిస్మం పరలోకం నుండి కలిగింది కాదా ? అని యేసు ప్రశ్నించాడు. వారి ప్రశ్నకు జవాబియ్యకుండా దాటవేయడం ఆయన ఉద్దేశం కాదు. వారి కపట వేషధారణను ఆయన బట్టబయలు చేస్తున్నాడు.

ఈ అవకాశాన్ని పురస్కరించుకుని వారి పాపం వారిని ఎంత దూరం తీసుకువెళ్లనున్నదో తెలియజేయడం కోసం యేసు వారికి ద్రాక్షతోట కౌలుదారుల ఉపమానం చెప్పాడు.

ద్రాక్షతోటతో ఇశ్రాయేల్ జాతిని పోల్చడం ఇది కొత్తకాదు (కీర్తన 80:8-16; యెషయా 5:1-7). యజమాని తన పొలం పంటలో తనకు రావలసిన భాగం కోసం కౌలుదారు లను అడగడం సహజమే. ఇవ్వడానికి వారు నిరాకరించడం వెనక ఉన్న ఆలోచన ఏమిటంటే, ద్రాక్షతోటపై అతని యాజమాన్యాన్ని వారు ఒప్పుకోవడం లేదన్నమాట. తన పంటకోసం యజమాని మనుషులను పంపడం తన అధికారాన్ని, హక్కును బట్టే.

తోట ఫలసాయంలో నాలుగవ సంవత్సరం పంటను దేవునికి ఇవ్వాలి (లేవీ 19:24). దేవుడు నాలుగవ సారిగా తన కుమారుణ్ణి పంపడంలో ఈ విధమైన ప్రత్యేకత ఉంది. కౌలుదారులు వారసుణ్ణి చంపగలిగితే భూమి వారిది కావడానికి అవకాశం మెరుగవుతుంది. అందువల్ల వారు అతణ్ణి తోట బయటికి తోసి చంపారు (హెబ్రీ 13:12-13). ఈ పరిస్థితిలో యజమాని ఏమి చేయాలి అని అడిగినప్పుడు మతాచార్యులు తమమీద తామే తీర్పు మాటలు పలికారు (మత్తయి 21:41). యేసు ఆ మాటలనే తన తీర్పుగా వినిపించాడు.

### బాధ్యత గురించి (13-17వ)

నాణేలపై సీజరు ఆకారం ముద్రించి ఉంది. ప్రజలు వాటిని ఉపయోగించి క్రయవిక్రయాలు చేసుకుంటున్నారు.

పరిసయ్యులకు ఇష్టమున్నా లేకపోయినా ఆ డబ్బును వినియోగించడం ద్వారా వారు సీజరు అధికారానికి ఒప్పుకుంటున్నారు. అయితే మనుషులందరి మీదా దేవుని ముద్ర ఉంది. ఆయన వారిని తన స్వరూపంలో చేశాడు. కాబట్టి ఆయన అధికారానికి వారు లోబడాలి.

మానవ ప్రభుత్వాన్ని దేవుడు మన మేలు కోసమే ఏర్పరిచాడు (రోమా 13:1; 1తిమోతి 2:1-6; 1పేతురు 2:13-17). అధికారంలో ఉన్న మనుషులు మనకు నచ్చకపోయినా అధికారాన్ని మాత్రం మనం గౌరవించాలి.

**నిత్యత్వం గురించి (18-27వ)**

సద్దూకయ్యులు మోషే గ్రంథాలను మాత్రమే అంగీకరిస్తారు. ఆత్మ, మరణానంతర జీవితం, పునరుత్థానం, అంతిమ తీర్పు, దేవదూతలు, దురాత్మలు మొదలైన వాటిని నమ్మరు. వీరిలో చాలామంది ధనిక యాజకులు. ద్వితీ 25:7-10లో ఇచ్చిన వివాహ చట్టం గురించి వారు యేసును ఒక ప్రశ్న అడిగారు. ఒకామె వరుసగా ఏడుగురు అన్నదమ్ములను చేసుకుంది - కాబట్టి ఆమె నిత్యత్వాన్ని ఏడుగురు భర్తలతో గడపాలి గదా?

అయితే వారికి రెండు సంగతులు తెలియవని యేసు చెప్పాడు - దేవుని శక్తి, లేఖన సత్యం. పునరుత్థానమంటే ఇప్పుడు మనకు తెలిసిన జీవితం మళ్లీ రావడం కాదు. భిన్నమైన జీవనంలోకి ప్రవేశించడమే పునరుత్థానం. ఆ నూతన జీవంలోకి దేవుడు మనకు కొత్త శరీరాలు ఇస్తాడు (1కొరింథీ 15:38 నుంచి). దేవదూతల వలె ఉండడమంటే లైంగికమైన తేడాలు ఉండవు. అది పరిపూర్ణ స్థితి. వివాహం, సంతానోత్పత్తి, మరణం మొదలైనవి ఉండవు.

సద్దూకయ్యులకు లేఖన సత్యాలు కూడా తెలియవు. మండుతున్న పొదలో దేవుడు మోషేతో 'నేను గతంలో (భూతకాలం) అబ్రాహాము ఇస్సాకు యాకోబుల దేవుణ్ణి' అనలేదు. ఈ మాటలు ఆయన వర్తమాన కాలంలో పలికాడు. దేవుడు మోషేతో ఈ మాటలు చెబుతున్న సమయంలో ఆ పితరులు దేవునివద్ద జీవించే ఉన్నారు. కాబట్టి మరణం తరువాత మనుషులు జీవించే ఉంటారని మోషే గ్రంథాలలో కూడా ఉంది.

**ప్రాథమ్యం గురించి (28-34వ)**

శాస్త్రులకు, పరిసయ్యులకు ఇష్టమైన వ్యాపకం ఆజ్ఞలలో ఏది గొప్పది అంటూ సిద్ధాంత చర్చలు జరపడమే. ధర్మశాస్త్రంలో 613 ఆజ్ఞలున్నాయి. 365 నిషేధాజ్ఞలు, 248 మనం చెయ్యవలసిన ఆజ్ఞలు ఉన్నాయి.

ప్రభువు 'షేమా' అని పిలువబడే ద్వితీ 6:4-5నూ, ప్రేమను గురించి లేవీ 19:18నీ ప్రస్తావించాడు. ఎందుకంటే ప్రేమ కలిగి ఉండడమే ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడం (రోమా 13:8-10). మనం నియమ నిబంధనల ద్వారా జీవించకూడదు, దేవునితో, మనుషులతో ప్రేమ సంబంధాల ద్వారా జీవించాలి.

ప్రభువుచేత ఏదో ఒక పొరపాటు మాట పలికించి నేరం మోపాలని ఆ శాస్త్రి ఆయనతో ఈ సంభాషణ చేస్తున్నాడు. అయితే ప్రభువు జవాబు విన్న తరువాత ఆయనిచ్చిన జవాబును అతడు మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. పాతనిబంధన మతంలో సైతం కేవలం బలులు అర్పించడమే గాక మరింత లోతైన అంతరార్థాలున్నాయని అతనికి అర్థమైంది (1సమూ 15:22; కీర్తన 51:16,17; 141:1-2; యిర్మీయా 7:22-23; హోషేయ 6:6; మీకా 6:6-8).

దైవరాజ్యానికి దూరంగా లేకపోవడమంటే ఏమిటి? అతడు సత్యాన్ని యథార్థంగా పరిశీలిస్తున్నాడు. తన వర్గంవారి అభిప్రాయానికి గుడ్డిగా కట్టుబడి ఉండడం లేదు. తమ వర్గానికీ, పార్టీకి కోపం తెప్పించే అవకాశం ఉన్నప్పటికీ సత్యాన్ని గ్రహించి ప్రశంసించడమే మనుషులను పరలోకానికి చేరువ చేస్తుంది.

**గుర్తింపు గురించి (35-37వ)**

ఇప్పుడు ప్రశ్నలు అడగడం ప్రభువు వంతు. ఆయన అన్నిటికన్నా ప్రాముఖ్యమైన ప్రశ్న అడిగాడు. "క్రీస్తును గురించి మీరు ఏమనుకుంటున్నారు. ఆయన ఎవరి కుమారుడు?" (మత్తయి 22:42). పరిసయ్యులు కుమారుని గురించి పొరపాటు చేస్తే రక్షణ విషయంలో కూడా తప్పి పోయినట్టే. దావీదు కొడుకే దావీదుకు ప్రభువు ఎలా కాగలడు? అని ప్రశ్నిస్తూ యేసు కీర్తన 110:1ని వారి ముందుంచాడు. మెస్సీయ దావీదు సంతతివాడూ, అదే సమయంలో దేవుడూ అయి ఉంటేనే ఇది సాధ్యం. యేసు ప్రభువు పరిశుద్ధాత్మ మూలంగా కన్యకు జన్మించడమే దీనికి తార్కాణం (యెషయా 7:14; మత్తయి 1:18-25; లూకా 1:26-38).

మనిషిని ప్రత్యేకమైన వ్యక్తిగా నిలబెట్టేది అతని ధనమూ, బిరుదులూ కావు. అతని వ్యక్తిత్వమే. ధనికులు పటాటోపంగా తమ ఘనమైన కానుకలు హుండీలో వేస్తున్నారు. కానుక ఎంత వేశారన్నది కాదు. ఉన్నదానిలో ఎంతభాగం వేశారన్నదే ప్రాముఖ్యం. కోటీశ్వరులు వందలు, వేలు కానుకలిచ్చారు. రెండే రెండు కాసులున్న వితంతువు తనకున్నదంతా ఇచ్చేసింది.

# 11. యుగాంతం గురించి సేవకుని ప్రవచనము (మార్కు 13)

రమ్యమైన యెరూషలేము ఆలయం విషయం యూదుల కెంతో అతిశయం. యేసు ఆ దేవాలయం గురించి తన అభిప్రాయాన్ని అంతకుముందే తెలిపాడు (మార్కు 11:15-17). యూదు మతనాయకులు దాన్ని పాడుచేశారు. రోమీయులు దానిని పడగొట్టనున్నారు.

ఈ విషాదం ఎప్పుడు జరుగుతుందని శిష్యులు అడిగారు. అది జరగబోతున్నదనడానికి సూచనలేమిటని అడిగారు. ఆలయం ధ్వంసం కావడం, యేసు తిరిగి రావడం, యుగాంతం ఒకేసారి ఉంటాయని వారి ఊహ (మత్తయి 24:3). ఇక్కడ ప్రభువిచ్చిన జవాబును మనం 'ఒలీవ కొండ ప్రసంగం' అని సాధారణంగా అంటాము (మత్తయి 24-25; లూకా 21:5-36).

మార్కు 13:8లో 'వేదనలకు ఇది ఆరంభం' అని ఉంది. వేదనలంటే స్త్రీ ప్రసవం నొప్పులు, ఈ నొప్పులు హఠాత్తుగా ఆరంభమై క్రమేణా పెరుగుతూ లోకమంతటికీ యాతన కరంగా పరిణమిస్తాయి.

తన రాకడకు గుర్తుగా వేటిని చూసి భ్రమపడకూడదో యేసు వివరించాడు. అవి కేవలం మహా శ్రమలు ఆరంభమౌతున్నాయనడానికే సూచనలు. అబద్ధ క్రీస్తులు (13:5-6), జాతుల మధ్య ఘర్షణలు (13:7-8), ప్రకృతి వైపరీత్యాలు (13:8), మతసంబంధమైన హింస (13:9-13) మొదలైనవి.

యేసుప్రభువు (మత్తయి 7:15-20), పౌలు (అపో.కా. 20:28-31), యోహాను 4:1-6) అబద్ధ ప్రవక్తల గురించి హెచ్చరించారు.

అసలు ఈ అధ్యాయాన్ని ధ్యానించే ముందు మూడు విషయాలు మనసులో ఉంచుకోవాలి. యుగాంత సంభవాలను అధ్యయనం చేసేటప్పుడు తక్కిన లేఖనాలను స్మరించుకుంటూ ముందుకు సాగాలి, ముఖ్యంగా దానియేలు గ్రంథాన్ని. రెండవదిగా దీని వెనుకనున్న ఆచరణాత్మక అన్వయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. కేవలం శిష్యుల కుతూహలం తీర్చడం కాదు ప్రభువు ఉద్దేశం. ప్రభువు నాలుగుసార్లు "జాగ్రత్తపడండి" అని హెచ్చరించాడు (5,9,23,33వ). చివర్లో "మెలకువగా ఉండండి" అన్నాడు. ముఖ్యంగా కొన్ని సూచనలపై ఆధారపడి తేదీలు నిర్ణయించడం విషయంలో జాగ్రత్త వహించాలి. మూడవదిగా ఈ ఒలీవకొండ ప్రసంగమంతటిలోనూ కనిపించే యూదు వాతావరణాన్ని కూడా గుర్తించాలి.

ఈ మహా శ్రమల కాలాన్ని (13:19) పాతనిబంధన ప్రవక్తలు యాకోబు కష్టకాలం (యిర్మీయా 30:7) అనీ, ఉగ్రత దినం (జెఫన్యా 1:15-18) అనీ పేర్కొన్నారు. ప్రభువు దీనిని 3 దశలుగా వర్ణించాడు. మహాశ్రమల కాలానికి ముందే సంఘం ఎత్తబడుతుందని అనేకమంది భక్తులు నమ్ముతారు. మహాశ్రమల కాలంలో సంఘం ఈ లోకంలోనే ఉంటుందని ఈ వ్యాస రచయిత నమ్మకం. అయితే అలా గానీ, ఇలా గానీ నమ్మడం వలన (సంఘం ఎత్తబడుతుందనేది మాత్రం ఖాయం) మన మధ్య ఎటువంటి తేడాగానీ, సహవాసానికి భంగం గానీ కలగనవసరం లేదు. ఇది క్రైస్తవ్యానికి పునాది సిద్ధాంతం కాదు. అలాంటి పునాది సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిల్లో ఏకాభిప్రాయం ఉండాలి. అలా లేనివారితో సహవాసం తగదు.

తన రాకడకు సూచనలుగా తీసుకోకూడని జాబితాలో యేసు 'అబద్ధ క్రీస్తుల ఆగమనం' అనేదాన్ని చేర్చాడు. ఇవి మహాశ్రమలకు ముందుగా కలిగే పురిటి నొప్పులు మాత్రమే. ఇవి మొదటినుంచీ ఉన్నాయి. అబద్ధ క్రీస్తులు, దేశాల మధ్య యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, కరువులు ... ఇవి ముందు నుంచీ ఉన్నాయి. వీటిని గురించి "మోసపోకుండా చూసుకోండి. ఇవి నా రాకడ సూచనలు కావు" అని ఆయన స్పష్టంగా చెప్పాడు (13:5-7)

రెండవది జాగ్రత్త పడండి (వ.9-13) . అధికారుల నుంచీ, స్వంతవారి నుంచీ మరింత పెద్ద యెత్తున వ్యతిరేకత ఎదురవుతుంది. అయితే ఆ బాధలన్నీ క్రైస్తవులు అనుభవించ వలసినవే. స్నేహితులు, బంధువులు సైతం పీడిస్తారు. ఈ బాధలన్నిటి అసలు కారణం 13:13లో ఉంది. " నా నామము నిమిత్తము..."

ఈ శ్రమల కాలం మధ్య దశలో "నాశనకరమైన హేయ వస్తువు"ను ఆలయంలో నిలపడం జరుగుతుంది. దానియేలు 9:27; 12:11 లో చెప్పిన విషయం ఇదే. దానియేలు 70 "వారాల" గురించి మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. పారశీక రాజు యూదులకు వారి ఆలయం కట్టుకునేందుకు అనుమతి ఇచ్చి తరువాత 70 వారాలు 'అంటే డెభ్భై ఏడులు, 490 సంవత్సరాలన్నమాట) జరగాలి (ఎజ్రా 1:1-4)

62 "వారాలకు" యెరూషలేము పునర్నిర్మాణం జరుగుతుంది. 69 వ వారానికి అభిషిక్తుణ్ణి హతమారుస్తారు.

అక్కడికి ఈ లెక్క ఆగిపోయి, ఈ 70 వ ఆఖరు "వారం" (అంటే 7 సంవత్సరాలు) యుగాంతంలో వచ్చే ఏడేళ్ళ శ్రమను సూచిస్తుంది.

మహా శ్రమల కాలం తుది దశను దేవుని ఉగ్రత సమయంగా చెప్పవచ్చు. ఈ కాలంలో దేవుడు లోకానికి తీర్పు తీరుస్తాడు. మార్కు 13:27 ఇశ్రాయేలేయులంతా ప్రపంచం నలుమూల నుండి పోగుచేయబడాన్ని తెలుపుతున్నది (ద్వితీ 30:3-6; యెషయా 11:12; యిర్మీయా 31:7,9. (ఈ విషయాల గురించి వివరాల కోసం 'మత్తయి బైబిలు గైడు' చూడండి).

యేసు ఈ ఉపదేశాన్ని రెండు ఉపమానాలతో ముగించాడు. మొదటిదానిలో ఆయన రాకడ సమీపించిందని గ్రహించడం గురించీ, రెండవదానిలో అలా గ్రహించక పోవడం గురించీ ఉంది.

అంజూరపు చెట్టు చిరిర్చినప్పుడు వసంతకాలం దగ్గర పడుతున్నదని తెలిసినట్టుగానే మహా శ్రమల కాలంలోని విశ్వాసులకు ప్రభువు రాకడ సామీప్యం అర్థమవుతుంది.

ఆయన సేవకులు అజాగ్రత్తగా ఆయన రాకడ కోసం కనిపెట్టకుండా ఇష్టం వచ్చినట్టు జీవిస్తుంటే వారు తమ ప్రతిఫలం పోగొట్టుకుంటారు.

## 12. సేవకుని హింసలు (మార్కు 14:1 - 15:20)

వేలకొలది పండుగ యాత్రికులు ఉత్సవానికై సిద్ధపడుతూ ఉంటే సేవకుడు తన సిలువ హింసల నిమిత్తం సిద్ధపడు తున్నాడు.

ఐదుచోట్లు మనుషుల నుండి ఆయనకు ఐదు ప్రతిస్పందనలు ఎదురైనాయి.

1. బేతనీలో - ఆరాధన
2. మేడగదిలో - ద్రోహం
3. గెత్సమనేలో - వియోగం
4. ప్రధాన యాజకుని ఇంట్లో - తిరస్కారం
5. పిలాతు న్యాయసభలో - నేరస్తునిగా తీర్పు

### 1. బేతనిలో - ఆరాధన (14:1-11)

ఈ సంఘటనను ఇక్కడ చెప్పడం ద్వారా మార్కు అటు యూదా ఇస్కరియోతు, యెరూషలేము అధికారుల తీరుకూ, ఇటు మరియ ప్రేమకూ తేడా చూపిస్తున్నాడు. వారి పాపంలో కనిపించే వికారం మరియ ఆరాధనలో క్రియను మరింత మనోహరంగా కనిపించేలా చేసింది. ఈ స్త్రీ మరియ అని యోహాను వ్రాశాడు (యోహాను 11:1,2). సువార్తలో ఈ మరియ 3 సార్లు కనిపిస్తుంది. మూడుసార్లూ ఈమె యేసు పాదాల చెంతనే కనిపిస్తుంది (లూకా 10:38-42; యోహాను 1:31-32, 12:1-8). లూకా 7:36-50లో ఇలాటిదే మరొకసారి జరిగింది. అక్కడ కనిపించే స్త్రీ పరివర్తన చెందిన ఒక వేశ్య. అది పరిసయ్యుడైన సీమోను ఇంట్లో జరిగింది.

మరియ యేసు భూస్థాపన నిమిత్తం జరిగించిన అభిషేకానికై వాడిన అత్తరు బహుశా ఇండియా నుంచి దిగుమతి చేసుకున్నదై ఉండవచ్చు. ఇది చాలా ఖరీదైనది. సామాన్య పనివాడు సంవత్సరం కష్టపడితే పొందగలిగే కూలి డబ్బులు.

ఈమె చేసిన ఆరాధనా క్రియకు 3 ఫలితాలు ఒన గూడాయి. అత్తరు వాసన ఇల్లంతా నిండింది (యోహాను 12:3). క్రీస్తును ప్రేమించి ఆరాధించేచోట ఆధ్యాత్మిక సుగంధం వ్యాపించి ఉంటుంది. రెండవదిగా అంత డబ్బు నష్టపరచినందుకు శిష్యులు విసుక్కున్నారు. డబ్బు నాశనం చేసినందుకు యూదా మరియపై మండిపడ్డాడు. కాని అతడు తన జీవితాన్నే నాశనం చేసుకున్నాడు కదా. మూడవదిగా మరియ ఇచ్చిన కానుకను బట్టి యేసు అమెను మెచ్చు కున్నాడు. మన సేవ, ఆరాధనల గురించి ఎవరేమను కున్నప్పటికీ ముఖ్య విషయమేమిటంటే అది ప్రభువుకు ప్రీతికరం కావాలి. మరియ తన ధనమంతా వెచ్చించి ప్రభువును సన్మానించింది. యూదా ఇస్కరియోతు బానిసలకు చెల్లించే వెలను తీసుకుని ప్రభువును అమ్మివేశాడు.

### 2. మేడగదిలో - ద్రోహం ((14:12-26)

నీసాను నెల (మన మార్చి - ఏప్రిల్) 10 వ దినాన పస్కా పశువును ఎంపిక చేసుకోవాలి. ఆ నెల 14వ తేదీ వరకు అది ఆరోగ్యంగా ఉన్నదీ లేనిదీ పరీక్షించి 14వ తేదీన వధించాలి. గతంలో సమకూడిన విజయాన్ని స్మరిస్తూ యూదులు పస్కా జరుపుకుంటారు. ప్రభువు తన మరణానికి స్మారకంగా ఒక పండుగను మేడగదిలో ప్రతిష్ఠించారు.

పేతురు, యోహానులు పండుగ భోజనాన్ని మేడగదిలో సిద్ధపరిచాడు(లూకా 22:8). నీళ్ళకుండ మోసుకువచ్చే పురుషుణ్ణి కనుగొనడం తేలికే. ఎందుకంటే నీళ్ళు మోసేది ఆ రోజుల్లో ఆడవారి పని. ఈ పురుషుడు మార్కు ఇంట్లోని సేవకుడో, ఎవరో అయి ఉండాలి. మొత్తంమీద మార్కు ఇల్లు యెరూషలేములో క్రైస్తవ కేంద్రం అయింది.(అపొ.కా. 12:12).

యూదులకు సూర్యాస్తమయంతో కొత్తరోజు ఆరంభమవుతుంది. కాబట్టి శుక్రవారం మొదలయిన కొద్ది గంటలకు అందరూ పస్కా విందుకు కూర్చుంటారు. యేసు తన శిష్యులకు కాళ్ళు కడిగి వినయమనస్సు గురించి బోధించిన (యోహాను 13:1-20) తరువాత ఆత్మలో వేదననుభవిస్తూ తన శిష్యుల్లో ఒకడు ద్రోహి అని ప్రకటించాడు. యూదా తప్ప మిగతా అందరూ ఇది విని నిర్ఘాంతపోయారు. తమలో ద్రోహి ఎవరో చివరిదాకా శిష్యులకు తెలియలేదు. యూదా తన పాపం నుండి మళ్ళుకోవాలని యేసు అతనికి అన్ని అవకాశాలూ ఇచ్చాడు. పేతురు వంటివాడికి యూదా తలపెట్టిన సంగతి తెలిసిఉంటే చంపేసేవాడు.

యేసు తన శక్తిని ప్రదర్శించి రాజ్యం స్థాపించేలా ఆయన్ను బలవంతం చేయడానికి యూదా ఈ పని చేశాడని కొందరు అంటారు. దేవుని చిత్తం నెరవేరేందుకు వీలుగా యేసును అధికారులకు పట్టి ఇచ్చిన నిమిత్తమాత్రుడే యూదా అని మరికొందరంటారు. యూదా హతసాక్షీ కాదు, మరమనిషీ కాదు. అతడు బాధ్యతగల ఒక మనిషి. అతని క్రియలవలన కలిగిన ఫలితమేదైనప్పటికీ అతని చర్యలకు బాధ్యుడు తానే. అతణ్ణి దైవకార్యం జరగడం కోసం బలైపోయిన హీరోగా("ఎవరో ఒకరు యేసును శత్రువులకు పట్టి ఇవ్వాలి కదా!") దేవుని చేతిలో చెడుకార్యం జరిగేందుకు ఉపయోగపడిన సాధనంగా ఎంచనవసరం లేదు. అతడు చేసిన పని ఏదైనప్పటికీ అతడు పశ్చాత్తాపపడి యేసుపై నమ్మకముంచలేదు. అతడు నాశనమైపోవడానికి ఏకైక కారణం ఇదే.

శిష్యులు ప్రతి ఒక్కరూ "నేను కాదు కదా" అంటున్నారు. తాను కాదని 11 మందికి తెలుసు. నేను కాదు, మరెవరు? అని వారి భావం. ప్రభువుకు కుడివైపున యోహాను, ఎడవవైపు గౌరవస్థానంలో యూదా కూర్చున్నారు. ఇంటి యజమాని రొట్టెను కూరలో ముంచి తన చేతులతో గౌరవనీయుడైన అతిథికి అందించడం మర్యాద. ఇది కూడా యూదా హృదయాన్ని కదిలించలేదు. వెంటనే ఆ గది విడిచి వెళ్ళిపోయాడు. సైతాను అతన్ని తన వశం చేసుకున్నాడు. శిష్యులకు అతని గురించిన వాస్తవం తెలియదు.(యోహాను 13:27-30).

అతడు వెళ్ళిపోయాడు. యేసు ప్రభురాత్రి భోజన సంస్కారాన్ని స్థాపించాడు. యూఖరిస్టు అంటే "కృతజ్ఞతార్పణ" ఆ రొట్టె ఆయన శరీరంగా, ఆ రసం ఆయన రక్తంగా మారిపోలేదు. అవి ఆ రెంటికీ చిహ్నాలు మాత్రమే. తన మరణం ద్వారా ప్రభువు పాత నిబంధనను నెరవేర్చి కొత్త నిబంధన స్థాపించాడు. మొదటిదానిని జంతురక్తంతో స్థిరపరిచారు. రెండవది సాక్షాత్తూ దైవకుమారుని రక్తంతో స్థిరపరచబడింది.

నన్ను జ్ఞాపకము చేసికొనుటకై" అంటే కేవలం స్మారక సూచనగా అని కాదు. ఆయన చనిపోయినవాడు కాదు. ఇప్పుడు ఆయన బ్రతికే ఉన్నాడు. గతంలో జరిగిన ఒక సంఘటన నిమిత్తం ప్రస్తుతం సిద్ధపడడం అని ఈ పదానికి అర్థం. అది ఆయనతో సహవాసం.

### 3. గెత్సేమనె తోటలో - వియోగం (14:27-52)

గెత్సెమనే అంటే "నూనె గానుగ" అని అర్థం. తోటకు వెళ్లే దారిలో యేసు తన శిష్యులకు వారంతా తనను విడిచి వెళ్లిపోతారని చెప్పాడు. జెకర్యా 13:7లోని ప్రవచనాన్ని వారికి వినిపించాడు. అయితే తాను తిరిగి బ్రతికి గలిలయలో వారిని కలుస్తానన్నాడు. ఈ సత్యాలను వారి మనస్సులు ఇముడ్చుకోలేకపోయాయి. ఎందుకంటే 3 రోజులు తరువాత ఆయన పునరుత్థాన వార్తను వారు నమ్మలేదు.

కాపరిని కొట్టినప్పుడు గొర్రెలు చెదరిపోవాలి. "వీరిని పోనియ్యుడి" అని యేసు తనను బంధించిన వారితో అన్నాడు. పేతురు "దూరము నుండి" యేసు వెంబడించడం తగని పని. ప్రభువు బోధించిన సత్యాలను అర్థం చేసుకున్నట్టయితే పేతురు సైనికులపై దాడిచేసేవాడూ కాదు, ఆయనెవరో తెలియదని 3సార్లు బుకాయించేవాడూ కాదు. యేసుప్రభువు చెబుతున్న మాటలు తనకు మాత్రం వర్తించవని పేతురు నమ్మకం. అందరూ ఆయన్ను వదిలేసినా తాను మాత్రం నిలబడతానన్నాడు.

మానవుడు గనుక యేసు తన కష్ట సమయంలో తనవారి తోడు కోరుకున్నాడు. తాను యాయీరు కూతుర్ని బ్రతికించినప్పుడు, రూపాంతం చెందినప్పుడూ తనతో ఉన్న ముగ్గురినీ ఇప్పుడు తీసుకుని యేసు ఏకాంతంగా కొంతదూరం వెళ్లాడు. ఫిలిప్పీ 3:10లో ఈ 3 అనుభవాలూ కనిపిస్తున్నాయి. "... ఆయననూ (రూపాంతరం), ఆయన సజీవంగా లేవడంలోని బల ప్రభావాలనూ (యాయీరు కుమార్తె తిరిగి బ్రతకడం), ఆయన బాధల సహవాసాన్నీ (గెత్సెమనె అనుభవం) తెలుసుకోవాలని ..."

తన తండ్రితో తనకు సంభవించనున్న వియోగం (మార్కు 15:34) ఆయన్ను తీవ్రంగా కలతపెట్టింది. ఆయన తాగవలసిన గిన్నెలోనిది (యోహాను 18:11) ఇదే. హెబ్రీ 5:7-9 ప్రకారం ఆయన మరణం నుండి తప్పించమని కాదు తండ్రిని అడిగింది. మరణం లో నుండి తప్పించమని

అడిగాడు. అంటే పునరుత్థానాన్ని కోరి తండ్రికి విన్నపం చేశాడు. గెత్సెమనె ప్రార్థనను తండ్రి విని ఆ ప్రకారం ఆమోదించి అనుగ్రహించాడు.

'అబ్బా' అనేది తండ్రీ అని అర్థమిచ్చే అతి సన్నిహిత పదం. ఇది మనం కూడా ఉపయోగించవలసిన పదం. ఎందుకంటే మనం ఆయనవారం (రోమా 8:15). తండ్రి ఏమి చేయాలని తాను కోరుతున్నాడో యేసు ఆయనకు చెప్పలేదు. దేవుని సంకల్పంపై ఆయనకు పరిపూర్ణమైన నమ్మకం ఉంది. ఈ సంగతి ఆయన మూడుసార్లు ప్రార్థించి మూడుసార్లూ దానిని తండ్రి చిత్తానికే వదిలిపెట్టాడు.

మూడవసారి యేసు తన శిష్యుల చెంతకు తిరిగివచ్చి వారు నిద్రిస్తుండగా చూశాడు. ఆయన వేదన గడియలో వారు ఆయనకు తోడుండి ప్రార్థించలేదు.

చాలామంది రాణువవారితో యూదా రావడం మనకొక సంగతి తెలియజేస్తున్నది. యూదాకు గానీ, యూదు మతాధికారులకు గానీ యేసుప్రభువు ఉద్దేశం అర్థం కాలేదు. బంధించడానికి వెళ్లిన వారినుండి ఆయన తప్పించు కోవడానికి ప్రయత్నిస్తాడని వారు భావించారు. మార్కు 14:49లోని ప్రభువు పలికిన మాటలను బట్టి అక్కడి పరిస్థితి అంతా ఆయన అదుపులోనే ఉన్నదని తెలుస్తున్నది.

ఒక కుర్రవాడు ఆ తోటలో తిరుగుతూ సైనికులను చూసి బెదరి పై వస్త్రం విడిచిపెట్టి పారిపోయాడు. ఈ విషయం ఒక్క మార్కు సువార్తలోనే రాసి ఉంది కాబట్టి ఈ పడుచువాడు మార్కేనని సాధారణంగా అర్థం చేసుకుంటారు. సైనికులను యూదా మొదట మేడగదికి తీసుకుపోయి ఉండవచ్చు. అక్కడ లేకపోయేసరికి వారంతా గేత్సేమనెకి బయలుదేరగా ఈ కుర్రవాడు గబగబా పైబట్ట వేసుకుని వారివెంట వెనకగా వచ్చి ఉండవచ్చు.

శిష్యులు పారిపోయారు. సేవకుడు ఒంటరిగా మిగిలాడు. కాని ఆయన ఒంటరి కాడు (యోహాను 16:32). అయితే త్వరలో తండ్రి సైతం ఆయన్ను ఒంటరిగా విడువనున్నాడు.

## 4. ప్రధాన యాజకుని ఇంటిలో – తిరస్కారం (14:53–72)

యూదుల న్యాయతీర్పులోను, యూదేతరుల న్యాయతీర్పు లోను మూడేసి దశలున్నాయి. అన్న ఇంటిలో (యోహాను 18:13–24) సాక్ష్యాలు విచారించడానికి; పూర్తి సభ ఎదుట, తీర్పు వినిపించడం కోసం; తెలతెలవారుతుండగా మరొక సారి (మార్కు 15:1) ఈ న్యాయ విమర్శలు జరిగాయి. యూదేతరుల విచారణ మొదట పిలాతు ఎదుట (మార్కు 15:1–5), హేరోదు ఎదుట (లూకా 23:6–12), మళ్ళీ పిలాతు దగ్గర (మార్కు 15:6–15), చివరిసారి పిలాతు జనసమూహం కేకలకు విలువనిచ్చి ఆయనకు మరణ దండన విధించారు.

ఈ సమయమంతా ప్రభువు చెమటతో రక్తంతో శరీరమంతా వెచ్చబడిన స్థితిలో ఉండగా పేతురు చలికి ఆగలేక చలిమంట వద్ద కూర్చున్నాడు. చాలామంది ప్రభువుకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పారు గాని ఒకదానికొకటి పొసగలేదు. అవి చెల్లలేదు. ఆ పవిత్ర పండుగ దినాన మతాచార్యులే మనుషులను అబద్ధాలాడమని ప్రోత్సహించడం ఎంత విచారకరం !

ఆ అబద్ధ అభియోగాలకు ప్రభువు నోరు తెరువలేదు (యెషయా 53:7; పేతురు 2:23). కాని ప్రధాన యాజకుడు దేవుని పేర ఒట్టుపెట్టినప్పుడు ఆయన నోరు తెరవక తప్పలేదు. తాను మనుష్య కుమారుడనని (ఇది మెస్సీయ బిరుదు – దానియేలు 7:13) స్పష్టపరిచాడు. కౌన్సిల్ సభ్యులకు ఆయనేమంటున్నాడో స్పష్టంగా అర్థమయింది. ఒక సామాన్య మానవుడు ఆ మాటలు పలకడం దైవదూషణ. దానికి శిక్ష మరణమే. సన్‌హెడ్రిన్ వారు మరణశిక్ష విధించే నేరాలను రాత్రివేళ విచారించకూడదు గనుక సూర్యోదయం కాగానే మళ్ళీ సమావేశమయ్యారు (మార్కు 15:11).

లోపల ప్రభువును అపహాస్యం చేస్తూ కొడుతూ ఉంటే బయట ఆవరణంలో పేతురు ఉన్నాడు. అసలు అతడు అక్కడికి రాకుండానే ఉండాల్సింది. ఆయనతో ఉండిన అపొస్తలుడే క్లిష్ట పరిస్థితిలో అబద్ధమాడాడు. మన విషయం ఏమిటి ? మార్కు సువార్తను మొదట రోమ్ విశ్వాసుల కోసం మార్కు వ్రాశాడు. వారు త్వరలో హింసలు అగ్ని పరీక్షలు ఎదుర్కోనున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో వారు స్థిరంగా నిలబడాలనే ఇక్కడ పేతురు అనుభవాన్ని వారికి వివరించడం. పేతురు మొదటిసారి బొంకినప్పుడు తొలి కోడి కూసింది (14:68). రెండవసారి, మూడవసారి బొంకుతూ ఒట్టుపెట్టుకుంటు న్నప్పుడు రెండవసారి కోడి కూసింది (మార్కు 14:30ని 14:72తో పోల్చి చూడండి).

పేతురువలె మనమెన్నోసార్లు – వినవలసిన సమయంలో మాట్లాడతాము, విధేయత చూపవలసిన సమయంలో నిద్రిస్తాము. దేవునికి లోబడవలసిన సమయంలో ఆయనతో పోరాడతాము. పేతురు కనీసం తన తప్పు తెలుసుకుని ఏడ్చి పశ్చాత్తాపడ్డాడు. మనం అదైనా చేశామా ? దేవుడు పేతురును క్షమించాడు.

### 5. పిలాతు మందిరం – మరణ దండన (15:1-20)

మరణ తీర్పును ఆమోదించాక యూదుల అధికార సభ వారు ఆయన్ను రోమా గవర్నరు పిలాతు వద్దకు తెచ్చారు. సాధారణంగా అతడు సీజరియ పట్టణంలో ఉంటాడు. పండుగ సమయంలో శాంతి భద్రతల పర్యవేక్షణ నిమిత్తం పిలాతు యెరూషలేములో మకాం వేశాడు.

రోమా అధికారులు రాజకీయంగా అవినీతి పరులైనప్పటికీ న్యాయం విషయంలో వారికీ కొన్ని విలువలు ఉన్నాయి. యూదుల నాయకులకు పగే ముఖ్యాశయమనీ, న్యాయం, ధర్మంతో వారికి పని లేదనీ పిలాతుకు బాగా తెలుసు (మార్కు 15:10). యేసులో ఏ నేరమూ తనకు కనబడలేదని పిలాతు పదే పదే చెప్పాడు. అయితే తన నమ్మకానికి అంటిపెట్టుకుని నిలబడగలిగే ఆత్మ స్థైర్యం అతనికి లేదు. యెరూషలేము జనంతో క్రిక్కిరిసి ఉన్న ఆ సమయంలో అల్లరి, తిరుగుబాటు చాలా తేలికగా లేచే ప్రమాదం ఉంది. "పిలాతు జనసమూహమును సంతోషపెట్టుటకు మనసు" గలవాడయ్యాడు (15:15). ఇది న్యాయమా, కాదా అని అడగలేదు, ఇది నాకూ, నగరానికీ క్షేమమా, కాదా అన్నదే చూశాడు.

హేరోదు వద్దకు పంపడం ద్వారా తన బాధ్యతను వదిలించుకుందామని చూశాడు. అది నెరవేరలేదు. యేసును గాని, బరబ్బను గాని విడుదల చేసే ఎంపిక ప్రజలకిచ్చాడు. వివేకమున్న వారెవరూ బరబ్బ విడుదల కావాలని కోరరని పిలాతు ధీమా. అయితే యాజకులు ప్రజలను పూర్తిగా తమ అదుపులోకి తెచ్చుకున్నారు (15:11). మూడవ ఉపాయంగా భయంకరంగా కొట్టి ప్రజలకు యేసుపై జాలి కలుగుతుందేమోనని ప్రయత్నించాడు. అదీ నెరవేరలేదు. పిలాతు తీర్పు ఇచ్చాక జరిగినది బహు ఘోరం. కర్కశ హృదయులైన సైనికులు తమ ఇష్టం వచ్చినట్టు ప్రభువును వేధించాడు, బాధించారు, ఉమ్మివేశారు. సేవకుణ్ణి ఊరి బయటకు తీసుకుపోయి సిలువకు మేకులతో కొట్టడం ఇంకా మిగిలి ఉంది.

## 13. సేవకుడు తన పని పూర్తిచేశాడు

**(మార్కు 15:21 - 16:20)**

"చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమి మీద నిన్ను మహిమపరచితిని" (యోహాను 17:4). మార్కు 15:21 నుండి చివరి వరకు ఉన్న వాక్యభాగంలో కనిపిస్తున్న నాలుగు సంభవాలు ఈ సువార్త సందేశానికి చక్కటి మంగళ వాక్యం పలుకుతున్నాయి.

### సేవకుని మరణం (15:21-41)

మూడవ, ఆరవ, తొమ్మిదవ ఘడియలు మార్కు ప్రస్తావించాడు (25,33,34వ). దోషి తన సిలువను తానే మోసుకుంటూ బయలుదేరాలి. కొంతదూరం వెళ్లాక సైనికులు కురేనె దేశస్థుడు సీమోను భుజాలపై ఆ సిలువ పెట్టి మోయించారు. యేసును అరెస్టు చేసినప్పటి నుండి ఆయన అనుభవించిన యాతనను తలచుకుంటే ఆయనకు సిలువ మోసే బలం లేకపోవడం ఆశ్చర్యం కాదు. అయితే సిలువను సీమోను మోయడంలో రమ్యమైన అంతరార్థం ఉందనిపిస్తుంది. దోషి తన సిలువను తానే మొయ్యాలి. అలా మొయ్యడం తాను నేరం చేశానని ఆ ఊరేగింపును చూస్తున్న వారందరికీ సాక్ష్యార్థంగా ప్రదర్శన. యేసు నేరస్థుడు కాదు. మనందరం నేరస్థులం. మనందరిలో ఒకడుగా సీమోను ఆ సిలువ మోశాడు. సిలువ మరణం వరకు యేసుతో వెళతానన్నాడు సీమోను పేతురు. నిజంగా వెళ్లినది కురేనె వాడైన సీమోను. సీమోను పస్కా పండుగ చేసుకుందామని యెరూషలేము వచ్చాడు. పస్కా బలి పశువును అక్షరాలా కలుసుకున్నాడు. ఇతడు, ఇతని ఇద్దరు కొడుకులు అలెగ్జాండరు, రూఫస్‌లు రోమా విశ్వాసులకు పరిచితులే అయి ఉండవచ్చు (15:21,22; రోమా 16:13).

సిలువ శిక్షను వివరించడానికి సువార్త రచయితలు పూనుకోలేదు. ఆ కాలం ప్రజలందరికీ సిలువ శిక్ష ఎలా అమలుపరుస్తారో తెలిసే ఉంటుంది. ఒక్కమాట మాత్రం నిజం, మనిషిని చంపడానికి కనుగొన్న మార్గాలన్నిటిలోకీ సిలువ అత్యంత భీకరమైనది. 22వ కీర్తన చదవండి.

సిలువపై తగిలించడానికి పిలాతు వ్రాయించిన దానికి శాస్త్రులు, పరిసయ్యులు అభ్యంతరం తెలిపారు. ఈ ఒక్కసారి మాత్రం పిలాతు స్థిరంగా నిలబడ్డాడు (యోహాను 19:19-22). రోమా సైనికులు తమ ఉద్యోగ ధర్మం నెరవేరుస్తూ, మరోవైపు లేఖనాల నెరవేర్పు కూడా జరిగిస్తున్నారు (కీర్తన 22:18).

మత నాయకులకు ఇంకా కక్ష తీరక సిలువ వేసిన చోటికి వెళ్లి ఆయన్ను దూషించారు. తమ మత నాయకులు చేసినదే సామాన్య ప్రజలు కూడా చేశారు. వారాయన్ను ప్రవక్తగా (15:29), రక్షకునిగా (15:31), రాజుగా (15:32) ఎగతాళి చేశారు. "వీడు ఇతరులను రక్షించాడు" అని వారు హేళనగా అన్నమాటే అక్షర సత్యం. "నరుల ఆగ్రహము నిన్ను స్తుతించును" (కీర్తన 76:10).

ఆరవ గడియలో (33వ) చిమ్మ చీకటి దేశమంతా అలముకుంది. సృష్టికర్త పడుతున్న హింసలకు సృష్టి అంతా చీకటయింది. ఇది అద్భుతం. సహజంగా కలిగే గ్రహణం, ఇసుక తుఫాను, మబ్బులు కమ్మడం కాదు. ఈ చీకటి ద్వారా దేవుడు ఆ ప్రజలకో సందేశం పంపుతున్నాడు.

అది పస్కా దినం. ఆ కాలంలో ఈజిప్టు పైకి వచ్చిన 9వ తెగులు చీకటి. చివరిది, పదవదీ జ్యేష్ఠ సంతతి మరణం (నిర్గమ 10:22-11:9). కల్వరిలో చీకటి దేవుని ఏకైక కుమారుని మరణాన్ని ప్రకటిస్తున్నది.

తొమ్మిదవ గడియ (34-41వ). చీకటి కమ్మకముందు మూడు మాటలు ప్రభువు పలికాడు. చీకటిలో పూర్తిగా మౌనం దాల్చాడు. ఎందుకంటే మనకోసం ఆయన పాపంగా చేయబడినది అప్పుడే (2కొరింథీ 5:21). మళ్లీ 9వ గడియలో ఆయన నోరు విప్పాడు. సమాప్తమైనదంటూ తన ఆత్మను తండ్రి చేతికి అప్పగించాడు.

భూకంపం, ఆలయం తెర చినగడం వెనువెంటనే జరిగాయి. తన మరణం ద్వారా సేవకుడు కొత్తది, సజీవమైనది అయిన మార్గమొకదానికి తెరిచాడు (హెబ్రీ 10:12-22). ధర్మశాస్త్రాన్ని ఇస్తున్నప్పుడు కూడా భూమి కంపించింది (నిర్గమ 19:16-18). అయితే యేసుక్రీస్తులో ధర్మశాస్త్రం ఈడేరినప్పుడు కూడా భూకంపం కలిగింది. ధర్మశాస్త్ర సంబంధమైన శాపం తీరిపోయింది.

రోమన్ సైనికాధికారి సాక్ష్యం ఒళ్లు పులకరింపజేస్తుంది. అటు యూదులకు, ఇటు రోమీయులకు కూడా కోపం తెప్పించే వ్యాఖ్య అది.

## సేవకుని సమాధి (15:42-47)

నికోదేము సహకారంతో సన్‌హెడ్రిన్ సభ్యుడు, అరిమతయి గ్రామవాసి అయిన యోసేపు ప్రభువు అంతిమ సంస్కారానికి సమకట్టాడు. ఇది అప్పటికప్పుడు చేసుకొన్న నిర్ణయం కాదు. సమాధి తొలిపించాలి. అది యోసేపు తనకోసం తొలిపించుకున్న సమాధి అయి ఉండదు. నేరస్థులను సిలువ వేసేచోటికి అంత సమీపంగా ఒక ధనికుడు తన సమాధి సిద్ధపరచుకోడు. అంతేగాక వారు చాలా సుగంధ ద్రవ్యాలను సిద్ధపరచుకొని ఉంటారు (యోహాను 19:39). వారు వీటిని సమకూర్చుకొని ఉండాలి. ఇదంతా ఎందుకంటే ఆ పస్కా పండుగనాడు దుకాణాలు ఉండవు సన్‌హెడ్రిన్ కౌన్సిల్ వారికి తెలియకుండా చేయాలి. దేవుడే ఈ ఇద్దరినీ ప్రేరేపించి ఈ ఏర్పాటన్నీ చేయించి ఉంటాడు.

గతంలో నికోదేము యేసు వద్దకు ఏకాంతంగా వచ్చాడు. కౌన్సిల్ సమావేశాల్లో యేసును ముందుగానే సమర్థించాడు. వీరిద్దరూ లేఖనాలను పరిశోధించి యేసేక్రీస్తు అని తీర్మానికి వచ్చి ఉండాలి. పస్కా దినానే "లోక పాపాలను మోసుకుపోయే దేవుని గొర్రెపిల్ల" వధ అవుతాడని పరిశుద్ధాత్ముడు వీరికి బయలుపరచి ఉండాలి.

వీరిద్దరి తెగువ చూసి ఈ పని చేయకుంటే యేసు దేహాన్ని దిక్కులేని శవంగా ఎక్కడో పారవేసేవారు. యేసును సమాధి చేయడంలో వీరిరువురూ యెషయా 53:9ని నెరవేర్చారు. ఆయనను సమాధి చేయడం ఆయన సిలువపై నిజంగా చనిపోయాడన్నదానికే రుజువు. ఆయన చనిపోయాడని నిర్ధారించుకున్న తరువాతగానీ రోమా సైనికాధికారులు ఆయన దేహాన్ని అప్పగించరు.

## సేవకుని పునరుత్థానం (16:1-18)

ప్రభువు పునరుత్థానం ఆయన మరణంతో సమానంగా మనం నమ్మే సువార్తలో అంతర్భాగం. ఆది సంఘం ముఖ్యంగా క్రీస్తు పునరుత్థానం గురించే సాక్ష్యమిచ్చారు. ఆయన తన గురించి ఏమి చెప్పుకున్నాడో అది నిజమని మనం నమ్మడానికి ఆయన పునరుత్థానమే ఆధారం. ఈ విషయం ఆయన ముందుగానే తన శిష్యులకు చెప్పాడు. ఆ సమాధి వద్దకు వచ్చిన స్త్రీలు కూడా ఆయన తిరిగి బ్రతుకుతాడని నమ్మలేదు.

మగ్దలెనె మరియ, యాకోబు తల్లి మరియ, సలోమీ, యోహన్న అనే స్త్రీలు ముందుగా సమాధికి చేరుకున్నారు (లూకా 24:10). సమాధి ఖాళీగా ఉండడం వీరే ముందుగా చూశారు. రెండవదిగా అక్కడ ఇద్దరు దేవదూతలను చూశారు. పునరుత్థాన ప్రభువును మొదటగా చూసిన విశ్వాసి మగ్దలెనె మరియ (16:9). మార్కు 16:9-14లో శిష్యుల అయోమయం, అపనమ్మకం మనకు అర్థమవుతున్నాయి.

యేసు ఆరోహణం సమయంలో ఇచ్చిన ఆజ్ఞలో కొంత భాగం మాత్రమే మార్కు 16:15-16లో ఉంది. దానిని పైపైన చదివితే పాపులకు బాప్తిస్మమిస్తే వారికి రక్షణ కలుగుతుందనే అర్థం స్ఫురిస్తున్నది. అయితే అక్క "నమ్మి" అనే మాట చాలా ప్రధానం.

దేవుడు మోషేను ఫరో వద్దకు పంపినప్పుడు అతనికి ఉన్న దివ్య అర్హతలకు గుర్తుగా కొన్ని అద్భుతాలు జరిగించే శక్తినిచ్చాడు (నిర్గమ 4:1-9). కొందరు ప్రవక్తల విషయంలో కూడా ఇదే జరిగింది (1రాజులు 18; 2రాజులు 2:14-25). అపొస్తులులకు కూడా వారి సందేశానికి

ఆసరాగా కొన్ని అద్భుతాలు చేసే శక్తిని దేవుడిచ్చాడు (అపో.కా. 19:11-12; 2కొరింథీ 12:12 మొ॥). కేవలం అద్భుతాలు చేసినంత మాత్రాన ఆ మనిషిని దేవుడు పంపాడని భావించడానికి వీలులేదు. అతని సందేశం కూడా దేవుని వాక్యానికి సరిపోవాలి. ఇక్కడ చెప్పిన అద్భుతాలు అపో.కా. గ్రంథంలో జరిగినట్టు కనిపించవు (విషం తాగినా చావకపోవడం మొ॥). మనకి తెలియకుండా దేవుడు తన సువార్తికుల చేత ఎన్నో అద్భుతాలు చేయించాడనేది స్పష్టం.

ఫిలిప్పీ 2లోని సేవక వృత్తాంతం మార్కు సువార్తలో చక్కగా నెరవేరింది.

సేవకునిగా వచ్చాడు (ఫిలిప్పీ 2:1-7) – మార్కు 1-13 అధ్యా.

సిలువపై మరణించాడు (ఫిలిప్పీ 2:8) – మార్కు 14-15 అధ్యా.

మహిమ పొందాడు (2:9) – మార్కు 16

మన ప్రభువు ఆరోహణం ఆయన భూసంబంధమైన పరిచర్యకు అంతం. పరలోక సంబంధమైన పరిచర్యకు అది ఆరంభం. ఆయన మన ప్రధాన యాజకుడుగా, ఉత్తరవాదిగా తండ్రివద్ద ఉన్నాడు (హెబ్రీ 7-10 అధ్యా; 1యోహాను 2:1-3). మహిమ స్థితిలో అక్కడ కూడా ఆయన మనకు సేవకునిగానే ఉన్నాడు. తండ్రి కుడివైపున అంటే అదెంతో ఘనత, మహిమ గల స్థానం. మన పరమ సేవకుడు ఇప్పుడు అక్కడ ఉన్నాడు.

---

ఆలోచించండి 10:32-37

## నిన్ను శిక్షించడానికి తగినన్ని రుజువులున్నాయా?

**నీవు రహస్యక్రైస్తవుడివా ? యేసుక్రీస్తును దూర దూరంగా వుండి వెంబడిస్తున్నావా? నీ విశ్వాసాన్ని రహస్యంగా వుంచుకున్నావా? నీ స్నేహితులు లేదా నీతో పనిచేసేవారు నిన్ను నమ్మకమైన విశ్వాసి అని చెప్పగలరా ? నీ విశ్వాస విషయంలో నీ మీద నేరం మోపడానికి ఏవైనా బలమైన రుజువులున్నాయా ?**

**ఇశ్రాయేలు రాజకీయ, మత నాయకులు ఎలాగైనా యేసు పీడ విరగడ చేసుకోవాలని తలపెట్టారు. ఆయన మీద ఏదో ఒక నేరం మోపి, శిక్షపడేలా చేయటానికి సాధ్యమైన మార్గాలన్నీ వెదికారు. యేసు శిష్యులలోనే ఒకడికి డబ్బిచ్చి, తమకు ఇన్‌ఫార్మర్‌గా వినియోగించుకోజూచారు. అయితే, వారి పథకం కాస్తా బెడిసి కొట్టింది. అతడు వారివద్ద పుచ్చుకొన్న డబ్బును తిరిగి ఇచ్చేసి, ప్రభువు నిర్దోషి అని ప్రకటించాడు (మత్తయి 14:43-46; మత్తయి 27:3-5). ఆయన్ను భయపెట్టడానికి ఒక గుంపును రేపారు. అయితే, ఆయన మిన్నకుండిపోయి, తన శిష్యుల్ని కూడా నిగ్రహం కోల్పోవద్దని హితవు పలికాడు (మత్తయి 26:51-54). మత నాయకులు అబద్ధ సాక్షులను న్యాయస్థానంలో నిలబెట్టారు - సాక్షులు అప్రమాణమైనా పలికారు, లేదా పరస్పరం వ్యతిరేక సాక్ష్యాలు ఇచ్చారు (మార్కు 14:55,56).**

**యేసును ఎలాగైనా ఏదో ఒక నేరంలో ఇరికించాలని ప్రజలు శతవిధాలా ప్రయత్నించారు కాని, వారికి చిన్న మెత్తు సాక్ష్యం కూడా లభించలేదు. ఒకవేళ యేసు స్థానంలో నీవు విచారణలో వున్నావు అనుకుందాం. నీ మీద ఎలాంటి నేరాలు మోపుతారు ? యేసుప్రభువును వెంబడించి, ఫలానా తప్పులు చేశావని నీ మీద వేలెత్తి చూపుతారా ? దేవునికైనా ఆధారాలున్నట్టు చెప్పగలరా ?**

ఆలోచించండి
10:32-37

## యేసును వెంబడించే వాని లక్షణాలు

- యేసుప్రభువు "పర్వత ప్రసంగంలో" వర్ణించిన "అద్భుత వైఖరి" ప్రదర్శించు (మత్తయి 5:3-16).
- మార్పు చెందిన మనసుతో ఆలోచిస్తాడు, యథార్థమైన ప్రేమను వెల్లడిస్తాడు, అధికారాన్ని గౌరవిస్తాడు (రోమా 12:1,2; 13:1-7).
- "ప్రేమపూర్వక జీవన శైలిని" ప్రతిఫలిస్తాడు (1కొరింథీ 13 అధ్యాయం).
- పౌలు వర్ణించిన ఆత్మ ఫలము ప్రదర్శిస్తాడు (గలతీ 5:22-26).
- క్రీస్తు నమ్రత స్వభావంతో ఇతరుల ఆకాంక్షలు నెరవేర్చ ప్రయత్నిస్తాడు (ఫిలిప్పీ 2:1-4).
- ఎల్లప్పుడు ఆనందిస్తాడు, ఎడతెగక ప్రార్థిస్తాడు, ప్రతి విషయంలో కృతజ్ఞత వ్యక్తం చేస్తాడు (1థెస్స 5:16-18).
- విశ్వాస సహితమైన కరుణ క్రియలు జరిగిస్తాడు (యాకోబు 2:14-17); నాలుకను అదుపులో వుంచుకుంటాడు (3ం1-11); జ్ఞానం కలిగి మసలుకుంటాడు (3:13).
- యేసును గూర్చిన సత్యాన్ని గట్టిగా చేపడతాడు (2యోహాను 4; 3యోహాను 3,4) దాని పక్షంగా పోరాడతాడు (యూదా 3).

క్రైస్తవుడు సేవకుడు. సేవకునిగా వచ్చిన యేసు ప్రభువుకు సేవకుడు. తన సాటి మనుషులందరికీ సువార్త పరిచర్య జరిగించవలసిన సేవకుడు.

సేవలు పొందేవారిని గొప్పవారుగా చింపుతుంది. ఈ లోకం సేవించివారిని గొప్పవారంటుంది పరలోకం.

## మార్కు సువార్తలో అద్భుతాలు

మార్కు సువార్తలో యేసు ప్రభువు అనేక అద్భుతాలు చేశాడు. యెహోవా సేవకుడిగా రక్షకుడు అనేక కరుణ క్రియలు జరిగించాడు. ఈ సువార్త అంతటిలో దాదాపు 30 అద్భుతాలు కనిపిస్తాయి. వాటిలో కొన్నిటి సారాంశం పరిశీలిద్దాం.

**1. కుష్ఠరోగిని స్వస్థపరిచాడు (1:40-45)**
**2. పేతురు అత్తను స్వస్థపరిచాడు (1:29-31)**
**3. సాయంకాల వేళ రోగులను స్వస్థపరిచాడు (1:32-34)**
**4. తుఫానును నిమ్మళింపజేశాడు (4:35-41)**
**5. సేన దయ్యాలను వెళ్లగొట్టాడు (5:1-20)**
**6. పక్షవాత రోగిని స్వస్థపరిచాడు (2:1-12)**
**7. యాయీరు కుమార్తెను బ్రతికించాడు (5:22-24; 35-43)**
**8. రక్తస్రావ రోగిని స్వస్థపరిచాడు (5:25-34)**
**9. ఊచచెయ్యి గలవానిని బాగుచేశాడు (3:1-6)**
**10. అయిదు వేలమందికి ఆహారం పెట్టాడు (6:30-44)**
**11. గలిలయ సముద్రంపై నడిచాడు (6:45-52)**
**12. సురోఫెనీకెయ స్త్రీ కుమార్తెను స్వస్థపరచాడు.**
**13. నాలుగు వేలమందికి ఆహారం పెట్టాడు (8:1-10)**
**14. మూగదయ్యము పట్టిన బాలుణ్ణి బాగుచేశాడు (9:17)**
**15. అంజూరపు చెట్టును ఎండిపోయేలా చేశాడు (11:12-14; 20,21)**
**16. మరణించి తిరిగి లేచాడు (16:1-14)**
**17. అపవిత్రాత్మను వెళ్లగొట్టాడు (1:23-28)**
**18. చెవుడు, నత్తి వున్న వ్యక్తిని బాగుచేశాడు (7:31-37)**
**19. బేత్సయిదాలో గుడ్డివాణ్ణి స్వస్థపరిచాడు (8:22-26)**
**20. గుడ్డి బర్తమయిని స్వస్థపరిచాడు (10:46-52)**

**యేసుప్రభువు చేసిన ఈ అద్భుతాలన్నిటినీ నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. (1) రోగాలపై ఆయన అధికారం, (2) దయ్యాలపై ఆయన అధికారం, (3) ప్రకృతిపై ఆయన అధికారం, (4) మరణంపై ఆయన అధికారం.**

# 1. కుష్ఠురోగిని స్వస్థపరచుట (1:40-45)

మత్తయి 8:1-4; లూకా 5:12-16 కూడా చూడండి. ఈ వ్యక్తికి వచ్చిన కుష్ఠు నేడు మనం చూచే కుష్ఠుకంటే భిన్నమైనది. అది చాలా బాధాకరం, భయం గొలిపేది. కుష్ఠురోగులు ఇతరులతో కలసిపోకుండా కఠిన చట్టాలు రూపొందించారు, (లేవీ 13). వారు చినిగిపోయిన బట్టలు ధరించి, వెంట్రుకలు పెంచుకోవాలి. ఎవరి ఇంటిలోనైనా ప్రవేశించకూడదు. వారు ఒకవేళ దారిన పోవటం జరిగితే ''అపవిత్రుణ్ణి'' అంటూ కేకలు వేయాలి. ఈ వ్యక్తి యేసుప్రభువు దగ్గరకు రావటం విచిత్రంగా వుంది. యేసుప్రభువు అతణ్ణి బాగుచేయటం మరింత అద్భుతంగా ఉంది. దుష్టత్వంపై విజయం సాధించే యేసుప్రభువు శక్తికి ఇది చక్కటి ఉదాహరణ.

కుష్ఠురోగి ఆయన దగ్గరకు వచ్చి ఆయన ఎదుట మోకాళ్లూని నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవని ఆయనతో చెప్పి, ఆయన్ను వేడుకొన్నాడు. (40వ). "నీకిష్టమైతే నన్ను శుద్ధుని చేయగలవు" అంటే అర్థమేమిటి, నీకు స్వస్థపరిచే శక్తి వుంది. కాని స్వస్థపరచడం నీకు ఇష్టమేనా? యేసు శక్తిగలవాడని అతడు నమ్ముతున్నాడు కాని, ఆయన ప్రేమగలవాడో కాదో వాడికి తెలియదు. ఈ సంఘటన ద్వారా మనకు తెలిసేదేమంటే దేవుడు ఎంత శక్తి గలవాడో, అంతే ప్రేమ గలవాడు.

అప్పుడు ప్రభువు "కనికరపడి, చెయ్యి చాపి, వానిని ముట్టి – నాకిష్టమే నీవు శుద్ధుడవు కమ్మని చెప్పెను" (41వ) కొందరు వ్యాఖ్యాతలు "కనికరపడి" అనే పదం స్థానంలో "కోపంతో మండిపడి" అని వుండాలి అంటారు. ప్రభువుకు కోపమెందుకు ? ఆ రోగం యొక్క చెడుగును చూచి ఆయన కోపగించాడు. ఇతరులు చెడుదారిన పడి, బాధ అనుభవించి నప్పుడు ఆయన తరచు కోపించేవాడు (10:14; 11:15-17 చూడండి.) రోగులను, వృద్ధులను నిర్లక్ష్యం చేసినప్పుడు మనము కోపించినట్లయితే, మరింతగా సాయం చేసే క్రైస్తవులుగా మనము వుండాలి. ఇదే సరైన కోపం (కీర్తన 97:10; ఎఫెసీ 4:26 చూడండి). ప్రభువు అతణ్ణి ముట్టు కున్నాడు. ఆ రోజున ప్రభువు చేసిన అత్యద్భుత కార్యాలలో కుష్ఠురోగిని ముట్టుకోవడం ఒకటి. దీనికి రెండు కారణాలు.

1) ఆ విధంగా చేయడం ద్వారా నిష్ఠగల యూదుల సాంప్రదాయానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు. ఎవరైనా కుష్ఠురోగిని ముట్టుకుంటే, ఆ వ్యక్తి ఆత్మ మైలపడుతుందని వారు నమ్ముతారు. అయినా, యేసు యూదుడై వుండి కూడా అతణ్ణి ప్రేమిస్తున్నాడు. అతనికి సాయం చెయ్యటం కోసం పదిహేను వందల ఏళ్లనాటి సాంప్రదాయాన్ని అతిక్రమించ డానికి ఆయన సిద్ధపడ్డాడు. మన పొరుగువారిపట్ల మన విద్యుక్తధర్మం నెరవేర్చడానికి కొన్నిసార్లు సాంప్రదాయాన్ని మీరవలసి వుంటుంది.

2) యేసుప్రభువు తనను అమితంగా ప్రేమిస్తున్నాడని కుష్ఠురోగికి తెలుసు. ఎందుకంటే ఆయన అతణ్ణి ముట్టు కున్నాడు. మనం ఎవరినైనా గాఢంగా ప్రేమిస్తే మాటల్లో గాక చేతల్లో ఆ ప్రేమను వ్యక్తపరుస్తాం. యేసుప్రభువు స్పర్శ ఆయన ప్రేమకు దృశ్యమాన బాహిర సంకేతం.

ఒకసారి ఇద్దరు ముస్లిమ్ రోగులు మిషనెరీ హాస్పిటల్‌కు వైద్యానికి వచ్చారు. వారి శరీరమంతా కురుపులు వున్నందున, భరింపరాని వాసన వస్తుంది. అయినా, అక్కడ పనిచేస్తున్న క్రైస్తవ నర్సు వారిపై అత్యంత శ్రద్ధ చూపించి, వారి కురుపులను శుభ్రంగా కడిగి, మందు పూసేది. ప్రతిరోజూ సాయంత్రం వారితో కూర్చొని కాసేపు ముచ్చటించేది. ఒకరోజు ఆమె తన డ్యూటీ ముగించుకొని పోతూవుంటే వారిద్దరూ ఇలా అన్నారు. "అమ్మా, మా ఊళ్లో మీ మతాన్ని గూర్చి విన్నాం. కాని ఇక్కడ దాన్ని కళ్లారా చూచాం."

### అతడు స్వస్థత పొందాడు (42వ)

యేసుప్రభువు రాకముందు ఎవరైనా కుష్ఠురోగి బాగు పడితే, అతడు వెళ్లి యాజకునికి కనబడాలి (లేవీ 14:2), అప్పుడు యాజకుడు "శుద్ధుడవు కమ్ము" అంటాడు. అనగా "ఇతరులను కలుసుకొనే స్వేచ్ఛ కలిగింది." (14వ వచనం చూడండి). అయితే, యేసుప్రభువు ఆ వ్యక్తిని స్వస్థపరచి నప్పుడు ఆయన స్వేచ్ఛను ప్రకటించటమే కాదు, ఆయన అతణ్ణి వాస్తవంగా నయం చేశాడు (రోమా 8:3 చూడండి). వైద్య విజ్ఞాన వేత్తలు "డాప్సన్" అనే మందు కనిపెట్టారు. ఈ మందు ద్వారా వేలాది కుష్ఠురోగులు స్వస్థత పొందారు. కనుక, ఆ మందు కనిపెట్టిన వారి ద్వారా యేసు ఇంకా అనేకుల్ని స్వస్థపరుస్తూ వున్నాడు.

యేసుప్రభువుకు అద్భుతాలు చేసే వ్యక్తిగా గుర్తింపు రావటం ఇష్టం లేదు. అందుకే అతణ్ణి "ఎవనితోను ఏమియు చెప్పకు సుమీ" అంటూ ఖండితంగా ఆజ్ఞాపించి పంపించి వేశాడు. అయితే యెరూషలేము దేవాలయానికి వెళ్లి, అక్కడ

యాజకుడికి పరీక్ష నిమిత్తం కనపరచుకొమ్మని ఆజ్ఞాపించాడు. మోషే నియమించిన రెండు పావురాలను, ఇతర కానుకలను అర్పించమని చెప్పాడు (లేవీ 14 అధ్యాయం చూడండి). అది "వారికి సాక్ష్యార్థము". అతణ్ణి చూచి యాజకుడు విస్తుపోయి వుంటాడు. ఎందుకంటే ఇశ్రాయేలులో కొన్ని శతాబ్దాల తరబడి అలాంటిది ఎన్నడూ వినబడలేదు. అతడు తన అనుభవాన్ని దాచుకోలేకపోయాడు. వెళ్లి అందరికీ జరిగింది చెప్పాడు. యేసుప్రభువు పని మరింత కఠినతరం చేశాడు. ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి ఆయన పనికి ఆటంకం కలిగించారు. అందువలన ఆయన పట్టణం విడిచి పల్లెపట్టులకు వెళ్లాడు. అక్కడికి కూడా ప్రజలు నలుమూలల నుండి వచ్చి ఆయన చుట్టూ మూగారు. మానవశక్తి కుష్ఠురోగాన్ని బాగుచేయలేదు. లోకంలో ఏ వైద్యుడూ చేయలేని పనిని యేసుప్రభువు మాట ద్వారా, స్పర్శ ద్వారా చేశాడు. కుష్ఠు అనేది శరీరం లోపలి జబ్బు. అది లోపలి నుండి బయటకు వస్తుంది. అది చాలా అసహ్యామైన జబ్బు కనుక దేవుడు పాపపు అపవిత్రతను సూచించడానికి కుష్ఠును సంకేతంగా వినియోగించాడు.

రక్షణ పొందని ప్రతివ్యక్తీ ఈ భయానక రోగంతో వున్నాడు, కనుక దేవుని దృష్టిలో అపవిత్రమైన పాపి. ఒక వ్యక్తి శరీరంపైన దద్దుర్లు, పుండ్లు వున్నందున కుష్ఠురోగి కాదు. ఇవి కేవలం లోపల వున్న జబ్బు బాహిర లక్షణాలే. ఒక వ్యక్తి పాపం చేసినందున పాపి కాదు, పాపి కనుక పాపం చేస్తున్నాడు. అందువలన లోపల చెడిపోయి వున్నాడు. యేసుప్రభువు శక్తిద్వారా మాత్రమే విడుదల కలుగుతుంది.

## సువార్తలలో క్రీస్తు ముఖ్య లక్షణాలు

| గుణ లక్షణాలు | లేఖన భాగం |
|---|---|
| యేసు దేవుని కుమారుడు | మత్తయి 16:15,16; మార్కు 1:1; లూకా 22:70,71; యోహాను 8:24 |
| యేసు దేవుడు, అయితే మనిషిగా అవతరించాడు | యోహాను 1:1; 2:14; 20:28 |
| యేసు క్రీస్తు, మెస్సీయ | మత్తయి 26:63,64; మార్కు 4:61,62; లూకా 9:20; యోహాను 4:25,26 |
| పాపులకు సాయం చేయడానికి యేసు వచ్చాడు | లూకా 5:32; మత్తయి 9:13 |
| పాపాలను క్షమించే అధికారం యేసుకు వున్నది | మార్కు 2:9-12; లూకా 24:47 |
| మరణంపై యేసుకు అధికారం వున్నది | మార్కు 5:22-24; 35-42; యోహాను 11o1-44; లూకా 24:5,6; మత్తయి 28:5,6 |
| యేసుకు నిత్యజీవం ఇచ్చే అధికారం వున్నది | యోహాను 10:28; 17:2 |
| యేసు రోగులను స్వస్థపరిచాడు | మత్తయి 8:5-13; మార్కు 1:32-34; లూకా:5:12-15; యోహాను 9:1-7 |
| యేసు అధికార పూర్వకంగా బోధించాడు | మార్కు 1:21,22; మత్తయి 7:29 |
| యేసు కనికరము గలవాడు | మార్కు 1:41; 8:2; మత్తయి 9:36 |
| యేసు దుఃఖము అనుభవించాడు | మత్తయి 26:38; యోహాను 11:35 |
| యేసు ఎన్నడూ దేవునికి అవిధేయుడు కాలేదు | మత్తయి 3:15; యోహాను 8:46 |

# 2. పేతురు అత్తకు స్వస్థత (1:29-31)

మత్తయి 8:14,15; లూకా 4:38,39 కూడా చూడండి. అది కపెర్నహూము. పేతురు, అంద్రెయల ఇంటికి ప్రభువు వచ్చాడు. ఈ సోదరులిరువురూ మొదట బేత్సయిదాలో నివసించేవారు. బహుశా సీమోను పేతురు వివాహం తరువాత వారు కపెర్నహూముకు నివాసం మారి వుండవచ్చు. అక్కడ ఏం జరిగిందో పూసగుచ్చినట్లు పేతురు మార్కుతో చెప్పి వుంటాడు. ఆ విషయాన్నే మార్కు మనకు తెలియ జేశాడు.

సమాజమందిరంలో నుండి... సీమోను ఇంటికి బహిరంగ ఆరాధన స్థలంలో దేవుని కార్యం జరిగించిన యేసుప్రభువు. ఒక ఇంటిలో కూడా అదే పని కొనసాగిస్తున్నాడు. ఆయన సమాజమందిరంలో వున్నప్పుడు ఒక విధంగా, ఇంటిలో వున్నప్పుడు మరొక విధంగా ప్రవర్తించలేదు. అదే రీతిగా మనము కూడా సంఘంలో వున్నప్పుడు ఎలా ప్రవర్తిస్తామో ఎలాంటి పనులు చేస్తామో, ఇంటిలో వున్నప్పుడు, ఇతర స్థలాల్లో వున్నప్పుడు అదే రీతిగా వుండాలి.

సీమోను పేతురు అత్త జ్వరముతో పడివున్నది. ఆ విషయం వారు ప్రభువుకు తెలియజేశారు (30వ). దీనిని బట్టి మనకు తెలిసేదేమంటే యేసుప్రభువు పిలిచినప్పటికే పేతురుకు పెళ్లయింది. 1కొరింథీ 9:5 ప్రకారం తరువాతి కాలంలో పేతురు తన భార్యను వెంటబెట్టుకొని సేవలో తిరిగేవాడు. పేతురు వివాహితుడు. పౌలు అవివాహితుడు. రెండు రకాల మనుష్యులనూ ప్రభువు వాడుకుంటాడు.

పేతురు అత్త జ్వరముతో మంచంపట్టి వుంది. ఇశ్రాయేలులో యేసు ఎక్కడికి వెళ్లినా పాపపు దుష్పరిణామాలను ఆయన చూచాడు. ఈ ప్రజలు దేవుని పట్ల నమ్మకంగా వుండివుంటే ఆయన వారి మధ్యనుండి రోగాన్ని లేకుండా చేసి వుండేవాడే (నిర్గమ 15:26). అయితే ఒక జాతిగా వారు దేవుని మాటకు లోబడలేదు. ఫలితంగా ఎక్కడబడితే అక్కడ రోగం, అస్వస్థత వ్యాపించింది. జ్వరంతో బాధపడుతున్న ఆమె స్థితిని శిష్యులు ప్రభువు దృష్టికి తెచ్చారు. ఎందుకంటే పరిస్థితిని ఆయన తప్పక చక్కదిద్దుతాడు అని వారికి గట్టి నమ్మకం. మొత్తం మీద వారి తలంపులు ఏవైనా, ముఖ్యంగా ఎవరైనా జబ్బుతో వున్నప్పుడు ప్రభువుతో ప్రార్థనలో చెప్పడం మంచిది. (32 వచనం చూడండి. "సాయంకాలము ప్రొద్దు గ్రుంకినప్పుడు, జనులు సకల రోగాలను దయ్యములు పట్టిన వారిని ఆయన యొద్దకు తీసికొని వచ్చిరి"). సాయంకాల ప్రార్థనలో మనం చేయగల పని ఇదే.

"ఆయన ఆమె దగ్గరకు వచ్చి, చెయ్యిపట్టి ఆమెను లేవనెత్తెను. అంతట జ్వరము ఆమెను వదలెను" (31వ). ఆయన స్పర్శలో స్వస్థత వున్నది, సున్నితంగా, వ్యక్తిగత శ్రద్ధతో జ్వరంతో మూలుగుతూ వున్న ఆ దీన స్త్రీని నెమ్మదిగా ప్రభువు లేపి కూర్చోబెట్టాడు. "జ్వరము ఆమెను విడిచింది". ఆమె లోపల వున్న జ్వరం తాలూకు మంట నిమ్మళించింది. ఆమెను వెంటనే నెమ్మది కలిగింది. సాధారణంగా జ్వరం తగ్గినా బలహీనత కొంతకాలం వుంటుంది. అయితే, ఈ స్త్రీ వెంటనే లేచి పరిచర్య చేయ మొదలుపెట్టింది. ఆమె తన కృతజ్ఞతను, ప్రేమను ఆ రీతిగా వ్యక్తం చేసింది.

**నిశిత పరిశీలన 12:18-27**

## నీవైతే ఏం చెబుతావో?

**యేసుప్రభువు ప్రజాదరణ, పలుకుబడి పెరుగుతున్నట్టు గమనించి, ఆయన్ను ఎలాగైనా నోరు మూయించాలని కుటిల ప్రశ్నలు అడిగారు మత నాయకులు (మార్కు 12:18-27). నీవు ఆయన స్థానంలో వుండివుంటే వారి కుటిల ప్రశ్నలకు ఎలా జవాబివ్వాలో తెలుస్తుందా ?**

**వ్యక్తి చిత్రణ :**

తెలుసుకుందాం
1:6

## బాప్తిస్మమిచ్చే యోహాను

**స్వస్థలం :** యూదా గోత్రానికి చెందిన ఒక పట్టణంలో పెరిగాడు కాని, పెద్దవాడయ్యాక అధికశాతం యొర్దాను నది సమీపంలో యూదయ అరణ్యంలో జీవించాడు.

**కుటుంబం :** జెకర్యా, ఎలిజబెత్‌ల కుమారుడు

**వృత్తి :** బోధకుడు, ప్రవక్త

**నేడు మనకు గుర్తుండే అంశం :** యేసు మెస్సీయాకు మార్గం సుగమం చేయుట

# 3. సాయంకాలం సమయంలో రోగులను స్వస్థపరచుట (1:32-34)

(మత్తయి 8:16,17; లూకా 4:41 కూడా చూడండి).

సమాజ మందిరంలో స్వస్థత పొందిన వ్యక్తిని గూర్చి కపెర్నహూములో చాలామంది విని వుంటారు. (21-28 వచనాలు). కనుక వారు రోగులను, దయ్యాలు పట్టిన వారిని స్వస్థత కోసం యేసుప్రభువు దగ్గరకు తీసుకొని వచ్చారు. ప్రొద్దు గుంకకముందు వారు ఆయన దగ్గరకు రాకపోవడానికి ఆ రోజు సబ్బాతు కావడమే. సబ్బాతు రోజున బరువులు మోయటం ధర్మశాస్త్ర విరుద్ధం. ప్రొద్దు గుంకడంతో సబ్బాతు ముగిసింది.

ఇది అతియశయోక్తి కాదు. "పట్టణమంతయు ఆ ఇంటి వాకిట కూడి యుండెను" (33వ). ఎందుకంటే కపెర్నహూము చిన్న పట్టణమే. అందువలన పట్టణం నలుదిక్కుల నుండి ప్రజలు కుతూహలంతో కొందరు, అవసరతతో మరికొందరు వచ్చి వుంటారు. అయితే వారిలో ఎక్కువమంది తమ మధ్యకు వచ్చిన ఆయనను రక్షకుడని గుర్తించలేదు.

"దయ్యములు తనను ఎరిగియుండినందున ఆయన ఆ దయ్యములను మాటలాడనియ్యలేదు" (34వ). అపవిత్రాత్మ పట్టిన వ్యక్తి "నీవు దేవుని పరిశుద్ధుడవు" (24వ) అని కేకలు వేసినందున ప్రజలు యేసును మెస్సీయాగా భావించే అవకాశం వున్నది. మెస్సీయా వచ్చి రోమీయులపై తిరుగుబాటు లేవదీస్తాడని ప్రజలు కనిపెడుతున్నారు. అందువలన ఆ బిరుదు వినియోగించటం ఆయన వారించాడు. యేసు మెస్సీయా అని మనమెరుగుదుము. కాని, వారు ఎదురు చూసిన మెస్సీయా మాత్రం కాదు. పైపెచ్చు దురాత్మల సాక్ష్యము ఆయనకు అక్కరలేదు.

భూమిమీద మన ప్రభువు నిరంతరము సేవచేస్తూ జీవించాడు. దీనర్థం ఆయన ఎడతెరిపి లేకుండా బోధిస్తూ స్వస్థపరుస్తూ వున్నాడని కాదు. ఆయన తండ్రితో ఏకాంతంగా గడపడానికి బోలెడంత సమయం తీసుకున్నాడు. కాని, ఆయన శిష్యుల్లో ఎవ్వరూ ఆ విధంగా చేయలేదు. కపెర్నహూములో ఒక్క సబ్బాతు రోజు ఆయన గడిపిన తీరు ఆయన గడపనైయున్న అనేక రోజులకు నమూనా మాత్రమే. రాజ్య సువార్తను ప్రకటిస్తూ, ప్రజల అక్కరలు తీరుస్తూ వుండటం మానవుల వ్యవహారాల్లో దేవునికి వున్న శ్రద్ధకు సాక్ష్యము. మనం నిష్ప్రయోజనమైన వాటిపైనే ఎంతో సమయం వృధాచేస్తూ వుంటాం. ఆయన ప్రతిక్షణం దేవుని మహిమ కోసమే వెచ్చించాడు. మన జీవితంలో శాశ్వత విలువ గలవి చాలా తక్కువ వుంటాయి. ప్రభువు చేసిన ప్రతి పనిలో, చెప్పిన ప్రతి మాటలో ప్రయోజకత్వము, శాశ్వతత్వము ఉన్నాయి. 10:32-37

ఆలోచించండి
10:32-37

## అన్యుల కంటే భిన్నమైన వారేమీ కాదు

**యెరూషలేముకు చివరి ప్రయాణంలో శిష్యులను అధికార జాడ్యం పట్టి పీడిస్తున్నట్టుంది. రానైయున్న రాజ్యంలో అధికార స్థానం కోసం యాకోబు యోహానులు పాచిక వేశారు (మార్కు 10:35-37).**

**యేసుప్రభువు వారిని ఆసక్తికరమైన రీతిలో మందలించాడు. వారు చీత్కరించుకొనే యూదేతర నాయకులు (10:42). అంటే పిలాతు, ఆగస్టస్, వారి గవర్నర్లు, సుంకం వసూలుదార్లు, సైనికులు, శతాధిపతులు మొదలైన వారితో వారిని పోల్చాడు ప్రభువు. శిష్యులు వారిని స్వార్థపరులు అని నిరసించారు. అయినా, శిష్యులు పదవుల కోసం ప్రాకులాడటం చూస్తే ఆ నాయకులకు వీరికి ఏమీ తేడా లేదని ప్రభువు చెప్పాడు. ఈ పోలిక వారి అంతరాంతరాలలోకి దూసుకుపోయి వుంటుంది. "మీరు అన్యులకంటే భిన్నమైన వారేమీ కాదు" అని ప్రభువు చెబుతున్నట్టుంది.**

# 4.తుఫానును నిమ్మళింపజేయుట (4:35-41)

మత్తయి 8:23-27; లూకా 8:22-25 కూడా చూడండి.

ఈ సందర్భంలో యేసు ప్రయాణంలో వున్నాడు. ఈ ప్రయాణంలో ఆయన నాలుగు అద్భుతాలు చేసినట్లు మార్కు చెబుతున్నాడు. వాటిలో ఇది మొదటిది. యేసుప్రభువు తుఫానును నిమ్మళింపజేశాడని చెప్పటం ద్వారా దేవుడు మాత్రమే చేయగలిగిన పనులను యేసు చేసినట్లు మార్కు చెబుతున్నాడు. ఇంతకుముందు చూచిన అద్భుతాలు రోగాలను బాగుచేసేవి కాగా, ఈ అద్భుతం మాత్రం ప్రకృతిని అదుపులో పెట్టేది.

### అద్దరికి పోవుదము (35వ)

అద్దరి అంటే సరస్సు ఆవలి ఒడ్డుకు. ప్రజల మధ్య అవిశ్రాంతంగా పనిచేసిన తరువాత కొంత విశ్రాంతి కోసం వెళ్లాలని తలంచాడు (1:35-39)

**పెను తుఫాను** (37వ) గలలీ సరస్సుకు ఇరువైపుల రెండు పర్వతాలున్నాయి. ఉత్తరపు గాలి బలంగా వీచినప్పుడు, దానికి తప్పించుకొనే మార్గం లేనందున, కొద్దిసేపు నీళ్లలో అలజడి రేపుతుంది. ముందస్తుగా ఎలాంటి సూచన లేకుండా తరచు ఇలా జరుగుతుంది. శిష్యులకు ఇది అలవాటే అయినా (జాలరులు గనుక), ఉవ్వెత్తున లేచిన అలలు సులభంగా పడవల్ని ముంచేస్తాయని వారికి తెలుసు. ఫలితంగా వాటిలో వున్నవారు మునిగిపోతారు. మనిషి దృష్టిలో పరిస్థితి చాలా విషమంగా కనిపిస్తుంది. యేసుప్రభువు మాత్రం అంత ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

### ఆయన నిద్రిస్తున్నాడు - 38వ

**1. నిద్ర:** అవును, ప్రభువు అలసిపోయి నిద్రపోతున్నాడు. ఆయన దేవుని కుమారుడే. అదే సమయంలో ఆయన అక్షరాలా మానవుడు. మనలాగే ఆయన అలసిపోతాడు.

**2. తలగడ :** ఇది వాస్తవంగా పడవ నడిపేవాడు క్రింద వేసుకొని కూర్చునే చర్మపు మెత్త. ఇంత చిన్న వివరాలు కూడా మార్కు చెప్పటం ఆసక్తికరం. ఆ పడవలో వున్న వ్యక్తి ఈ విషయమంతా చెప్పి వుంటాడు. ఆ వ్యక్తి పేతురు కనుక, మనం చదివేది ముమ్మాటికీ వాస్తవ గాథ అని గ్రహించాలి.

**3. బోధకుడా :** వారు ఆయన్ను "రబ్బీ" అనీ పిలవటం వాడుక (రబ్బీ అనగా "బోధకుడు" లేదా "యజమాని") ఎందుకంటే ఆయన దేవుడని వారు ఎరుగలేదు. ఆయన ఎవరో మనము ఎరుగుదుము. కనుక, ఆయన్ను "బోధకుడు" లేదా ''యజమాని'' అని పిలవక ''ప్రభువా'' అని సంబోధించటం సముచితం.

**4. మేము నశించిపోవుచున్నాము :** వారు మునిగిపోతామని భయపడి ఆయనకు ప్రార్థన చేశారు. మనము అసలు ప్రార్థించకుండా వుండడంకన్నా, భయపడినప్పుడైనా ప్రార్థన చేయటం మంచిది. అయితే భయపడినప్పుడు మాత్రమే ప్రార్థించేవారిలాగా మనము వుండకూడదు.

**5. నీకు చింతలేదా? :** వారు భయములో ఏం మాటలాడు తున్నారో వారికే అర్థం కానట్టుంది. యేసుప్రభువుకు వారిమీద ప్రేమ లేదని నిందమోపుతున్నారు. ఎంతమాట!

### <u>సైలెన్స్ ప్లీజ్</u>

"అంతట ఆయన లేచి గాలిని గద్దించి - నిశ్శబ్దమై ఊరకుండుమని సముద్రముతో చెప్పగా, గాలి అణిగి మిక్కిలి నిమ్మళమాయెను" (39). "యేసుప్రభువు మాటలే తుఫానును నిమ్మళింపజేశాయా?" కొందరు కుహనా పండితులు "కాదు" అని అంటారు. యేసుప్రభువు రోగుల్ని స్వస్థపరిచాడు కాని, తుఫానును ఆపలేదు అంటారు. ఆయన మాటలాడుతూ వుండగనే గాలి దానికై అదే నిమ్మళించింది అంటారు. యేసుప్రభువు ఏం చెయ్యగలడు, ఏం చెయ్యలేదో విశ్లేషించడం మన పనికాదు. ఆయన దేవుని శక్తి గలవాడు. సమస్త చరాచర జగత్తును సృష్టించిన దేవుడే, ఇప్పుడు కూడా జీవమును అనుగ్రహిస్తున్నాడు. రోగులను బాగు చేస్తాడు. కాని, గాలిని నిమ్మళింపచేయలేడు అని చెప్పడానికి మనమెవరం? అపవిత్రాత్మను వెళ్లగొట్టినప్పుడు "ఊర కుండుము" అని వినియోగించి పదమే ఇక్కడ కూడా వినియోగించాడు. మొరిగే కుక్కపిల్లను "ఏయ్ నోర్ముయ్" అన్నంత సులువుగా ఆయన తుఫానును గద్దించాడు. తక్షణమే ప్రకృతి శక్తులు తమ యజమానికి లోబడ్డాయి. తుఫాను నిమ్మళించింది. అదేరీతిగా నేడు కూడా ఆయన కలవరపడిన హృదయాలతో, తుఫాను రేగిన జీవితాలతో మాటలాడతాడు.

### భయమెందుకు ?

**1.** "మీరెందుకు భయపడుచున్నారు ? మీరింకను నమ్మికలేక యున్నారా?" (40వ) అని శిష్యులను ప్రశ్నించాడు ప్రభువు. దేవునిపై నమ్మకం వుంచితే భయపడరు అని ప్రభువు భావం.

భయ విముక్తులవటం ఏలాగో ఇక్కడ ప్రభువు చూపెడుతున్నాడు. శారీరక బాధ, ఒంటరితనం, ఇతరులు ద్వేషించటం, లేదా మరణం చాలామందికి భయం కలిగిస్తాయి. చాలా చెడు విషయాలన్నీ భయం మూలంగానే కలుగుతామి. యుద్ధాలకు మూలకారణం భయమే. చాలామంది జబ్బునపడటానికి కారణం కూడా భయమే. అయితే, దేవుడు మనల్ని ఎన్నడూ నిర్లక్ష్యం చెయ్యడు అనే సత్యం గుర్తిస్తే భయాన్ని సులభంగా జయిస్తాం (యెషయా 26:3; ద్వితీ 33:27; లూకా 12:7-12).

**2.** దేవుడిపై నమ్మకం పెట్టిన వ్యక్తి నీళ్లల్లో మునిగిపోడు. ప్రమాదంలో మరణించడు అని దీనర్థం కానేకాదు. మరణం తరువాత కూడా దేవుని సంరక్షణలోనే వుంటాడు. గనుక దేవుణ్ణి నమ్మిన వ్యక్తి మునిగిపోతానని, ప్రమాదంలో చనిపోతానని భయపడడు అని దీని అర్థం (కీర్తన 23:4,5 చూడండి).

**3.** యేసుప్రభువు ఎందుకు అంత ప్రశాంతంగా, నిర్భయంగా వున్నాడు. (1) తాను చనిపోతే దేవుని చేతుల్లో భద్రంగా వుంటానని ఆయనకు తెలుసు, (2) భూమిమీద తాను చేయవలసిన పని ఉన్నంతవరకు దేవుడు ఆయన్ను మరణించ నివ్వడు. "ఈయన ఎవరో, గాలియు, సముద్రమును ఈయనకు లోబడుచున్నవని ఒకనితో ఒకడు చెప్పుకొనిరి" (41వ). ఈ సందర్భంలో వారు మిక్కిలి భయపడినట్లు రాసివుంది. ఈ భయానికీ 40 వచనంలోని భయానికీ తేడా వుంది. ఇది ఆశ్చర్యంతో కూడిన భయం. ఒక గొప్ప అద్భుతం ఎదుట తమను తృణమాత్రులుగా భావించుకొనడం. ఈయన ఎవరో? అని వారు చెప్పుకున్నారు (6:50; 9:6; 10:32; 16:8; లూకా 5:8 కూడా చూడండి).

క్రైస్తవులలో ఇలాంటి భయం వుంటే ఇతర భయాల నుండి విముక్తులవుతారు. జాన్ కాల్విన్ అనే భక్తుణ్ణి గూర్చి ఈ మాట చెబుతారు. "ఆయన దేవుడంటే ఎంత భయపడే వాడంటే, మరిక దేనికీ భయపడేవాడు కాదు".

## మరియ లెంతమంది?

క్రొత్త నిబంధన చదువుతూ వుంటే మొదటి శతాబ్దపు పాలస్తీనాలో అనేకమంది మరియలున్నట్టు గమనిస్తాం. మరియ అనే పేరు ఆ రోజుల్లో సర్వసాధారణమైనదిగా వున్నది.

- యేసు తల్లి మరియ, ఊరు నజరేతు (లూకా 1:26; 2:52).
- మార్త లాజరుల సోదరి, బేతనియ మరియ (10:38-42; యోహాను 11)యేసు మరణానికి ముందు ఈమె ఆయనను అత్తరుతో అభిషేకించింది (యోహాను 12:3).
- యేసుకు ఆర్థికంగా తోడ్పడ్డ మగ్దల గ్రామానికి చెందిన మరియ (లూకా 8:2,3). ఈమెలో నుండి యేసు ఏడు దయ్యాలను వెళ్లగొట్టాడు. యేసు సిలువ మరణం ఈమె దగ్గరగా చూచింది. ఆయన పునరుత్థానానికి మొదటి సాక్షి (మార్కు 15:40; 16:9).
- యాకోబు యోసేపుల తల్లి మరియ. ఆమె యేసును సిలువ వేసినప్పుడు అక్కడే వున్నది. మరొక మరియగా పేర్కొన్నది ఈమె అయి వుంటుంది (మత్తయి 27:61; 28:1). క్లోపా భార్య మరియ కూడా ఈమే అయివుండవచ్చు (యోహాను 19:25).
- మార్కు తల్లి మరియ, బర్నబా బంధువు (అపో.కా. 12:12; కొలస్సీ 4:10).
- రోమ్ నగరానికి చెందిన మరియ. పౌలు, అతడి అనుచరులకోసం కష్టపడి పనిచేసిన స్త్రీ (రోమా 16:6).
- ఇంతమంది యూదు స్త్రీలకు మరియ అనే పేరు ఎందుకు పెట్టినట్టు? హెబ్రూలోని మిరియాం అనే పేరుకు గ్రీకుభాషా రూపమే మరియ. ఇశ్రాయేలు చరిత్రలో మిరియాం చాలా ప్రాముఖ్యమైన స్త్రీ.
- మిరియాం మోషే అక్క (సంఖ్యా 26:59); ఇశ్రాయేలులో మొట్టమొదటి ప్రవక్తి (నిర్గమ 15:20).
- ఇశ్రాయేలు జాతిని ఈజిప్ట్ నుండి వాగ్దాన భూమికి నడిపించడానికి దేవుడు ఎన్నుకొన్న బృందం ఆమె, ఆమె సోదరులు మోషే, అహరోను (మీకా 6:4).
- మిరియాం తన తమ్ముణ్ణి బాల్యంలో మరణం నుండి కాపాడటంలో గొప్ప తెగువ చూపింది (నిర్గమ 24-7).
- తరువాత ఇశ్రాయేలు ప్రజలు వెన్నంటి వస్తున్న ఫరో సైన్యాన్ని తప్పించుకొని, ఎర్ర సముద్రం దాటిన మీదట ప్రజలు ఉత్సవ ధ్వనిలోనూ స్తుతి చెల్లించుటలోను నడిపించింది (నిర్గమ 15:20,21).
- అయితే ఒక్క సందర్భంలో మాత్రం. ఆమె మోషేకు వ్యతిరేకంగా మాటలాడింది. ఫలితంగా దేవుని తీర్పుకు గురై, కుష్ఠురోగి అయ్యింది. ఏడు రోజులు శిబిరం వెలుపల వున్నది. తరువాత స్వస్థురాలై, సమాజంలో ప్రవేశించింది (సంఖ్యా 12:1-15).
- ఆమె వ్యాధితో వున్నప్పుడు, ఆమె తిరిగి వచ్చి స్తుతులతో నడిపించే దాకా ప్రజలంతా ఒకచోట చేరి సమిష్టిగా వున్నారు (సంఖ్యా 12:15).

# 5. సేన దయ్యాలను వెళ్ళగొట్టుట (5:1-20)

(మత్తయి 8:28-34; లూకా 8:26-29 కూడా చూడండి).

మత్తయి అయిదో అధ్యాయంలో అపవిత్రాత్మపైన, రోగాలపైన, మరణముపైన యేసుప్రభువు శక్తి వెల్లడి అవటం చూస్తాం. మొదట ఆయన్ను గెరాసేనుల దేశం లేదా గదర ప్రాంతంలో గలిలయ సరస్సు ఆవలి దిక్కున చూస్తాం.

యేసుప్రభువు తన శిష్యులతోపాటు గలిలయ సరస్సు దాటి నిషిద్ధ గదర ప్రాంతంలో ప్రవేశించారు. అక్కడ మిశ్రమ జాతులు నివసిస్తారు. వారిలో అనేకుల వృత్తి పందుల పెంపకం. శిష్ట యూదులకు ఆ వృత్తి అంటే పరమ అసహ్యం.

పడవ ఆగిన ఒడ్డుకు కాస్త ఎడంగా ఎత్తైన స్థలంలో శ్మశాన వాటిక వుంది. లేదా రాతితో తొలిచిన సమాధులు కొన్ని వున్నాయి. ఆ సమాధుల్లో అపవిత్రాత్మ ఆవహించిన ఒకడు నివసిస్తున్నాడు. వాడు దురాత్మల ప్రభావం వలన అదుపులేకుండా వున్నాడు. చాలా కాలంగా వాడు ఆ ప్రాంతమంతటినీ వణికిస్తున్నాడు. కొన్నిసార్లు పట్టుకొని, సంకెళ్లతో బంధించినా, అతడు మానవాతీత శక్తితో వాటిని సునాయాసంగా తెంపుకొనేవాడు. కనుక, వాడికి అడ్డు అదుపు లేకుండాపోయింది. రాత్రింబవళ్లు వాడు రాళ్లతో తనను తాను గాయపరచుకొంటూ, కొండలలో తిరుగాడుతూ చేసే భయంకర ధ్వనులు, వేసే కేకలు చాలా దూరం వినిపించేవి. సాతాను చెప్పుచేతల్లో వున్న వ్యక్తి భయంకర చిత్రపటమిది.

అయితే, వాడు త్వరలోనే స్వస్థతనిచ్చే యేసు శక్తిని అనుభవించబోతున్నాడు. వాడు దూరం నుండే యేసును చూచి, పరిగెత్తుకుంటూ వచ్చి, ఆయన ఎదుట సాష్టాంగపడి "యేసూ సర్వోన్నతుడైన దేవుని కుమారుడా, నాతో నీకేమి ? నన్ను బాధపరచకుమని దేవుని పేరట నీకు ఆనబెట్టుచున్నానని బిగ్గరగా కేకలు వేసెను" (7వ). అతడి పెదవులు కదిలినా వెలువడిన మాటలు మాత్రం దయ్యానివే, ఈ అపవిత్రాత్మలు యేసు ఎవరో వెంటనే గుర్తుపట్టాయి. ఆ మనిషిని విడిచి వెలుపలికి రమ్మని అంతకుముందే ప్రభువు అపవిత్రాత్మను గద్దించాడు. అప్పుడు పేరు చెప్పమని వాణ్ణి ఆజ్ఞాపించాడు. జవాబు ఆశ్చర్యకరమైంది. "నా పేరు సేన, ఏలయనగా మేము అనేకులం" ఒక్క అపవిత్రాత్మ కాదు. ఆ ప్రాంతాన్ని గడగడలాడించిన ఆ వ్యక్తిలో అనేక అపవిత్రాత్మలు నివసిస్తున్నాయి.

ఆ తరువాత ఒక విచిత్రమైన అభ్యర్థన వచ్చింది. దానికి ప్రభువు సమ్మతించడం మరీ విచిత్రంగా వుంది. దగ్గరలో మేత మేస్తున్న పందుల మందలోనికి పంపించమని అపవిత్రాత్మలు వేడుకొన్నాయి. ఎందుకంటే యూదులు పందులను అపవిత్రమైన జంతువులుగా పరిగణించేవారు. ఇంతకూ అపవిత్రాత్మలు కోరుతున్నదేమిటి ? ఆ ప్రాంతం విడిచిపెట్టడం కానీ, నిర్ణీత సమయం రాకముందే నాశనం చేయటం కాని వద్దు అంటున్నాయి. ఈ వివరాలు మనకు ఒక సత్యాన్ని వెల్లడిస్తున్నాయి. అదేమంటే దురాత్మలు వాటంతట అవి ఉనికి కలిగి వుండలేవు. అవి పరాన్నజీవులు అవి ఇతరులను ఆలంబన చేసికొని జీవిస్తాయి. వాటిని లోపలికి ఆహ్వానించకపోతే, నిలువ నీడలేక నశిస్తాయి. ఈ కథ మనకు నేర్పించేదేమంటే, చెడుగు స్వనాశకారి: దానికై అదే మనుగడ సాగించలేదు. మంచిపై పట్టు సాధించినంతవరకే దాని మనుగడ అన్నాడు ఒక భక్తుడు. చెడు అనేది మంచిమీద ఆధారపడి జీవించే విషతుల్యమైన పరాన్నజీవి. సాతాను పడిపోయిన మంచి దేవదూత. అయితే వాడు దేవుడిలాగా శాశ్వతకాలం వుండదు. వాడి నాశనం తథ్యం.

పందులు వడివడిగా పరుగెత్తుకొనిపోయి సముద్రంలోనికి దూకి, ఊపిరాడక చనిపోయాయి (13వ). ఇది యూదులకు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యతను వెల్లడించింది. అంతేకాదు ఆ దయ్యం పట్టిన వాడిమీద కూడా పీడిస్తున్న ఆ దురాత్మల పీడ శాశ్వతంగా విరగడైపోయింది.

విముక్తుడైన వ్యక్తి. మునుపు సంకెళ్లను కూడా తెంపుకొనేవాడు. ఇప్పుడు ప్రశాంతంగా, నెమ్మదిగా వున్నాడు. అంతకుముందు నగ్నంగా వున్నవాడు ఇప్పుడు బట్టలు కట్టుకున్నాడు. యేసుప్రభువు పాదాలచెంత ఆరాధన భావంతో కూర్చుని వున్నాడు. ఇక ఎంతమాత్రము పిచ్చివాడు కాదు. స్వస్థచిత్తుడై యున్నాడు. మానసిక స్వస్థత చేకూరింది. నెమ్మదిగా కూర్చుని వున్నాడు. ఎంతలో ఎంత మార్పు!

ఈ విషయం మంద కాపరులు వెళ్లి గ్రామంలో వున్న యజమానులకు తెలియజేశారు. జరిగింది చూడటానికి వారు స్వయంగా వచ్చారు. దయ్యం పట్టినవాడు స్వస్థత నొంది నందుకు సంతోషించటం మాని తమ ఆస్తియైన అపవిత్ర

జంతువులు నశించినందుకు కోపించారు. ఈ నష్టానికి కారణం యేసు అని గ్రహించి తమ ప్రాంతాలను వదలి వెళ్లమని యేసును బ్రతిమాలారు.

''దయ్యములు పట్టినవాడు ఆయనయొద్ద తనను వుండనిమ్మని బ్రతిమాలాడు'' (18వ). ఇంతకాలము భయంకరమైన బాధ, దాస్యము అనుభవించిన వ్యక్తి అద్భుత రీతిగా విముక్తుడైనందున కృతజ్ఞత నిండిన హృదయంతో సమస్తము వదలిపెట్టి, ఇతరులు చేసినట్లే యేసుప్రభువును వెంబడించాలని కోరాడు. అతడే చొరవ తీసుకొన్నాడు.

యేసు వానిని అనుమతి ఇవ్వక – "నీవు నీ ఇంటివారి యొద్దకు వెళ్లి, ప్రభువు నీయందు కనికరపడి, నీకు చేసిన కార్యములన్నియు వారికి తెలియజెప్పుమనెను" (10వ).

పన్నెండు మందిలోగాని, డెబ్భైమందిలోగాని, అతణ్ణి ఒకటిగా పరిగణించటం ప్రభువు చిత్తం కాదు. అతడి సేవాపరిధి అతడు బాగా పరిచయం వున్న స్థలంలోనే, అతడు దూరం ప్రయాణం చేయటం కంటే అక్కడే సాక్ష్యం చెప్పటం చాలా ముఖ్యం.

అతడు వెళ్లి దెకపొలి (పది పట్టణాలు) ప్రాంతమంతా యేసుప్రభువు తనకు చేసిన కార్యములు ప్రకటించాడు. దెకపొలి అనేవి గలిలయకు తూర్పు తీరంలో వున్న గ్రామాలు. యేసుప్రభువును ఎవరైతే తమ ప్రాంతం వదలి వెళ్లమని బ్రతిమాలారో, అదే గ్రామాలకు ఇతడు వెళ్లాడు. ఇతడి సాక్ష్యం ద్వారా మరల యేసు ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు ప్రజల వైఖరిలో మార్పు చోటుచేసుకుంది. ఆయనను సాదరంగా ఆహ్వానించారు.

## యోహాను : అరణ్యంలో కేకవేయు ఒక స్వరం

**నాలుగు సువార్తలూ యోహానును అరణ్య బోధకుడిగా పరిచయం చేస్తున్నాయి (మత్తయి 3:1; మార్కు 1:4; లూకా 3:2; యోహాను 1:23). ఆ రోజుల్లోనే ఆయన ఒక విచిత్రమైన వ్యక్తిగా కనిపించి వుండవచ్చు. ఆయన కాపురం అడవిలో, ఆహారం మిడతలు, అడవి తేనె. ఆయన నమ్రత కూడా చాలా అతిగా వుందేమో అనిపిస్తుంది. ఉదా, "ఆయన (యేసు) హెచ్చాలి, నేను తగ్గాలి" అని ఆయన చేసిన ప్రకటన (1యోహాను 3:30). అంతేకాదు ఆయన చెప్పుల వారు విప్పడానికి కూడా తాను తగనని చెప్పడం (మార్కు 1:27).**

అయితే యోహానులో అందరికీ నచ్చిన ప్రధానాంశం ప్రజలందరినీ మారుమనస్సు పొందమని నిర్భయంగా ప్రకటించడం. ప్రజలంతా ఆయన సందేశం శ్రద్ధగా విన్నారు. యూదయ ప్రాంతమంతటి నుండి, ముఖ్యంగా యెరూషలేము నగరం నుంచి ప్రజలు తండోపతండాలుగా ఆయన సందేశం వినడానికి వచ్చారు. మరో విశేషమేమంటే, సాధారణ ప్రజానీకంతోబాటు మత నాయకులు, సామాజికంగా ఉన్నత స్థాయిలో వున్నవారు, రోమన్ సైనికులలాంటి యూదేతరులు కూడా ఆయనపట్ల ఆకర్షితులయ్యారు. ఇంతకూ వీరిని అంతగా ఆకర్శించిన ఆయన సందేశమేమిటి? "సర్ప సంతానమా, రాబోవు ఉగ్రతను తప్పించుకొమ్మని మీకు బుద్ధి చెప్పిన వారెవ్వరు !" (లూకా 3:7).

అందరూ ఊహించినట్లే ఒక వ్యక్తి ఉగ్రత అతనిపై రగులుకుంది. ఆ వ్యక్తి మరెవరో కాదు హేరోదు రాజు భార్య హేరోదియ. రాజదంపతుల అక్రమ వివాహాన్ని యోహాను తీవ్రంగా ఖండించాడు. దీనితో కోపోద్రిక్తురాలైన హేరోదియ తన భర్తపై వత్తిడి తెచ్చి ప్రవక్తను నిర్బంధించి మరణశిక్ష విధించేలా చేసింది. అయితే, నీతిమంతుడు, పవిత్రుడు అయిన వ్యక్తిని చంపడానికి మొదట హేరోదు వెనకాడాడు. కాని, తన కపట వ్యూహం నెగ్గించుకోవటం ఎలాగో హేరోదియకు బాగా తెలుసు. ఎలాగైతేనేం తన దుష్ట కోరికను చివరకు నెరవేర్చుకుంది (మార్కు 6:14–29).

యోహాను మరణించినా ఆయన ప్రభావం కొనసాగుతూనే వున్నది. ఆయన శిష్యులలో అనేకులు యేసుప్రభువు శిష్యులైపోయారు (ఉదా : అంద్రెయ 1:35–40). దాదాపు 30ఏళ్ల తరువాత పౌలు ఎఫెసు నగరానికి బోధించడానికి రాగా, అక్కడ ఆయనకు యోహాను శిష్యులు తటస్థపడ్డారు (అపొ.కా. 19:17).

పాత నిబంధన ప్రవక్తలలో చిట్టచివరివాడైన యోహానును మనుషులందరిలోకి గొప్పవాడని యేసుప్రభువు అభివర్ణించాడు (మత్తయి 11:11–14). ఆయన ఎందుకు వచ్చాడో ఆ పని ముగించాడు. అదే యేసుకు మార్గం సుగమం చేయటం.

# 6.పక్షవాత రోగిని స్వస్థపరచుట (2:1-12)

(మత్తయి 9:1-8; లూకా 5:17-26 కూడా చదవండి)

ప్రభువు గలిలయలో ప్రారంభించిన కృపా పరిచర్య కొనసాగుతూ వున్నది. ఈ భాగంలోని సంఘటనలు దాని వెనువెంట చోటు చేసుకున్నవే. కపెర్నహూము కేంద్రంగా చేసుకొని గలిలయలోని ఇతర ప్రాంతాలలో ప్రభువు పనిచేస్తున్నాడు. బహుశా అది క్రీ.శ. 28 వేసవి ప్రారంభం అయి వుండవచ్చు.

"ఆయన ఇంట వున్నాడని వినవచ్చింది" (2వ). యేసు ప్రభువు ఏ స్థలంలో వున్నా ఆ వార్త దానంతట అదే వ్యాపించేది. ఈ సందర్భంలో ఆయన తన నివాసంగా చేసికొన్న పట్టణంలోని ఇంటిలో వున్నాడని ప్రజలు తెలుసు కున్నారు.

"ఆయన వారికి వాక్యము బోధించాడు." ఇంటినిండా ప్రజలే, వెలుపల కూడా ప్రజలే వారికి ఆయన దేవుని రాజ్య వార్త ప్రకటించాడు. ఆ పరిచర్య జరిగించిన మూడున్నర ఏండ్ల కాలంలో ఆయన రోగుల్ని బాగుచేసినప్పటికీ, అది ఆయన ప్రథమ కర్తవ్యం కాదు. దేవుని వాక్యం ప్రకటించడమే ఆయన ప్రాధాన్యం. భౌతిక రోగాలను స్వస్థపరచడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వలేదు. నాటికీ నేటికీ ప్రజల వైఖరిలో మార్పులేదు. భౌతిక రుగ్మత కంటే ఆత్మ రుగ్మత ఎంతో తీవ్రమైనది. శారీరక అస్వస్థతల నుండి ప్రజల్ని విడిపించడం కంటే జీవితాల్ని మార్చే సందేశం అందించటం అత్యంత ప్రాముఖ్యం కదా !

"పక్షవాయువు గల ఒకనిని నలుగురు మోసికొని వచ్చిరి" (3వ). ఈ దిక్కుమాలిన, నిస్సహాయ పక్షవాత రోగి ఇతరుల సాయం లేకుండా యేసుప్రభువు దగ్గరకు రావటం చేతకాలేదు. అయితే అతడికి నలుగురు స్నేహితులు వున్నారు. తమ స్నేహితుడి చచ్చుబడ్డ అవయవాలను ప్రభువు పునరుజ్జీవింప జేయగలడు అని దృఢంగా నమ్మారు.

"ఆయన ఉన్న చోటికి పైగా కప్పు విప్పి, సందు చేసి పక్షవాయువు గలవానిని పరుపుతోనే దింపిరి" (4వ). ద్వారం దగ్గర ప్రజలు కిటకిటలాడుతున్నారు. లోపల ప్రవేశించటం బొత్తిగా వీలు కాలేదు. అయినా వారు తమ ప్రయత్నం విరమించుకోలేదు. ఎలాగైనా, రోగిని అద్భుతాలు జరిగించే, దయగల రక్షకుడి దగ్గరకు చేర్చాలి. అతణ్ణి వెలుపలి నుండి మిద్దె మీదికి వున్న మెట్లమీదుగా పైకి తీసుకొని వెళ్లి రోగి మంచాన్ని సరిగ్గా ప్రభువు ఎదుట దింపారు. ఇశ్రాయేలు దేశంలో మన దేశంలోలాగే పూర్వం మిద్దెలు వుండేవి. పైన దంతెలు పరచి, దానిపై ఎండబెట్టిన మట్టిని పరిచేవారు. వీరు ఎంత శ్రమ తీసుకున్నారో చూడండి. మట్టి తవ్వి, దంతెలు కోసి, ఆ మీదట రోగిని క్రిందికి దింపారు. ఆ విధంగా రోగిని యేసు పాదాల దగ్గర పైనుండి దించుతూ వుంటే కలకలం రేగి వుంటుందనుకుంటాను. ఇన్ని వివరాలు మార్కుకు ఎలా తెలిసివుంటాయి ? పేతురు స్వయంగా చెప్పి వుంటాడు గనుక తెలిసి వుంటాయి. ఎందుకంటే ఇల్లు మరెవరిదో కాదు పేతురుదే!

"యేసు వారి విశ్వాసమును చూచి" విశ్వాసం క్రియలలో వ్యక్తమవుతుంది. వారు పట్టువదలక, తమ శక్తినంతా వినియోగించడంలో వారి విశ్వాసం స్పష్టంగా చూడగలం. అందువలన ప్రభువు అద్భుతం చేయడానికి సిద్ధపడ్డాడు. పక్షవాత రోగికి శారీరక స్వస్థతకంటే మించినది పాప క్షమాపణ అవసరమని ప్రభువు గుర్తించి "కుమారుడా, నీ పాపములు క్షమించబడి యున్నవని పక్షవాయువు గలవానితో చెప్పాడు" (5వ). ఈ నాటకీయ పరిణామం ప్రజల్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఎందుకంటే ఎప్పుడైనా ఏ మనిషీ ఆ మాట చెప్పటం వారు విననే లేదు.

పక్షవాత రోగి అక్షరాలా "బలహీనుడు" (రోమా 5:6). ఈ వ్యక్తి లోకంలోని పాపులందరికీ ప్రతినిధిగా ఉన్నాడు. యేసు ప్రభువు పలికిన మాట అతడి చచ్చుబడిపోయిన అవయవాల్లోని జవజీవాలు తెచ్చాయి. అదేరీతిగా ఈ రోజున విశ్వాసంతో యేసుప్రభువు మాటలు స్వీకరించే వారికి జీవము లభిస్తుంది.

ఆ నిస్సహాయ వ్యక్తి స్నేహితులు నలుగురూ క్రియల ద్వారా తమ విశ్వాసాన్ని వెల్లడించారు. రోగంతో వున్న తమ స్నేహితుడికి యేసుప్రభువు అక్కర గుర్తించి, అతణ్ణి ఆయన దగ్గరకు తీసుకొనిపోవడానికి ఎలాంటి అవాంతరాలైనా ఎదుర్కోవడానికి సిద్ధపడ్డారు. రక్షణ పొందని మన స్నేహితుల్ని రక్షకుడి దగ్గరకు తీసుకురావడానికి అంత శ్రద్ధ చూపు

తున్నామా ? విశ్వాసం ఎప్పుడూ దేవుణ్ణి మహిమపరుస్తుంది గనుక, ఆ నలుగురు వ్యక్తుల విశ్వాసం చూచి ప్రభువు సంతోషించాడు. చిత్తశుద్ధితో తనను వెదికే వారిలోని విశ్వాసాన్ని ఆయన గుర్తిస్తాడు. వారి హృదయ వాంఛలు తీరుస్తాడు. "శాస్త్రులు కొందరు ... తమ హృదయములలో ఆలోచించుకొనిరి" (7వ). వీరు సనాతన వాదులు. దేవుని కృపను ఎరగనే ఎరగరు. యేసు తాను దేవుని కుమారుణ్ణి అంటే వారు నిరాకరించారు. అదేమిటో వివరంగా తెలుసు కోడానికి లేఖనాలను పరిశోధించారు. వారిలో వారు తర్జన భర్జన పడుతున్నారు. ద్వేషంతో నిండిపోయి, యేసును నమ్మటం ససేమిరా ఇష్టం లేక, వెంటనే సమస్యను యేసు దగ్గర లేవనెత్తారు. "దేవుడొక్కడే తప్ప పాపములు క్షమింపగల వాడెవడు?" ఎవరైనా పాపాలు క్షమించే అధికారం వున్నదని చెప్పుకుంటే వారి దృష్టిలో అంతకు మించిన దేవదూషణ మరొకటి లేదు. ఆ పని దేవుడు మాత్రమే చేయగలడని వారికి బాగా తెలుసు. అయితే వారి మధ్య వున్నది శరీరధారియైన దేవుడు అని వారు గుర్తించలేకపోయారు.

"వారు తమలో తాము ఈలాగున ఆలోచించుకొనుట యేసు వెంటనే తన ఆత్మలో తెలుసుకొన్నాడు" (8వ). ఆయన మాటలపట్ల తమ అభ్యంతరాన్ని, కోపాన్ని వారు బిగ్గరగా వ్యక్తం చెయ్యలేదు. అయితే యేసుకు వారి ఆలోచనలు తెలుసు (కీర్తన 94:11). వారికి తగ్గట్టే ఆయన జవాబిచ్చాడు. "మీరిలాంటి సంగతులు మీ హృదయములో ఎందుకు ఆలోచించుకొనుచున్నారు ?" అని ప్రభువు ప్రశ్నించారు. వారి అంతరంగములోని ఆలోచనల రహస్యాన్ని పసిగట్టగలగడం దేవుడి మరో లక్షణం. దేవుడు మాత్రమే తలంపుల పుట్టుకకు ముందే వాటిని తెలుసుకోగలడు (కీర్తన 139:2).

వారి విషయానికే వస్తే, పాపాలను క్షమించటం అటుంచితే రోగాలను కూడా బాగు చెయ్యలేదు. యేసుప్రభువు రెండూ చెయ్యగలడు. ఆయన అత్యంత ప్రాముఖ్యమైన దాన్ని వెంటనే మొదట చేశాడు.

"పాపములు క్షమించుటకు భూమి మీద మనుష్య కుమారుని అధికారం కలదని వారు తెలుసుకోవాలని" చెప్పాడు (10వ) పాపము, దాని పరిణామాల నుండి విడిపించడంలో తన అధికారం వెల్లడించడానికి ఆయన అద్భుతం చేశాడు.

"లేచి, నీ పరుపెత్తుకొని, ఇంటికి పొమ్ము" (11వ). ప్రభువు నిస్సహాయుడైన పక్షవాత రోగివైపు మళ్లి, లేచి పరుపెత్తుకొని ఇంటికి వెళ్లమని ఆజ్ఞాపించాడు. ఆయన మాటలో శక్తి వుంది. ఆయన మాటలాడుతూ వుండగానే, నిర్వీర్యమైన అతడి అవయవాలలోకి శక్తి వచ్చింది. చుట్టూవున్న ప్రజలు ఆశ్చర్యపోతూ వుండగా అతడు లేచి నడిచాడు. "వారు దేవున్ని మహిమపరిచారు" (12వ). అందుకు ముందు తమ కళ్లెదుట పక్షవాత రోగిగా వున్న వ్యక్తి, ఇప్పుడు యేసు ఆజ్ఞమేర తన పరుపెత్తుకొని, నడుచుకుంటూ తన ఇంటికి వెళ్లడం కళ్లారా చూచారు. తమ మధ్య దేవుని శక్తి పని చేస్తుందని ప్రజలు గ్రహించి, దేవుడు తన సేవకుడు యేసుద్వారా అంత గొప్ప అద్భుతకార్యాలు చేస్తున్నందుకు దేవుని మహిమపరచారు. "మనమీలాంటి కార్యములు ఎన్నడును చూడలేదని" ప్రజలు ఆశ్చర్యంతో చెప్పుకోవడాన్ని బట్టి దేవుడు వాగ్దానం చేసిన మెస్సీయా ఆయనే అయి వుండవచ్చని అనేకులు భావించి వుండవచ్చు. దేవుని కృప, శక్తి నూతనంగా వెల్లడించటం జరిగింది.

తెలుసుకుందాం
1:16

**వ్యక్తి చిత్రణ :**

## సీమోను పేతురు

**మరో పేరు :** సీమోను (అసలు పేరు). కేఫా (అరామిక్) పేతురు (గ్రీకు) క్రీస్తు పెట్టిన పేరు రాయి.

**స్వస్థలం :** గలిలయ సముద్రం ఉత్తర తీరంలోని బేత్సయిదా, కపెర్నహోములు.

**కుటుంబం :** తండ్రి యోనా. కనిష్ట సోదరుడు అంద్రెయ. పేతురు వివాహితుడు. యేసుప్రభువును ప్రకటిస్తూ సంచరిస్తూ వుండగా భార్య కూడా అతడితో ప్రయాణం చేసింది.

**వృత్తి :** జాలరి, తరువాత యేసు ప్రభువు మొదటి ప్రతినిధి

**ఈ రోజు మనకు గుర్తుండే అంశాలు :** యేసే క్రీస్తు అని చేసిన ప్రకటన; యేసును ఎరగనని బొంకుట.

# 7. యాయీరు కుమార్తెను బ్రతికించుట 5:21-24

(మత్తయి 8:18; లూకా 8:40-42 కూడా చూడండి).

గదర ప్రాంతం నుండి ప్రభువు తన శిష్యులను వెంటబెట్టుకొని కపెర్నహోముకు వెళ్లాడు. అక్కడ ఆయన కొరకు అనేకులు కనిపెడుతూ వున్నారు. ఈ కథనం 25 వచనం దగ్గర ఆగిపోయి, మరల 35 నుండి ప్రారంభమవుతుంది. మధ్యలో రక్తస్రావరోగి గాథ వుంది.

"ఆయన సముద్ర తీరమున వుండగా సమాజమందిరపు అధికారులలో యాయీరు అను ఒకడు వచ్చి, ఆయన పాదముల మీద పడెను" (22వ). ఈ యాయీరు యాజకుడు కాదు, సమాజమందిరానికి సంబంధించిన కార్యనిర్వాహక సభ్యుడు. ఆవిధంగా చూస్తే అతడు కపెర్నహోములో ప్రముఖుడు. యేసు వ్యతిరేకిస్తున్న గుంపుకు చెందినవాడు. అయితే ఆయన పాదములమీద పడి సాయంకోసం ప్రాధేయపడుతున్నాడు.

ఇంతకూ, అతడు యేసు దగ్గరకు ఎందుకు వెళ్లినట్టు? మొదటిది, అతడి సమస్య. దేవుడంటే లెక్కలేని వారు గొప్ప ప్రమాదంలో వున్నప్పుడు, దేవుడికి ప్రార్థనలు చేస్తారు. అయితే, ఆయన వారికి అపన్న హస్తం అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా వున్నట్లు గ్రహిస్తారు. రెండవదిగా, అతడి కుమార్తె. అతడు తన కుమార్తెను అధికంగా ప్రేమిస్తున్నందున యేసుప్రభువు దగ్గరకు వచ్చాడు (23వ). చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రేమిస్తున్నారు, వారికొక మంచి ఆదర్శం చూపాలనే తలంపుతో ప్రార్థనలో ప్రభువును సమీపిస్తుంటారు.

**"ఆయన అతనితో కూడ వెళ్లెను" (24వ).**

1. చనిపోతున్న ఆ అమ్మాయి ఇంటికి వెళ్తున్నాడంటే పరలోక తండ్రి శక్తిమీద యేసుకు అచంచల విశ్వాసం వుండి వుండాలి.

2. ఆయన తన ప్రణాళికలను కాసేపు ప్రక్కన పెట్టాడు. ఆయన బోధనలు వినటానికి వచ్చిన ప్రజల్ని వదలి కొద్దిసేపు వెళ్లాడు. కొన్నిసార్లు మనము ఏదో ప్రణాళికలు వేసికొని వుంటాం. అయితే, ప్రభువు ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్లాలి.

3. వారు తన పనికి ఆటంకం కలగజేయ చూస్తున్నా, వారి నాయకులలో ఒకరికి ఆయన సాయం చేయబోతున్నాడు (రోమా 12:21; 1పేతురు 3:8,9 చూడండి).

వాస్తవంగా, ప్రభువు ప్రయాణంలో వుండగా చేసిన నాలుగు అద్భుతాలలో ఇది చివరిది. రక్తస్రావ రోగిని స్వస్థపరుస్తూ వుండగా యాయీరు ప్రభువును కలుసుకొనే అవకాశం కోసం కనిపెడుతున్నాడు. అంతలో ఎవరో వచ్చి యాయీరుతో తన కూతురు చనిపోయిందని చెప్పటం ప్రభువు విన్నాడు. అయితే యేసు, యాయీరు కలసి వెళ్లారు. ప్రభువు సమూహాన్ని పంపించి వేసిన తరువాత, యేసు ఆ బాలిక చెయ్యి పట్టుకున్నాడు. అంతే. చప్పున ఆమె లేచి కూర్చుంది. రణగొణ ధ్వనులు, భయం చోటుచేసుకొన్న స్థలంలో ప్రశాంతత, ఆనందం కలుగజేయటం ఈ కథలో గమనిస్తాము.

**"బోధకుని శ్రమపెట్టుట ఎందుకు ... ? (35వ)**

యేసు భూమిమీదికి వచ్చింది రక్షించడానికే. ఎవరైనా ఆక్రందన చేస్తే ఆదుకోవడానికి సిద్ధంగా వుంటాడని వారికి తెలియదు. మనమెల్లప్పుడూ మన మనవుల్ని తనకు తెలియజెయ్యాలనేదే దేవుడి కోరిక (ఫిలిప్పీ 4:6; లూకా 11:5-10 చూడండి).

**భయపడకుము నమ్మిక మాత్రముంచుము (36వ)**

"నమ్మిక" వుంచడమంటే, "దేవునియందు విశ్వాసముంచుట. ఎందుకంటే నీవు భయపడే చెడువాటికంటే దేవుడు ఎంతో శక్తిమంతుడు". ఏదైనా క్రైస్తవ సంఘం తరిగిపోతూ వున్నా, దుర్మార్గులు నిక్షేపంగా జీవిస్తున్నా లేక స్నేహితులు చాలా కాలంగా రోగంతో మంచం పట్టి వున్నా ఈ మాటలు మనకు గొప్ప ప్రోత్సాహం కావాలి. ఎందుకంటే మన భయాలు ప్రభువు పారద్రోలుతాడు.

**పేతురు, యాకోబు, యోహాను (37వ)**

ఈ ముగ్గురిని ఒంటరిగా ప్రభువు వెంటబెట్టుకొని వెళ్లడం ఇదే ప్రథమం. మిగతా శిష్యులకంటే వీరి విశ్వాసం కాస్త పటిష్టమైనది కాబోలు. అందుకే వీరిని ఎంపిక చేసుకున్నాడు (9:2; 14:33 చూడండి). ప్రజలు గొల్లు గొల్లున ఏడ్చుచు, ప్రలాపించుట (38వ). వీరంతా కుటుంబ సభ్యులు, స్నేహితులు, కిరాయికి వచ్చిన వారు అయి వుంటారు.

ఈ విధంగా ఏడ్వడం మంచిది కాదని ప్రభువు భావించి వుంటాడా ? అని కొందరు ప్రశ్నిస్తారు. ఆ బాలిక కోలుకోవడానికి వారి రణగొణ ధ్వని అడ్డుగా వుండవచ్చని ప్రభువు

వారి గోలను ఆపి వుండవచ్చు. లేదా కొందరు తప్పుడు కారణాలను బట్టి కూడా ఏడుస్తూ వుండవచ్చు.

1. ఎవరైనా తమ బంధువులను, ఆప్తులను కోల్పోయినప్పుడు ఇతరులలాగే క్రైస్తవులు కూడా బాధపడతారు. లాజరు చనిపోయినప్పుడు యేసుప్రభువు కూడా విలపించాడు.

2. ఇరుగుపొరుగు వారు వచ్చి సానుభూతి తెలియజేయటం సహజమే.

3. అయితే, కొన్నిసార్లు ప్రజలు ఏడ్చి, గగ్గోలు పెట్టినప్పుడు ఒక విషయం మరచిపోతూవుంటారు. మన దేవుడు ప్రేమామయుడు, చనిపోయిన వ్యక్తినీ, బ్రతికి వున్నవారి విషయం కూడా ఆయన చూసుకుంటాడని వారు మరచిపోతారు.

"చిన్నది నిద్రించుచున్నదే గాని, చనిపోలేదు" (39వ). ఆ బాలిక నిజంగా చనిపోయిందా ? లేక అపస్మారక స్థితిలో వుందా ? యేసుప్రభువు యొక్క గొప్ప శక్తిని వెల్లడించడానికి మార్కు ఈ సంఘటన రాసి వుంటాడు. ఆయన మరణించిన వారిని సహా లేప శక్తి గలవాడని చూపటం ఆయన ముఖ్య ఉద్దేశం. ఆ బాలిక నిజంగా చనిపోయింది అనటానికి కొన్ని కారణాలు.

(1) ప్రజల దుఃఖము

(2) 35 వచనంలోని మాటలు

(3) ఆమె లేచినప్పుడు ప్రజలు గొప్ప ఆశ్చర్యానికి లోనుకావటం. ఒక వ్యక్తి మరణించినప్పుడు ఆనందమయ స్థితి నుండి శాశ్వతంగా షియోల్ అనబడే చీకటి స్థలంలోకి వెళ్లారని యూదుల నమ్మకం. కనుక, ఇక్కడ యేసుప్రభువు నేర్పిస్తున్నదేమంటే మరణమంటే కేవలం నిద్రమాత్రమే. మేలుకోవటం వుంటుంది (1థెస్స 4:13,14). అందుకే క్రైస్తవులు మృతులను పాతిపెట్టే స్థలానికి గ్రీకు భాషలో నిద్రించే స్థలము అనే అర్థముంది.

"వారు ఆయనను అపహసించిరి" (40వ) అంతకు ముందు ప్రజలు ఆయనను మతి చలించిన వాడని నిందించారు (3:21). ఈ సమయంలో అందరూ ఆశ వదులు కొంటే, ఆయనేమో సంపూర్ణమైన ఆశాభావంతో వున్నాడు. చాలాసార్లు ఇలా జరుగుతూ వుంటుంది. రోగుల కొరకు ప్రార్థన చేస్తే 'మంత్రాలకు చింతకాయలు రాలతాయా' అంటూ హేళన చేసేవారు లేకపోలేదు. యేసుప్రభువు వారి అపహాస్యాన్ని పట్టించుకున్నాడా? ? ఆయన దానికి ఏ విధంగా భయపడలేదని చెప్పొచ్చు.

## "వారందరినీ బయటికి పంపివేశాడు"

సమూహాల మధ్య కూడా యేసుప్రభువు అద్భుతాలు చేయగలడని 25-34 వచనాలను బట్టి తెలుసుకుంటాం. అయితే, ఈ సందర్భంలో మాత్రం గొల్లుచేసేవారు. తనపై నమ్మకం లేనివారు అవరోధంగా వున్నట్టు భావించాడు. ఆయన వారిని వెలుపల వుంచి, ఈ కుటుంబానికి నెమ్మదిని, విశ్వాసాన్ని అందించగల కొంతమందిని తనతో లోపల వుంచుకున్నాడు.

"తలీ తాకుమీ.. చిన్నదానా, లెమ్ము" (41వ). సువార్త లన్నీ దాదాపు గ్రీకు భాషలో వున్నాయి. అయితే ఈ రెండు పదాలు మాత్రం అరామిక్ భాషలోనివి. యేసుప్రభువు కూడా మాటలాడిన నాటి వ్యావహారిక భాష అదే.

**చిన్నదానా,** ఆ బాలికను యేసు "చిన్నదానా" లేదా "చిన్న గొర్రెపిల్ల" అని సంబోధించాడు. (తలిత అంటే గొర్రెపిల్ల). శిష్యులు ఆశ్చర్యపోతున్నారు. ఎందుకంటే జనసమూహాలను వదిలేసి చిన్నపిల్లతో తన స్వంత కూతురులాగా మాటలాడు తున్నాడు. ఈ బాలిక ఆమె తండ్రికి చాలా ప్రియమైనదైనా, సాధారణంగా బాలికలకు అంత ప్రాధాన్యం ఇవ్వరు. అయితే, యేసుప్రభువుకు అందరిలాగే వారు కూడా చాలా ప్రాముఖ్య మైనవారే.

1886 ప్రాంతంలో ఇంగ్లండ్‌లో జరిగిన సంగతి, ఏడేళ్ల బాలికల్ని బొగ్గుగనుల్లో 18 గంటలు పనిచేయించేవారు. కొందరిని వేశ్యావృత్తిలోకి అమ్మేసేవారు. మరికొందరితో కర్మాగారాల్లో వెట్టి చాకిరీ చేయించినందుకు వారు శారీరకంగా ఎదిగేవారు కాదు. జోసెఫిన్ బట్లర్ అనే ఆమె బ్రిటీష్ పార్లమెంటుపై వత్తిడి తెచ్చి ఈ బాలికల్ని రక్షించే శాసనం తెచ్చింది. ఇదంతా ఆమె యేసుప్రభువు నామంలో చేసింది.

"ఆమెకు ఆహారం పెట్టండి" (43వ)

ప్రభువు చనిపోయిన ఆ బాలికను లేపి, తరువాత చిన్న విషయమని ఆహారం పెట్టే విషయం విస్మరించలేదు. అదేరీతిగా గొప్ప గొప్ప నక్షత్రాలను సృష్టించిన దేవుడు మన జీవితంలోని చిన్న విషయాన్ని కూడా మరచిపోడు. ఉదా: ఏమి తింటామో, ఎక్కడ వుంటామో, ఎవర్ని పెళ్లి చేసుకుంటామో మొదలైనవి.

ఆలోచించండి
10:17-27

# అతడికి అన్నీ వున్నాయి ... కాని

అతడు యువకుడు, సంస్కారవంతుడు, విద్యావంతుడు, ఆస్తిపాస్తులున్నవాడు. అంతేకాదు నిజాయతీపరుడు, చిత్తశుద్ధి గలవాడు. అన్నిటికంటే మించి మచ్చలేనివాడు. అతడిలో ఇతరుల్ని ఇట్టే ఆకర్షించే శక్తీ, ముఖంలో చిరునవ్వు కూడా వుండి వుండవచ్చు. యేసుప్రభువుకు అతడిపై సదభిప్రాయమే కలిగి వుంటుందనుకోవాలి. ఎందుకంటే అతణ్ణి తన బృందంలో చేర్చుకోజూచాడు (మార్కు 10:21). అతడికి అన్నీ వున్నాయి కాని ఒక్కటే తక్కువ - అదే నిత్యజీవం. కావాలనుకుంటే అది కూడా సంపాదించుకోగలిగేవాడే. అతడు చేయవలసిందల్లా డబ్బును వదలుకొని, యేసును వెంబడించడమే.

అయితే అలా జరగలేదు. మరోచోట యేసుప్రభువు ఎవరూ సిరికీ, దేవునికి దాసులు కాలేరు అని చెప్పాడు (మత్తయి 6:24). ఇక్కడ ఆ సూత్రానికి సజీవ నిదర్శనం చూస్తున్నాం. యేసుప్రభువు దగ్గరకు రావడంతో ఆ యువకుడు జీవితమార్గంలో ఒక కూడలి స్థానానికి వచ్చినట్లయింది. ఇప్పుడతడు దేనిని, ఎవరిని సేవిస్తాడో - డబ్బునా, యేసునా - తేల్చుకోవలసి వుంది. విషయమేమంటే అతడు డబ్బునే ఎంపిక చేసుకున్నాడు.

ధనవంతుల్ని యేసుప్రభువు ఎన్నడూ ఖండించలేదు. డబ్బు కూడబెట్టుకోవడం, ధనవంతులు కావటం లేఖనాలు కూడా ఖండించటం లేదు. అంతే యేసుప్రభువు "ధన మోసాన్ని" (మార్కు 4:19). గూర్చి ప్రజల్ని హెచ్చరించాడు. డబ్బు యొక్క శక్తిని ఆయన గ్రహించాడు అయితే అది చివరికి దేవుడికి స్థానం ఆక్రమించుకునే ప్రమాదం వుందని ఆయనకు తెలుసు.

ఈ యువ అధికారిలో అలాంటి వైఖరిని యేసు పసిగట్టాడు. అతడు తన డబ్బుకు చాలా ఎక్కువ విలువ ఇస్తున్నాడు. అందుకే యేసుప్రభువు దాన్ని వదిలించుకోమని అతడితో చెప్పాడు. ఆ బంధకాల నుండి బయటపడమని చెప్పాడు. యేసుప్రభువుకు తారసపడ్డ ప్రతి ధనవంతుడితోనూ ఈ సలహా చెప్పలేదనేది గమనించాలి. ఈ యువకుడికి అది అవసరమైంది.

ఈ రోజున మనమధ్య అనేకమంది సంపన్న యువత వున్నారు. వారిలో కొంతమంది ఇప్పటికే ఆస్తికర్తలై వుండగా, కొందరు ఆ పరిణామ క్రమంలో వున్నారు. వీరిలో కొందరు క్రైస్తవులు, మరికొందరు కారు. అయితే ఆ యువకుడు యేసును అడిగిన ప్రశ్నకు వీరంతా జవాబు చెప్పాల్సి వున్నది. "నిత్య జీవమునకు వారసుడగుటకు నేనేం చెయ్యాలి ?" (మార్కు 10:17).

యేసుప్రభువు అప్పటికీ ఇప్పటికీ ఒక్కటే. నిత్యజీవం సంపాదించుకొనేది కాదు, దేవుడు ఇచ్చేది (10:27). ఆయన్ను వెంబడించే వారికి ఆయన దానిని ఉచితంగా, ధారాళంగా ఇస్తాడు (10:29,30). అయితే, అది సంపన్నులకు చాలా కష్టంగా వుంటుంది (10:23). వారికి మరొక బలమైన ఆకర్షణ అవతల వున్నది. దానిని నుండి బయటపడటం చాలా కష్టమవుతుంది.

# 8.రక్తస్రావ రోగిని స్వస్థపరచుట 5:25-34

(మత్తయి 9:20-22; లూకా 8:43-48 చూడండి)

ఈ సంఘటనను మత్తయి, లూకాలు క్లుప్తంగా వివరించగా, మార్కు సవివరంగా తెలియజేశాడు. యేసు ప్రభువు కపెర్నహూము వీధులగుండా యాయీరు ఇంటికి వెళ్తున్నాడు. ప్రజలు గుంపులు గుంపులుగా ఆయన చుట్టూ వున్నారు. ఆ గుంపులో ఒక స్త్రీ వున్నది. ఆమె కైసరయ ఫిలిప్పీకి చెందిన స్త్రీ అని యూసిబియస్ అనే ప్రాచీన రచయిత అభిప్రాయపడ్డారు. అపొక్రిఫ అనే కేతలిక్ బైబిలు లోని నికోదేము సువార్తలో ఈ స్త్రీని వెరోనికగా పేర్కొనటం జరిగింది. యేసును సిలువ వేయటానికి కొనిపోతూ వుండగా మార్గమధ్యంలో ఆయన నుదురు వెరోనిక తుడిచినట్లు చెబుతారు. ఒక ఆదికాల పితరుడు ఆ స్త్రీని మార్తగా పేర్కొన్నాడు. యూసిబియన్ చెప్పిన కథనంలో సీజరియ ఫిలిప్పిలో ఒక ఇంటి గుమ్మంలో యేసుప్రభువు ప్రతిమ, ఒక స్త్రీ ప్రతిమ వున్నట్టు పేర్కొన్నాడు. వీటిని ఆ స్త్రీయే స్వయంగా నిర్మించినట్లు కూడా చెబుతారు. కాని, ఇవన్నీ ఎంతవరకు నిజాలో మనం ఖచ్చితంగా చెప్పలేం.

ఈ స్త్రీ రక్తస్రావ రోగంతో పన్నెండేళ్ల నుండి బాధపడుతూ వున్నది. ఇది లేవీ 15:25-30లో ప్రస్తావించిన రోగం లాంటిది. యూద సమాజం అలాంటి రోగులను అపవిత్రులుగా పరిగణిస్తారు. మతసంబంధమైన అనేక ఆధిక్యతలకు వారు దూరంగా వుండాలి. అంతకాలము రోగము తనను వెన్నంటే వున్నందున ఆ స్త్రీ నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్టాడుతూ వున్నది. అన్ని రకాల వైద్య ప్రక్రియలు పరీక్ష చేసి చూసింది. ఎంతో డబ్బు ఖర్చు చేసుకుంది. అయినా ఫలితం మాత్రం శూన్యం. మన తెలుగు బైబిలులో ఆమె స్థితిని కళ్లకు కట్టినట్టు చూపేమాట "ఎన్నో తిప్పలు పడి" గమనార్హం.

యూదు వైద్యులు కాయకల్ప చికిత్సలను తాల్ముడ్ అనే వారి సాంప్రదాయ గ్రంథం నుండి చదివి ఇలాంటి రోగులకు వైద్యం చేసేవారు. రబ్బీ యోహాను కొన్ని వైద్య విధానాలను పేర్కొన్నారు. "తుమ్మ బంక, పటిక, కుంకుమ పువ్వు సమపాళ్లలో తీసుకొని మొత్తగా దంచి, ద్రాక్షరసంలో కలిపి రక్తస్రావ రోగికి ఇవ్వాలి''. ఇది పనిచేయకపోతే "నీరుల్లిపాయలు తొమ్మిది రెబ్బలు తీసుకొని ద్రాక్షారసంలో మరిగించి రోగికి ఇచ్చి, నీ రక్తస్రావం నుండి లే అని చెప్పాలి". ఇది కూడా పనిచేయకపోతే, "రోగిని రెండు దారులు కలిసే చోట కూర్చుండబెట్టి, వెనక నుండి ఎవరైన అకస్మాత్తుగా వచ్చి, భయపెట్టి, నీ రక్తస్రావ రోగం నుండి లే అని చెప్పాలి". ఈ విధంగా రకరకాల చికిత్సలు చేసేవారు. ఆమె ఇవన్నీ ప్రయత్నించింది. డబ్బంతా పోగొట్టుకొంది. పాపరోగం కూడా అంతే మనుషులతో బాటే లోకంలో ప్రవేశించింది. గనుక ఈ రోగం మనిషంత ప్రాచీనమైనది. అది మనిషికి చాలా సహజమైనది. సాధారణమైన పద్ధతుల ద్వారా పాపాన్ని పరిహరించడం వల్లపడదు. మానవాతీత శక్తి, కృప అవసరం. అలాంటి పరిస్థితుల్లో దేవుని ఆత్మ బ్రతికించి, పవిత్రపరచి, శుద్ధిచేస్తుంది. "అయితే నేను నీ యొద్దకు వచ్చి, రక్తములో పొర్లుచున్న నిన్ను చూచి, నీ రక్తములో పొర్లియున్న నీవు బ్రతుకుదువని నీతో చెప్పితిని" (యెహెజ్కేలు 16:6).

యేసుప్రభువు చేసిన అనేక అద్భుతాలను గురించి, స్వస్థతలను గురించి, తనకంటే మొండి రోగాలను నయం చెయటాన్ని గూర్చి ఆమె విన్నది. ఇప్పుడాయన వీధిగుండా వెళ్తున్నాడు. జనసమూహములో వెనకగా వచ్చి ఆయన వస్త్రము ముట్టుకొన్నది (27వ). ఆమె రోగం విషయంలో సిగ్గుపడుతుంది అంటే అర్థం చేసికోవచ్చు (5:33లోని "భయపడి, వణకటం" గమనించండి). కొందరు వ్యాఖ్యాతలు ఆమె నిగ్రహాన్ని పాటించింది, అని ప్రశంసించగా, మరి కొందరు ఆమె పిరికితనాన్ని తెగనాడారు. ఆమె ప్రచారం కోరుకోక, రహస్యంగా చేసిన కార్యాన్ని బెర్నార్డ్ కొనియాడారు. మరికొందరు విశ్వాసాన్ని బహిరంగంగా వెల్లడించడానికి ఇష్టపడక, రహస్యంగా ఆశీర్వాదాలు కోరుకునేవారు ఇలాంటి వారే అంటూ విమర్శించారు. ఈ సంఘటన నుండి మనకు అనేక పాఠాలున్నాయనటంలో సందేహం లేదు.

*"ఆయన వస్త్రము ముట్టెను" (27వ).*

ఇది విశ్వాసపు స్పర్శ. అంటే యేసుప్రభువును రక్షకుడిగా వ్యక్తిగతంగా అన్వయించుకోవడం. ఈ స్త్రీలో తెగువ, విశ్వాసం రెండూ వున్నాయి. విశ్వాసం ఎప్పుడూ సాహసం చేస్తుంది. చాలామంది యేసుచుట్టూ మూగుతారు కాని, వారి జీవితంలో ఆయన దయగల శక్తిని అనుభవించరు. ఎందుకంటే తమ కోసం ఆయన్ను స్పృశించరు అన్నాడు సెయింట్ ఆగస్టీన్.

"వెంటనే ఆమె రక్తధార కట్టెను..." (29వ).

"బాధ", "రోగము" అనే పదానికి గ్రీకు భాషలో "కొరడా", "శిక్ష" అనే పదాలు వున్నాయి (5:34). రోగము దేవుడు ఝళిపించే కొరడా అని నమ్మేతారు. దీనర్థం ఆ రోగి చేసి ఏదో పాపానికి శిక్ష అనుభవిస్తున్నాడని కాదు (కొన్ని సందర్భాల్లో అది నిజం కావచ్చు). అయితే మానవజాతి యావత్తు అనుభవిస్తున్న పాపపు శిక్షలో అతడు పాలుపొందు తున్నాడు అని గ్రహించాలి. లోకంలో మానవులు అనుభవించే కడగండ్లకు మానవుడి పతనంతో దగ్గర సంబంధం వున్నది (ఆది 3:17-19). అలాగే శారీరక స్వస్థతతకూ పాప క్షమాపణకూ సన్నిహిత సంబంధం వున్నది (కీర్తన 103:3 "ఆయన నీ దోషములన్నిటిని క్షమించువాడు నీ సంకటము లన్నిటిని కుదుర్చువాడు"). ఈగాథ కేవలం శారీరక స్వస్థత లను గూర్చినదే గాక, యేసుప్రభువు పాపము, చెడుగులపై విజయం సాధించటాన్ని తెలియజేస్తుంది. "యేసుప్రభువు చేసిన ప్రతి స్వస్థత వెనక మరణాన్ని వెనక్కి తరమటమే గాక, వాస్తవంలో పాపపు కోటపై దాడి చేయటమే" అని డా॥ కల్‌మల్ అనే రచయిత పేర్కొన్నాడు. ప్రతి స్వస్థత ఒక పాక్షిక పునరుత్థానమే. మరణంపై జీవం సాధించిన పాక్షిక పునరుత్థానం.

"యేసు తనలోనుండి ప్రభావము బయలు వెళ్లెనని తనలో తాను గ్రహించాడు" (30వ).

1. ప్రభావం. యేసు తన శక్తిని బట్టి నిరంతరము దుష్టత్వంపై పోరాడుతూ, జయించాడు. ఉదా॥ ఆయన శోధనకు గురైనప్పుడు, అద్భుతాలు చేసినప్పుడు, సిలువపై, పునరుత్థాను డైనప్పుడు, తన అనుచరులకు తన అధికారాన్ని ఇచ్చినట్లు మార్కు 6:7 చూస్తాం.

2. తనలో నుండి బయలువెళ్లింది. ఆయన వినియోగించిన శక్తి ఆయనకు వెలుపలిది కాదు (ఉదా. ఎవరైనా తన స్నేహితుడికి నదిలోని నీళ్లు ఒక బకెట్టుతో ముంచి ఇచ్చినట్టు). తాను వినియోగించిన శక్తి తనదే.

నా వస్త్రములు ముట్టినదెవరు? ఏమిటి? దేవుని కుమారుడు యేసుకు తనను ఎవరు ముట్టుకున్నారో తెలియదా ?

తనను ముట్టుకున్నదెవరో ఆయన తెలుసుకోగలడు. అయితే, తన శక్తిని దానికోసం వినియోగించదలచలేదు (6:38; 8:4 చూడండి). ఆ స్త్రీని స్వస్థపరచింది తానేనని, తాను ధరించుకొన్న వస్త్రము కాదని ఆ స్త్రీ తెలుసుకోవాలని ఆయన ఉద్దేశం.

జనసమూహము నీ మీద పడుచుండుట చూచు చున్నావే... ? (31వ).

ఎవరో వ్యక్తి రహస్యంగా తనను స్పృశించారనే మాట విని శిష్యులు దాదాపు నవ్వినంత పనిచేశారు. ఈ విశాల విశ్వంలో దేవుడు ఎవరో ఒక్కరిపట్ల శ్రద్ధ కలిగి వున్నాడనేది నమ్మటం స్త్రీ పురుషులకు కష్టంగా వుంటుంది. యూదులకు దీనిని నమ్మటం మరీ కష్టమైంది.

అలాంటి రోగం వున్న వ్యక్తిని ఎవరినైనా యూదులు ''అపవిత్రంగా'' పరిగణిస్తారు. తనను ముట్టుకొని, "అపవిత్రం" చేసినందుకు యేసు కోపపడతాడేమోనని ఆమె భయపడింది. ఆయన శక్తిగలవాడు అని ఆమెకు తెలుసుగాని ఆయన ప్రేమగలవాడో కాదో ఇంకా తెలియదు (1:40లో ఈ విషయం చూచాం).

"కుమారీ, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను" (34వ). ఈ సంఘటనలో మనం నేర్చుకునే గొప్ప పాఠం పట్టువిడవని విశ్వాసం యొక్క ప్రాధాన్యత. ఇంతకూ ఆమెను స్వస్థపరచింది ఆమె విశ్వాసమా, యేసుప్రభువు శక్తా ? ఆమె విశ్వాసము సాధనము, యేసు శక్తి ఆశీర్వాదాలకు మూలం. విశ్వాసమే ఆశీర్వాదం కాదు, అందుకొనే సాధనం విశ్వాసం. ఆశీర్వాదా లను స్వీకరించే ఆత్మ యొక్క కుడిచెయ్యి విశ్వాసం అని ఒక భక్తుడు చెప్పాడు. ఆశీర్వాదాలను అందుకొనే చెయ్యిలాంటిది విశ్వాసం. రక్షణ అనే బావులలో నుండి ఆశీర్వాద జలాలను చేదుకొనే బకెట్ లాంటిది విశ్వాసం.

"సమాధానము గలదానవై పొమ్ము" (34వ)

అపవిత్రత తొలగిపోయిన ఆ స్త్రీ క్షమాపణ పొందిన పాపికి సాదృశ్యం. ఆమె భయముతో వణికిపోతూ వచ్చింది. ఆయన నుండి ప్రభావం బయలువెడలి రక్షించినట్లు తెలిసి కొన్నది. అదేరీతిగా పాపులు దేవుని ఎదుట భయముతో, వణకుతూ వచ్చి క్రీస్తు శక్తి ద్వారా సమాధానం అనుభవిస్తాడు. ఆమె ఇంతవరకు వెలుపలికి రావడానికి భయపడేది. ఇప్పుడైతే స్వస్థత, ఆనందం పొందింది. అలాగే స్త్రీ పురుష లకు తమ అపవిత్రతను బహిరంగంగా ఒప్పు కోవటం చాలా కష్టమవుతుంది. అయితే యేసుక్రీస్తు ద్వారా దేవునిలో శుద్ధి పొందిన తరువాత మాటలలో వర్ణించలేని ఆనందం అనుభవిస్తారు. దేవుని కృపద్వారా సమాధాన స్థితిని పొంది, ఆనందంతో సాగిపోతారు.

# బైబిలులో

# బాప్తిస్మాలు

మార్కు యేసు జీవిత కథనాన్ని ప్రారంభిస్తూ ఇశ్రాయేలీయులు తండోపతండాలుగా యొర్దాను నదికి వచ్చి యోహానుచేత బాప్తిస్మం పొందినట్లువర్ణించాడు. లేఖనాలలో బాప్తిస్మాన్ని గూర్చిన సారాంశమిది.

| | |
|---|---|
| **పద ఉత్పత్తి నిర్వచనం** | బాప్టిజమ్ అనే పదం గ్రీకు భాషలోని బాప్టిజో నుండి వచ్చింది. దీనికి ముంచుట అని అర్థం. ఒక వ్యక్తి ఒక నాయకుడితో గాని గుంపుతో గాని లేదా వారికి సంబంధించిన బోధతో గాని తనను తాను మమేకం చేసుకోకూడానికి సంకేతంగా పవిత్ర శుద్ధీకరణ, ప్రారంభ చర్యను సూచించే క్రియ. |
| **లేఖనాలలోని వివిధ రకాల బాప్తిస్మాలు** | **యూదుల బాప్తిస్మం :** మనుషులేమి, వస్తువులేమి పొందవలసిన సాంప్రదాయక శుద్ధీకరణ (మార్కు 7:3; నిర్గమ 19:10-14; లేవీ 8:6; హెబ్రీ 9:10 కూడా చూడండి).<br><br>**యోహాను ఇచ్చిన బాప్తిస్మం :** మెస్సీయా రాకడ తథ్యమని తాము పాపం నుండి నీతి జీవనం వైపు మళ్లుతామని యూదులు తమ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ పొందేది (మార్కు 1:4-8).<br><br>**యేసు పొందిన బాప్తిస్మం :** సాంప్రదాయబద్ధమైన నీతి సంబంధిత బాప్తిస్మం, యోహానుచేత బాప్తిస్మం పొందినవారు తాము పాపులమని ఒప్పుకొన్నారు, కాని యేసు బాప్తిస్మం ద్వారా, సేవకు తనను తాను సమర్పించుకున్నాడు (మార్కు 1:9-11).<br><br>**ఆత్మ బాప్తిస్మం :** ఒక విశ్వాసిని క్రీస్తు శరీరమైన సంఘములో చేర్చుతూ పరిశుద్ధాత్మ జరిగించే అలౌకిక కార్యం (రోమా 6:3,4; 1కొరింథీ 12:13; గలతీ 3:26,27; ఎఫెసీ 4:5; కొలస్సీ 2:9-12).<br><br>**క్రైస్తవ బాప్తిస్మం :** క్రీస్తే స్థాపించిన సాంప్రదాయ క్రియ (మత్తయి 28:19). అపొస్తలులు దీనిని పాటించారు (అపొ.కా. 2:38). యేసుక్రీస్తు మరణము, సమాధి, పునరుత్థానములతో విశ్వాసి ఐక్యతను సూచిస్తుంది.<br><br>**అగ్ని బాప్తిస్మం :** బహుశా ఇది రెండవ రాకడలో తీర్పును గూర్చి గానివిశ్వసించని వారిని నరకంలో పడవేయడం లేదా పెంతెకొస్తు రోజు పరిశుద్ధాత్మ దిగి రావటాన్ని గాని సూచిస్తూ వుండవచ్చు (మత్తయి 3:9-12; లూకా 3:16-17). |
| **పాత నిబంధన ఛాయలు :** | క్రీస్తు ఆజ్ఞాపించిన బాప్తిస్మానికి సంకేతాలుగా వున్న అనేక ఛాయలను క్రొత్త నిబంధన రచయితలు ప్రస్తావించారు.<br><br>నోవహు జలప్రళయం నుండి బయటపడటం (1పేతురు 3:17-22)<br><br>ఇశ్రాయేలీయులు ఎర్ర సముద్రం దాటిపోవటం (1కొరింథీ 10:1,2) |

# 9. సబ్బాతు దినాన ఊచచెయ్యి గలవానిని బాగు చేయుట 3:1-6

(మత్తయి 12:9-14; లూకా 6:6-11 కూడ చూడండి).

పరిసయ్యులు చేసును ఎందుకు ద్వేషిస్తున్నారో తెలియజేయడానికి మార్కు అయిదు గాథలను అందించాడు. వాటిలో ఇది చివరిది యేసుప్రభువు రెండు విధాల పోరాటం జరుపుతున్నాడు. 1) పరిసయ్యులపైన, 2) రోగమనే దుష్టత్వం పైన అయితే రెండు శక్తులపైనా ఆయన విజయం సాధించాడు. యేసుప్రభువు సమాజ మందిరంలోనికి వెళ్లాడు. ఆయన ఆసనంపై కూర్చోడానికి వెళ్తున్నాడు. ఇంకా కార్యక్రమం ప్రారంభం కాలేదు. ఆయన రెండు దృశ్యాలు చూచాడు. ఊచచెయ్యి గలవాడు ఒకడు (లూకా అతడి కుడిచెయ్యి అని చెప్పాడు. మరో కథనంలో అతడు భవన నిర్మాణ కార్మికుడు అని వుంది). మరోవంక ఆ వ్యక్తిని స్వస్థపరుస్తాడేమోనని పరిసయ్యులు కాచుకొని వున్నారు. ఆయన అతణ్ణి బాగుచేశాడు. అయితే, అంతకుముందు వారి హృదయాల్లోకి దూసుకుపోయే ప్రశ్న వేశాడు.

ఎవరైనా వ్యక్తి తీవ్ర అస్వస్థతతో విషమ స్థితిలో వుంటే సబ్బాతునాడు స్వస్థపరచవచ్చు అని పరిసయ్యుల సాంప్రదాయం చెబుతుంది. అయితే, ఇతడి పరిస్థితి అలాంటిది కాదు. అతణ్ణి మరునాడు బాగుచేయవచ్చు. కనుక, అతణ్ణి స్వస్థపరుస్తున్నప్పుడు నాలుగో ఆజ్ఞ అతిక్రమిస్తున్నాడని పరిసయ్యులు నిందమోపుతారని, ఆయనకు తెలుసు. అతణ్ణి బహిరంగంగా స్వస్థపరచడానికి రెండు కారణాలున్నాయి.

1) పరిసయ్యుల వైఖరి ఏవిధంగా తప్పో అందరికీ తెలియజేయడం, పరిసయ్యులకు కూడా స్పష్టం చేయటం.

2) సబ్బాతు అసలు దేనికోసమో నేర్పించడం.

యేసు అడిగిన ప్రశ్నకు పరిసయ్యుల దగ్గర సమాధానం లేదు (4వ). యేసును వ్యతిరేకించింది మత నాయకులైన పరిసయ్యులు కాదు, రాజకీయ నాయకులైన హేరోదీయనులు కూడా ఆయనను వ్యతిరేకించారు. ఇరువురూ కలిసి ఆయన్ను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నటం మొదలుపెట్టారు.

లూకా మరో నాలుగు విషయాలు అదనపు సమాచారం అందించాడు. (1) ఈ సంఘటన "మరో సబ్బాతు" రోజున జరిగింది. అంటే శిష్యులు పొలాల్లోగుండా వెళ్తూ వెన్నులు విరిచిన మరుసటి సబ్బాతు అన్నమాట. (2) అతడి కుడిచెయ్యి ఊచచెయ్యి (3) యేసుకు పరిసయ్యుల దుష్ట తలంపులు తెలుసు. (4) యేసు పనులు, మాటలు పరిసయ్యులకు కోపం రేపాయి.

పరిసయ్యులు మూడు రీతులుగా తప్పు చేశారు.

1. యేసు సబ్బాతు మీరాలని వారు కనిపెట్టారు. ఇతరులు తప్పు చేస్తే చూడాలని ఆశించటం ప్రేమకు వ్యతిరేక లక్షణం. ఇతరులు వైఫల్యం చెందితే మనం వారికంటే మెరుగైన వారంగా కనిపించాలనుకోవటం దుర్నీతి అవుతుంది (1కొరి 13:6).

2. వారు యేసు చెప్పింది విననేలేదు. వారు ఆయనను కలుసుకోకముందే ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చి ఆయన్ను కలిశారు. మనం కూడా "ఫలానా వ్యక్తి ఆ కులానికి, తెగకు చెందినవాడు గనుక మంచివాడు కాదు" అని చెబితే అన్యాయంగా తీర్పు తీరుస్తున్నట్టే.

3. రోగగ్రస్తుడు బాగుపడటం, బాగుపడకపోవటం అనేది వారికి బొత్తిగా పట్టని విషయం. వారు మతస్థులు, కాని వారికి దయ లేదు (ఒక చిన్నమ్మాయి ఇలా ప్రార్థించింది. "ఓ దేవా, చెడ్డవాళ్లందర్నీ మంచివాళ్లుగా మార్చు, మంచి వాళ్లను దయగల వారిగా మార్చు").

"విశ్రాంతి దినములన మేలు చేయుట ధర్మమా, కీడు చేయుట ధర్మమా ? ..." (4వ)

1. సబ్బాతును గురించి పరిసయ్యుల బోధ ఎంత తప్పో తెలియజేయడానికి ప్రభువు ఈ ప్రశ్న అడిగాడు, దానర్థమేమంటే "నేను సబ్బాతును మేలు చేయడానికి వినియోగిస్తున్నాను. మీరేమో నన్ను చంపడానికి కుట్రపన్నడానికి (కీడు చేయడానికి) వినియోగిస్తున్నారు" ఈ రెంటిలో ఏది దేవుణ్ణి సంతోషపెడుతుందని మీ ఉద్దేశం ? వారు దానికి జవాబు చెప్పలేకపోయారు.

2. ఈ మాటలు మరో భావాన్ని కూడా కలిగిస్తాయి. సబ్బాతు రోజున పని తప్పించుకోవడం కంటే, మేలు చేస్తేనే దేవుడు మరింత సంతోషిస్తాడు. పరిసయ్యులలో చాలామందికి తలకెక్కలేదు. నేను వారమంతా చేసే పనిని ఈ ఆదివారం రోజున చేయలేదు అని నీవు సంతృప్తిని వ్యక్తం చెయ్యొచ్చు. కాని, దేవుడు అడిగే ప్రశ్న ఏమంటే, "నీవు ఏం చేశాడు ? ఎవరైనా ఒంటరిగా వున్నవారిని, రోగులను దర్శించావా ?"

యేసు అడిగిన ప్రశ్నకు పరిసయ్యులు జవాబు చెప్పలేక పోయారు గదా. వారి హృదయ కాఠిన్యానికి ఆయన దుఃఖపడి, కోపముతో చుట్టూ కలియజూచి, ఆ మనిషితో "చెయ్యి చాపు" అన్నాడు. అతడు చెయ్యి చాపగానే అది బాగైంది. ప్రజలు ఏమంటారో ఏం చేస్తారో అని భయపడి ప్రభువు మేలు చేయకుండా ఎప్పుడూ వుండలేదు. ఆయన ఎన్నుకొన్న మార్గం ఆయనకు శత్రువుల్ని తెచ్చిపెడుతుంది. అది సిలువదాకా తీసుకువెళ్తుంది. అయినా, ఆయన దానినుండి

వెనక్కు తగ్గలేదు. వెంటనే పరిసయ్యులు వెలుపలికి వెళ్లి హేరోదీయులతో సమాలోచనలు జరిపి, ఆయన్ను చంపటానికి కుట్ర పన్నారు (6వ). తమకు వ్యతిరేకంగా ఎత్తిన గళాన్ని మూయాలని, ఆయన చేస్తున్న కరుణ క్రియలను నిలిపివేయాలని పరిసయ్యులు కృత నిశ్చయంతో వుండి తమ శత్రువులు హేరోదీయులతో చేతులు కలిపారు.

కొన్ని సందర్భాలలో యేసుప్రభువు సబ్బాతు రోజున రోగులను స్వస్థపరచినట్లు సువార్తలలో చదువుతాం. అందు వలన అది విమర్శ లేవదీసింది. యూదుల వైఖరికి, యేసు వైఖరికి తేడా కూడా వీటిలో మనం గమనిస్తాం. 1:21-27; లూకా 13:10-17; 14:1-6; యోహాను 5:1-18; 9:1-41 కూడా చూడండి.

**హేరోదీయులు :** రోమీయులు పాలస్తీనా పాలించిన కాలంలో స్థానిక పాలకులైన హేరోదు కుటుంబ సభ్యులకు కొన్ని సంవత్సరాలపాటు అధికారం యిచ్చారు. హేరోదు కుటుంబాన్ని సమర్థించే వారిని హేరోదీయునులు అంటారు. పరిసయ్యులు నిష్ఠగల యూదులు గనుక వారంటే బొత్తిగా గిట్టదు. అయినా, యేసు మీద వున్న ద్వేషంతో ఆయన్ను అంతమొందించడానికి వారితో చేతులు కలపడానికి వెనుకాడలేదు.

ఆలోచించండి 6:23

## నిర్లక్ష్య తీర్మానం

కొన్నిసార్లు మంచి తీర్మానాలు చేస్తాం, కొన్నిసార్లు చకచకా తీర్మానాలు చేస్తాం, మరి కొన్నిసార్లు చకచకా మంచి తీర్మానాలు చేస్తాం. ఇతే ఈ చివరిది అరుదు. హేరోదు తన సవతి కూతురు అడిగినప్పుడు ఖాళీ చెక్కు చేతికిచ్చినట్లు ఒక చెడు తీర్మానం చేశాడు (మార్కు 6:23).

హేరోదు అవివేకాన్ని ఖండించటం చాలా సులువు. అయితే మనం కూడా ఎన్నిసార్లు ఈవిధంగా తొందరపాటులో అవివేక తీర్మానాలు చేయటం లేదు! వాటి పరిమాణాలు ఎంత తీవ్రంగా వుండటం లేదు! ఉద్రేకంలో కొన్నిసార్లు అవివేక తీర్మానాలు చేసి నష్టం కొని తెచ్చుకుంటాం.

హేరోదు దుందుడుకు చర్యను మనం అర్థం చేసుకోవచ్చు. అతడు తప్పతాగి, ఒళ్లు మరచి వున్నాడు. హేరోదు స్వతహాగా అనాలోచిత చర్యలకుపెట్టింది పేరు. విశ్వాసులెన్నడూ ఆవిధంగా దుందుడుకుగా తీర్మానాలు చేయకూడదు. పౌలు మనల్ను సవాలు చేసిన రీతిగా మనం అవివేకులం గాక వివేకులంగా వుండాలి (ఎఫెసీ 5:14-17).

# 10. అయిదు వేలమందికి ఆహారం పెట్టడం

**(మార్కు 6:30-46; లూకా 9:10-17; మత్తయి 14:13-23; యోహాను 6:1-15)**

ఈ అద్భుతం నాలుగు సువార్తల్లోనూ గ్రంథస్తం చేసి వున్నది. నాలుగు సువార్తల్లో గ్రంథస్తమైన అద్భుతం ఇది ఒక్కటే. ఇందులో ప్రాధాన్యత లేకపోలేదు. యేసు గాథలో ఏదో ఒక ప్రాముఖ్య అంశం ఈ అద్భుతంలో వున్నందునే ఏ సువార్తికుడు కూడా దానిని వదిలిపెట్టలేదు. దానికి కారణాలు బహుశ (1) కైసరయ ఫిలిప్పి వద్ద పేతురు, మిగిలిన అపొస్తలులు యేసును మెస్సీయగా అంగీకరించినది ఈ సంఘటన ద్వారానే అయివుండవచ్చు. మార్కులో ఈ అద్భుతం కైసరయ ఫిలిప్పిలోని ఒప్పుకోలుకు దారితీసింది (మార్కు 8:29). దీనితోబాటే మరికొన్ని అద్భుతాలు, నాలుగు వేలమందికి ఆహారం పెట్టడం కూడా జరిగింది. లూకా సువార్తలో అయిదు వేలమందికి ఆహారం పెట్టిన వెంటనే ఒప్పుకోలు జరిగింది. కైసరయ ఫిలిప్పిలోని సంఘటనకు సమాంతర సంఘటన యోహాను 6:66-71లో వున్నది. (2) రెండవదిగా, తానే జీవాహారమని వెల్లడించే సందేశానికి పూర్వరంగం సిద్ధమైంది. ఈ కథలో మూడు భాగాలున్నాయి.

1) పన్నెండుమంది తిరిగి వచ్చి, తమ సేవ సమాచారం ప్రభువుకు నివేదించారు.

2) విశ్రాంతికోసం యేసు వారిని పక్కకు తీసుకొనిపోయాడు.

3) ప్రజలు యేసును వెంబడించారు. ఆయన వారికి బోధించాడు, ఆహారం పెట్టాడు.

ఆరో అధ్యాయం 7-13 వచనాల్లో పన్నెండు మంది శిష్యులను పంపించిన వైనం వున్నది. 14-29 వచనాల్లో అనేక విషయాలు చెప్పడం జరిగింది. యేసుప్రభువు, ఆయన ప్రతినిధులు చేసిన కార్యాలను గూర్చి విని హేరోదు బాప్తిస్మమిచ్చే

యోహానును గురించి పెట్టుకున్న అభిప్రాయం, చంపించిన విధం ఇందులో వున్నాయి. ఇప్పుడు శిష్యులు తిరిగి వచ్చిన విషయం చూస్తున్నాం. తమ అనుభవాలు యజమానితో చెప్పుకోడానికి వారు తహతహచెందుతున్నారు. వారు పనిచేసి అలసిపోయారు. యేసు ప్రభువుకు ఎంతో చెప్పాలనుకుంటున్నారు. అప్పుడు ప్రభువు వారితో "మీరేకాంతముగా అరణ్య ప్రదేశములకు వచ్చి కొంచెము సేపు అలసట తీర్చుకొనుడి" అని ఆహ్వానించాడు. వారిలాగే, మనం కూడా ఏకాంతంగా ప్రభువుతో గడపటం నేర్చుకోవాలి. అయితే, ప్రజలు తమ అక్కరలతో వచ్చి మన ఏకాంతాన్ని భంగం చేస్తారని కూడా వారు గ్రహించాల్సి వుంది.

### 1. యేసు కనికరం

విశ్రమించాలని భావించేటప్పుడు ప్రజలు వచ్చి తొందర చేయటం పెద్ద తలనొప్పిగా భావించారు శిష్యులు. యేసు అయితే వారిమీద కనికరపడ్డాడు. వారు కాపరిలేని గొర్రెలవలె వున్నారని గ్రహించాడు (34వ). కాపరులవలె గొర్రెలను నడిపించవలసినవారు, సరైన మార్గములో నడిపించటంలో విఫలమయ్యారు (యెహెజ్కేలు 34:1-6తో పోల్చి చూడండి). ఇప్పుడు యేసుప్రభువు వారికి కాపరి అయ్యాడు. అనేక సంగతులు వారికి బోధించాడు. ప్రజలను పంపించే సమయ మైనదని శిష్యులు భావించారు. అందుకనే ప్రభువు దగ్గరకు వచ్చి "ఇది అరణ్య ప్రదేశము. ఇప్పుడు చాలా ప్రొద్దుపోయింది .... వెళ్లి భోజనమునకేమైనను కొనుక్కొనుటకు వారిని పంపివేయుము అని చెప్పిరి" (35,36వ). అయితే, తన శిష్యులు కూడా తన కనికరంలో పాలుపొందాలని ప్రభువు కోరిక. "మీరు వారికి భోజనము పెట్టుడి" (37వ) అని చెప్పాడు.

### 2. యేసు శక్తి

ఆకలితో వున్న సమూహాల ఆకలి దీర్చే అంత కోరిక శిష్యులకు లేదు. వారు చెయ్యగలిగే మార్గం కూడా వారికి తెలియదు. "ఇన్నూరు (రెండు వందల) దేనారముల రొట్టెలు కొని వారికి పెట్టుదుమా?" ఒక వ్యక్తి ఎనిమిది లేదా తొమ్మిది నెలల్లో సంపాదించగలిగే మొత్తం అది (మత్తయి 20:2 చూడండి). బహుశ వారివద్ద అంత సొమ్ము లేకపోవచ్చు. ఒకవేళ వున్నా, ఎక్కడ రొట్టెలు కొనగలరు? ఒకవేళ కొన్నా అంతమందికి సరిపడ పంచిపెట్టగలరా? అప్పుడు యేసు మీయొద్ద ఎన్ని రొట్టెలున్నవి అని అడిగాడు. వారి దగ్గర వున్న కొద్ది మొత్తాన్ని అంత గొప్ప సమూహానికి ఆయన పంచిపెట్టి తృప్తిపరచగలడు. రోగులను స్వస్థపరచి, చనిపోయిన వారిని లేపి, తుఫానును గద్దించిన ఆయన అయిదు రొట్టెలు, రెండు చేపలను అధికం చెయ్యలేడా? వారింకా ఆయన శక్తిని గ్రహించలేదు. దేవుడు భోజనము సిద్ధపరచగలడా?" ఆయన ఆహారం ఇయ్యగలడా? తన ప్రజలకు మాంసము సిద్ధపరచగలడా?" మెస్సీయా ఈ లోకానికి రావటానికి ఎన్నో శతాబ్దాల ముందే ఈవిధంగా రాసి వుంది "దాని ఆహారమును నేను నిండారులుగా దీవించెదను, దానిలోని బీదలను ఆహారముతో తృప్తిపరచెదను". కీర్తన 132:15; యెషయా 40:11లో కూడా ఈవిధంగా రాసి ఉంది . "గొర్రెల కాపరివలె ఆయన తన మందను మేపును."

### 3. యేసు విధానము

యేసుప్రభువు చేసిన విధానంలో శిష్యులు నేర్చుకో వలసింది ఎంతో వుంది. సమూహాలతో వ్యవహరించేవారు క్రమశిక్షణను తప్పక నొక్కి చెప్పాలి. ప్రభువు జనసమూహాలను నూరేసి మంది, ఏబదేసి మంది చొప్పున పచ్చికమీద పంక్తులుగా కూర్చోబెట్టాడు. అప్పుడు ఆయన ఆ అయిదు రొట్టెలను, రెండు చేపలను పట్టుకొని, యూదు కుటుంబం లోని ఒక తండ్రిలాగా ఆ మంచి బహుమతికి దేవుణ్ణి స్తుతించాడు. రొట్టెలను విరిచి, చేపను విభజించి అందరికీ పంచిపెట్టాడు. చివరకు, ప్రభువు వ్యర్థం చేయటం ఇష్టపడలేదు. మిగిలిపోయిన రొట్టెముక్కలను, చేపలను పన్నెండు గంపలకు ఎత్తారు.


శిష్యులు ప్రభువు కనికరము, శక్తి, పద్ధతి తెలిసికోవాలి మార్కు మరల ఈ విషయాలను ప్రస్తావిస్తాడు (6:51; 8:1-10; 17-21). తరువాత విరిచిన రొట్టెముక్కలు జీవాహారమైన యేసు లోకం కోసం విరవబడడానికి సాదృశ్యంగా చూస్తాం (14:22). ఈ అద్భుతం క్రీస్తు సువార్త కేంద్రంలోనికి తీసుకొని వెళ్తుంది.

# 11. నీళ్లపై నడుచుట 6:45-52

(మత్తయి 14:22,23; యోహాను 6:15-21 కూడా చూడండి).

అయిదువేల మందికి రొట్టెలు పంచిపెట్టిన తరువాత ఒక గొప్ప ప్రమాదం పొంచి వున్నది. రోమీయులపై తిరుగుబాటు చేయటానికి ప్రజలు ఆయన్ను బలవంతంగా తీసుకొనిపోయి తమ నాయకుడిగా చేసికోవచ్చు (యోహాను 6:15 చూడండి). శిష్యులకు కూడా అలాంటి తలంపు కలిగి వుండవచ్చు. అందువలన ఆయన వారిని ఒక దోనెలో ఆవలి వైపుకు బలవంతంగా పంపించేశాడు (45వ). తరువాత ప్రజలను విడిచిపెట్టనని అభయమిచ్చి, వారి దగ్గర సెలవు తీసుకొని వుంటాడు. పరలోక తండ్రితో సమయం గడపడానికి ఆయనకు బొత్తిగా కుదరడం లేదు. అందువలన ఆయన ప్రజల్ని పంపివేశాడు. ఆయన అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాడు. పరిసయ్యులు, హేరోదు ఆయనను నిర్బంధించ చూస్తున్నారు. ప్రజలు తనను రాజుగా చేసి, రోమ్‌పై తిరుగు బాటు చేయమని ఆశిస్తున్నారు. అయితే ఆయన అలాంటి నాయకుడిగా వుండటానికి రాలేదు. ఆయన భౌతిక ఆహారం ప్రసాదించడానికీ రాలేదు. రోమ్ పాలనను అంతం చేసే రాజకీయ నాయకుడిగా వుండటానికి రాలేదు. ప్రజలను దేవుని మార్గంవైపు మళ్లించి, వారు దేవుని రాజ్యాన్ని ఎరిగి, ఆయన పాలనలో ఉండేలా చేసేందుకు వచ్చాడు. కనుక, అలాంటి ప్రయత్నం ఏదైనా వుంటే అది ప్రజలకు, శిష్యులకూ ప్రమాదకరమే. ఎందుకంటే, అది వారిని తప్పు త్రోవలో నడిపిస్తుంది. ఆ మాటకొస్తే యేసుప్రభువుకు కూడా అది సంకట స్థితే. ప్రారంభంలో ఎదుర్కొన్న శోధనలలో చిక్కుకొనే ప్రమాదం ఉన్నది (1:13 మత్తయి 4:3-10 చూడండి). కనుక, తన కోసము, శిష్యుల కోసము, సమూహాల కోసము ఆయన కొండపైకి వెళ్లి ఏకాంతముగా ప్రార్థించాడు (46వ).

ఇప్పుడు మన దృష్టిని కొండపై ఏకాంతంగా ప్రార్థిస్తున్న ప్రభువు మీదనుండి సరస్సులో శిష్యులు వున్న దోనెపైకి మరల్చుదాం. వారు చాలా కష్టంతో దోనెను నడిపిస్తున్నారు. ఎందుకంటే బలమైన గాలులు వీస్తున్నాయి. అలలు ఉవ్వెత్తుగా లేస్తున్నాయి. "అప్పుడు గాలి ఎదురైనందున దోనె నడిపించుటలో వారు మిక్కిలి కష్టపడుచున్నారు" (48వ). వారు బహుశ చాలాసేపు ఎదురుగాలికి ఓడను నడిపి విసిగిపోయి వుంటారు. ఆయన వారిని చూచాడు. ఇంచు మించు నాలుగవ జామున (నాలుగవ జాము ఉదయం 3 గంటలకు ప్రారంభమవుతుంది). సముద్రం మీద నడుచు కుంటూ వారియొద్దకు వచ్చాడు. యేసుప్రభువు నీళ్లమీద ఎలా నడిచి వుంటారు ? ఏమో మనకు తెలియదు. అయితే, దేవుడు శరీరధారియైన తరువాత అలాంటి పనులు చేయలేడు అని తలంచడం అవివేకమే. ఆయనను చూచి భూతమనుకొని భయపడిపోయారు. అయితే, ఆయన మాటలు వారికి ఆదరణ కలిగించాయి. "ధైర్యము తెచ్చు కొనుడి, నేనే, భయపడకుడని చెప్పెను" (50వ). ఆయన కనిపించటంతోనే ప్రశాంతత చోటుచేసుకుంది. గాలి నిమ్మళించింది. వారి ఆశ్చర్యానికి అంతులేదు. మరల ఇక్కడ మార్కు వారు నేర్చుకొనవలసిన విశ్వాస పాఠాన్ని చూపెడు తున్నాడు. గొప్ప సమూహాలకు ఆహారం పెట్టిన ఆయన, తుఫానులలో గాని ప్రమాదకర పరిస్థితులలో గాని వారిని చేయి విడువడు అని గుర్తించాలి.



ఆలోచించండి 6:14-16

**'నీవు ... వ్యక్తిని తలపింపచేస్తున్నావు"**

యేసు ఖ్యాతి దశదిశలా, చివరకు రాజు దాకా వ్యాపించింది (మార్కు 6:14). ఇంత అసాధారణ అధికారము, శక్తివున్న వ్యక్తి ఇంతకూ ఎవరు? హేరోదు, అతడి మంత్రివర్గం యేసును కొందరు ప్రముఖులతో - ..... బాప్తిస్మమిచ్చే యోహాను, ఏలీయా, పాత నిబంధన ప్రవక్తలతో పోల్చారు.

వారు యేసును గుర్తించడానికి చేస్తున్న ప్రయత్నం ఒక ఆసక్తికరమైన ప్రశ్న లేవనెత్తుతుంది. ఇతరులు నిన్ను గమనిస్తూ వుండగా, నీ అధికారాన్ని, శక్తిని ఎలా వినియోగిస్తున్నావు. నిన్ను వారు ఎవరితో పోలుస్తున్నారు. ఎవరైనా ఈ వాక్యాన్ని ఎలా పూరిస్తారు ? "నిన్ను చూచినప్పుడు (నీ పేరు) నాకు .... పలానా వ్యక్తి జ్ఞప్తికి వస్తున్నాడు" ?

## 12. సురోఫొనీకే స్త్రీ కుమార్తెను స్వస్థపరిచాడు 7:24-30

(మత్తయి 15:21–28 చూడండి)

యేసుప్రభువు ఇప్పుడు ఉత్తర దిశగా ప్రయాణం చేసి, అన్యజనాంగము, అంటే యూదులు కానివారు నివసించే తూరు, సీదోను ప్రాంతాల మధ్య వున్నాడు. యూదేతర భూభాగంలో ఆయన సంచారం చేయటం ఇది మొదటి పర్యాయం కాదు (6:14–16 చూడండి). బహుశా విశ్రాంతి కోసం, ప్రార్థనలో గడపటం కోసం, తనకు రానైయున్న శ్రమలను సహించడానికి సిద్ధపాటుకోసం వెళ్లి వుంటాడు. హేరోదు, పరిసయ్యులు ఆయన్ను నిర్బంధించ చూస్తున్నారు. సాధారణ యూదులు ఆయన్ను రాజును చెయ్యాలని ప్రయత్నించారు.

ఇప్పుడు యేసుప్రభువుకు ఒక అన్యస్త్రీ తటస్థపడింది. ఆమె పూర్తిగా అన్యురాలు. గ్రీకు సంస్కృతికి చెందినది. సిరియాలోని ఫొనీషియా దేశస్థురాలు. ఆమె కుమార్తె దయ్యం పట్టి బాధపడుతూ వున్నది. ఈ పరిస్థితి మూలంగా ఆ బాలిక విపరీతంగా బాధ అనుభవిస్తూ ఉంది. ఆమె వాగ్దాన నిబంధనలకు చెందనిదైనా యేసును గూర్చి విన్నది. ఆయనకు ఇష్టమైతే తన కుమార్తెను దయ్యం బారినుండి విడిపించగలడని నమ్మింది. అందుకే వచ్చి ఆ యువతిలో నుండి దయ్యాన్ని వెళ్లగొట్టమని యేసును ప్రాధేయపడింది. మత్తయి 15:22లో "ప్రభువా, దావీదు కుమారుడా, నన్ను కరుణించు" అంటూ అభ్యర్థించింది. బహుశా, ఆమె పొరుగున వున్న యూదుల ద్వారా దావీదు వంశం నుండి మెస్సీయా వస్తాడని విని వుంటుంది. ఆ మెస్సీయా యేసే అని ఆమె గుర్తించినట్టుంది. అయితే, ఆమె పట్టువిడువకుండా ప్రాధేయపడుతుంటే ఈ మాటలన్నాడు. "పిల్లలు మొదట తృప్తిపొందవలెను. పిల్లల రొట్టె తీసుకొని కుక్క పిల్లలకు వేయుట యుక్తము కాదు" (37వ). మనకు ఈ మాట చాలా కటువుగా వినిపిస్తుంది. ఇంతకూ ప్రభువు ఎందుకు అలా మాట్లాడినట్టు?

1) ఆయనకు స్త్రీలంటే చిన్నచూపు వున్నందున కాదు. మార్కు 1:30,31; 5:40–43; 10:7,8; యోహాను 4:1–30లలో గమనిస్తే యూదు బోధకులవలె గాక ఆయన పురుషులను చూచినట్లే స్త్రీలను కూడా సమానంగా చూశాడని తెలుస్తుంది.

2) ఆయనకు యూదేతరులంటే తిరస్కారభావం వున్నందున కాదు. ఆయన గెరాసేను ప్రాంతంలోని అన్యుడైన సేన దయ్యాలు పట్టిన వ్యక్తిని బాగుచేశాడు (5:1–20). అన్యుడైన శతాధిపతి సేవకుణ్ణి (లూకా 7:1–10); ఒక అన్య అధికారి కుమారుణ్ణి (యోహాను 4:46–54) బాగు చేశాడు. కనుక, ఆయన తన క్రియల ద్వారా తనకు జాతి వైషమ్యం లేదని చూపెట్టాడు.

3) ఆయన అలసిపోయినందునో, ఇష్టం లేకనో లేదా తన మనసు మార్చుకొనేలా బ్రతిమాలించుకోవటం కోసం కాదు. మనం ప్రార్థన చేస్తే దేవుడు తన మనస్సు మార్చుకుంటాడని అర్థం కాదు. ప్రార్థన చేసేది దేవుడిపై వత్తిడి తేవటం కోసం కానేకాదు (11:24 చూడండి).

4) ఆ సమయంలో ఆయన ఒక క్లిష్ట సమస్యను గూర్చి ఆలోచిస్తున్నాడు. ఆయన ఏకాంతంగా, ప్రశాంతంగా వుండాలని ఆశించాడు. అలాంటి సందర్భంలో అద్భుతాలు చేసి, బోధచేసి ప్రజల్ని తన దగ్గరకు ఆహ్వానించటం ఆయనకు ఇష్టం లేదు. ఒకవేళ ఆయన అద్భుతాలు చేయడం, బోధించడం జరిగితే మొదట యూదులకు చేయాలి. దేవుడు ఈ ఒక్క జాతిని (యూదుల్ని) ఎన్నుకొని, వారిద్వారా తనను లోకానికి వెల్లడించుకోవాలని అనుకొన్నాడు. దేవుడు పక్షపాతి కానేకాదు. ఆయనకు ఒక జాతి అంటే ప్రేమ, మరో జాతి అంటే ద్వేషం వుండదు. అయితే అందరికీ తన సందేశాన్ని కొందరి ద్వారా అందించటం దేవుని విధానం (మత్తయి 10:5; రోమా 1:16; 2:9–11 చూడండి). తన తదనంతరం కూడా తన పనిని కొనసాగించునట్లు, తన నిర్బంధానికి ముందే శిష్యులకు శిక్షణ ఇవ్వాలనుకున్నాడు ప్రభువు.

ఆమె స్పందన అద్భుతంగా వుంది. ఆయన తనను అవమా నించాడని గాని, నీచంగా మాటలాడాడని గాని ఆమె భావించ లేదు. వినమ్రంగా ఆమె ఇలా జవాబిచ్చింది. "నిజమే ప్రభువా, అయితే కుక్కపిల్లలు కూడ బల్లక్రింద వుండి, పిల్లలు పడవేయు రొట్టెముక్కలు తినును గదా." ఆమె చెప్పింది ఎలా ఉందంటే, "ప్రభువా, నేను దిక్కుమాలిన, దీన దరిద్ర అన్యురాలను, రాజ్యానికి చెందిన పిల్లలు తిరస్కరిస్తున్న రొట్టెముక్కలైనా నాకు దక్కనివ్వు. నీ కృపను అనుభవించ డానికి బల్లక్రింద వుండే కుక్కపిల్లల స్థానాన్నైనా నన్ను తీసుకోనియ్యి". విశ్వాసానికి, వినమ్రత తోడైతే ప్రభువు హృదయం పులకించిపోతుంది. అందుకు ప్రభువు "వెళ్లుము, దయ్యము నీ కుమార్తెను వదలిపోయినది" అని చెప్పాడు. త్వరత్వరగా ఇంటికి వెళ్లి. దయ్యం వదిలిపోయినందున ఆ బాలిక మంచం మీద ప్రశాంతంగా పడుకొని వుండటం చూసింది. హృదయం పరవశించి, కృతజ్ఞతతో ప్రభువును స్తుతించి వుంటుంది.

# మన ప్రభువు ప్రశంసలు

మత్తయి సువార్తలో ప్రభువు ప్రశంసించిన ముగ్గురు వ్యక్తులను గూర్చి నేర్చుకున్నాం. మార్కు సువార్తలో కూడా ప్రభువు కొందరిని ప్రశంసించాడు. సాధారణంగా మనుషులు మనుషుల మెప్పు కోసం తాపత్రయపడతారు. అయితే, ప్రభువే స్వయంగా ప్రశంసించినది, నిజంగా ధన్యకరం. మార్కు 9వ అధ్యాయంలో ఒక వ్యక్తి దయ్యాలు వెళ్లగొడుతుంటే అతణ్ణి ఆయన తన పక్షంలోని వాడుగానే పరిగణించటం విశేషం (41వ), రెండవదిగా 10వ అధ్యాయంలో కొందరు తల్లులు ప్రభువు దగ్గరకు తమ పిల్లలను తీసుకొని వచ్చారు. ఇక్కడ కూడా శిష్యులు ఆటంకపరిచారు. అయితే, ప్రభువు వారిని ఆటంకరపరచక తన దగ్గరకు రానిమ్మన్నాడు (14వ), మూడవదిగా, బేతనియాలో మరియ ఆయన్ను అత్తరుతో అభిషేకించి నప్పుడు ఆమె పనిని శ్లాఘించాడు (6-9వ), నాలుగవది, విధవరాలు తనకున్నదంతా ఇచ్చినప్పుడు ఆమె అందరికంటే ఎక్కువ ఇచ్చిందని ప్రభువు ప్రశంసించాడు (మార్కు 12:41-44). ఇప్పుడు ఒక్కొక్కటీ వివరంగా పరిశీలిద్దాం.

## అద్భుతాలు చేసే అనామక వ్యక్తి దయ్యాలను వెళ్లగొట్టడం

(లేఖన భాగం : మార్కు 9:38-41, ప్రశంస 39వ.)

మార్కు 9వ అధ్యాయంలో యేసుప్రభువు శిష్యులు ఎదుర్కొన్న సవాలుతో కూడిన అనుభవాలు గ్రంథస్థం చేసి వున్నాయి. ఏమిటి యేసుప్రభువు తొలినాటి శిష్యులు ఇంత ఆధ్యాత్మికంగా వున్నారు. వారు కీర్తన 51:10 ప్రకారం ప్రార్థన చేయవలసి వున్నట్టుందే అవి మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఆ మాటకొస్తే మనమేమన్నా వారికంటే తక్కువ తిన్నామా? వారి వైఖరి ఏం బాగాలేదు. మనది కూడా అంతే.

1. మార్కు 9:5,6లో నిర్లక్ష్య వైఖరి చూస్తాం.
2. మార్కు 9:10లో అంధవైఖరి చూస్తాం.
3. మార్కు 9:28,29లో శక్తిహీన వైఖరి చూస్తాం.
4. మార్కు 9:33,34లో గర్వపు వైఖరి చూస్తాం.
5. మార్కు 9:38లో మతాతత్వం చూస్తాం.

ఈ వచనాలన్నీ జాగ్రత్తగా అధ్యయనం చేస్తే చివరకు మన పాఠంలోకి, మార్కు 9:38-41లోనికి వస్తాం. ఇందులో మనకు ఏడు పాఠాలున్నాయి.

**1. దేవుని రాజ్యంలో అథమ స్థానం గైకొనుట ద్వారా ప్రథమ స్థానం చేరుకుంటాం**

యోహాను ప్రభువుతో ఈ మాటలు చెప్పడం 38వ వచనంలో గమనిస్తాం. 38వ వచనానికీ అంతకుముందు జరిగిన దానికీ సంబంధం ఉన్నది. అదేమిటో 33-37 వచనాలు చదివితే తెలుస్తుంది. తన ప్రజల హృదయాల్లో వున్నదేదో ప్రభువుకు తెలుసు (లూకా 9:47 చూడండి). అందుకే ప్రభువు 33 వచనంలోని ప్రశ్న అడిగాడు. దానికి శిష్యులు సిగ్గుపడిపోయారు (34వ) అప్పుడు ఆయన ఒక చిన్న పిల్లవాణ్ణి తీసుకొని వారి ఎదుట నిలబెట్టి వినమ్రతను గూర్చి బోధించాడు. మత్తయి 5:3; లూకా 14:11; యాకోబు 4:61; పేతురు 5:5 చూడండి. మనము ప్రభువు శిష్యులమైతే ఆయన పాఠశాలలో విద్యార్థులమైతే మనం నేర్చుకోవలసిన గొప్ప పాఠం ప్రభువు చెబుతున్నాడు. మత్తయి 11:29,30 చూడండి. మనము క్రింది స్థానం గైకొనడానికి ఇష్టపడి, నిజమైన నమ్రత అంటే ఏమిటో నేర్చుకోవడానికి సిద్ధపడితే, మన జీవితంలోని అసహనం, జగడాలు, గర్వం అంతమొంది, వాటి స్థానే మన ఆత్మలలో నెమ్మది చోటు చేసుకుంటుంది.

**2. మనలో మంచివారమనుకున్న వారు కూడా నిర్లక్ష్యంగా తప్పుగా మాటలాడి, ప్రవర్తించే ప్రమాదం వున్నది**

యోహాను ప్రభువుతో మాటలాడుతున్నట్టు 38వ వచనంలో వున్నది. ఇది విచిత్రంగా ఉన్నది కదూ ? పేతురో, యూదానో మాటలాడితే మనం ఆశ్చర్యపోయేవారం కాదు. అయితే ఇక్కడ మాటలాడుతున్నది యేసుప్రభువుకు అతి సన్నిహితంగా మెలిగిన వ్యక్తి, “యేసు ప్రేమించిన శిష్యుడు” యోహాను 13:23 చూడండి. మనలో ఎవరైనా, దేవుణ్ణి బాగా నిరాశపరచామా ? కాని మాట పలికిన మోషేలాగా, (కీర్తన 106:33), దేవుని హృదయానుసారమైన దావీదులాగా, (2సమూ 11:27), పరస్పరం విభేదించిన పౌలు, బర్నబాలాగా (అపొ.కా. 15:39) దేవుడికి బాగా ఆశాభంగం కలిగించటం సాధ్యమే. ఇదంతా విన్న తరువాత మనం మూడు విషయాలు చెబుతాం.

మొదటిది, ప్రభువు తన బిడ్డల పట్ల ఎంత సహనం కలిగి వున్నాడు! రెండవది మనం కూడా ఒకరిపట్ల మరొకరు సహనం కలిగి వుండాలి. యాకోబు 5:9 చూడండి. మూడవది, మన వైఫల్యం విషయం గ్రహిస్తే దేవునితో ఒప్పు కోవాలి (1యోహాను 1:9) ఒకరితో ఒకరం కూడా మన

తప్పులు ఒప్పుకోవాలి (యాకోబు 5:16) ఇప్పుడు మూడవ పాఠం చూడండి.

**3. దేవుడు తన సేవలో వివిధ రకాల పనివారిని నియమిస్తాడు**

ఈ సంఘటనలో ప్రభువు శిష్యులు ఒకతణ్ణి చూచి "ఇతడు మనల్ని వెంబడించేవాడు కాడు" అంటున్నారు (38వ). మనం ఒక్క విషయం గమనించాలి. ప్రభువు పొలంలో రకరకాల పనివారున్నారు. ఇది మనకు ఆశ్చర్యం కలిగించకూడదు. ముఖ్యంగా 1కొరింథీ 1:26-29 చదివినప్పుడు, 1కొరింథీ 12:14-18తో పోల్చండి.

ఈ భాగంలో చెప్పిన పరిచర్యల విషయమేమంటే "కృపావరాలు నానా విధాలు". పరిచర్యలు నానా విధాలు, "నా నా విధములైన కార్యాలు" మొదలైనవి. ప్రపంచ వ్యాప్తంగా దేవుడు తన కొరకు సాక్షులను నిలుపుకున్నాడు. వారు భిన్నమైన జాతులకు, స్థలాలకు, రంగాలకు, భాషలకు చెందినవారు. అయితే వారంతా దేవుని కృపను బట్టి ఒక్కటే. మనము దేవుని ప్రజలమధ్య సంచరిస్తున్నప్పుడు ఈ గొప్ప సత్యం గుర్తించటంలో జాగ్రత్త వహించాలి. 1కొరింథీ 12:14-18 మరలా జాగ్రత్తగా చదవండి.

**4. ముఠాతత్వం దేవుడికి అసహ్యం**

అద్భుతాలు చేసే వ్యక్తి విషయం 38 వచనంలో యోహాను ప్రభువుతో చెప్పిందేమంటే అతడు మనలను వెంబడించువాడు కాడు. అయితే 39 వచనంలో అతణ్ణి ఆటంకపరచవద్దని ప్రభువు తన ఆమోదం తెలిపాడు (39). శిష్యులు ఎంత కంగారు పడిపోయారంటే ఈ ఊరూ పేరూ లేని అద్భుతాలు చేసే వ్యక్తి యేసుప్రభువును విశ్వసించినట్టుంది. అతడు ఆయన నామంలో క్రియలు జరిగిస్తున్నాడు (లేనట్లయితే ప్రభువు అతణ్ణి ఆమోదించేవాడు కాదు కదా). అతడు గొప్ప పరిచర్య చేస్తూ వున్నాడు మేము ఎన్నికైన వారం, మేము తప్ప మరెవ్వరూ పరిగణనలోకి రారు అనే భావనతో వున్నారు శిష్యులు.

తమ చిన్న గుంపుకు చెందనివాడెవరో తమ యజమాని పేరు వినియోగించుకోవటంతో వారు కోపంతో మండి పడ్డారు. అయ్యో, ఇలాంటి ప్రేమ రహిత కఠిన వైఖరి నేటి విశ్వాసుల్లో చూస్తున్నాము. చాలామంది తమ చిన్న గుంపే సరైనదని, తక్కిన వారంతా తప్పని భావిస్తారు. మనం విమర్శించటం మానాలి. ప్రభువును క్షమించమని వేడు కోవాలి. ఏ గుంపుకు చెందినవారైనా సరే, ప్రభువులో మన సహోదరీ, సహోదరులను సమీపించడానికి ప్రయత్నించాలి. ప్రభువుకు నిజంగా చెందిన వారందరూ ఒకరికొకరు కావలసినవారు. "యేసుక్రీస్తునందు అందరూ ఒక్కటే" అనే సదాశయం ప్రతి ఒక్కరూ పాటించాలి.

**5. దయ్యం పట్టటం 2000 సంవత్సరాల నాడు ఎంత వాస్తవమో నేడు కూడా అంతే వాస్తవం.**

38వ వచనంలో ప్రస్తావించిన వ్యక్తి దయ్యాలను వెళ్ళగొడుతున్నాడు. క్రొత్త నిబంధనలో దయ్యం పట్టిన సంఘటనలు అనేకం. చాలా సందర్భాల్లో మన ప్రభువు కూడా దయ్యాలను వెళ్ళగొట్టాడు. ఈ అధ్యాయంలో కూడా ప్రభువు అదేపని చేస్తాడు. 9:14-29, నేటి మన మానసిక శారీక రుగ్మతలకు కారణం సాతాను ప్రభావమే అని నిస్సందేహంగా చెప్పొచ్చు. నేటికీ మానవజాతి బద్ధ శత్రువు సాతానే. మనం వాడి శక్తిని తక్కువగా అంచనా వేస్తాం. వాడు మనకు "గర్జించే సింహం లాగా" గాక (1పేతురు 5:8) "వెలుగుదూత వేషంలో" (2కొరి 11:14) వస్తాడు గనుక మనం పప్పులో కాలేస్తుంటాం. ఎఫెసీ 6:12 వచనంలో చూడండి. అలాగైతే దురాత్మల శక్తులను పారద్రోలి, శత్రువు ఆధీనంలో వున్నవారిని విడిపించటంలో మనం అంత శక్తిహీనులమా? మార్కు 9:28,29 చూడండి.

**6. మన దేవుడు ఇంకా అద్భుతాలు చేసే దేవుడే**

ఈ వ్యక్తి వాస్తవంగా ఒక అద్భుతం జరిగిస్తున్నట్టు 38వ వచనం చెబుతున్నది. 39 వచనంలో ప్రభువు దానిని నిర్ధారించాడు కూడా. ఆ వ్యక్తి కేవలం ఒక సాధనమే. దేవుడే అతడి ద్వారా ఆ పని జరిపిస్తున్నాడు. అయితే ఇప్పుడొక ప్రశ్న తలెత్తుతంది. అద్భుతాలు ఇప్పుడు జరుగుతున్నాయా ? అవును, జరుగుతున్నాయి. దేవుని వాక్యంలో మనకు అనేక ప్రార్థన వాగ్దానాలున్నాయి. వాటిలో అధికభాగం యేసుప్రభువు స్వయంగా చెప్పిన మాటలే. మనము ప్రార్థించి, అద్భుతాలు కొరకు కనిపెట్టవచ్చు అని ఆ మాటల సారాంశం. ఉదా. మత్తయి 17:20; మార్కు 9:23 చూడండి.

**7. క్రీస్తు నామంలో చేసిన చిన్న పనిని కూడా ఆయన గమనిస్తాడు. ప్రతిఫలమిస్తాడు**

ఈ విషయం 41 వచనంలో ఉన్నది. దేవుని పిల్లలకు సేవచేసిన వారందరికీ ఆయన ప్రతిఫలమిస్తాడు. దీనర్థమేమంటే, మనము చేసే సామాన్యమైన పనులు కూడా ఆయన నామంలోనే చెయ్యాలి. కొలస్సీ 3:17; 1కొరి 10:31తో పోల్చండి.

# తమ పిల్లల్ని యేసు దగ్గరకు తెచ్చిన తల్లులు

(లేఖన భాగం : 10:13-16, ప్రశంస 14 వచనం)

లేఖనాలలోని 7 చిత్రాలన్నిటిలోకి ఇది మనోహరమైనది. ఈ దృశ్యాన్ని మనసుకు తెచ్చుకోడానికి ప్రయత్నించండి. తల్లులే గాక ఇతరులు కూడా పిల్లలను యేసుప్రభువు దగ్గరకు తీసుకుని వచ్చి వుంటారు. ప్రభువు ప్రేమతో దగ్గరకు తెచ్చిన పిల్లల్ని ఆహ్వానించి, ఆశీర్వదించాడు. పరిశుద్ధాత్మ ముగ్గురు సువార్తికుల చేత ఈ సంఘటన రాయించిపెట్టాడు (మత్తయి 19:13-15; మార్కు 10:13-16; లూకా 18:15-17). ఈ సంఘటన నుండి మనము నేర్చుకొనే పాఠాలు ఏమైనా వున్నాయా ? పిల్లలను ప్రభువు దగ్గరకు తీసుకొని వచ్చేపని ఒక బాధ్యతను, ఆధిక్యతను తెలియజేస్తుంది. అలాగే ఆయన దగ్గరకు రాకుండా ఆటంకపరచడంలోని తీవ్ర ప్రమాదాన్ని కూడా హెచ్చరి స్తున్నది. చిన్న పిల్లలను ప్రభువు దగ్గరకు తీసుకురావటం నిజంగా ఎంత గొప్ప ఆధిక్యత! అలాగైతే మన బాధ్యత ఏమిటి? పిల్లలను ప్రభువు దగ్గరకు తీసుకు రావాలి. ఎందుకంటే వారిని రక్షించటం కోసం ఆయన వారి కోసం కూడా సిలువలో మరణించాడు. ప్రభువు దగ్గరకు రాకుండా ఆటంకపరుస్తున్నది ఆయన శిష్యులే. మార్కు 10:13 చూడండి. అది ప్రభువుకు బొత్తిగా ఇష్టం లేదు. "యేసు అది చూచి కోపపడ్డాడు" అని తెలుగు బైబిల్లో వున్నది కాని గ్రీకు భాషలో కోపంలో మండిపడ్డాడు అని వున్నది. మత్తయి 18:6 పోల్చి చూడండి.

## 1. పిల్లల్ని యేసు దగ్గరకు ఎవరు తీసుకురావాలి ?

ఇంతకూ ఇది ఎవరి బాధ్యత ? మార్కు 10:13లో "కొందరు ఆయన యొద్దకు చిన్న పిల్లలను తీసుకొని వచ్చినట్లు" చూస్తాం. తల్లులేగాక అమ్మమ్మలు, అక్కలు, అన్నలు, స్నేహితులు తీసుకొని వచ్చి వుండవచ్చు. "కొందరు" అనే పదం చిన్నపిల్లల పట్ల శ్రద్ధవహించిన వారినందరినీ సూచిస్తుంది. ఇందులో తండ్రులు కూడా వున్నారని మరిచిపో కూడదు. తమ పిల్లల ఆత్మరక్షణ పట్ల భారం కలిగిన తల్లి దండ్రులు ఎంత ధన్యులు, కొందరు అనేమాట పిల్లలకు బోధించే ఉపాధ్యాయులకు (సండేస్కూలు టీచర్లు కూడా)

**ఒలీవల కొండ ప్రసంగంలోని యేసుప్రభువు ప్రవచనాలు**

| ప్రవచన రీతి | పాత నిబంధన లేఖన భాగం | క్రొత్త నిబంధన భాగం |
|---|---|---|
| **అంత్య దినాలు** | | |
| మార్కు 13:1-23 | దానియేలు 9:26, 17 | యోహాను 15:21 |
| మత్తయి 24:1-28 | దానియేలు 11:31 | ప్రకటన 11:2 |
| లూకా 21:5-24 | యోవేలు 2:2 | 1తిమోతి 4:1,2 |
| **క్రీస్తు రెండవ రాకడ** | | |
| మార్కు 13:24-27 | యెషయా 13:6-10 | ప్రకటన 6:12 |
| లూకా 21:25-28 | యెహెజ్కేలు 32:7 | మార్కు 14:62 |
| మత్తయి 24:29-31 | దానియేలు 7:13,14 | 1థెస్స 4:16 |

మార్కు 13లో, మనం తరచు ఒలీవల కొండ ప్రసంగం అని వ్యవహరించే దానిలో యేసుప్రభువు ప్రముఖంగా రెండు విషయాలు ప్రస్తావించాడు. అంత్యదినాలు, ఆయన రెండవ రాకడ. యేసుప్రభువు తన శిష్యులతో ఈ విషయాలు చెప్పటం, తాను రెండవమారు ఎప్పుడు వస్తానోనని ఊహిస్తూ కూర్చోమని కాదు. అందుకు భిన్నంగా తన అనుచరులంతా తన రాకడ కొరకు సిద్ధపడి, కనిపెడుతూ వుండాలనేది ఆయన కోరిక. ఇప్పుడు మనం యేసుప్రభువు సేవ నమ్మకంగా చేస్తే ఆయన తిరిగి వచ్చినప్పుడు సిద్ధంగా వుంటాం.

వర్తిస్తుంది. ఎందుకంటే పిల్లలను ప్రభువు దగ్గర తెచ్చే పనిలో వారి పాత్ర విశిష్టమైనది. ఇంతకూ, పిల్లల్ని ప్రభువు దగ్గరకు ఎవరు తీసుకురావాలి ? మనమంతా. ఎందుకంటే మనలో ప్రతి ఒక్కడికీ పిల్లలతో సంబంధం ఉంటుంది. కనుక మన పిల్లల్ని ప్రభువు దగ్గరకు తీసుకురావాలి.

**2. పిల్లల్ని మనం యేసుప్రభువు దగ్గరకు ఎలా తీసుకురావాలి ?**

యేసుప్రభువు లోకంలో వున్నప్పుడు తీసుకురావడం సులభం. ఎందుకంటే ఆయన కనిపిస్తున్నాడు గనుక, ఈ రోజు ఆయన కంటికి కనిపించడం లేదు కదా ! మరి పిల్లల్ని ఆయన దగ్గర ఎలా తీసుకురాగలం అనే సందేహం కలగటం సహజం. మొదటిమెట్టు, విశ్వాసంతో ఆయన దగ్గరకు తీసుకురావాలి. మనం ప్రభువును కంటితో చూడకపోయినా, ఆయన మనతో వున్నాడు. అలాగే ఆయన నామం పేర ప్రత్యేకంగా కూడుకొనినప్పుడు ప్రత్యేకరీతిలో ఆయన మనతో వుంటాడు. మత్తయి 18:20 చూడండి. మన ప్రార్థనలలో పిల్లలను ప్రభువు దగ్గరకు తీసుకురావచ్చు. తల్లిదండ్రుల ప్రార్థనను మించిన మరొకటి వుండదు. నీ సంరక్షణలో వున్న పిల్లల కొరకు నీవు ప్రార్థిస్తున్నావా? మన కుటుంబ ప్రార్థనలలో పిల్లల్ని ప్రభువు దగ్గరకు తీసుకురావచ్చు. మీ ఇంటిలో కుటుంబ ప్రార్థన వున్నదా?

క్రైస్తవ బోధ చేయటం ద్వారా పిల్లల్ని ప్రభువు దగ్గరకు నడిపించవచ్చు. "ప్రభువు శిక్షణలోను, బోధలోను వారు పెరుగునట్లు వారికి సరైన పుస్తకాలు ఇవ్వాలి ఎఫెసీ 6:4ను ద్వి.కా. 6:6,7తో పోల్చండి. పిల్లలను ప్రభువుకు ప్రత్యేకంగా ప్రతిష్ఠించడం ద్వారా వారిని ప్రభువు దగ్గరకు నడిపించవచ్చు. దీనికి చక్కటి ఉదాహరణ హన్న. ఆమె తన కుమారుడు సమూయేలును దేవాలయానికి తీసుకొని వచ్చి ప్రభువు సేవ కొరకు ప్రతిష్ఠించింది.(సమూ 1:24. అలాగే యేసు బాలుణ్ణి దేవాలయానికి తీసుకొని వచ్చి ప్రతిష్ఠించిన మరియ. (లూకా 2:22.) పిల్లలను యేసు దగ్గరకు తీసుకొని వచ్చే కొన్ని మార్గాలలో ఇవి కొన్ని మాత్రమే. అన్నిటికంటే ప్రాముఖ్య మైనది పిల్లల ఎదుట మన సాక్ష్యము, జీవితము. పిల్లలు ఏది సత్యమో, ఏది వేషధారణో, అసత్యమో ఇట్టే పసిగట్ట గలరు. మన మాటలు, క్రియలు పిల్లలను ప్రభువు చెంతకు నడిపించేవిగా వుండాలి.

**3. చిన్న పిల్లల్ని యేసుప్రభువు దగ్గరకు ఎప్పుడు తీసుకురావాలి ?**

మార్కు 10:13లో "చిన్న బిడ్డలు", లూకా 18:15లో "శిశువులు" అనే మాటలు వున్నాయి. యేసు వారిని తన చేతుల్లోకి తీసుకున్నప్పుడు అంటే వారు మరీ చిన్నవారు అయి వుంటారు. పిల్లల్ని ప్రభువు దగ్గరకు ఫలానా వయసులో తీసుకురావాలి అని ఏమైనా వున్నదా ? యూదుల సున్నతి సంస్కారం (యూదులు తమ పిల్లల విషయంలో దేవునిపట్ల తమ విశ్వాసం విధేయతలను సూచిస్తూ చేసే పని) పిల్లవాడు ఎనిమిది రోజుల వయసప్పుడు చేస్తారు.

పిల్లలు ఏ వయసులో రక్షకుడి పేరును గ్రహించగలరో ఇదమిద్ధంగా చెప్పలేం కాని, ప్రభువు మార్కు 10:14లో చెప్పిన మాటలు ఈ సందర్భంలో గమనార్హం, "చిన్న బిడ్డలను నా యొద్దకు రానియ్యుడి, వారిని ఆటంకపరచవద్దు, దేవుని రాజ్యము ఈలాంటివారిదే" క్రైస్తవులలో అత్యధికులు తాము బాల్యంలోనే, మరీ చిన్న పిల్లలుగా వున్నప్పుడే ప్రభువు దగ్గరకు వచ్చినట్లు సాక్ష్యం చెబుతారు. కనుక ఏ వయసులో పిల్లల్ని ప్రభువు దగ్గరకు నడిపించాలి అనే ప్రశ్నకు జవాబు, సాధ్యమైనంతవరకు చిన్న వయసులోనే.

**4. చిన్న పిల్లల్ని యేసు దగ్గరకు ఎందుకు తీసుకురావాలి ?**

ఒకటి, వారిని ప్రేమిస్తున్నాడు. రెండు, వారిని ఆహ్వానిస్తున్నాడు. మార్కు 10:14లో ఈ విషయం స్పష్టంగా వున్నది. మూడు, ఆయన వారికొరకు కూడా చనిపోయాడు. అపో.కా. 2:39, నాలుగు, పరలోక రాజ్యంలో వారికి కూడా స్థలం వున్నది మార్కు 10:14. అయిదు, వారికి కూడా ఆయన కావాలి. ఎందుకు? కీర్తన 51:5ను మత్తయి 18:14తో పోల్చి చూడండి.

చిన్న పిల్లలు ప్రమాదంలో వున్నారు కనుక వారికి రక్షకుడు కావాలి. సామె 22:6. ఈ కారణాలన్నిటిని బట్టి మనం అన్ని విధాలా ప్రయత్నించి వారిని ప్రభువు చెంతకు నడిపించాలి. మనము ఆ పని చేసినప్పుడు రెండువేల సంవత్సరాలనాడు "ఆ బిడ్డలను ఎత్తి కౌగలించుకొని, వారి మీద చేతులుంచి, ఆశీర్వదించినట్లే ఇప్పుడు కూడా జరుగు తుంది.

# మంచి పని చేసిన మరియ

**(లేఖన భాగం : మార్కు 14:3-9; ప్రశంస 6-9 వచనాలు)**

ప్రభువు మరియను ప్రశంసించిన సందర్భంలో చాలా చక్కని మాటలు వినియోగించాడు. "ఈమె నాయెడల మంచి కార్యము చేసెను" మొఫత్ ఈ వచనాన్ని ఇలా అనువదించాడు. "ఈమె నా కొరకు మనోహరమైన కార్యం జరిగించింది". ఇదీ మన పాఠం అంశం. మరియ ప్రభువు కొరకు మనోహర కార్యం చేసి ఆయన ప్రశంస పొందినట్లే మనము కూడా చేసి ఈయన ప్రశంస పొందాలి. ఇంతకూ ప్రభువు అంత మంచి ప్రశంసా వాక్కులు పలకటానికి కారణమేమిటి? ఒక ఇంటిలో విందు జరుగుతూ వుంది. ఇంటి యజమాని పేరు సీమోను. అతడంతకు ముందు కుష్ఠరోగి, ప్రభువు అతణ్ణి స్వస్థపరిచాడు. ఈ విందులో ముఖ్య అతిధి యేసుప్రభువు. ఆయన శిష్యులు కూడా ఆయనతో వున్నారు. మరియ సోదరి మార్త, వారి సోదరుడు లాజరు కూడా ఆ విందులో పాల్గొన్నారు. యోహాను 12:1-11 చూడండి. విందు సమయంలో మరియ తెచ్చిన శ్రేష్టమైన అత్తరును ప్రభువు తలమీద, పాదాలపైన పోసింది. ఆమె చేసిన పనిని యూదా విమర్శించాడు (యోహాను 12:4,5); ప్రభువు ప్రశంసించాడు. ఆమె చర్య ఎందుకు అంత మనోహరమైనది?

## 1. మరియ చేసిన పని మనోహరం ఎందుకంటే అది ఆయనపట్ల ప్రేమతో చేసిన పని

మరియ అత్తరు బుడ్డి పగలగొట్ట ప్రభువును అభిషేకించినప్పుడు ఆయనపట్ల మరియ తన ప్రేమను, భక్తిని వెల్లడించింది. ఆ అత్తరు బుడ్డి చాలా అందమైనది. అందులోని అత్తరుతో ప్రభువును అభిషేకించినప్పుడు ఆ పరిమళం గదంతా గుబాళించింది. అయితే అంతకంటే పరిమళ భరితమైనది ప్రభువుకు మరొకటి వున్నది. అది ఆమె హృదయంలోని ప్రేమానురాగాలు. తన ప్రజల ప్రేమ కంటే మించింది ప్రభువుకు మరొకటి వుండదు. యోహాను సువార్తలోని కథనంలో మార్త అతిధులకు పరిచర్య చేస్తున్నట్లు, లాజరు ప్రభువుతోబాటు పంక్తిలో కూర్చుని వున్నట్లు గమనిస్తాం. అప్పుడు మరియ ప్రభువును అభిషేకించింది (యోహాను 12:1-3) ఎంత మనోహర దృశ్యమిది! మార్త ప్రభువుకు చేసే సేవకు, లాజరు ప్రభువుతో సహవాసానికి, మరియ ప్రభువుపట్ల భక్తిని సాదృశ్యంగా వున్నారు. ప్రభువుకు ఈ మూడూ ప్రీతికరమైనవే కాని, మరియ భక్తి మరింత ప్రీతికరమైనది. ఆయనకు మన సేవ, సహకారం కావాలి. కాని అన్నిటికంటే మిన్నగా మన హృదయపూర్వక భక్తి కావాలి. తమ సోదరుని మృతులలో నుండి లేపినందుకు, ముమ్ముందు తనకోసం సిలువలో మరణించనున్నందుకు మరియ యేసును ప్రేమించింది అని గుర్తుంచుకోవాలి. అదే ప్రభువుకు మనం ఇవ్వగలిగిన అత్యున్నతమైన, శ్రేష్టమైన ప్రేమ "ఆయనే మొదట మనల్ని ప్రేమించాడు గనుక మనము ప్రేమిస్తున్నాము" (1యోహాను 4:19). తనను తాను మన కొరకు అర్పించుకొన్నాడు గనుక ప్రేమిస్తున్నాం" (గలతీ 2:20). అయితే అన్నింటికంటే మిన్నగా "అతికాంక్షణీయుడు" (ప.గీ. 5:16) గనుక ఈయనను ప్రేమిస్తున్నాం. మన దగ్గర అచ్చ జటామాంసి అత్తరుబుడ్డి లేదు కదా. మనమాయన్ను ఎలా ప్రేమించాలి అనుకుంటున్నారా ? యేసుప్రభువు పట్ల ప్రేమతో చేసిన ఎంత చిన్న పనైనా ఆయన దృష్టిలో మనోహరమైనదే.

## 2. మరియ చేసిన నని మనోహరమైనది ఎందుకంటే అందులో ఎంతో త్యాగం వున్నది.

ఈ అత్తరు 'చాలా విలువైనది" (మార్కు 14:3) అని మార్కు చెబుతున్నాడు. మరియ చేసిన మహోన్నత కార్యాన్ని విమర్శించిన యూదా "ఈ అత్తరెందుకు మూడు వందల దేనారముల కంటే ఎక్కువకు అమ్మి, బీదలకివ్వకూడదు" అన్నాడు (మార్కు 14:5). సాధారణ కార్మికుడికి ఇది ఒక సంవత్సరం కూలి. ఒక్క పర్యాయం అంత ఖర్చుపెట్టడం చాలా పెద్ద మొత్తం. మరియ అంతకంటే చాలా తక్కువ విలువగల అత్తరు తెచ్చి అభిషేకిస్తే ఎవరూ అడిగేవారు కాదు. అయితే ఆమె ప్రభువుకు శ్రేష్ఠమైనది ఇవ్వాలని ఆశించడంవల్ల దానికి ఆమె ఎంతో వెల చెల్లించింది 2సమూ 24:24 చూడండి. మనము త్యాగపూర్వకంగా ఇస్తున్నామా? ఎప్పుడైనా మనం ప్రేమతో ప్రేరితులమై, త్యాగపూర్వకంగా ఇస్తే దానిని ప్రభువు "మనోహరమైనది" అంటాడు.

## 3. మరియ పని మనోహరమైనది ఎందుకంటే ఆమె ముందే సిద్ధపడి వచ్చి ఆ పని చేసింది.

ఆమె ఆ క్షణంలో ఉద్రేకంతో చేసిన పనికాదు అది. తాను చెయ్యబోయే దాన్ని ముందే ఆలోచించుకున్నది. దానికి

తగ్గట్టే సిద్ధపడింది. మార్కు 14:8 ఈ విషయం స్పష్టం చేస్తున్నది. ఆమె యేసు పాదాల దగ్గర కూర్చొని ఆ బోధ వింటున్నప్పుడు, (లూకా 10:39), యేసు ఆమెతో తన మరణం, సమాధి, పునరుత్థానాల గురించి మాట్లాడుతాడని ఎవరు ఊహించి వుంటారు? అయితే ఆమె ప్రభువు మాటలు శ్రద్ధగా విన్నది. ఆయన్ను తన కానుకతో సన్మానించాలి అని తీర్మానించుకొని వుంటుంది. దానికి తగినరీతిలో సిద్ధపడి సరైన సమయం కోసం అవకాశం కోసం కనిపెడుతూ వుండి వుంటుంది. అత్తరు బుడ్లను ప్రశస్తమైన ద్రవ్యాలతో నింపి, ప్రభువుకు అర్పించడానికి తగిన సమయం కోసం కనిపెట్టే విశ్వాసులంటే ప్రభువుకు ఎంత ఇష్టమో! అలాంటి ప్రేమ వ్యక్తీకరణలు పరిమళ వాసనగా ఇంటిని నింపితే అలాంటిది ప్రభువుకు ఎంతో మనోహరం.

**4. మరియ పని మనోహరమైనది ఎందుకంటే ఆమె ఆ పనిని ఎలాంటి భేషజాలు లేకుండా చేసింది.**

తాను చేసే పనిని గురించి ముందుగాని తరువాత గాని ఏమీ మాటలాడలేదు. ఆ పని చేసింది అంతే. అందరికీ కనిపించేలా తన పనిని దండోరా వేసుకోలేదు. ఆ పని చేసినప్పుడు స్వీయతృప్తి అనేది కూడా లేదు. ఆమె మౌనంగా ఆ పని చేసింది. గనుకనే అది మనోహరం – 1పేతురు 3:4 చూడండి. నమ్రత, ఆత్మలో నెమ్మది ప్రభువుకు ఇష్టమైన లక్షణాలు. కొంతమంది తమ పనులను అందరి ఎదుటా చాటుకొని, తామెంత ప్రాముఖ్యతమైనవారమో అని వెల్లడించుకుంటారు. అయితే కీర్తన 149:4లో కీర్తనకారుడు ఏం చెబుతున్నాడో గమనించండి. దీనర్థమేమంటే యేసుప్రభువు పట్ల ప్రేమతో మనం చేసే ఏ పనైనా మన జీవితాల్లో ప్రతిబింబిస్తుంది.

**5. మరియ పని మనోహరం ఎందుకంటే ఆమె విమర్శను బొత్తిగా లెక్కచేయలేదు, తన పని తాను చేసుకుపోయింది.**

విమర్శంతా యూదా నుండి వచ్చిందే (యోహాను 12:4,5). అప్పటికి అతడు వీరికింకా తెలియదు, ప్రజల మధ్య పేరెన్నిక గన్నవాడు, తన సహోదరుల మధ్య మంచిపేరు కలిగి ఉన్నాడు. (అతడు తమ ప్రభువును అప్పగిస్తాడని గాని, వాడు దొంగ అని) ఎవరికీ ఇంకా తెలియదుగానీ, అతడు చెప్పినదాన్ని మరియ మనస్కరించి వుంటే ఏం జరిగేది? ఆమె తన ప్రభువును అభిషేకించి వుండేదే కాదు. యూదా విమర్శించడానికి అవకాశం ఉండేది కాదు. ఒకవేళ పేతురు, యోహాను తోమా లాంటివారు విమర్శించి వుంటే అది అనుకొన్నదేలే అని సరిపెట్టుకొనేదే – కాని ఇప్పుడు విమర్శించింది యూదా. ఈ రోజుల్లో కూడా ఇంతకంటే చిన్న విషయాలను కూడా లోకము, కొన్నిసార్లు శిష్యులు కూడా విమర్శిస్తుంటారు. మరియ పనిలోని రహస్యమేమిటి? మరియ హృదయం నిండా యేసుప్రభువే వున్నాడు, ఆమెకు యేసు తప్ప మరెవ్వరూ కనిపించటం లేదు (మార్కు 9:8 చూడండి). మరియ లాగా వుండటానికి ప్రయత్నిద్దాం. ఇతరులు విమర్శించవచ్చు, సందేహించి, అపార్థం చేసుకో వచ్చు. అయితే మన హృదయాలను ఎరిగిన ఒకరు వున్నారు ఆయన మన పనిని ప్రశంసిస్తాడు – ఆయనే యేసు.

ఆయనకు నేను ఎలాంటి మనోహరమైన పని చేయగలను అనుకుంటున్నావా? సమస్తము "ప్రభువు కొరకు" "ప్రభువు పని" అని చెయ్యి. అప్పుడది ఆయన దృష్టికి ఎంతో మనోహరంగా వుంటుంది.

### గలిలయుడు యేసు

గలిలయ ప్రాంతం సాంప్రదాయ యూదు జీవితానికి ప్రతీక, హీబ్రూ, గ్రీకు – రోమన్ రాజ్యాల సరిహద్దు. ఫలితంగా గలిలయులను తమ పొరుగునే వున్న యూదయ ప్రజలు తూలనాడేవారు. అవివేకి, అన్యుడు, పాపి, భ్రష్టుడు అనటానికి పర్యాయపదంగా గలిలయుడు" అనే పదం యూదయ ప్రాంత ప్రజలు ప్రయోగించేవారు. యేసు విషయానికి వస్తే, గలిలయ ప్రాంతం నుండి ప్రవక్త ఎవరూ రారని ఖరాఖండిగా తేల్చి చెప్పేసేవారు (యోహాను 7:52).

అయితే మాత్రమేం, గలిలయ నుండి ప్రవక్త రానే వచ్చాడు. యేసు తన సందేశ లక్షణాలను, దాని శక్తినీ వెల్లడించాడు (లూకా 4:14-19). గలిలయలో ఆయన కనీసం 33 అద్భుతాలు చేశాడు. గ్రంథస్థమైన 32 ఉపమానాల్లో 19 గలిలయ ప్రాంతంలో చెప్పినవే.

ఒక్క మాటలో చెప్పాలంటే గలిలయ జిల్లా యేసుప్రభువు బహిరంగ సేవకు కేంద్రబిందువు. తన సువార్త ఏ కొద్దిమంది మేధావి వర్గానికి కాదు, అందరికీ అని ఆయన వెల్లడించాడు. సమాజంలో వున్న అట్టడుగు వర్గాలకు ఆయన సువార్త ప్రకటించాడు. ఆయన పరిచర్య పైన ప్రారంభించి తరువాత క్రిందికి రాలేదు. క్రింది స్థాయి నుండి ప్రారంభించి, ఆ మీదట ఉన్నత వర్గాలను చేరుకున్నాడు.

అయితే, ఆయన నిర్గమనం తరువాత గలిలయలో ఆయన సందేశం వేళ్ళూనుకొన్నది అని చెప్పడానికి అట్టే బలమైన ఆధారాలు లేవు. కపెర్నహూము, కొరాజీను మొదలగు గలిలయ ప్రాంత పట్టణాలను గూర్చి ఆయన ప్రవచనాలు నెరవేరాయి (మత్తయి 11:20-24). వారి అవిశ్వాంతో వారి ఏకైక రాజును, ప్రవక్తను తిరస్కరించారు.

# యేసుక్రీస్తు జీవిత సంగ్రహం

1. యేసుప్రభువు చేసిన అద్భుతాలు - 36
2. యేసుప్రభువు చెప్పిన ఉపమానాలు - 38
3. యేసుప్రభువు చేసిన ప్రార్థనలు - 19
4. యేసుప్రభువు చెప్పిన ప్రవచనాలు - 45
5. యేసుప్రభువు చేసిన ప్రసంగాలు - 16
6. యేసుప్రభువు చేసిన సంభాషణలు - 36
7. యేసుప్రభువును గూర్చిన పాతనిబంధన లేఖనాలు-32
8. యేసు ప్రభువు ఉదహరించిన పాతనిబంధన లేఖన భాగాలు - 16
9. యేసుప్రభువు దైవత్వాన్ని గూర్చిన ఋజువులు -10
10. యేసుప్రభువు మానవతను గూర్చిన ఋజువులు-30
11. యేసుప్రభువు బిరుదులు, పేర్లు - 37
12. యేసుప్రభువు నెరవేర్చిన పాతనిబంధన ప్రవచనాలు - 37
13. యేసుప్రభువు ద్వారా రక్షణ పొందిన వ్యక్తులు- 27
14. యేసుప్రభువు అనుభవించిన వివిధ రకాల శ్రమలు - 15
15. యేసుప్రభువు చివర్లో మాటలాడిన మాటలు - 7
16. యేసుప్రభువు పునరుత్థానుడైన తరువాత ప్రత్యక్షతలు - 10

## యేసుప్రభువు అద్భుతాలు

1. నీళ్లను ద్రాక్షరసముగా మార్చాడు (యోహాను 2:7-9)
2. ప్రధాని కుమారుని స్వస్థపరిచాడు (యోహాను 4:50)
3. కపెర్నహూములో దయ్యం పట్టినవాణ్ణి బాగుచేశాడు (మార్కు, లూకా 4:35)
4. పేతురు అత్తను స్వస్థపరిచాడు (మత్తయి 8:15; మార్కు 1:31; లూకా 4:39)
5. విస్తారంగా చేపలు లభించేలా చేశాడు (లూకా 5:5,6)
6. కుష్ఠరోగిని స్వస్థపరిచాడు (మత్తయి 8:3; మార్కు 1:41)
7. పక్షవాత రోగిని స్వస్థపరిచాడు (మత్తయి 9:2,6,7; మార్కు 2:5,10-12; లూకా 5:20,24,25)
8. ఊచచెయ్యి గలవానిని బాగుచేశాడు (మత్తయి 12:13; మార్కు 3:5; లూకా 6:10)
9. శతాధిపతి సేవకుని స్వస్థపరిచాడు (మత్తయి 8:13; లూకా 7:10)
10. విధవరాలి కుమారుని బ్రతికించాడు (లూకా 7:14)
11. తుఫానును నిమ్మళింపజేశాడు (మత్తయి 8:26; మార్కు 4:39; లూకా 8:24)
12. గెరాసేనులు ప్రాంతంలో సేన దయ్యాలు పట్టినవాణ్ణి బాగుచేశాడు (మత్తయి 8:2; మార్కు 5:8; లూకా 8:33).
13. రక్తస్రావ రోగిని స్వస్థపరిచాడు (మత్తయి 9:22; మార్కు 5:29; లూకా 8:44)
14. యాయీరు కుమార్తెను బ్రతికించాడు (మత్తయి 9:25; మార్కు 5:41; లూకా 8:54)
15. ఇద్దరు గుడ్డివారికి చూపు ప్రసాదించాడు (మత్తయి 9:29)
16. మూగ దయ్యం పట్టినవాణ్ణి బాగుచేశాడు (మత్తయి 9:33)
17. ముప్పై ఎనిమిదేండ్ల అంగవికలుని స్వస్థపరిచాడు (యోహాను 5:8)
18. అయిదువేల మందిని పురుషులు, వారి కుటుంబాలకు ఆహారంపెట్టాడు (మత్తయి 14:19; మార్కు 6:41; లూకా 9:16; యోహాను 6:11).
19. సముద్రం మీద నడిచాడు (మత్తయి 14:25; మార్కు 6:48; యోహాను 6:19)

20. దయ్యం పట్టిన బాలికను బాగుచేశాడు (మత్తయి 15:28; మార్కు 7:29)

21. మాట మాంద్యముగల చెవిటివాణ్ణి బాగుచేశాడు (మార్కు 7:34,35)

22. 4000 పురుషులకు, వారి కుటుంబాలకు ఆహారం పెట్టాడు (మత్తయి 15:36; మార్కు 8:6)

23. గుడ్డివాడికి చూపు ప్రసాదించాడు (మార్కు 8:25)

24. పుట్టుగుడ్డికి చూపు ప్రసాదించాడు (యోహాను 9:7)

25. దయ్యం పట్టిన బాలుణ్ణి స్వస్థపరిచాడు (మత్తయి 17:18; మార్కు 9:25; లూకా 9:42)

26. కడుపులో నాణెం వున్న చేపను పట్టుకొనేలా చేశాడు (మత్తయి 17:27)

27. గుడ్డి, మూగ దయ్యం పట్టిన వ్యక్తిని బాగుచేశాడు (మత్తయి 12:22; లూకా 11:14)

28. 18 సంవత్సరాలుగా బలహీనతలో వున్న స్త్రీని స్వస్థపరిచాడు (లూకా 13:10-17)

29. జలోదర రోగిని స్వస్థపరిచాడు (లూకా 14:4)

30. పదిమంది కుష్ఠురోగులను స్వస్థపరిచాడు (లూకా 17:11-19)

31. లాజరును బ్రతికించాడు (యోహాను 11:43,44)

32. గుడ్డివాడికి చూపు ప్రసాదించాడు (మత్తయి 20:34; లూకా 18:42)

33. బర్తిమయి అనే గుడ్డివాడికి చూపు ప్రసాదించాడు (మార్కు 10:46,52)

34. అంజూరపు చెట్టును శపించాడు (మత్తయి 21:19; మార్కు 11:14)

35. తెగిన చెవిని అతికించాడు (మత్తయి 26:51; మార్కు 14:47; లూకా 22:50,51; యోహాను 18:10)

36. విస్తారంగా చేపలు పట్టేలా చేశాడు (యోహాను 21:6)

## అద్భుతాలను గూర్చి సంక్షిప్త వివరణ

1. వివిధ వ్యక్తులను స్వస్థపరచినవి (మొత్తం 17)
   1) జ్వరం (2,4 చూడండి)
   2) కుష్ఠు (6,30 చూడండి)
   3) పక్షవాతం (7,9,17 చూడండి)
   4) ఊచచెయ్యి (8 చూడండి)
   5) రక్తస్రావం (13 చూడండి)
   6) గుడ్డితనం (15,23,24,32,33 చూడండి)
   7) చెవుడు (21 చూడండి)
   8) జలోదర రోగం (29 చూడండి)
   9) తెగిన చెవి (35 చూడండి)
2. దయ్యాలను గద్దించాడు (మొత్తం 7)
   1) విలవిల లాడించిన సందర్భం (3,25 చూడండి)
   2) పిచ్చిపట్టినట్టు ప్రవర్తించిన సందర్భం (12 చూడండి)
   3) మూగవాడిని బాగు చేసిన సందర్భం (16 చూడండి)
   4) తెలియని బాధకు సంబంధించినది (20 చూడండి)
   5) అంధ, మూగ రోగానికి సంబంధించినది (27 చూడండి)
   6) పక్షవాత రోగానికి సంబంధించినది (28 చూడండి)
3. చనిపోయిన వారిని లేపాడు (3 సందర్భాలు)
   1) చిన్న బాలిక (14 చూడండి).
   2) ఒక యువకుడు (10 చూడండి)
   3) లాజరు (31 చూడండి)
4. తన శిష్యులను కాపాడుట (రెండు సందర్భాలు)
   1) పడవలో వున్నప్పుడు (11 చూడండి)
   2) నీళ్లమీద నడచినప్పుడు (19 చూడండి)
5. ఆకలితో ఉన్నవారికి ఆహారం పెట్టాడు (అయిదు సందర్భాలు)
   1) పెండ్లిలో అతిథులకు (1 చూడండి)

2) అయిదు వేలమందికి (18 చూడండి)

3) నాలుగు వేలమందికి (22 చూడండి)

4) శిష్యులలో నలుగురికి (5 చూడండి)

5) శిష్యులలో ఏడుగురికి (36 చూడండి)

6. పన్నుసొమ్ము ఏర్పాటు చేశాడు (36 చూడండి)

7. అంజూరపు చెట్టును శపించాడు (34 చూడండి)

## అద్భుతాలను గురించి కొన్ని నియమాలు

1. ఎప్పుడైనా, ఎక్కడైనా ఆయన అద్భుతాలు చేశాడు.

1) పెళ్లిలో (1 చూడండి)

2) అంత్యక్రియలలో (10,14,31 చూడండి)

3) శ్మశాన వాటికలో (12 చూడండి)

4) సమాజ మందిరంలో (3,8,28 చూడండి)

5) ఇళ్లలో (4,7,14,20,29 చూడండి)

6) సముద్రం ఒడ్డున (36 చూడండి)

7) తోటలో (35 చూడండి)

8) పర్వతంపైన (18,22 చూడండి)

9) కోనేటి ఒడ్డున (17 చూడండి)

10) పడవలపైన (5,11 చూడండి)

2. మన ప్రభువు చేసిన పదకొండు అద్భుతాల సందర్భంలో ఆయన ఆ వ్యక్తులను ముట్టుకున్నాడు. (4,6,14,15,19,21,23,25,33,35 చూడండి)

3. స్వస్థతకోరిన వ్యక్తి ఆయన్ను ముట్టుకొన్న సందర్భం ఒకటి

4. మూడు సందర్భాల్లో అద్భుతం చేస్తూ ఆయన నేలమీద ఉమ్మివేశాడు (21,23,24 చూడండి).

5. అయిదు అద్భుతాలు సబ్బాతు రోజు చేసినవి (8,17,24,28,29 చూడండి)

6. యేసుప్రభువు అద్భుతాలు జరిగించిన ఆరు సందర్భాల్లో జాలితో నిండిపోయాడు (6,10,18,22,32,33 చూడండి).

7. రెండు అద్భుతాల సందర్భాల్లో ఆయన ఆశ్చర్యంతో నిండిపోయాడు (9,20 చూడండి)

8. ఒక అద్భుతం సందర్భంలో ఆయన మూలిగాడు (21 చూడండి)

9. ఒక అద్భుతం సందర్భంలో ఆయన ఏడ్చాడు (21 చూడండి)

10. ఆయన చేసిన నాలుగు అద్భుతాలు విస్తృత ప్రభావం చూపాయి.

1) అయిదవ దానిని బట్టి పేతురు, ఆంద్రెయ, యాకోబు, యోహానులు సేవకు వచ్చారు

2) లాజరును బ్రతికించినందున (31) పరిసయ్యులతో చిక్కులు ఏర్పడ్డాయి

3) అంజూరపు చెట్టును శపించటం (34) ఇశ్రాయేలు జాతిని దేవుడు విడిచిపెట్టడాన్ని సూచిస్తుంది

4) 35 అద్భుతం పేతురును తక్షణమే చావకుండా కాపాడింది.

11. ఆయన చేసిన అద్భుతాలు మానవ హృదయం నైజం వెల్లడిస్తాయి.

1) విశ్వాసలేమి (2,11,19 చూడండి)

2) దుష్టత్వం (5,16,17,27,28 చూడండి)

3) కృతజ్ఞత లేకపోవడం (30 చూడండి)

12. కొన్నిసార్లు అద్భుతం చేసే సందర్భంలో ప్రశ్న అడిగాడు

1) అమ్మా నాతో నీకేమి (పని) ? (1 చూడండి)

2) నీ పాపములు క్షమింపబడి వున్నవి అని చెప్పుట సులభమా? నీవు లేచి నడువుమని చెప్పుట సులభమా ? (7 చూడండి)

3) విశ్రాంతి దినమున మేలు చేయుట ధర్మమా, కీడు చేయుట ధర్మమా ? (8 చూడండి)

4) "మీ విశ్వాసమెక్కడ ?" (11 చూడండి)

5) "నీ పేరేమి" ? (12 చూడండి)

6) "నన్ను ముట్టినది ఎవరు ?" (13 చూడండి)

7). "స్వస్థపడగోరుచున్నావా ?"

8) "వీరు భుజించుటకు ఎక్కడ నుండి రొట్టెలు కొని తెప్పింతుము" (18 చూడండి)

9) "ఎందుకు సందేహపడితివి ?" (19 చూడండి)

10) "మీ యొద్ద ఎన్ని రొట్టెలున్నవి ?" (22 చూడండి)

11) "నీకేమైనను కనబడుచున్నదా ?" (23 చూడండి)

12) “భూరాజులు, సుంకరులు, పన్నులను ఎవరి యొద్ద వసూలు చేయుదురు ?” (26 చూడండి)

13) “సాతాను సాతానును వెళ్లగొట్టిన యెడల వాని రాజ్యమేలాగు నిలుచును ?” (27 చూడండి)

14) “అతని ఎక్కడ వుంచితిరి ?” (31 చూడండి)

15) “నేను నీకు ఏమి చేయగోరుచున్నావు ?” (33 చూడండి)

16) “పిల్లలారా, భోజనమునకు మీ యొద్ద ఏమైనా వున్నదా?” (36 చూడండి)

13. అద్భుతము చేసే కొన్ని సందర్భాల్లో ఆయన ఆజ్ఞ జారీ చేసేవాడు

1) “బానలు నీళ్లతో నింపుడి” (1 చూడండి)

2) “దోనెను లోతుకు నడిపించి వలలు వేయుడి” (5 చూడండి)

3) “నీ చెయ్యి చూపుము” (8 చూడండి)

4) “నీవు లేచి, నీ మంచమెత్తుకొని, నీ ఇంటికి వెళ్లుము” (7,17 చూడండి)

5) “ఏబదేసిమంది చొప్పున పంక్తుల తీర్చి కూర్చుండ బెట్టుడి” (18 చూడండి)

6) “రమ్ము” (19 చూడండి)

7) ‘నీవు నీలోయము కోనేటికి వెళ్లి అందులో కడుగు కొనుము” (24 చూడండి)

8) “నీవు సముద్రమునకు పోయి, గాలము వేసి, మొదట పైకి వచ్చు చేపను పట్టుకొనుము” (26 చూడండి)

9) “లాజరూ, బయటికి రమ్ము” (31 చూడండి)

10) “దోనె కుడిప్రక్కన వల వేయుడి, మీకు దొరుకును” (36 చూడండి)

14. మొదటి, చివరి అద్భుతాలను యోహాను మాత్రమే గ్రంథస్తం చేశాడు (1,36 చూడండి)

15. నాలుగు సువార్తలలో కేవలం రెండు అద్భుతాలను అందరూ గ్రంథస్తం చేశారు (18,35 చూడండి)

16. పదహారు అద్భుతాలను ఒకే ఒక సువార్తలో మాత్రమే గ్రంథస్తం చేయటం జరిగింది.

1) మత్తయి మాత్రమే గ్రంథస్తం చేసినవి:15,16,26 (మొత్తంమీద మత్తయి 22 అద్భుతాలు గ్రంథస్తం చేశాడు)

2) మార్కు మాత్రమే గ్రంథస్తం చేసినవి : 21,23 (మొత్తం మీద మార్కు గ్రంథస్తం చేసిన అద్భుతాలు 19)

3) లూకా మాత్రమే గ్రంథస్తం చేసినవి: 5,10,28,29,30 (లూకా గ్రంథస్తం చేసిన అద్భుతాలు మొత్తం 19)

4) యోహాను మాత్రమే గ్రంథస్తం చేసిన అద్భుతాలు:1,2,17,24,31,36 (యోహాను గ్రంథస్తం చేసిన మొత్తం అద్భుతాలు 9)

17. ప్రభువు తన పరిచర్య మొదటి సంవత్సరం ఏడు అద్భుతాలు చేసినట్లు గ్రంథస్తమై వున్నది (1-7 చూడండి)

18. రెండవ సంవత్సరం ప్రభువు పన్నెండు అద్భుతాలు చేసినట్లు గ్రంథస్తమై వున్నది (8-19 చూడండి)

19. మూడో సంవత్సరం ప్రభువు అయిదు అద్భుతాలు చేసినట్లు గ్రంథస్తమై వున్నది (20-24 చూడండి)

20. నాలుగో సంవత్సరం ప్రభువు పన్నెండు అద్భుతాలు చేసినట్లు గ్రంథస్తమై వున్నది (25-36 చూడండి)

## ప్రభువు ఉపమానాలు

1. తుఫానులో చిక్కుకున్న రెండు ఇండ్లు (మత్తయి 7:24-27; లూకా 6:47-49)
2. యాభై, అయిదు వందల దేనారములు అప్పు వున్న వారిని క్షమించుట (లూకా 7:41-52)
3. బలవంతుని బంధించుట (మార్కు 3:22-30)
4. విత్తువాడు, విత్తనము, నేల (మత్తయి 13:1-9, 18-23; మార్కు 4:1-20; లూకా 8:4-15)
5. రక్షకుడి పొలంలో సాతాను గురుగులు (మత్తయి 13:24-30; 36-43)
6. విత్తటం, కోత కోయటం (మార్కు 4:26-29)
7. పెద్ద ఆవ వృక్షం (మత్తయి 13:31,32; మార్కు 4:30-32; లూకా 13:18,19)
8. పులిపిండి, పరలోక రాజ్యం (మత్తయి 13:33; లూకా 13:20,21)
9. పొలంలో నిధిని కనుగొనుట (మత్తయి 13:44)

10. ముత్యం వెల (మత్తయి 13:45,46)

11. మంచి, చెడ్డ చేపలను వేరు చేయుట (మత్తయి 13:47-50)

12. శాస్త్రీ, ధన నిధి (మత్తయి 13:52)

13. చిరిగిన బట్ట, పాత తిత్తి (మత్తయి 9:16,17; మార్కు 2:21,22; లూకా 5:36-39)

14. తుంటరి తరం (మత్తయి 11:16-19; లూకా 7:31-35)

15. క్షమాపణ పొంది, క్షమించని వ్యక్తి (మత్తయి 18:23-35)

16. నీ పొరుగువారెవరో తెలుసుకోవటం ఎలా ? (లూకా 10:25-37)

17. ఏడు దయ్యాలు, ఊడ్చి చక్కబెట్టిన ఇల్లు (మత్తయి 12:43-45; లూకా 11:24-26)

18. సందిగ్ధ స్థితిలో అవివేకి (లూకా 12:16-31)

19. మెళకువగా వుండుట (లూకా 12:32-40; మత్తయి 24:43,44)

20. పాపం చేస్తున్న సేవకుడు, తిరిగి రానున్నయజమాని (మత్తయి 24:45-51; లూకా 12:42-48)

21. నిష్ఫలమైన అంజూరపు చెట్టు (లూకా 13:6-9)

22. విందులలో అగ్రస్థానం ఆశించకుండటం (లూకా 14:7-11)

23. విందుకు రాకుండా వంకలు (లూకా 14:15-24)

24. తప్పిపోయిన గొర్రె, పోగొట్టుకున్న నాణెం, దౌర్భాగ్య స్థితిలో కుమారుడు (లూకా 15:1-32)

25. గృహనిర్వాహకుడి చేతివాటం (లూకా 16:1-13)

26. పాతాళం పరదైసుకు మొరపెట్టడం (లూకా 16:19-31)

27. "చేయవలసినవే చేశాము" (లూకా 17:7-10)

28. విధవరాలు, విసిగిపోయిన న్యాయాధిపతి (లూకా 18:1-8)

29. తలబిరుసు పరిసయ్యుడు, తగ్గించుకొన్న సుంకరి (లూకా 18:9-14)

30. కపదటివాడు మొదటివారు, తగ్గించుకొన్న సుంకరి (మత్తయి 20:1-16)

31. ముగ్గురు దాసులు, వారి మినాలు (లూకా 19:11-27)

32. మనసు మార్చుకొన్న ఇద్దరు కుమారులు (మత్తయి 21:28-32)

33. చెడ్డ ద్రాక్షతోట కాపరులు (మత్తయి 21:33-46; మార్కు 12:1-12; లూకా 21:9-19)

34. వివాహ వస్త్రంలేని వివాహ అతిథి (మత్తయి 22:1-14)

35. అంజూరపు చెట్టు, భవిష్యత్తు (మత్తయి 24:32-35; మార్కు 13:28-31; లూకా 21:29-33)

36. ఆరిపోయిన అయిదు దీపాలు (మత్తయి 25:1-13)

37. ముగ్గురు దాసులు, వారి తలాంతులు (మత్తయి 25:14-30)

38. గొఱ్ఱెలను, మేకలను వేరుచేయుట (మత్తయి 25:31-46)

## ప్రభువు ఉపమానాల సంగ్రహం

1. ఆయన ఉపమానాలలో క్రింది అంశాలు వున్నాయి.
   1) సరైన పునాది (1 చూడండి)
   2) క్షమాపణ (2,15 చూడండి)
   3) సాతాను (3,15,17 చూడండి)
   4) మనిషి హృదయం (4 చూడండి)
   5) పరలోక రాజ్యం (4-13 చూడండి)
   6) సంఘం (10 చూడండి)
   7). అంతిమ తీర్పు (5,11,38 చూడండి)
   8) ఇశ్రాయేలు (9,14,21,33,35 చూడండి)
   9) జాలి (16 చూడండి)
   10) సంపద (18 చూడండి)
   11) సిద్ధపాటు (19,20 చూడండి)
   12) దీనత్వం (22 చూడండి)
   13) లౌకిక పోకడలు (25 చూడండి)
   14) నరకం (18,26,34 చూడండి)
   15) గృహ నిర్వాహకత్వం (27,31,37 చూడండి)

16) ప్రార్థన (28,29 చూడండి)

17) పశ్చాత్తాపం (32 చూడండి)

18) రక్షణ (24 చూడండి)

2. దైనందిన జీవితంలోని అంశాలనే ఉపమానాల్లో వినియోగించాడు.

1) వ్యవసాయం (4,5,6,7,18,21,35 చూడండి)

2). చేపలు పట్టడం (11 చూడండి)

3) వివాహాలు (22,23,24,34,36 చూడండి)

4) గొర్రెలను కాయటం (24,38 చూడండి)

5) వర్తక లోకం (2,25,30 చూడండి)

## ప్రభువు ప్రార్థనలు

1. బాప్తిస్మం సమయంలో (లూకా 3:21)
2. మొట్టమొదటిసారి గలిలయకు సేవకు వెళ్లకముందు (మార్కు 1:35; లూకా 4:42)
3. కుష్ఠు రోగిని స్వస్థపరచిన తరువాత (లూకా 5,16)
4. పన్నెండు మంది శిష్యుల ఎంపికకు ముందు (లూకా 6:12)
5. అయిదు వేలమందికి ఆహారం పెట్టిన తరువాత (మత్తయి 14:23; మార్కు 6:46; యోహాను 6:15)
6. పేతురు గొప్ప ఒప్పుకోలు వినకముందు (లూకా 9:18)
7. రూపాంతర సమయంలో (లూకా 9:28,29)
8. తిరిగి వచ్చిన 70 మంది సమాచారం విన్న తరువాత (మత్తయి 11:25-27; లూకా 10:21,22)
9. మరియ, మార్తలను దర్శించిన పిమ్మట (లూకా 11:1)
10. కొంతమంది చిన్న పిల్లలను దగ్గరకు తీసుకొన్న తరువాత (మత్తయి 19:13-15; మార్కు 10:13-16; లూకా 18:15-17)
11. లాజరును బ్రతికించకముందు (యోహాను 11:41,42)
12. కొందరు గ్రీకులు ఆయన్ను చూడగోరినప్పుడు (యోహాను 12:27,28)
13. మేడగది విడిచి వెళ్లిన తరువాత (యోహాను 17:1-26)
14. తోటలో (మొదటి ప్రార్థన) (మత్తయి 26:39; మార్కు 14:35,36; లూకా 22:41,42)
15. తోటలో (రెండవ ప్రార్థన) (మత్తయి 26:42; మార్కు 14:39; లూకా 22:44)
16. తోటలో (మూడో ప్రార్థన) (మత్తయి 26:44)
17. సిలువపై (మోదటి ప్రార్థన) (లూకా 23:34)
18. సిలువపై (రెండో ప్రార్థన) (మత్తయి 27:46,47; మార్కు 15:34,35)
19. సిలువపై (మూడో ప్రార్థన) (లూకా 23:46)

## తోటలో ప్రార్థనలు

**(మత్తయి 26:36-46; మార్కు 14:32-42; లూకా 22:41-44)**

| మొదటి ప్రార్థన | రెండో ప్రార్థన | మూడో ప్రార్థన |
|---|---|---|
| ☐ ఆయన కెద్రోను వాగు దాటాడు | ☐ మరల ప్రార్థించి తనను తాను అప్పగించుకున్నాడు | ☐ అదే ప్రార్థన |
| ☐ పేతురు, యాకోబు, యోహానులను కూడా ప్రార్థించమని కోరాడు | ☐ దేవదూత వచ్చి, ఆయన్ను బలపరిచాడు | ☐ ముగ్గురు శిష్యుల్ని మూడోసారి మేల్కొల్పాడు |
| ☐ తన పాత్రను గురించి ప్రార్థించి, తండ్రి చిత్తానికి అప్పగించుకున్నాడు. | ☐ మరల నిద్రమత్తులో వున్న శిష్యులను తనను తాను అప్పగించుకున్నాడు | ☐ సైనికులు రావటం తెలియజేశాడు |
| ☐ నిద్రిస్తున్న శిష్యుల్ని మేల్కొలిపాడు | ☐ ముగ్గురు శిష్యులను మేల్కొల్పాడు | |

## ప్రార్థనలు సంగ్రహం

**1. ఆయన దేనికోసం ప్రార్థించాడు ?**

1) తండ్రి గలిలయ పరిచర్యను ఆశీర్వదించాలని (2 చూడండి)

2) పన్నెండుమంది ఎంపికలో తండ్రి నడిపింపు కోసం (4చూడండి)

3) కుమారుని దైవత్వం తండ్రి పేతురుకు బయలు పరచాలని (6 చూడండి)

4) డెబ్భైమంది ఆధ్యాత్మిక సత్యాలు వెల్లడించినందుకు తండ్రికి కృతజ్ఞతలు వ్యక్తం చేశాడు (8 చూడండి)

5) తన మనవి ఎల్లప్పుడూ విన్నందుకు తండ్రికి కృతజ్ఞత వ్యక్తం చేసేవాడు (11 చూడండి)

6) తండ్రికి మహిమ కలగాలని (12 చూడండి)

7) విశ్వాసులందరినీ తండ్రి భద్రపరచి, సమైక్య పరచి, పవిత్రపరచి, పరిపూర్ణులుగా చేసి క్రీస్తు దగ్గరకు అందరినీ సమకూర్చాలని (13 చూడండి)

8) వీలయితే తననుండి శ్రమలు తప్పించాలని (14,15,16 చూడండి)

9) తండ్రి చిత్తం నెరవేరాలని (14,15,16 చూడండి)

10) శత్రువులకు క్షమాపణ ప్రసాదిస్తూ (17 చూడండి)

11)తన శ్రమలను అర్థం చేసికొనునట్లు (18 చూడండి)

12). తండ్రి తన ఆత్మను చేర్చుకొమ్మని (19 చూడండి)

**2. ఎవరి కోసం ప్రార్థించాడు?**

1) చిన్నపిల్లల కోసం (10 చూడండి)

2) తన శత్రువుల కోసం (17 చూడండి)

3) తన కోసం (12-16,18,19 చూడండి)

4) విశ్వాసులందరి కోసం 913 చూడండి)

5) డెబ్భైమంది శిష్యుల కోసం (8 చూడండి)

**3. ఎప్పుడు ప్రార్థించాడు?**

1) రాత్రంతా (4 చూడండి)

2) మధ్యరాత్రి దాటిన కొద్ది సేపటికి (13-16 చూడండి)

3) వేకువనే (2 చూడండి)

4) పొద్దున్నే (17 చూడండి)

5) మధ్యాహ్న వేళ (18,19 చూడండి)

**4. ఎలా ప్రార్థించాడు ?**

1) ఆకాశంవైపు కన్నులెత్తి (11,13 చూడండి)

2) మోకరిల్లి (14,15 చూడండి)

3) సాష్టాంగపడి (14,15 చూడండి)

4) భూమ్యాకాశముల మధ్య వ్రేలాడి (17,18,19 చూడండి)

## యేసుప్రభువు ప్రవచనాలు

1. తన ఆరోహణ (యోహాను 1:50,51)
2. తన మరణ, పునరుత్థానాలు (యోమాను 2:19-22)
3. తన మరణం (యోహాను 3:14)
4. మహా ధవళ సింహాసనం తీర్పు (మత్తయి 7:21-23)
5. భవిష్యత్ పునరుత్థానం (యోహాను 5:28,29)
6. తనను అప్పగించేవాడి విషయం (యోహాను 6:70-71)
7. తన పునరుత్థానం (మత్తయి 16:4)
8. తన ఆరోహణం (యోహాను 7:33,34)
9. పెంతెకొస్తు (యోహాను 7:37-39)
10. తన ఆరోహణం (యోహాను 8:14,21)

### కల్వరి ప్రార్థనలు

మొదటి ప్రార్థన (లూకా 23:34) **"తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము"**

రెండో ప్రార్థన (మత్తయి 27:46; మార్కు 15:34) **"నా దేవా, నా దేవా, నన్నెందుకు చేయి విడిచితివి?"**

మూడో ప్రార్థన (లూకా 23:46) **"తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుచున్నాను"**

11. తన మరణం (యోహాను 8:28)
12. తన మరణం (యోహాను 10:17,18)
13. సంఘం (మత్తయి 16,18,19)
14. తన పునరుత్థానం (మత్తయి 16:27; మార్కు 8:31; లూకా 9:22)
15. తన రూపాంతరం (మత్తయి 16o27; మార్కు 8:38; లూకా 9:26)
16. తన రూపాంతరం (మత్తయి 16:28; లూకా 9:27)
17. తన పునరుత్థానం (మత్తయి 17:12; మార్కు 9:9)
18. తన శ్రమల విషయం (మత్తయి 17:12; మార్కు 9:12)
19. తనను అప్పగించేవాడి విషయం (లూకా 9:44; మత్తయి 17:22)
20. తన పునరుత్థానం విషయం (మార్కు 9:31; మత్తయి 17:23)
21. తన పునరుత్థానం విషయం (మత్తయి 12:38-40; లూకా 11:29,30)
22. మహా ధవళ సింహాసనం తీర్పు (మత్తయి 12:14,42; లూకా 11:31-32)
23. మహా ధవళ సింహాసనం (లూకా 12:2,3)
24. తన శ్రమల విషయం (లూకా 17:25)
25. చివరి రోజుల విషయం (లూకా 17:26-30)
26. అర్మెగిద్దోను విషయం (లూకా 17:34-47)
27. భవిష్యత్ బహుమానాల గురించి (మత్తయి 19:27-30; మార్కు 10:28-31; లూకా 18:28-30)
28. తన పునరుత్థానం విషయం (మత్తయి 20:17-19; మార్కు 10:32-34; లూకా 18:31-34)
29. యెరూషలేము నాశనం (లూకా 19:43-44)
30. ఇశ్రాయేలును పక్కనబెట్టే విషయం (మత్తయి 21:43,44)
31. తన మరణం విషయం (యోహాను 12:20-26)
32. తన మరణం విషయం (యోహాను 12:32)
33. శ్రమల కాలం విషయం (మత్తయి 24:1-42)
34. తన రెండవ రాకడ విషయం (మత్తయి 24:29-41)
35. తన మరణం విషయం (మత్తయి 26:2)
36. తనను అప్పగించే విషయం (యోహాను 13:18-33; మత్తయి 26:21-25; మార్కు 14:18-21; లూకా 22:21-23)
37. పేతురు మరణం విషయం (యోహాను 13:36)
38. పేతురు మొదటిసారి మూడు పర్యాయాలు బొంకే విషయం (యోహాను 13:38; లూకా 22:34)
39. ఆయన రాకడ విషయం (యోహాను 14:2,3)
40. తన శిష్యులే తనను విడిచి వెళ్లే విషయం (మత్తయి 26:31)
41. పునరుత్థానం తరువాత గలిలయలో శిష్యులను కలిసే విషయం (మత్తయి 26:32; మార్కు 14:28; 16:7)
42. రెండవసారి పేతురు ముమ్మారు బొంకే విషయం (మత్తయి 26:33-35; మార్కు 14:29-31)
43. తన రెండవ రాకడ విషయం (లూకా 22:64)
44. తన రెండవ రాకడ విషయం (లూకా 22:69)
45. యెరూషలేము నాశనం విషయం (లూకా 23:28-31)
46. పేతురు హతసాక్షి అయ్యే విషయం (యోహాను 21:18,19)

## ప్రవచనాల సంక్షిప్త సారాంశం

### తనను గూర్చి చెప్పినవి

1. శ్రమ పొంది, మరణించి, తిరిగి లేస్తానని చెప్పాడు (2, 3, 7,11,12,14,17, 18,19,20,21,24, 28, 31, 32, 35)
2. రూపాంతరం చెందుతానని చెప్పాడు (16 చూడండి)
3. తనను అప్పగిస్తారని చెప్పాడు (6,19,36 చూడండి)
4. తనను తిరస్కరిస్తారని చెప్పాడు (38,42 చూడండి)
5. తనను వదలి వెళ్లారని చెప్పాడు (40 చూడండి)
6. పునరుత్థానం తరువాత గలిలయలో ప్రత్యక్షమవుతానని చెప్పాడు (41 చూడండి)

7. ఆరోహణమవుతానని చెప్పాడు (1,8,10 చూడండి)

8. పరిశుద్ధాత్మను పంపిస్తానని చెప్పాడు (9 చూడండి)

9. తన సంఘాన్ని స్థాపిస్తానని చెప్పాడు (13 చూడండి)

10. తాత్కాలికంగా ఇశ్రాయేలును పక్కన బెడతానని చెప్పాడు (30 చూడండి)

11. తిరిగి వస్తానని చెప్పాడు (15,39,43,44 చూడండి)

12. ఒకానొక రోజు అందరినీ బ్రతికించి తీర్పు తీరుస్తానని చెప్పాడు (4,5,22,23,27 చూడండి)

## ప్రాముఖ్యమైన ప్రవచనాలు

| ప్రవచనం స్వభావం | ప్రవచన రిఫరెన్సు | |
|---|---|---|
| 1. ఆయన శ్రమలు, మరణం, పునరుత్థానం | ❖ యోహాను 2:19-22; | మత్తయి 16:4,21; |
| | ❖ యోహాను 3:14; | మత్తయి 17:22,23; |
| | ❖ యోహాను 10:11-18 | మత్తయి 20:17-19 |
| 2. రూపాంతరం | ❖ మత్తయి 16:28 | |
| 3. ఆయనను అప్పగించే వ్యక్తి | ❖ యోహాను 6:70,71 | |
| 4. పేతురు నిరాకరణలు | ❖ యోహాను 13:38; | మార్కు 14:26-31 |
| 5. గలిలయలో వారికి ప్రత్యక్షమగుట | ❖ మత్తయి 26:31,32 | |
| 6. ఆరోహణం | ❖ యోహాను 1:50,51 | |
| 7. పెంతెకొస్తు | ❖ యోహాను 7:37-39 | |
| 8. సంఘం | ❖ మత్తయి 16:13-19 | |
| 9. సంఘం పైకెత్తబడటం | ❖ యోహాను 14:2,3 | |
| 10. రెండవ రాకడ | ❖ మత్తయి 16:27 | మత్తయి 26:24 |
| 11. మహా ధవళ సింహాసనం తీర్పు | ❖ మత్తయి 7:21-23; | మత్తయి 12:41,42 |
| 12. భవిష్యత్ పునరుత్థానం | ❖ యోహాను 5:28-29 | |
| 13. చివరి రోజులు | ❖ లూకా 17:26-30 | |
| 14. అర్మెగిద్దోను | ❖ లూకా 17:34-37 | |
| 15. భవిష్యత్ బహుమానాలు | ❖ మార్కు 10:28-31 | |
| 16. పేతురు మరణం | ❖ యోహాను 21:18,19 | |

### ఇతర అంశాలు

1. చివరి రోజులు (25)
2. ఆర్మెగిద్దోను (26)
3. యెరూషలేము నాశనం (29:45)
4. శ్రమలు (33)
5. పేతురు మరణం (37,46)

## యేసుప్రభువు ప్రసంగాలు

1. స్వస్థలంలోని సమాజమందిరంలో యెషయా 61 నుండి బోధించాడు (లూకా 4:16-30)
2. పరలోక రాజ్య లక్షణాలను గూర్చి బోధించాడు (కొండ మీద ప్రసంగం) (మత్తయి 5-7; లూకా 6:20-49; 12:22-31; 57-59; 16:17)
3. పరలోక రాజ్యాన్ని గూర్చిన తొమ్మిది సాదృశ్యాలు (మత్తయి 13:31-52; మార్కు 4:1-34; లూకా 8:4-18; 13:18-21)
4. బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి బోధించాడు (మత్తయి 11:7-15; లూకా 7:24-30)
5. తీర్పు, పునరుత్థానాలను గురించి బోధించాడు (యోహాను 5:19-47)
6. బయలుదేరి వెళ్తున్న పన్నెండుమంది శిష్యులకు ఉపదేశం (మత్తయి 10:5-16; 24633; 37-42; మార్కు 6:8-11; లూకా 9:3-5)
7. జీవాహారమును గూర్చిన బోధ (యోహాను 6:26-59)
8. చెడుకు మూలమును గూర్చిన బోధ (మత్తయి 15:1-20; మార్కు 7:1-23)
9. అపవాది, వాడి సంతానం విషయమైన బోధ (యోమాను 10:1-18; 8:33-59)
10. మంచి కాపరిని గూర్చి బోధ (యోహాను 10:1-18)
11. నరకం విషయమైన బోధ (మత్తయి 18:1-20; మార్కు 9:33-10:1; లూకా 9:46-50)
12. బయలుదేరి వెళ్తున్న 70 మంది శిష్యులకు ఉపదేశం (మత్తయి 11:20-24; లూకా 10:1-16)
13. మత వేషధారులకు వ్యతిరేకంగా బోధ (మత్తయి 23:1-36; మార్కు 12:38-49; లూకా 20:45-47)
14. చివరి శ్రమలను గూర్చిన బోధ (ఒలీవల కొండ ప్రసంగం) (మత్తయి 24:1-42; 10:17-23; 25:1-46; మార్కు 13:1-37; లూకా 21:5-36; 12:11,12)
15. తన తండ్రి ఇంటిని గూర్చిన బోధ (యోహాను 14:1-31)
16. ద్రాక్షవల్లి, తీగెలను గూర్చిన సందేశం (యోహాను 15:1-16:33)

### *ప్రభువు ప్రసంగాల సంక్షిప్త సారాంశం*

1. ఒక ప్రసంగం తరువాత ఆయన్ను చంపినంత పని చేశారు (1 చూడండి)
2. దోనెలో కూర్చొని ఒక ప్రసంగం చేశాడు (3 చూడండి)
3. రెండు సుదీర్ఘ ప్రసంగాలు రెండు కొండలపైన చేశాడు (2,14 చూడండి)
4. అనేక ప్రసంగాలు యెరూషలేములోని దేవాలయం సమీపంలో చేశాడు (5,8,9,10,13,15,16 చూడండి)
5. రెండు ప్రసంగాలు బోధకులకు చేశాడు (6,12 చూడండి)
6. తనను తాను సమర్థించడానికి ఒక ప్రసంగం చేశాడు (9 చూడండి)
7. శిష్యులను సమర్థించడానికి ఒక ప్రసంగం చేశాడు (8 చూడండి)
8. ఒక ప్రసంగంలో పిల్లవాణ్ణి సాదృశ్యంగా చూపెట్టాడు (11 చూడండి)
9. మేడగదిలో ఒక ప్రసంగం చేశాడు (15 చూడండి)
10. వెన్నెలలో ఒక ప్రసంగం చేశాడు (16 చూడండి)
11. మొదటి సంవత్సరం సేవలో ఆయన చేసిన ప్రసంగం ఒకటి గ్రంథం చేసి వున్నది (1 చూడండి)
12. రెండవ సంవత్సరం సేవలో అయిదు ప్రసంగాలు గ్రంథస్తం చేసి వున్నాయి (2-6 చూడండి)
13. మూడవ సంవత్సరం సేవలో నాలుగు ప్రసంగాలు గ్రంథం చేసి వున్నాయి (7-10 చూడండి)

14. నాలుగో సంవత్సరం ఆయన చేసిన రెండు ప్రసంగాలు గ్రంథం చేసి వున్నాయి (11,12 చూడండి)

15. చివరి వారం ఆయన చేసిన నాలుగు ప్రసంగాలు గ్రంథస్తమై వున్నాయి (13-16 చూడండి)

## ప్రభువు వ్యక్తిగత సంభాషణలు

1. తన సర్వజ్ఞత, ఆరోహణల విషయం నతనయేలుతో (యోహాను 1:47-51)
2. తన జీవిత ఉద్దేశం విషయం తల్లితో (యోహాను 2:3,4)
3. నూతన జన్మను గూర్చి నికొదేముతో (యోహాను 3:1-21)
4. జీవజలము గూర్చి సమరయ స్త్రీతో (యోమాను 4:6-26)
5. స్వస్థత విషయం ఒక కుష్ఠురోగితో (మత్తయి 8:2-4)
6. స్వస్థత, విశ్వాసం విషయం శతాధిపతితో (మత్తయి 8:6-13; లూకా 7:4-9)
7. ప్రేమ, క్షమాపణలను గూర్చి సీమోను అనే పరిసయ్యుడితో (లూకా 7:40-47)
8. యాయీరుతో అతడి కుమార్తె విషయం (మార్కు 5:22,23,35,36)

## ప్రముఖ ప్రసంగాలు

| ప్రసంగం | ప్రసంగించిన స్థలం | ఉద్దేశం | లేఖనభాగం |
|---|---|---|---|
| 1. యెషయా 61 నుండి | నజరేతు | తనను తాను మెస్సీయగా వెల్లడించుకోవడం | లూకా 4 |
| 2. పర్వత ప్రసంగం | తాబోరు పర్వతం | విశ్వాసులు ఇప్పుడు చేయవలసిన పని చెప్పడం వెయ్యేండ్ల పాలనలో ప్రపంచం ఏమి చేస్తుందో వెల్లడించడం | మత్తయి 5-7 |
| 3. తీర్పు, పునరుత్థానం | యెరూషలేములోని దేవాలయంలో | జీవాధిపతిగా తమ తండ్రితో సమానం చేసుకోవడం | యోహాను 5:19-47 |
| 4. జీవాహారము గూర్చి | గలిలయ సరస్సు ఒడ్డున | జీవాహారము, తనను తాను తండ్రితో సమానం చేసుకోవడం | యోహాను 6:22-71 |
| 5. పర్ణశాలల పండుగ | యెరూషలేము దేవాలయంలో | జీవజలము దగ్గరకు ప్రజలను ఆహ్వానించడం | యోహాను 7:1-52 |
| 6. దేవాలయం | యెరూషలేము దేవాలయంలో | లోకానికి తానే జీవము, వెలుగు అని వెల్లడించుకోవడం | యోహాను 8:12-59 |
| 7. మంచికాపరి | యెరూషలేములో | కీర్తన 23, యెహెజ్కేలు 34 నెరవేర్పు | యోహాను 10:1-28 |
| 8. ఒలీవల కొండ | ఒలీవల కొండపై | శ్రమల కాలంలో విశ్వసించిన యూదులకు సజీవ మార్గదర్శిగా ఉండేందుకు | మత్తయి 24,25 |
| 9. తండ్రి ఇంటిని గూర్చిన ప్రసంగం | మేడగదిలో | అపొస్తలులను సిలువ, పెంతెకొస్తులకు సిద్ధపరచుట | యోహాను 13 |
| 10. ద్రాక్షవల్లి పరిశుద్ధాత్మలను గూర్చిన ప్రసంగం | గెత్సెమనే దారిలో | విశ్వాసులను సేవకు సిద్ధపరచుటకు | యోహాను 15,16 |

9. 38 ఏండ్ల నుండి రోగముతో పడియున్న వ్యక్తితో స్వస్థతను గూర్చి (యోహాను 5:6-8,14)

10. సురోఫోనీకే దేశ స్త్రీతో ఆమె కుమార్తె విషయం (మత్తయి 15:21-28)

11. స్వస్థతను గూర్చి గుడ్డివాడితో (మార్కు 8:22-26)

12. ఒక వ్యభిచార స్త్రీతో ఆమెపై నిందలు మోపుతున్న వారి విషయం (యోహాను 8:10,11)

13. తన దైవత్వాన్ని గూర్చి పుట్టు గుడ్డితో (యోహాను 9:7,35-38)

14. దయ్యం పట్టిన బాలుడి తండ్రితో (మార్కు 9:17-24)

15. పొరుగువాడెవరు అన్న అంశంపై ఒక ధర్మశాస్త్ర పండితుడితో (లూకా 10:25-37)

16. శిష్యరికాన్ని గూర్చి కాబోయే ముగ్గురు శిష్యులతో (లూకా 9:57-62)

17. లోభత్వాన్ని గురించి గుంపులోని ఒక వ్యక్తితో (లూకా 12:13,14)

18. కృతజ్ఞత విషయం కుష్ఠరోగితో (లూకా 17:13-19)

19. నిత్యజీవం విషయం యువ అధికారితో (మత్తయి 19:16-22)

20. స్వస్థత విషయం గుడ్డి బర్తిమయితో (మార్కు 10:46-52)

21. రక్షణ విషయం జక్కయ్యతో (లూకా 19:1-10)

22. స్వస్థత విషయం గుడ్డి బర్తిమయితో (మార్కు 10:46-52)

23. ఆజ్ఞలలో ఏది గొప్పది అనే విషయంపై ఒక శాస్త్రితో (మార్కు 12:28-34)

24. త్రిత్వం నమ్మిన వారిలో శాశ్వతంగా నివసించే విషయం యూదాతో (ఇస్కరియోతు కాదు) (యోహాను 14:22,23)

25. తన బోధ విషయం ప్రధాన యాజకుడు అన్నతో (యోహాను 18:19-23)

26. తన దైవత్వాన్ని గూర్చి కయపతో (మత్తయి 26:62-64)

27. పరదైసును గూర్చి చనిపోయే దొంగతో (లూకా 23:42-43)

28. తన పునరుత్థానాన్ని గూర్చి మగ్దలేనే మరియతో (లూకా 24:17-27)

29. తన పునరుత్థానాన్ని గూర్చి క్లోపాతో (లూకా 24:17-27)

30. పేతురుతో
    1) ఆత్మల సంపాదన విషయం (లూకా 5:4-11)
    2) విశ్వాసం విషయం (మత్తయి 14:26-31)
    3) శిష్యరికాన్ని గూర్చి (యోహాను 6:66-70)
    4) తన దైవత్వాన్ని గూర్చి (మత్తయి 16:18,19)
    5) తన శ్రమలను గూర్చి (మత్తయి 16:21,23)
    6) పన్ను చెల్లించే విషయం (మత్తయి 17:25-27)
    7) క్షమాపణను గూర్చి (మత్తయి 18:21,22)
    8) తగ్గింపు విషయం (యోహాను 13:6-11)
    9) పేతురు మొదటి నిరాకరణ విషయం (యోహాను 13:36-38)
    10) పేతురు రెండవ నిరాకరణ విషయం (మార్కు 14:29-31)
    11) క్రీస్తుపట్ల పేతురుకున్న ప్రేమ విషయం (యోహాను 21:15-22)

31. మార్తతో
    1) అతి ప్రాముఖ్యమైన వాటిని గూర్చి (లూకా 10:38-42)
    2) పునరుత్థానాన్ని గూర్చి (యోహాను 11:21-27,39,40)

32. యూదాతో
    1) మేడగదిలో తనను పట్టిఇచ్చే విషయం (మత్తయి 26:25; యోహాను 13:27)
    2) తోటలో తనను పట్టిఇచ్చే విషయం (మత్తయి 26:49,50)

33. పిలాతుతో
    1) తన రాజ్యమును గూర్చి (మత్తయి 27:11-14; మార్కు 15:15; లూకా 23:3; యోహాను 18:33-38)
    2) తన అధికారమును గూర్చి (యోహాను 19:8-11)

34. యాకోబు, యోహానులతో

1) మత (శాఖల) దురభిమానం విషయం (మార్కు 9:38–42)

2) ప్రతీకారం విషయం (లూకా 9:54–56)

3) పరలోక రాజ్యంలో స్థానాల ఏర్పాటు విషయం (మత్తయి 20:20–23; మార్కు 10:38–40)

35. ఫిలిప్పుతో

1) అయిదువేల మందికి ఆహారం పెట్టే విషయం (యోహాను 6:5–7)

2) తండ్రిని గూర్చి (యోహాను 14:8,9)

36. తోమాతో

1) జీవమార్గం విషయం (యోహాను 14:5,6)

2) అవిశ్వాసం విషయం (యోహాను 20:26–29)

## ప్రభువు ప్రస్తావించిన పాత నిబంధన వ్యక్తులు, సంఘటనలు

1. ఆదాము, హవ్వల సృష్టి (ఆది 1:27; 2:24; మార్కు 10:6–8)
2. హేబెలు హత్యాకాండ (ఆది 4:10; లూకా 11:51)
3. నోవహుకాలం నాటి భ్రష్టత్వం, జలప్రళయం (ఆది 6,7; లూకా 17:26,27)
4. లోతుకాలం నాటి భ్రష్టత్వం, అన్న (ఆది 19; లూకా 17:32)
5. లోతు భార్య లోకం పోకడ (ఆది 19:26; లూకా 17:32)
6. మండుతున్న పొద – మోషే (నిర్గమ 3; మార్కు 12:26)
7. పరలోక మన్నా – మోషే (నిర్గమ 16:15; యోహాను 6:31)
8. ఇత్తడి సర్పం – మోషే (సంఖ్యా 21:8; యోహాను 3:14)
9. సముఖపు రొట్టెలు – దావీదు (1సమూ 21:6; మత్తయి 12:3,4)
10. సొలొమోను – షేబరాణి (1రాజులు 10:1; మత్తయి 12:42)
11. ఏలీయా – విధవరాలు, కరువు (1రాజులు 10:1; మత్తయి 12:42)
12. సయమాను – అతడి కుష్ఠ (2రాజులు 5; లూకా 4:27)
13. జెకర్యా హత్య – (2దిన 24:20,21; లూకా 11:51)
14. దానియేలు – దేవాలయంలో హేయమైన దానిని నిలుపుట (దాని 9:27; 11:31; 12:11; మత్తయి 24:15)
15. యోనా – చేప (యోనా 1:17; మత్తయి 12:40; 16:4)
16. యోనా – నీనెవె ప్రజల పశ్చాత్తాపం (యోనా 3:4–10; లూకా 11:30; మత్తయి 12:41)

## ప్రభువు ప్రస్తావించిన పాత నిబంధన లేఖనాలు

1. శోధన సమయంలో

   1) మొదటి శోధన (మత్తయి 4:4లో ద్వితీ 8:3)
   2) రెండవ శోధన (మత్తయి 4:7లో ద్వితీ 6:16)
   3) మూడవ శోధన (మత్తయి 4:10లో ద్వితీ 6:13)

2. కొండమీది ప్రసంగంలో

   1) మత్తయి 5:21లో నిర్గమ 20:13 ఆరో ఆజ్ఞ
   2) మత్తయి 5:27లో నిర్గమ 20:14 ఏడో ఆజ్ఞ మత్తయి 53:1ని ద్వి.కా. 24:1తో పోల్చండి

   గమనిక : తరువాత సంపన్న యువకుడితో ఇవే ఆజ్ఞలలో కొన్నిటిని పేర్కొన్నాడు (మార్కు 10:19).

3. స్వస్థలంలో చేసిన ప్రసంగంలో (లూకా 4:18,19లో యెషయా 61:1,2)
4. యూదులతో తలపడిన పలు సందర్భాల్లో

   1) పాపులతో తన సాహచర్యం సమర్థించుకొన్న సందర్భంలో (మత్తయి 9:13లో హోషేయా 6:6)
   2) వివాహం విషయం విరించినప్పుడు (మార్కు 10:7,8లో ఆది 2:24)
   3) గొప్ప ఆజ్ఞ ఏది అని అడిగిన సందర్భంలో (మార్కు 12:29,30 లో; ద్వితీ 6:4,5)
   4) వారి వ్యర్థ సాంప్రదాయాలను మందలించి నప్పుడు (మత్తయి 15:7–9లో యెషయా 29:13)
   5) పరిసయ్యులు తన అధికారాన్ని ప్రశ్నించినప్పుడు (యోహాను 8:17లో ద్వి.కా. 17:6)

5 యోహానుకు నివాళి అర్పించినప్పుడు (లూకా 7:27 లో మలాకీ 3:1)

6. తాను విజయ ప్రవేశం చేసిన రోజు (మత్తయి 21:16లో కీర్తన 8:2)

7. దేవాలయాన్ని సంస్కరించిన సందర్భంలో (లూకా 19:46లో యెషయా 56:7)

8. ఇశ్రాయేలును గూర్చి చెప్పిన ఒక ఉపమానంలో (మత్తయి 21:42-44లో కీర్తన 118:22,23; యెషయా 8:14,15)

9. దేవాలయంలో ప్రశ్నోత్తరాల సమయంలో (మార్కు 12:36లో కీర్తన 110:1)

10. చివరి పస్కా రాత్రి : తనను ద్వేషించినట్లు శిష్యులను ద్వేషిస్తారని ముందే వెల్లడించుట (యోహాను 15:25 లో కీర్తన 35:19; 69:4)

11. సిలువలో
    1) నాలుగో మాట (మత్తయి 27:46లో కీర్తన 22:1)
    2) ఏడో మాట (లూకా 23:46లో కీర్తన 31:5)

## ప్రభువు దైవత్వం

1. దేవదూతలు ఆయన దైవత్వం ప్రకటించారు
    1) గబ్రియేలు మరియతో (లూకా 1:26-33)
    2) గబ్రియేలు యోసేపుతో (మత్తయి 1:20-23)
    3) కొందరు కాపరులతో గబ్రియేలు (లూకా 2:8-11)
    4) కొందరు స్త్రీలతో గబ్రియేలు (మత్తయి 28:5,6)

2. తండ్రి ఆయన దైవత్వం ప్రకటించాడు
    1) ఆయన బాప్తిస్మం సమయంలో (మత్తయి 3:16,17)
    2) ఆయన రూపాంతరం సందర్భంలో (మత్తయి 17:5)
    3) ఆయన శ్రమలకు కొద్ది ముందు (యోహాను 12:27,28)

3. ఆయన అద్భుతాలు ఆయన దైవత్వాన్ని వెల్లడించాయి (యోహాను 20:30,31; 21:25)

4. శక్తివంతమైన ఆయన సందేశాల్లో ఆయన దైవత్వం వెల్లడైంది (లూకా 4:32; యోహాను 7:46)

5. ఖచ్చితమైన ఆయన ప్రవచనాలు ఆయన దైవత్వాన్ని వెల్లడిస్తున్నాయి (మత్తయి 26:32)
    1) పిలాతు మాటల్లో (యోహాను 19:4)
    2) పిలాతు భార్య మాటల్లో (మత్తయి 27:19)

ఆలోచించండి
7:9-13

### తల్లిదండ్రులను సన్మానించండి

**తల్లిని, తండ్రిని సమానంగా గౌరవించాలని, (మార్కు 7:10) ధర్మశాస్త్రం నిర్దేశిస్తుంది (నిర్గమ 20:12). తల్లిదండ్రులను శపించే వారిపై ధర్మశాస్త్రం కఠినమైన శిక్షలు విధించింది (లేవీ 20:9). "యూదుల జ్ఞాన సాహిత్యం ప్రకారం తల్లికి అవిధేయుడై, తండ్రిని దూషించేవాడు బుద్ధిహీనుడు" (సామెతలు 30:17).**

**అయితే యేసుప్రభువు కాలంనాటి శాస్త్రులు, పరిసయ్యులు ఈ ఆజ్ఞలకు దొడ్డిదారి కనిపెట్టారు. అందుకే యేసుప్రభువు వారిని వేషధారులు అన్నాడు (7:6).**

    3) యూదా మాటల్లో (మత్తయి 27:4)
    4) రోమా శతాధిపతి మాటల్లో (లూకా 23:47)
    5) చనిపోయే దొంగ (లూకా 23:41)

7. దయ్యాలు ఆయన దైవత్వాన్ని వెల్లడించాయి
    1) దయ్యం పట్టినవాణ్ణి బాగు చేసినపుడు (మత్తయి 8:28,29)
    2) కపెర్నహూములో ఒక వ్యక్తిని స్వస్థపరచినపుడు (లూకా 4:33,34)
    3) కపెర్నహూములో అనేకులను స్వస్థపరచినప్పుడు (లూకా 4:41; మార్కు 3:11)

8. ఆయన్ను ఆరాధించినవారు ఆయన దైవత్వాన్ని ప్రకటించారు
    1) గొర్రెల కాపరులు (లూకా 2:15)
    2) జ్ఞానులు (మత్తయి 2:2,11)
    3) కుష్ఠరోగి (మత్తయి 8:2)
    4) అధికారి (మత్తయి 9:18)
    5) అన్యురాలైన తల్లి (మత్తయి 15:25)
    6) ఒక హెబ్రూ తల్లి (మత్తయి 20:20)
    7) దయ్యం పట్టిన వ్యక్తి (మార్కు 5:6)
    8) గుడ్డివాడు (యోహాను 9:38)
    9) ఒక అపొస్తలుడు (తోమా) (యోహాను 20:28)

10) అపొస్తలులంతా (మత్తయి 14:33; 28:9)

9. సాతాను ఆయన దైవత్వాన్ని వెల్లడించాడు (మత్తయి 4:3,6)

10. ఆయనే స్వయంగా తన దైవత్వం ప్రకటించాడు
   1) తాను దేవుని కుమారుడినని వెల్లడించాడు (యోహాను 9:35; 10:36; 11:4)
   2) పాపాలు క్షమించాడు (మార్కు 2:5,10)
   3) ఆయన మనిషికి తీర్పు తీరుస్తాడు (యోహాను 5:22,27)
   4) ఆయన జీవాధిపతి (యోహాను 5:24,28,29)
   5) తండ్రిని గౌరవించినట్లే ఆయన్ను గౌరవించాలి (యోహాను 5:23)
   6) రక్షించగలిగేది ఆయన ఒక్కడే (యోహాను 10:28; లూకా 19:10; యోహాను 14:6)

## యేసుప్రభువు మానవత్వం

ఆయన అక్షరాలా మానవుడు

1. ఆయనకు మానవ సంబంధమైన తల్లిదండ్రులు వున్నారు (లూకా 1:31)
2. ఆయనకు మనలాంటి భౌతిక శరీరం వున్నది (మత్తయి 26:12)
3. ఆయనకు మానవ ప్రాణం వున్నది (యోహాను 12:27)
4. ఆయనకు మానవ ఆత్మ వున్నది (మార్కు 2:5; లూకా 23:46)
5. ఆయన శారీరకంగాను, జ్ఞానంలోనూ ఎదిగాడు (లూకా 2:32,40)
6. ఆయన ప్రశ్నలు వేశాడు (లూకా 2:46; 5:45)
7. ఆయన విధేయత నేర్చుకున్నాడు (లూకా 2:51)
8. ఆయన మనిషిలాగే కనిపించాడు
   1) సమరయ స్త్రీకి (యోహాను 4:9)
   2) యూదులకు (యోహాను 8:57; 10:33)
   3) మగ్దలేనే మరియకు (యోహాను 6:51,55)
9. ఆయనకు రక్తమాంసాలున్నాయి (యోహాను 6:51,55)
10. ఆయన సాంఘిక కార్యకలాపాల్లో పాల్గొన్నాడు (యోహాను 2:1,2)
11. ఆయన ప్రార్థించాడు (లూకా 11:1)
12. ఆయన శోధనకు గురయ్యాడు (మత్తయి 4:1)
13. ఆయన ఆకలిగొన్నాడు (మత్తయి 4:2; 21:18)
14. ఆయన దాహం గొన్నాడు (యోహాను 4:7; 19:28)
15. ఆయన అన్నం తిన్నాడు (యోహాను 21:13-15; లూకా 24:42,43)
16. ఆయన అలసిపోయాడు (యోహాను 4:6)
17. ఆయన నిద్రపోయాడు (మత్తయి 8:24)
18. ఆయన ప్రేమించాడు (మార్కు 10:21)
19. ఆయన జాలి చూపాడు (మత్తయి 9:36; 14:14; 15:32; లూకా 7:13; మార్కు 1:41; 9:22,23; 5:19)
20. ఆయన కోపించాడు, బాధపడ్డాడు (మార్కు 3:5)
21. ఆయన ఏడ్చాడు (యోహాను 11:35; లూకా 19:4)
22. ఆయన ఆనందం అనుభవించాడు (లూకా 10:2)
23. ఆయన ఆసక్తి కలిగివున్నాడు (యోహాను 2:17)
24. ఆయన చింతాక్రాంతుడయ్యాడు (మత్తయి 26:37; మార్కు 14:34)
25. ఆయన పాట పాడాడు (మత్తయి 26:30)
26. చెమట, వేదనలు అనుభవించాడు (లూకా 22:44)
27. ఆయన కలవరపడ్డాడు (యోహాను 11:33; 12:27; 13:21; మార్కు 14:33,34)
28. ఆయన రక్తం కార్చాడు (యోహాను 19:34)
29. ఆయన మరణించాడు (మత్తయి 27:50)
30. ఆయన్ను సమాధి చేశారు (మత్తయి 27:59,60)

ఆలోచించండి
10:2-12

### విడాకులు

మొదటి శతాబ్ధంలో యూదు పురుషులు అనేక కారణాలను బట్టి విడాకులు ఇవ్వచ్చు. ఒక వ్యక్తి అనుసరించే వ్యాఖ్యానాన్ని బట్టి భార్య అన్నం మాడిస్తే ఇంటికి పంపివెయ్యొచ్చు.

అదే స్త్రీల విషయానికి వచ్చేటప్పటికి విడాకులు ఇచ్చే అవకాశాలు చాలా తక్కువలో ఉన్న కొద్దిపాటి కారణాలలో ఒకటి భర్త వృత్తికి సంబంధించింది. ఒకవేళ అతడు రాగి పోతపోసే వ్యక్తి గాని, చర్మకారుడు గాని, పాకీ పనివాడు గాని అయితే విడాకులు ఇవ్వవచ్చు. అతడి వృత్తి ఆమెకు అంతకు ముందే తెలిసినా దాని వాసన భరించలేననే కారణంతో విడాకులు ఇవ్వొచ్చు.

ఆలోచించండి
2:3-17

# చిన్న చిన్న వారి ప్రాధాన్యత

జీవితంలో ఎవరు ప్రాముఖ్యమైన వారు? ఆస్తి, అంతస్తు, ఆరోగ్యం, డబ్బు, దర్పం లేనివారు నిజంగా పనికివస్తారా? లేక వారికి ఏకైక లక్ష్యం ఎలాగోలాగ నిచ్చెన పైకి ఎగబాకడమేనా ?

నాలుగు సువార్తల రచయితలలో ప్రతి ఒక్కరూ యేసుప్రభువు జీవితంలో ప్రాముఖ్యమైన వ్యక్తులను పాఠకులు సంధించేలా సాయపడుతున్నారు. ప్రాముఖ్యత విషయం సాంప్రదాయక ప్రమాణాల మేర బేరీజు వేస్తే వారంతా వాస్తవంగా ఎందుకూ ఎన్నిక రానివారు అనిపిస్తుంది. ఉదాహరణకు పైకప్పును తొలగించి క్రిందికి దించిన పక్షవాత రోగిని తీసుకుందాం (మార్కు 2:3). యేసుప్రభువు ముట్టుకున్నదాకా అతడు గుంపుల్లో ఎక్కడో మరుగున పడివున్నాడు. అదేరీతిగా మిగిలినవారు కూడా సంపన్నులు లేదా పేరు ప్రఖ్యాతులున్నవారు కారు. లేదా సాంఘికంగా, వ్యాపార రీత్యా ప్రముఖులు అనుకుంటే అదీ లేదు. వారంతా లోకంలో మనలాగే జీవిత సమస్యలు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలు.

ప్రతి రచయితా తన సువార్త ప్రారంభ అధ్యాయాల్లో ప్రస్తావించిన వ్యక్తులను గమనించండి.

### మత్తయి

- ❖ అపనిందల పాలైన నలుగురు స్త్రీలు 1:3,5,6)
- ❖ సంక్లిష్టమైన వివాహ సమస్యను ఎదుర్కొంటున్న యువజంట (1:18-21)
- ❖ విదేశీ ప్రభుత్వం నుండి వచ్చిన సలహాదారులు (2:1-12)
- ❖ నరమేధానికి గురైన అసంఖ్యాక బాలలు (2:16-18)
- ❖ యేసుకు ముందుగా వెళ్లి ప్రకటన చేసిన ఒక అడవి మనిషి (3:1-17).

### మార్కు

- ❖ నలుగురు జాలరులు (మార్కు 1:16-20)
- ❖ దయ్యముచే పీడింపబడుతున్న వ్యక్తి (1:23-27)
- ❖ జ్వర బాధితురాలైన ఒక అత్త (1:29-31)
- ❖ అసంఖ్యాక రోగులు, పీడితులు (1:32-34)
- ❖ బహిష్కృతుడైన కుష్ఠరోగి (1:40-42)
- ❖ పక్షవాతం రోగి (2:1-12)
- ❖ తృణీకారానికి గురైన సుంకరి

### లూకా

- ❖ సంతులేని వృద్ధ దంపతులు (1:5-25)
- ❖ బిడ్డ కోసం కనిపెడుతున్న దంపతులు (1:26-38)
- ❖ గందరగోళ పరిస్థితుల మధ్య జన్మించిన శిశువు (1:57-80)
- ❖ కలవరపడిన కాపరులు (2:8-20)
- ❖ ఒక వృద్ధ భక్తుడు (2:25-35)
- ❖ ప్రవచన వరమున్న ఒక వృద్ధ విధవరాలు (2:36-38)

### యోహాను

- ❖ తికమక పెట్టే మత మార్గదర్శి (1:19-34)
- ❖ ఇద్దరు జాలరులు (1:35-42)
- ❖ జాలరుల స్నేహితుడు (1:43-44)
- ❖ నిర్దేవ విమర్శకుడు (1:45-51)
- ❖ రహస్యంగా వుండి పోజూచే సత్యాన్వేషకుడు (3:1-21)
- ❖ అవినీతి మూటగట్టుకున్న అల్పసంఖ్యాక స్త్రీ (4:1-42)
- ❖ జబ్బున పడ్డ అధికారి కుమారుడు (4:46-54)

లేఖనాలు రక్షకుణ్ణి పరిచయం చేసే కొలది, మనకు ఎన్నికలేని చిన్న చిన్న వ్యక్తులు తారసపడతారు. దేవుని సాయంకోరిన వారంతా తమ అక్కరలు ఎరిగినవారు. ఆస్తి, అంతస్తు, ఆరోగ్యం వున్నవారు కారు. విపత్కర పరిస్థితులు దేవుని సాయంకోసం అర్రులు చాచేలా చేస్తాయి. మానవ పరిమితులను అధిగమించే క్షమాపణ, నిరీక్షణ ఆయనలోనే లభిస్తాయి.

పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవడం కోసం ఇతరుల నెత్తిన చెయి పెట్టి ఎలాగైనా పైకి రావాలనే ఉచ్చులో నీవు చిక్కుకొని వున్నావా ? లేక ఆ బంధకాలను ఛేధించడంలో సాయం చెయ్యడానికి దేవునికి అవకాశం యిచ్చావా ? అలాగయితే, చిన్న చిన్న వారితో కలిసి నీవు యేసుక్రీస్తును వెంబడిస్తున్నావా? వారు ఎక్కడ వున్నా, సాయంకోసం అర్థిస్తూ వుంటే వారికి ఆపన్నహస్తం అందించడానికి సిద్ధంగా వున్నావా?

తెలుసుకుందాం
1:29-31

సీమోను, అంద్రెయ అనే ఇద్దరు యేసుప్రభువును వెంబడించ మొదలుపెట్టారు. వారి ఇంటిని యేసుప్రభువు దర్శించిన వైనాన్ని మార్కు వర్ణించాడు. అక్కడ ఆయన సీమోను అత్తను స్వస్థపరిచాడు. తరువాత ఆమె ఉపచారం చేసినట్లు మన లేఖనభాగం చెబుతుంది.

మన దేశంలోలాగే నాటి యూదు కుటుంబాలలో సూర్యోదయంతోనే పనిపాటలు ప్రారంభమవుతాయి. ఉదయాన్నే పెరుగు, రొట్టెలతో అల్పాహారం ముగించుకొని స్త్రీలు నీళ్లకోసం దగ్గరలో వున్న బావికి గాని, వాగుకు గాని వెళ్తారు.

నీళ్లలో కొంత రొట్టెలు తయారు చెయ్యడానికి వినియోగిస్తారు. స్త్రీలు గోధుమలను, యవలను మన దేశంలోని గ్రామీణ స్త్రీల లాగే తిరగటిలో విసురుతారు. లూకా 17:35 వద్ద "ధాన్యం విసరటం" అనే అంశం నేర్చుకుంటాం). ఆ తరువాత ఆ పిండికి కొంత నీరు కలిపి, అంతకు ముందురోజు పిండిలో నుండి పులిసిన పిండిని కొంత తీసి క్రొత్త దాంట్లో కలుపుతారు. (మన దేశంలో పాలలో తోడు వేసినట్లు), పిండిని బాగా పిసికితే, అది పొంగుతుంది. ఆ పిండితో పెద్ద రొట్టెలు చేసి, ఇంట్లోనే పొయ్యిలో కాలుస్తారు. పొయ్యిని స్త్రీలు, పిల్లలు సేకరించిన చితుకులు, కర్రలతో మంట పెడతారు.

నూలు వడకటం, బట్టలు నేయటం, బట్టలు కుట్టడం, ఉతకడం, వంటకోసం కుండలు మొదలగు పాత్రలు తయారు చేయడం, వంట చెయ్యడంలాంటి పనులు నిత్యకృత్యాలు. వీటిని సరదాకోసం కాక, కుటుంబ పోషణ కోసం చేస్తుంటారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందని ఆ రోజుల్లో ప్రతి కుటుంబం తన ఇంటివారి పనిపాటల మీదే ఆధారపడేది. స్త్రీలు పనులన్నీ తమ తల్లుల నుండి నేర్చుకుంటారు. వారు తమ పిల్లలకు నేర్పిస్తుంటారు.

# యూదు కుటుంబ జీవనం

అందుకే కాబోలు మొదటి శతాబ్దపు యూదు స్త్రీలకు తమ పనికి, కుటుంబానికి ఎలాంటి అంతరం వుండేది కాదు. జీవితంలో ఆ రెండు వేరు వేరు విభాగాలు కాదు. ఒకే దానిలోని రెండు భాగాలు. పిల్లల పెంపకం, నిత్యావసరాలైన ఆహారం, బట్టలు సరఫరా చేయటం అనేవి యూదు సంస్కృతిలో ఎంతో గౌరవప్రదమైన వ్యాపకాలు.

అలాగని స్త్రీ పాత్ర భౌతిక అవసరాలకే పరిమితం కాదు. కుటుంబ జీవితంలో పిల్లలకు ధార్మిక, సాంస్కృతిక జీవన విలువలను నేర్పించడంలో స్త్రీలు ప్రధాన పాత్ర పోషిస్తారు. ఇప్పటిలాగా పాఠశాలలు ఆ రోజుల్లో వుండేవి కాదు. అందువలన తల్లే పిల్లలకు చదువు చెప్పటం, చేతివృత్తులు నేర్పడం చేసేది. అంతేకాదు పిల్లలు ఇశ్రాయేలు ప్రజల విశ్వాసాన్ని సాంప్రదాయాన్ని అనుసరించేలా తోడ్పడాలి. తల్లి ద్వారానే పిల్లలకు యూదు సాంప్రదాయం తెలిసేది.

సబ్బాతు రోజు కోసం ఇంటిని సిద్ధపరిచే బాధ్యత కూడా స్త్రీలదే. దీపాలను ఆలివ్ నూనెతో నింపి, సబ్బాతు కోసం ఆహార పదార్థాలు, ఇతర వంటకాలు తయారుచేసి, ఇంకొక రోజుకోసం ఎక్కువ నీరు సేకరించడం స్త్రీలు చేసే పనులే. సబ్బాతు రోజు సాయంత్రం ఆమె భర్త సామెతలు 31:10-31. చదువుతాడంటే ఆశ్చర్యమేమీ లేదు. ఎందుకంటే ఆమె ప్రాధాన్యతను, పనిని గుర్తిస్తున్నదన్న మాట.

తెలుసుకుందాం
1:16

# ఉపమానాల భావం

ఉపమానాలు వినియోగించటంలో యేసుప్రభువు సిద్ధహస్తుడు. అయితే ఉపమానాలు వినియోగించిన వారిలో ఆయనే ప్రథముడు కాదు. పాత నిబంధనలో మనకు అనేక ఉపమానాలు కనిపిస్తాయి. ఉదాహరణకు, నాతాను ప్రవక్త దావీదులో చెప్పిన చిన్న గొర్రెపిల్ల ఉపమానం (2సమూ 12:1–40); తెకోవ విధవరాలు చెప్పినది. (2సమూ 14:5–7); సోమరిని గూర్చి సొలొమోను చెప్పిన ఉపమానం (సామెతలు 24:30–34).

ఇలాంటి కథల వలన ప్రయోజనమేమంటే ఏదైనా సత్యాన్ని శ్రోతలు సులభంగా ఊహించుకోగలరు. అలాగని, అన్ని సమయాల్లో వాటిని అర్థం చేసుకోవడం సులభమని కాదు. కొన్నిసార్లు యేసుప్రభువు శిష్యులు కూడా ఆయన చెప్పిన ఉపమానాల భావం విషయం తికమకపడ్డారు (మత్తయి 13:24–30, 36–43). అంతేకాదు కొన్నిసార్లు యేసుప్రభువు తనను తిరస్కరించిన వారికి అర్థం గాకుండా, తన శిష్యులకు మాత్రమే అర్థమయ్యేలా ఉపమానాలు చెప్పాడు (మత్తయి 13:10–17; మార్కు 4:10–12; లూకా 8:9,10). ఆవిధంగా ఆయన యెషయా 6:9,10లోని ప్రవచనం నెరవేర్చాడు. రెండంచుల ఖడ్గంలాగా అవిధేయులకు అంధకారం మిగిల్చాయి.

యేసుప్రభువు ఉపమానాలన్నిటిలో ఒకే ఒక కేంద్ర సత్యం వుంటుంది అంతేగాని, వాటిని చిలవలు పలవలు చేసి విపరీతమైన, తమాషా భాష్యాలు చెప్పటానికి వీలుకాదు. ఆధునిక పాఠకులంగా ఆ కేంద్ర సత్యం గ్రహించడానికి ఒక పని చేయాలి. యేసుప్రభువు నాటి శ్రోతలకు దాని భావమేమిటో, ఆయన రాజ్యాన్ని ప్రకటించడానికి, ఆయన చేసిన అద్భుతాలకు ఆ కథకు వున్న సంబంధమేమిటో గ్రహించాలి. ఉపమానాలు వాస్తవంగా జానపద గాథలకంటే కొద్దిగా మెరుగైనవి. దేవుడు, మానవజాతి, రక్షణ, ఆయన రాకతో ప్రారంభమైన నూతన అధ్యాయం మొదలైన విషయాల్లో యేసుప్రభువు ఆంతర్యాన్ని వెల్లడి చేసేవే ఉపమానాలు.

ఈ కోవకు చెందిన ఉపమానాలకు మంచి ఉదాహరణ లూకా 15:3–32లోని నాలుగు “తప్పిపోయిన” ఉపమానాలు : తప్పిపోయిన గొర్రె, తప్పిపోయిన నాణెం, తప్పిపోయిన ఇద్దరు కుమారులు, యేసుప్రభువు సుంకరులు, పాపులతో భోజనంచేస్తూ ఈ ఉపమానాలు చెప్పినట్లు గమనిస్తాం (లూకా 15:1,2). నాటి మేధావి వర్గం ఆయన్ను విమర్శిస్తున్నారు. ఎందుకంటే, వారి దృష్టిలో ఆయన ధర్మశాస్త్రం మీరుతున్నాడు.

అందుకు జవాబుగా యేసు మూడు ఉపమానాలు చెప్పాడు. మారుమనస్సు అక్కరలేని 99 మంది నీతిమంతులకంటే (15:7; స్వనీతిపరులైన మతనాయకులకు) ఒకపాపి మారుమనస్సు పొందితే దేవుడు ఎంతో ఆనందిస్తాడని (తనతో కూర్చున్న వారిలాంటి వారు) చెప్పాడు. తప్పిపోయిన చిన్న కుమారుడు (లూకా 15:11–24) సుంకరులకు, పాపులకు సాదృశ్యంగా వున్నాడు. పెద్ద కుమారుడు (15:25–32) శాస్త్రులు, పరిసయ్యులకు సాదృశ్యంగా వున్నాడు.

లేఖనాల్లోని ఉపమానాలు బోధనలో వినియోగించిన చక్కని విధానాలు. మీరు గాని, మీకు తెలిసిన వారెవరైనా గాని దేవుని వాక్కు సత్యాలు గ్రహించి, అన్వయించుకోవటం కష్టంగా వుంటే ఉపమానాలు చదవండి. అవి బలీయమైన రీతిలో మన ఊహలకు పదునుపెట్టి దేవుని అనంత సత్యాన్ని దైనందిన జీవితానికి అన్వయిస్తాయి.

ఆలోచించండి 8:11-12

# యేసుప్రభువు అద్భుతాలు

"ఈ తరానికి ఏ సూచన క్రి అనుగ్రహించబడదు" అని పరిసయ్యులకు ప్రభువు వెల్లడి చేశాడు (మార్కు **8:12**) తన ప్రత్యర్థులు సూచక క్రియకోసం పట్టుపడితే యేసు వారికి చోటు పెట్టలేదు. అయితే యేసు ఇంతకు ముందే అనేక అద్భుతాలు జరిగించాడు. ఇకముందు కూడా అనేకం చేయనున్నాడు. క్రింది పట్టిక చూడండి.

| అద్భుతాలు | మత్తయి | మార్కు | లూకా | యోహాను |
|---|---|---|---|---|
| కుష్ఠరోగిని స్వస్థపరిచాడు | 8:2-4 | 1:40-45 | 5:12-16 | |
| శతాధిపతి సేవకుణ్ణి స్వస్థపరిచాడు | 8:5-13 | | 7:1-10 | |
| పేతురు అత్తను స్వస్థపరిచాడు | 8:14,15 | 1:29-31 | 4:38,39 | |
| సాయంత్రంపూట రోగులను స్వస్థపరిచాడు | 8:16,17 | 1:32-34 | 4:40,41 | |
| తుఫానును నిమ్మళింపజేశాడు | 8:23-27 | 4:35-41 | 8:22-25 | |
| దయ్యాలను వెళ్ళగొట్టి, పందులలోకి పంపాడు | 8:28-34 | 5:1-20 | 8:26-39 | |
| పక్షవాత రోగిని స్వస్థపరిచాడు | 9:1-8 | 2:1-12 | 5:18-26 | |
| చనిపోయిన యాయీరు కుమార్తెను లేపాడు | 9:18,19 23-26 | 5:22-24 35-43 | 8:40-42 49-56 | |
| రక్తస్రావ రోగిని స్వస్థపరిచాడు | 9:20-22 | 5:25-34 | 8:43-48 | |
| ఇద్దరు గుడ్డివారిని స్వస్థపరిచాడు | 9:27-31 | | | |
| దయ్యంపట్టిన మూగవానిని స్వస్థపరిచాడు | 9:32,33 | | | |
| ఊచచెయ్యి గలవానిని స్వస్థపరిచాడు | 12:9-14 | 3:1-6 | 6:6-11 | |
| దయ్యం పట్టిన గుడ్డి, మూగవాణ్ణి స్వస్థపరిచాడు | 12:22 | | 11:14 | |
| 5000 మందికి ఆహారం పెట్టాడు | 14:13-31 | 6:30-44 | 9:10-17 | 6:1-14 |
| గలలీ సరస్సుపై నడిచాడు | 14:22-27 | 6:45-52 | | 6:16-21 |
| గలలీ సరస్సుపై పేతురు నడిచేలా చేశాడు | 14:28-33 | | | |
| సురొఫొనీకే స్త్రీ కుమార్తెను స్వస్థపరిచాడు | 15:21-28 | 7:24-30 | | |
| 4000 మందికిపైగా ఆహారం పెట్టాడు | 15:32-39 | 8:1-10 | | |
| మూర్ఛరోగిని స్వస్థపరిచాడు | 17:14-18 | 9:17 | 9:38-42 | |
| చేప నోట్లో నాణెం కోసం పేతురును పంపాడు | 17:24-27 | | | |
| యెరిగో దగ్గర ఇద్దరు గుడ్డివారిని బాగుచేశాడు | 20:29-34 | | | |
| అంజూరపు చెట్టును ఎండిపోయేలా చేశాడు | 21:18,19 | 11:12-14 21,22 | | |
| మరణం నుండి తిరిగి లేచాడు | 28:1-10 | 16:1-14 | 24:1-43 | 20:1-29 |
| అపవిత్రాత్మను వెళ్ళగొట్టాడు | | 1:23-28 | 4:33-37 | |
| అపవిత్రాత్మ పట్టిన వ్యక్తిని బాగుచేశాడు | | 7:31-37 | | |
| బేత్సయిదాలో గుడ్డివాణ్ణి బాగుచేశాడు | | 8:22-26 | | |
| గుడ్డి బర్తిమయిని బాగుచేశాడు | | 10:46-52 | 18:35-43 | |
| ఆగ్రహంతో ఉన్న గుంపుల నుండి తప్పించుకున్నాడు | | | 4:28-30 | |
| విస్తారంగా చేపలు పట్టేలా చేశాడు | | | 5:1-11 | |

| అద్భుతాలు | మత్తయి | మార్కు | లూకా | యోహాను |
|---|---|---|---|---|
| నాయీనులో చనిపోయిన విధవరాలి కుమారుని లేపాడు | | | 7:11-17 | |
| నడుము వంగిపోయిన బలహీన స్త్రీని స్వస్థపరిచాడు | | | 13:11-13 | |
| జలదోర రోగిని స్వస్థపరిచాడు | | | 14:1-4 | |
| పదిమంది కుష్టురోగులను స్వస్థపరిచాడు | | | 17:11-19 | |
| తెగిన మల్కు చెవిని బాగుచేశాడు | | | 22:47-51 | 18:10 |
| నీటిని ద్రాక్షరసముగా మార్చాడు | | | | 2:1-11 |
| అధికారి కుమారుని స్వస్థపరిచాడు | | | | 4:46-54 |
| బేత్సయిదాలో ఒక అంగవికలుని స్వస్థపరిచాడు | | | | 5:1-15 |
| పుట్టుగుడ్డివాణ్ణి స్వస్థపరిచాడు | | | | 9:1-41 |
| చనిపోయిన లాజరును లేపాడు | | | | 11:1-44 |
| రెండవ పర్యాయం విస్తారంగా చేపలు పట్టేలా చేశాడు | | | | 21:1-14 |

దేవుడు చేసిన అనేక అద్భుతాలు బైబిలులో పేర్కొనబడ్డాయి. దేవుడు ఎప్పుడూ అలాగే చేస్తాడేమో అని ఎవరైనా అనుకొనే ప్రమాదం లేకపోలేదు. అద్భుతం అంటేనే సాధారణంగా జరిగేది కాదు అని అర్థం. నిర్గమ **14:21; యెషయా 38:7**లో అద్భుతాలను గూర్చి మరింత విపులంగా తెలుసుకుంటాం.

యేసుప్రభువు ఆశ్చర్యకరమైన అద్భుతాలు చేసినా, ఆయన యూదు సోదరీ, సోదరులు మెస్సీయాగా ఆయన్ను తిరస్కరించారు. నేడు కూడా అనేకులు అదే తలంపుతో, క్రైస్తవం సైన్స్ పరస్పర విరుద్ధమని అంగీకరించటం లేదు. "క్రైస్తవ విశ్వాసానికి విజ్ఞాన శాస్త్రం (సైన్స్) విరుద్ధమా ?' అనే అంశాన్నీ యోహాను **4:48** వద్ద నేర్చుకుంటాము.

తెలుసుకుందాం
3:22

## క్రొత్త నిబంధనలో అన్య దేవతలు

| పేరు | వర్ణన | లేఖన భాగం |
|---|---|---|
| బెయెల్జెబూలు | యూదులు ప్రధాన దుష్ట శక్తిగా పరిగణించే అన్య దేవత | మార్కు 3:22 |
| డయానా అర్తెమీ | రోమన్‌ల పురాణాలలోని చంద్ర దేవత, వేట, అనన్య మృగాలు, కన్యత్వం మొదలైన దేవత | అపో.కా. 19:24, 27,28 |
| హెర్మే | వాణిజ్యం, శాస్త్రం, పరిశోధన, కపటం, దొంగతనం మొదలైన రంగాలకు చెందిన గ్రీకు దేవత | అపో.కా. 14:12 |
| సిరి | ధన దేవత (మన దేశంలో లక్ష్మి వంటిది) | లూకా 16:9,11 |
| మొలెకు | అమ్మోనీయుల జాతీయ దేవత, శిశు, బలులు అర్పిస్తారు | అపో.కా. 7:43 |
| రొంఫా | ఇశ్రాయేలీయులు అరణ్యంలో పూజించిన విగ్రహం | అపో.కా. 7:43 |
| కవల సోదరులు | గ్రీకు పురాణాలలోని జ్యూస్ కవల సంతానం అశ్వనీ | అపో.కా. 28:11 |
| బృహస్పతి | ప్రాచీన గ్రీకుల అధిష్టాన దేవత | అపో.కా. 14:12,13 |

# విశ్వాసం

యావత్ మానవ జాతిని, విశ్వాసులు, అవిశ్వాసులు అని, రెండు వర్గాలుగా విభజించవచ్చు. దేవుని పిల్లలు విశ్వాసులు : వారి లక్షణం విశ్వాసం, వారు విశ్వాసంతోనే జీవిస్తారు (రోమా 1:17). విశ్వాసం అనేది నూతన జీవనానికి అంటే క్రైస్తవ జీవితానికి ఇంధనం లాంటిది. విశ్వాసంలో అనేక దశలున్నాయి. హెబ్రీ 11 అధ్యాయం దీనిని చక్కగా వివరిస్తుంది. అయితే ఈ పాఠంలో మనం రక్షించే విశ్వాసానికే పరిమితమవుతున్నాం. విశ్వాసం ద్వారా మనం దేవుని రక్షణను అనుభవించి, ఆనందిస్తాం.

**1. రక్షణ పొందాలంటే నేనేం చెయ్యాలి?** (అ.కా. 16:30)

ఇది ప్రశ్నలన్నింటిలో కెల్లా చాలా గొప్ప ప్రశ్న. రక్షణ విషయంలో మానవుడి బాధ్యత ఏమిటి ? మాటలలో చెప్పలేనంత వెల చెల్లించి ప్రతి పాపికీ రక్షణ సమకూర్చటం జరిగింది (1యోహాను 2:2). దేవుని ఏకైక కుమారుడు పరలోకం నుండి దిగివచ్చి, సిలువలో మరణించుట ద్వారా రక్షణ సంపాదించాడు (యెషయా 53:5,6; యోహాను 1:29; 2కొరి 5:2). తండ్రియైన దేవుడు ఆయన చేసి ముగించిన కార్యాన్ని అంగీకరించి, మృతులలో నుండి లేపి, పరలోకంలో తన కుడిప్రక్కన కూర్చుండునట్లు హెచ్చించాడు (అ.కా. 2:32,33). ఇప్పుడు రక్షణ అందరికీ అందుబాటులో వున్నది (యెసయా 45:22). దానికి ఏమైనా షరతులు వున్నాయా? అ.కా. 16:31 దానికి జవాబు ఇస్తుంది. అవధులు లేని రక్షణ సంపాదించటం జరిగింది. ఇకపోతే మనిషి బాధ్యత విషయానికి వస్తే యేసుక్రీస్తు ప్రభువును తన రక్షకుడిగా విశ్వాసంతో స్వీకరించటమే. విశ్వాసం ద్వారానే రక్షణ అని తెలియజేసే లేఖనభాగాలు క్రొత్త నిబంధనలో 150 వున్నాయి. విశ్వాసము, నమ్మకం అనేవి పర్యాయ పదాలు. ఉదా॥ యోహాను 3:16; అ.కా. 13:38,39; రోమా 1:6; 3:26; 4:5; 10:9,10; ఎఫెసీ 2:8; 1యోహాను 5:1.

**2. యేసుక్రీస్తును నమ్మటం అంటే ఏమిటి?**

యేసుక్రీస్తును నా స్వకీయ రక్షకుడిగా నా పూర్తి నమ్మకాన్ని ఆయనపై పెట్టడం. యేసుప్రభువు, నేను నిన్ను నమ్ముతున్నాను నిన్నే నమ్ముతున్నాను గొప్ప రక్షణ, ఉచిత రక్షణ, సంపూర్ణ రక్షణకై నమ్ముతున్నాను.

**3. యేసుక్రీస్తును స్వకీయ రక్షకుడిగా విశ్వసించుటలో మూడు మెట్లు**

1) మొదటి మెట్టు వినుట : రోమా 10:17 చూడండి. సువార్తను నమ్మకముందు నేను దానిని వినాలి. యేసుక్రీస్తు నన్ను రక్షించగలడు, రక్షించటానికి ఇష్టపడుతున్నాడు అని నమ్మేముందు ఆయన రక్షించ సమర్థుడు. రక్షించడానికి ఇష్టపడుతున్నాడు అని వినాలి. యోహాను 5:24 చూడండి.

2) రెండో మెట్టు విశ్వసించుట : ఆయన ఎవరో, ఆయన నాకోసం ఏం చేయగలడో విన్న తరువాత, నేను విన్నది నమ్ముటకు నా అంగీకారం తెలియజేస్తాను. ఆయన నా కొరకు మరణించాడని (యెషయా 53:5); నన్ను రక్షించగలడని (హెబ్రీ 7:25); నన్ను రక్షించే అభిలాష ఆయనకు వున్నదని (యోహాను 5:40) ఆయన్ను గూర్చి నేను విశ్వసిస్తాను. ఇక్కడ ఒక్క విషయం గమనించాలి. మానసిక అంగీకారం రక్షించే విశ్వాసానికి తప్పనిసరియైన మెట్టే కాని అదే రక్షించే విశ్వాసం కాదు.

3) మూడో మెట్టు నమ్మకం : నేను విన్నాను... విశ్వసిస్తున్నాను. ఇప్పుడు నేను నమ్మకం పెట్టాలి. ఆయన ఏమి చేయగలడని నేను విన్నానో అదంతా నాపట్ల జరిగించమని నమ్మాలి. నన్ను నేను ఆయనకు అర్పించుకుంటున్నాను, నన్ను రక్షించమని నమ్ముతున్నాను. అన్ని ప్రయత్నాలను ప్రక్కన బెట్టి ఎవరిపై నమ్మకం వుంచుతామో ఆయనపై పూర్తిగా ఆధారపడతాం.

**4. రక్షించే విశ్వాసానికి సాదృశ్యమైన మూడు సంఘటనలు పరిశీలిద్దాం :**

1) మార్కు (5:25-35) : ఆ స్త్రీ విన్నది (27వ) ఆమె విన్నదానిని విశ్వసించినందున వచ్చింది (28వ), ఆయనను ముట్టుకొన్నది (నమ్మండి) 27,29వ.

2) అపొ.కా (8:29-37) : నపుంసకుడు క్రీస్తును గూర్చి విన్నాడు (30:35వ); ఆయనపై విశ్వాసం వుంచాడు (36వ) తన రక్షకుడిగా ఆయనపై నమ్మకం పెట్టాడు (37వ).

3) (అ.కా. 16:30,31) : జైలు అధికారి కూడా ఈ మూడు మెట్లు ఎక్కినట్టు గమనిస్తాం. అతడు 30వ వచనంలోని ప్రశ్న అడిగాడు గనుక విని వుంటాడు. తరువాత విశ్వసించాడు;

వెంటనే బాప్తిస్మం పొంది, జీవితంలో మార్పు చోటు చేసుకున్నదాన్ని బట్టి రక్షించమని క్రీస్తుపై నమ్మకం పెట్టి వుంటాడు.

**5. రక్షించే విశ్వాసాన్ని గూర్చి రెండు సాధారణ సాదృశ్యాలు గమనించండి :**

1) బ్యాంకుపై నమ్మకం : నీకు చాలా పెద్ద మొత్తం వారసత్వంగా సంక్రమించింది అనుకొందాం. దానిని భద్రతకోసం ఎక్కడ పెడతావు. అప్పుడొక స్నేహితుడు నీతో పలానా బ్యాంక్ చాలా భద్రమైనది అని చెబుతాడు. అతడు చెప్పింది విన్నావు, అతడి సాక్ష్యం నమ్మావు, ఈ సంపాదనంతా బ్యాంకుకి అప్పగించావు.

2) డాక్టరుపై నమ్మకం : అకస్మాత్తుగా నీకు గుండె నొప్పో, కడుపు నొప్పో వచ్చిందనుకోండి, మీ స్నేహితులెవరైనా వచ్చి నాకు పలానా డాక్టరు ఇదే నొప్పికి వైద్యం చేశాడని, తన బాధ పూర్తిగా నివారణ అయిందని చెబితే, నీ స్నేహితుడు చెప్పింది వింటావు. అతడి సాక్ష్యం నమ్ముతావు, డాక్టరు గారు సంపూర్ణంగా నయం చేస్తాడని నిన్ను నీవు డాక్టరుకు అప్పగించుకుంటావు కదా !

**6. యేసుక్రీస్తు ఇచ్చిన క్రింది వాగ్దానాలు గమనించండి. అవన్నీ సాదృశ్యాలే. ప్రతి సందర్భంలోనూ మూడు అంచెలు అంటే వినుట, విశ్వసించుట, నమ్ముట పాటించినట్లు గమనిస్తాం.**

1) యేసుక్రీస్తునందు విశ్వాసం వుంచటం అంటే ఆయనను దేవుని బహుమతిగా స్వీకరించటం, యోహాను 3:16; 1:12 చూడండి (ఇక్కడ విశ్వసించుట అనగా అంగీకరించుట) అ.కా. 16:14; ప్రకటన 3:20తో పోల్చండి.

2) యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట అంటే ఆయన ద్వారా మందలో ప్రవేశించుట. యోహాను 5:40; 6:37తో పోల్చండి.

3) యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట అంటే ఆయన ద్వారా మందలో ప్రవేశించుట. యోహాను 10:9ని లూకా 13:24-27తో పోల్చండి.

4) యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట అంటే ఆయన దగ్గరకు వచ్చి దాహం తీర్చుకొనుట. యోహాను 4:13,14; 7:37 చదవండి.

5) యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట అనగా రక్షణ కొరకు ఆయనను వేడుకొనుట. రోమా 10:13 చూడండి. అప్పుడు దొంగ ఎలా చేశాడో (లూకా 23:42,43), పేతురు ఎలా చేశాడో (మత్తయి 14:30,14); కుష్ఠురోగి ఎలా చేశాడో (లూకా 5:12,13); అన్య స్త్రీ ఎలా చేసిందో (మత్తయి 15:22,28) చూడండి. అది సరేకాని, నీవు ఆ పని చేశావా?

దీనిని బట్టి యేసుక్రీస్తునందు విశ్వాసం వుంచుట అంటే రక్షణ కొరకు ఆయనపైనే ఆధారపడటం నీవు ఆవిధంగా నమ్ముతున్నావా? నీవు రక్షణ పొందావా ?

ఆలోచించండి 10:13-16

## కనిపెట్టి, ప్రార్థించు

శోధనకు గురికాకుండునట్లు కనిపెట్టి, ప్రార్థించమని శిష్యులను హెచ్చరించాడు ప్రభువు (మార్కు 14:38). శోధననుండి పారిపోవటం, ఎదిరించటంలో దేవుడు మాత్రమే సాయపడగలడని ఆయనకు తెలుసు.

నిశిత పరిశీలన 14:38

## పసిపిల్లల నేస్తం

యేసు ప్రభువు రోజుల్లో తల్లులు తమ పిల్లలను ప్రముఖ రబ్బీల వద్దకు తీసుకువచ్చి ఆశీర్వదించమని కోరడం సర్వ సాధారణం. యేసు ప్రభువు విషయంలో వారు కోరింది ఆశీర్వాదానికి మించినది. ఈ రబ్బీ తమ పిల్లలను ముట్టుకోవాలని వారి కోరిక (10:13). ఆయన స్పర్శలో ఉన్న మహత్తు అందరికీ తెలిసే ఉంటుంది.

శిష్యులు పిల్లలను రాకుండా ఎందుకు ఆటంకపరిచారో మార్కు వివరించలేదు. బహుశా చిన్న పిల్లలు సంప్రదాయం ప్రకారం అపవిత్రులుగా భావించారో లేక అంత గొప్ప వ్యక్తి దగ్గరకు చిన్న పిల్లలు రాకూడదని భావించారో మొత్తంమీద స్పష్టమైన కారణం మనకు తెలియదు.

అయితే యేసు శిష్యులను మందలించి, పిల్లలను తన కౌగిట్లోకి ఆహ్వానించాడు (10:16). ఆయన వారితో మాటలాడి, వారిని అక్కున చేర్చుకున్న తీరు చూసేవారికి ఆశ్చర్యం కలిగించి ఉండవచ్చు. ఆ సమాజంలో చిన్న పిల్లల పట్ల అంత ప్రేమ, గౌరవం చూపడం చాలా అరుదు.

# తనకున్నదంతా ఇచ్చిన పేద విధవరాలు

(లేఖనభాగం : మార్కు 12:41-44; ప్రశంస 43,44 వచనాలు)

మార్కు సువార్త ముగింపులో ఊరూ పేరు లేని ఒక విధవరాలిని గూర్చి చదువుతాం. ఆమెను గూర్చి ప్రభువు చెప్పిన దయగల ప్రశంసా వాక్కు మన పాఠానికి మూలవాక్యం. అసలు మనకున్న దానిలో నుండి ఇచ్చే విషయమంతా కూడా ఇందులో వుంది. పూర్వకాలం నుండి దేవుని పిల్లలు తమకు కలిగిన దానిలో నుండి భూమిమీద ప్రభువు పనికై ఇచ్చేవాడుక వుంది. పాత నిబంధన కాలంలో దేవుని పనికి ఇవ్వటం అనేది ఒక విధి, తప్పనిసరి అందువలన యూదులు తమ "కానుకలు, దశమ భాగాలు" అర్పించేవారు. క్రొత్త నిబంధనలో ఇవ్వటం అనేది ఒక విధిగా గాక ఆధిక్యతగా, ఆనందంతో చేసే పనిగా అభివర్ణించటం గమనిస్తాం. సంతోషంగా, కృతజ్ఞతా పూర్వకంగా యివ్వాలని బైబిలు హెచ్చరిస్తుంది, 2కొరింథీ 9:77 చూడండి. డబ్బు విషయంలో మనం ధర్మకర్తలుగా వుండాలని బైబిలు చెబుతుంది. ఈ సంఘటనలో మనం చేర్చుకొనే పాఠాలు ఎన్నో వున్నాయి.

**1. మొట్టమొదటి స్పష్టమైన పాఠమేమంటే - మనము ఎంత ఇస్తున్నాం, ఎంత మిగుల్చుకుంటున్నాం అనేది ప్రభువు చూస్తాడు.**

మార్కు 12:41 ఏం చెబుతుందో చూడండి. అదేపని ఇప్పటికీ ప్రభువు చేస్తున్నాడు. ఆయన "కానుక పెట్టె ఎదుట కూర్చుండి" ఆయన ప్రజలు ఎలా ఇస్తున్నారో గమనిస్తూ వున్నాడు - ఒకవేళ మొక్కుబడిగా ఇస్తున్నారో, జాగ్రత్తగా ఇస్తున్నారో, సణుగుతూ ఇస్తున్నారో, సంతోషంగా ఇస్తున్నారో, వీలైనంత తక్కువ ఇస్తున్నారో, వీలైనంత ఎక్కువ ఇస్తున్నారో చూస్తున్నాడు. పన్ను చెల్లించినట్లు చెల్లిస్తున్నారో లేక తమకు ఎంతో ఇచ్చిన ప్రభువుకు కృతజ్ఞతా హృదయంతో ప్రేమతో ఇస్తున్నారో ప్రభువు గమనిస్తాడు. ఒక క్రైస్తవుడు ప్రభువుకు ఇచ్చేదాన్ని బట్టి అతడి హృదయం, గుణగణాలు ఎలా వున్నాయో తెలుస్తుంది. ప్రభువుకు ఇచ్చేముందు "ఆయన కనుదృష్టి అగ్నిజ్వాలల వలె వున్నాయి" (ప్రకటన 1:14) అని గ్రహిస్తే ఎంతో వ్యత్యాసం వుంటుంది.

**2. రెండవ పాఠం, ధనవంతులు యిచ్చే పెద్ద మొత్తం కానుకలు ప్రభువు చూస్తాడు, వాటికి విలువ ఇస్తాడు.**

"ధనవంతులైనవారు అనేకులు అందులో విశేషముగా సొమ్ము వేయుచుండిరి" అని 41 వచనంలో చదువుతాం. ఆ తరువాత 44 వచనంలో "వారందరు తమకు కలిగిన సమృద్ధిలో నుండి వేసిరి" అని రాసి వుంది. బైబిలు కాలాల్లో దేవునికి ప్రజలు ఇచ్చే విధానం బహిరంగంగా తమ కానుకలు ఇవ్వటం చాలాసార్లు జరిగేదేమంటే ప్రజలు ప్రదర్శనకోసం అందరూ చూడాలని ఇచ్చేవారు. ఎవరైనా పెద్ద మొత్తంలో కానుకలు ఇస్తే చప్పట్లు మారుమ్రోగేవి, తక్కువ ఇస్తే ఇక చెప్పనక్కర్లేదు కదా: ఇక్కడ ధనవంతులు అధిక మొత్తంలో కానుకలు వేసినట్లు గమనిస్తున్నాం. దేవునికి పెద్ద మొత్తంలో ఇవ్వటం. అనేది గొప్ప సంగతే. ఇవ్వగల స్తోమత వుండటమే కాదు, వాస్తవంగా ఇవ్వటం గొప్పే. దేవుడు మనకు ఆస్తిపాస్తులను సమకూర్చి, మంచి ధర్మకర్తలుగా నియమిస్తే అదెంతో ఆశీర్వాదకరం. అనాదిగా దేవుని పని ఎందరో ధనవంతులు ధారాళంగా ఇచ్చిన కానుకలతో కొనసాగుతుంది. దాతృత్వం విషయంలో మంచి క్రమశిక్షణ, భక్తి, విధేయత వుంటే దేవుని సేవకు బోలెడంత డబ్బు వుంటుంది.

**3. మూడవ పాఠం - పేదలు ఇచ్చే చిన్ని మొత్తాలను కూడా ఆయన చూస్తాడు, లెక్కలోకి తీసుకుంటాడు.**

"ఒక పేద విధవరాలు వచ్చి రెండు కాసులు వేసింది" అని 42 వచనం చెబుతుంది. ఆమె ఇచ్చిన కానుక విలువ వాస్తవంగా చాలా తక్కువ, బహుశా ప్రజలు

ఆమె కానుకలు గుర్తించి కూడా వుండకపోవచ్చు. అయితే, ప్రభువు నోటినుండి ఆమె గొప్ప ప్రశంసా వాక్కులు విన్నది. ఆయన ప్రశంసా వాక్కులు ఎంత దయగలవి. చాలామంది ఆమె కానుక ఒక లెక్కలోనిది కాదు అని భావించి వుంటారు. కాని, ప్రభువు ఆ రోజు ఇచ్చిన కానుకలన్నిటి లోకీ ఆమె ఇచ్చినది ఎక్కువగా పరిగణించాడు. ఆమె కానుక మనకు నేర్పించే గొప్ప పాఠం ఏమంటే ఇవ్వపోవటానికి ఎలాంటి సాకులు పనికిరావు. నా ఆదాయం చాలా స్వల్పం; లేదా మా సంఘానికి వాస్తవంగా నా డబ్బు అవసరం లేదు అని చెప్పొచ్చు. అయితే, మొట్టమొదట దేవునికి చెందవలసిన భాగం ప్రక్కన పెడితే దేవుని పనిలో ఎంత ఆశీర్వాదమో ఎప్పుడైనా ఆలోచించారా? - అది ఆయనకు చెందిందే కదా! 2కొరింతి 8:5 చూడండి.

**4. నాలుగో పాఠం – ప్రభువు కొలమానం మనం ఇచ్చే మొత్తాన్ని బట్టి గాక మిగుల్చుకున్న మొత్తాన్ని బట్టి వుంటుంది.**

43,44 వచనాలు చదవండి. మన గణాంకాలకు పరలోకపు గణాంకాలకూ ఎంతో వ్యత్యాసం వుంటుంది. యేసుప్రభువుకు ఇచ్చిన మొత్తం పరిమాణం కంటే దాని నాణ్యత చాలా ముఖ్యం. దాతృత్వాన్ని గూర్చి ప్రభువు మాటలాడుతూ ఉదాహరణంగా చూపింది. బోలెడంత ఆస్తిపాస్తులున్న సంపన్నుడు కాదు, ఒక పేద విధవరాలు ఆమె దాతృత్వంలోని నాణ్యతను ప్రభువు ప్రశంసించాడు. ఆ రోజున దేవుడికి ఇచ్చిన వారందరి కంటే ఆమె ఎక్కువ ఇచ్చిందని ప్రభువు చెప్పాడు. ఒక వ్యక్తి దేవుని పనికి రూ. 1000 ఇచ్చి వుండవచ్చు. అయితే అతడి బ్యాంకులో లక్ష రూపాయలు వున్నాయి అనుకుందాం. వెయ్యి ఇచ్చిన తరువాత అతడి దగ్గర ఇంకా రూ. 99,000 వున్నాయి. అందుకు భిన్నంగా ఒక పేదరాలు నెలకు రూ. 100 సంపాదిస్తుంది అనుకుందాం. అందులో నుండి ఆమె దశమభాగం ఇస్తే, ఇద్దరిలో ఎవరు ఎక్కువ ఇచ్చినట్లు? నిష్పత్తి రూపేణా చూస్తే విధవరాలు ఇచ్చింది ధనవంతుడి కంటే ఎంతో ఎక్కువ. అతడు ప్రభువు పనికి ఒక్కశాతం ఇవ్వగా, ఈ విధవరాలు పదిశాతం ఇచ్చింది. దేవుడెన్నడూ తన పిల్లలకు బాకీపడడు. వారు తమ ఆస్తిపాస్తులతో, ప్రేమ ఈవులలో, ధారాళంగా క్రమంగా ఇచ్చే కానుకలతో ఆయన్ను ఘనపరిస్తే దేవుడు తన వాగ్ధానాలు ప్రకారం వారి ప్రతి అక్కర తీరుతుందని ధైర్యంగా వుండవచ్చు - ఫిలిప్పీ 4:19 చూడండి.

**5. చివరి పాఠం : నమ్మకంగా, దేవుణ్ణి సంతోషపెట్టే విధంగా ఇచ్చే రహస్యమేమంటే మనకున్నదంతా ప్రభువుకు చెందిందే అని గుర్తించటం.**

ఈ అనామక విధవరాలు తనకున్నదంతా ఇచ్చింది. 44 వచనంలో యేసుప్రభువే ఆ మాట చెప్పాడు. "ఈమె తన లేమిలో తనకు కలిగినదంతా, అనగా తన జీవనమంతయు వేసెను." క్రైస్తవులంగా మనం గుర్తించాల్సిన ప్రాముఖ్య విషయమిది. మన ఆస్తిపాస్తులు, డబ్బు సమస్తమూ ప్రభువుకు చెందినవే. నా ఇల్లు, నా పిల్లలు, నా డబ్బు, నా పొలము, నా కారు ఇవేవీ నావి కావు. ఆయనకు చెందినవే. నేనొక ధర్మకర్తను, గృహ నిర్వాహకుడిని మాత్రమే. ఈ సూత్రం నా డబ్బుకు ఎలా వర్తిస్తుంది ? నాకున్నదంతా ప్రభువుకు చెందిందే అని నేను గుర్తిస్తే "ఆయనకు ఎంత ఇవ్వాలి" అని నేను అడగను. అందుకు భిన్నంగా "ప్రభువు తన డబ్బులో నన్ను నా అవసరాలకోసం ఎంత వాడుకోమంటాడు ?" అని అడుగుతాం.

ఈ పేద విధవరాలు యేసుప్రభువును ఎంత ప్రేమించిందంటే, ఆమె "తనకున్నదంతా" ఇచ్చింది. అదీ నిజమైన దాతృత్వం. త్యాగపూర్వకంగా ఇవ్వటం. నిజమైన విశ్వాసం అంటే అదే. నిజమైన విశ్వాసం చేసేదేమంటే తన దగ్గర వున్నదంతా ఇచ్చేసి, తన అవసరాల కోసం దేవునివైపు కనిపెడుతుంది. దీనంతటి లో రహస్యమేమంటే, ఆమె ప్రభువుకు ఇచ్చింది. ఏ గుడికో కాదు. ప్రభువుకే ఇచ్చింది. ఆమె తన చిన్న కానుకను పెట్టెలో వేసినప్పుడు ఆమె హృదయం "చెప్ప శక్యం గాని దేవుని పరమునకై దేవునికి స్తోత్రం" (2కొరి 9:15) అని చెబుతున్నట్టుంది.

తెలుసుకుందాం
5:1-20

# పన్నులు

**పరిసయ్యులు, హేరోదీయులు యేసు ప్రభువును పన్ను విషయమూ ప్రశ్నించి, పరీక్షించినప్పుడు (మార్కు 12:14). వారొక జటిల సమస్యను లేవనెత్తుతున్నారు. పన్నుల విషయంలో యూదులు చాలా తీవ్రమైన నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే దాదాపు సహస్రాబ్ది కాలంగా వారు విపరీతమైన పన్నుల భారం మోస్తూ ఉన్నారు.**

పన్నులు అనేవి కీడు జరక్కుండా వుండటానికి ఇచ్చిన కానుకలతో ప్రారంభమై వుండవచ్చు (ఆది 13-21; 33:10; 43:11).

ఈజిప్ట్‌లో ఏడు సంవత్సరాల సమృద్ధి తదనంతరం, ఏడేళ్ల కరువు వస్తుందని యోసేపు హెచ్చరించాడు. తరువాత ఫరో యోసేపుకు ఆదాయం సేకరించే బాధ్యతలను అప్పగించాడు. అతడు కరువు కాలంలోనూ, సమృద్ధిగా పంటలు పండిన కాలంలోనూ ఫరో కోసం ధాన్యం నిల్వ చేయడానికీ, పొలాలు కొనడానికి 20 శాతం పన్ను వసూలు చేశాడు (ఆది 47:20-26).

నిర్గమనం కాలంలో ప్రత్యక్ష గుడార నిర్మాణం కోసం మోషే స్వేచ్ఛార్పణలు కోరాడు (నిర్గమ 25:2; 35:5,21) ప్రత్యక్ష గుడారం సేవకోసం 20 ఏళ్లు పైబడిన ప్రతి పురుషుడు అర షెకెలు యివ్వాలని ధర్మశాస్త్రం నిర్దేశిస్తున్నది (నిర్గమ 30:1-16).

ఇశ్రాయేలు ప్రజలు ఒక రాజు కావాలని కోరినప్పుడు దాని ఫలితం విపరీతమైన పన్నుల భారం అని సమూయేలు ప్రవక్త హెచ్చరించాడు. అది ప్రతి దాంట్లో దాదాపు పదోవంతు దాకా వుండవచ్చు. అంతేకాదు తమ పొలాలను, సేవకుల్ని కూడా లాగేసుకొనే ప్రమాదం వున్నది. "ఆ దినమున మీరు కోరుకొనిన రాజును బట్టి మీరు మొరపెట్టినను యెహోవా మీ మొర వినకపోవును" అని ముందే హెచ్చరించాడు (1సమూ 8:14-18). అతడి మాటలు అక్షరాలా నెరవేరడానికి ఎంతోకాలం పట్టలేదు.

దావీదు, సొలొమోనుల హయాంలో ఎన్నో పన్నులు విధించారు. భూ ఫలములోను, మందలలోను పదోవంతు (1సమూ 8:15,17); ఏడాదిలో ఒక నెలపాటు నిర్బంధ సైనిక సేవ (1ది.వృ. 27:1); దిగుమతి సుంకాలు (1రాజులు 10:15). వీటన్నిటికి తోడు సామంత రాజులు చెల్లించే కప్పం (2సమూ 8:6; 2రాజులు 3:4). పన్నుల భారం ఎంత పెరిగిందంటే సొలొమోను మరణానంతరం రాజ్యం చీలిపోయేంత వరకు దారితీసింది (1రాజులు 12:4).

పర్షియనులు రాజ్యానికి వచ్చినప్పుడు నూతన పన్ను వ్యవస్థను నెలకొల్పారు. సామంత రాజ్యాలు కప్పం చెల్లించటం మాని, ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం పన్నులు వసూలు చేయాలని నిర్దేశించారు. పర్షియా సామ్రాజ్యంలోని ఆయా ప్రాంతాలలో సత్రపులు అనే అధికారులు పన్నులు వసూలు చేసి, నియమిత సొమ్మును రాజుగారి ఖజానాలో చేర్చేవారు. ఆదాయ వనరులు కప్పం, శిస్తూ, సుంకాల రూపంలో వచ్చేవి (ఎజ్రా 4:13). గవర్నరు కుటుంబ నిర్వహణ కోసం కూడా ప్రత్యేకమైన పన్ను వసూలు చేసేవారు. ఇక్కడ కూడా పన్నులు పెనుభారమే. చాలామంది ప్రజలు గత్యంతరం లేక తమ పొలాల్ని, ద్రాక్షతోటలను తాకట్టు పెట్టేవారు. కొందరైతే ఏకంగా తమ పిల్లల్నే బానిసలుగా అమ్మేశారు (నెహెమ్యా 5:1-5).

పాత, క్రొత్త నిబంధనల మధ్యకాలంలో యూదులు ఈజిప్ట్‌కు చెందిన టోలమీ వంశస్థుల పాలనలో వున్నారు (క్రీ.పూ. 301-198). తరువాత సిరియాకు చెందిన సెల్యూసిడ్ పాలకుల క్రింద వున్నారు. (క్రీ.పూ. 198-63). టోలమీల హయాంలో పన్నులు వసూలు చేసే అధికృత వేలంపాటు ద్వారా నిర్ణయించేవారు. ఎవరు ఎక్కువ మొత్తం చెల్లించడానికి ముందుకు వస్తే వారికి ఆ బాధ్యత అప్పగించేవారు. కాంట్రాక్టర్లు చట్టం నిర్దేశించిన దానికంటే రెట్టింపు పన్ను వసూలు చేసి, బాగా డబ్బు ఆర్జించేవారు. ఈ పన్నులు వసూలు చేసే అధికారులకు తమ పనిలో తోడ్పడానికి సైనిక సహాయం కూడా అందించేవారు.

బహుశా, సిరియనుల కాలంలో కూడా ఇదే పద్ధతి కొనసాగి వుండవచ్చు. జట్టు పన్ను, ఉప్పు పన్ను, చక్రవర్తి పన్ను మొదలైన పన్నుల్ని ఈ కాలంలో విధించేవారు.

సిరియనులు పంటలో మూడోవంతు, పండ్లతోటలపై సగం వంతు, దేవాలయ నిర్వహణ కోసం చెల్లించే దశమభాగంలో కొంత పన్నుగా వసూలు చేసేవారు. క్రీ.పూ. 63లో రోమన్‌లు యెరూషలేమును స్వాధీనపరచుకొన్నప్పుడు యూదులపై తాత్కాలిక పన్నుగా 10,000 తులాలను విధించారు. ఆ తరువాత జూలియస్ సీజర్ చక్రవర్తి పన్నులు తగ్గించి, సబ్బాతు సంవత్సరంలో (ప్రతి ఏడో సంవత్సరం) పన్నులేమీ లేకుండా చేశాడు. అయితే, అనతికాలంలోనే హేరోదులు పాలకులయ్యారు.

హేరోదులు జుట్టు పన్ను, మత్స్యకారులపై పన్ను విధించారు. కపెర్నహూములోని లేవీ లాంటి వ్యక్తులు వాణిజ్య మార్గాలలో సుంకాలు వసూలు చేసేవారు (మత్తయి 9:9; మార్కు 2:14; లూకా 5:27). ఈ నగరంలో నౌకాశ్రయం కూడా వుండి వుండవచ్చు. అందువలన దిగుమతి సుంకాలు, మత్స్యకారులపై కూడా పన్నులు విధిస్తూ వుండవచ్చు. ఈ పన్నులన్నీ కలుపు కుంటే కొన్ని వస్తువుల్ని వాటి అసలు ధరకంటే 1000 రెట్లు అధికంగా అమ్మి వుండవచ్చు. బానిసలపైన, నూనెలు, వస్త్రాలు, చర్మాలు, ఉన్ని మొదలైన వాటిపై కూడా పన్నులు విధించి వుండవచ్చు.

ఈ పన్నులన్నిటితో బాటు మత సంబంధమైన పన్నులు వుండనే వున్నాయి. అవి ప్రభుత్వ పన్నులు చెల్లించకపూర్వం ఒక వ్యక్తి ఆదాయంలో 10 నుండి 20 శాతం వుంటుంది. ఫలితంగా యేసుప్రభువు కాలంలో యూదులు ప్రభుత్వానికేమీ, మత సంబంధంగా నేమి 30 నుండి 40 శాతం పన్నులు చెల్లించేవారు.

అందుకే, "కైసరుకు పన్ను చెల్లించుట న్యాయమా? కాదా?" అని పరిసయ్యులు ప్రశ్నించటంలో ఆశ్చర్య పోవలసిందేమీ లేదు.

ఆలోచించండి
5:1-20

## మృతుల నగరం

**గదర బహుశ సేన దయ్యాలు పట్టిన వ్యక్తిని యేసు బాగుచేసిన స్థలమో లేక సమీప స్థలమో అయి వుంటుంది (మార్కు 5:1-20; మత్తయి 8:28-34; లూకా 8:26-39). దయ్యం పట్టిన ఇద్దరు వ్యక్తులను స్పష్టపరచినట్లు మత్తయి రాశాడు. అయితే, లూకా ఒక వ్యక్తినే ప్రస్తావించాడు. బహుశా ఆ ఇద్దరిలో వీడు చాలా అదుపులో లేనివాడు అయివుంటాడు.**

ఏది ఏమైతేనేం ఆ సంఘటన ఒక మృతనగరం వద్ద జరిగి వుంటుంది (మార్కు 5:2,3,5). ఇప్పటిలాగే అప్పుడు కూడా కొందరు సమాధుల్లోనే కాపురముండేవారు. దయ్యం పట్టిన వ్యక్తిని సభ్యసమాజం తరిమి వేసినట్లు సువార్తలు తెలియజేస్తున్నాయి. ఇప్పటి కైరో నగరంలో దాదాపు పదిలక్షల మంది శ్మశానాల్లోనే నివసిస్తున్నారంటే ఆశ్చర్యం వేస్తుంది కదూ, అవును, ఇది ముమ్మాటికీ నిజం. సమాధులపైన ఇళ్లు కట్టుకొని నివసిస్తున్నారు. మధ్య ప్రాచ్యంలో ఈ అలవాటు ఇప్పటిది కాదు.

ఈ నాటకీయ సంఘటన ఒక మృత నగరంలో జరగటమే గాకుండా, మరొక గట్టి సంఘటన కూడా ఇక్కడే చోటుచేసుకుంది - అదే తుఫానును నిమ్మళింపజేసిన సంఘటన (మార్కు 4:35-41). యేసుప్రభువు సముద్రంపై చెలరేగిన తుఫానుకే కాదు సమాధులలో కాపురమున్న వాడి జీవితంలో రేగిన పెను తుఫానుకు కూడా యేసే అధినేత అని మార్కు వెల్లడిచేస్తున్నాడు.

ఆ మనిషి లేదా దయ్యాలు తమను తాము సేనగా చెప్పుకొన్నారు (5:9). రోమన్ సేనలోని 5000 నుండి 6000 సైనికులు అఖాబా అగాధం నుండి ఉత్తర సిరియా వరకు వున్న దెకపొలి గుండా వెళ్లే రాజ రహదారి ఈ దయ్యాలు పట్టిన వ్యక్తి నివాస స్థలం సమాధులు వున్న స్థలంమీదుగా కవాతు నిర్వహించేవారు. అదేరీతిగా వేలాది దయ్యాలు ఈ వ్యక్తిని రాత్రింబవళ్లు చిత్రహింసలు పెడుతూ అతడి శరీరం మీద స్వారీ చేస్తున్నాయి.

యేసు దయ్యాలను వెళ్లగొట్టాడు, అవి వెళ్లి ఒక పందుల మందలో దూరి, వాటిని కొనిపోయి ఒక సరస్సులో దూకి చనిపోయేలా చేశాయి (5:11-13). ఏమిటీ యేసుప్రభువుకు అదెంత నష్టం కలిగిస్తుందో, పర్యావరణానికి ఎంత చేటు చేస్తుందో తెలియదా అంటూ కొందరు విమర్శించే వారూ లేకపోలేదు. కాని, యేసుప్రభువు పందులమంద అంతటికంటే ఒక్క ఆత్మ ఎంతో ముఖ్యం. వాస్తవంగా ఆయన నష్టం కలగజేయలేదు. దయ్యాలు చేశాయి. అయితే, అతణ్ణి రక్షించడం కోసం ఆ సంఘటనను అనుమతించాడు. ఇతరచోట్లలో లాగే ఇక్కడ కూడా వస్తు వాహనాలకంటే, లాభాపేక్ష కంటే ప్రజలు ముఖ్యమని ఆయన తేటతెల్లం చేస్తున్నాడు.

# మార్కు సువార్తలో
# ప్రసంగాంశాలు

**పాత బట్టకు మాసిక (మార్కు 2:16-22)**

పాత బట్ట – పాపి సహజ స్వభావం, ప్రాచీన పురుషుడు

కొత్త మాసిక – మతము, పైపై మెరుగులు

ఫలితం – చినుగు – మార్పులేని స్వభావాన్ని బహిర్గతం చేస్తుంది

గొప్ప అవసరత – నూతన జన్మ, మారుమనస్సు (యోహాను 3:7)

**మొలిచిన విత్తనం (మార్కు 4:26-34)**

విత్తనం విత్తుట – వాక్యం హృదయంలో ప్రవేశించుట (1పేతురు 1:23)

నెమ్మదిగా పెరుగుట – చనిపోయి, బ్రతుకుట (1కొరి 15:36)

ఖచ్చితమైన ఫలితం – జీవం కనిపించుట (అ.కా. 11:22,23)

కోతకొచ్చిన పంట – సంపూర్ణ ఫలం (యోహాను 4:34)

**తుఫానును నిమ్మళింపజేయడం (మార్కు 4:35-41)**

జీవిత యానం (35వ) – "అద్దరికి వెళ్లుదము"

తన స్వంత వారితో యేసు (36వ) – "ఆయన దోనెలో వున్నాడు"

జీవిత తుఫానులు (37వ) – "పెను తుఫాను"

అవిశ్వాసపు భయం (38) – "నిశబ్దమై ఊరకుండుము"

ఆహ్లాదకరమైన మార్పు (39వ) – "మిక్కిలి నిమ్మళము"

పాపి మేల్కొలుపు, భయం, ప్రమాదం, అవసరతలో ఆక్రందన, క్రీస్తు శక్తి, సువార్త ద్వారా నెమ్మది, నమ్మకం ద్వారా ప్రశాంతత, నెమ్మదిని అనుభవించుట, మహిమలో ప్రవేశించుట ఇవన్నీ ఛాయామాత్రంగా కనిపిస్తున్నాయి.

**గదర మనిషి (మార్కు 5:1-21)**

అపవాది చెరలో (2వ) – పాపి స్థితి

సమాధుల మధ్య (2వ) – పాపి స్థలం

బంధింప వీలు లేకుండెను (3వ) – పాపి పరిస్థితి

సాధుపరచలేకపోవుట (4వ) – మనిషి నిస్సహాయత

మహా వైద్యుడు, యేసు (6వ) – సమీపంలో యేసు

దయ్యాలు ఆయన శక్తికి – సాతాను వ్యతిరేకత

భయపడి పొయ్యాయి (7వ)

గొప్ప విడుదల (9వ) – వ్యక్తిగత రక్షణ

క్రీస్తును గూర్చి సాక్ష్యము (16వ) – మార్పు లక్షణాలు

క్రీస్తు కొరకు సాక్షి (19,20వ) – నిజమైన శిష్యరికం

**మొండివ్యాధిని స్వస్థపరచడం (మార్కు 5:25-34)**

దీర్ఘకాల రోగం (26వ)

అనేకమంది వైద్యుల రోగి (26వ)

తరిగిపోయిన వనరులు (26వ)

క్రొత్త వైద్యుని గూర్చి విన్నది (27వ)

క్రీస్తు దగ్గరకు వచ్చింది (27వ)

ఆయన శక్తి ద్వారా స్వస్థతపొంది, తెలిసికొన్నది (29వ)

దాని విషయం ఒప్పుకొన్నది, ఆయన మెప్పు పొందింది (34వ)

**అయిదువేలమందికి ఆహారం (మార్కు 6:30-34)**

ఆకలితో వున్న గుంపులు (34వ) – మానవజాతి

అరణ్య ప్రదేశం (35వ) – లోకం

ప్రొద్దుగుంకు వేళ (35వ) – జీవితం క్షణ భంగురం

దైవిక కనికరం (37వ) – దేవుని కృప

విశ్రమించుచున్న ప్రజలు (40వ) – క్రియల ద్వారా కాదు

శక్తిగల అద్భుతం (41వ) – క్రీస్తు శక్తి

సమృద్ధి సరఫరా (42వ) – సమృద్ధి రక్షణ

**యేసు నీళ్ళమీద నడవడం (మార్కు 4:35-40)**

ఒంటరి రాత్రి (35వ) – ప్రస్తుత కాలం

చెలరేగిన సముద్రం (37వ) – జీవిత తుఫానులు

తల్లక్రిందులవుతున్న పనివారు (38వ) – భూమిమీద సంఘం

ప్రార్థిస్తున్న ప్రభువు (38వ) – పరలోకంలో

సకాలంలో విమోచకుడు (39వ) – రానైయున్నవాడు

సంతోషకరమైన మాట (40వ) – ఆయన స్వరమే

ఆయన సన్నిధి శక్తి (41వ) – ఆయనే వారిమధ్య

**చూపు పొందిన గుడ్డివాడు (మార్కు 8:22-30)**

గుడ్డివాడు (22వ) – పాపి సహజ స్వభావం

అవసరతలో ఆవేదన (22వ) – ప్రార్థించే భక్తులు

సున్నిత స్పర్శ (23వ) – క్రీస్తు దయ

పని మొదలైంది (23వ) – పరిశుద్ధాత్మ కార్యం

దృష్టి (24వ) – వాక్యపు వెలుగు

స్పష్టమైన చూపు (25వ) – నిజమైన రక్షణ

**దయ్యం పట్టిన బాలుడు (మార్కు 9:14-29)**

చింతలోనున్న తండ్రి (17వ) – విశ్వాసము గల వ్యక్తి

అవసరతలో కుమారుడు (18వ) – సాతాను అధికారం క్రింద

నిస్సహాయ శిష్యులు (14–28వ) – వారిలో వారు మాటలాడుకొనుట (33వ)

శక్తిగల విమోచకుడు (19వ) – యేసుక్రీస్తు

**వ్యత్యాసాలు – 1**

సున్నం గొట్టిన (మత్తయి 23:27) – వేషధారి

తెల్లగా చేసికొనిన (ప్రకటన 7:14)

**వ్యత్యాసాలు – 2**

స్వనీతి (లూకా 16:15) – స్వనీతిపరులైన పరిసయ్యులు

దైవనీతి (లూకా 18:14) – ఒప్పుదల పొందిన పాపి

**వ్యత్యాసాలు – 3**

నేనేం చెయ్యాలి ? (మార్కు 10:17) – ధనవంతుడి ప్రశ్న

నీకేమి చేయగోరుచున్నావు ? (మార్కు 10:51) – బిచ్చగాడి అవకాశం

మొదటి ప్రశ్న ఏమీ చేయని ధనవంతుడు రక్షకుణ్ణి అడిగింది

రెండవ ప్రశ్న ప్రభువు బిచ్చగాణ్ణి అడిగింది, ఆయన సమస్తము ఇచ్చాడు

ఒకడు "విచారముతో" వెళ్లాడు, మరొకడు "దేవుని మహిమపరిచాడు"

**మారుమనస్సు, లేదా పశ్చాత్తాపం**

**1. మానవుని విధి**

(2రాజులు 17,13; 2ది.వృ. 30:6; కీర్తన 1:23)

యెషయా 22:12; యెహెజ్కేలు 18:31; హోషేయా 14:2

యోవేలు 2:12; మత్తయి 3:2; లూకా 13:2,3; అ.కా. 3:19; 8:22; 17:30

**2. ఒప్పుకోలు (క్రీస్తునందలి విశ్వాసం)**

1) క్రీస్తును ఒప్పుకొనుట (బహిరంగంగా)

మత్తయి 10:32; లూకా 12:8; రోమా 10:9; ఫిలిప్పీ 2:11; యోహాను 2:23; 4:15

2) ఏడు ప్రాముఖ్యమైన ఒప్పుకోళ్లు

పేతురు – మత్తయి 16:16

నతనయేలు – యోహాను 1:49

సమరయ స్త్రీ – యోహాను 4:29

పేతురు రెండవ ఒప్పుకోలు – యోహాను 6:69

మార్త – యోహాను 11:27

తోమా – యోహాను 20:28

ఇతియోపియా మంత్రి – అ.కా. 8:37

**3. పాపములు ఒప్పుకొనుట**

(లేవీ 16:21; 26:40; సంఖ్యా 8:37)

ఎజ్రా 10:11; సామెతలు 28:13; యిర్మీయా 3:13; యోహాను 1:9

**4. జాతి పాపాలు ఒప్పుకొన్న ఉదాహరణలు**

సంఖ్యా 21:7; న్యాయాధి 10:10; 1సమూ 7:6; ఎజ్రా 9:6; నెహెమ్యా 1:6; యెషయా 50:12; యిర్మీయా 8:14; 14:7; దానియేలు 9:5

**5. వ్యక్తిగత పాపాలు కొప్పుకొనిన ఉదాహరణలు**

బిలాము – సంఖ్యా 22:34

ఆకాను – యెహోషువ 7:20

సౌలు – 1సమూ 15:24

దావీదు – 2సమూ 12:13 (2సమూ 24:10; యోబు 7:20; కీర్తన 41:4; 51:3; మత్తయి 27:4)

బాప్తిస్మమిచ్చే యోహాను ద్వారా మారుమనస్సు

పొందినవారు – మార్కు 1:5

పేతురు – లూకా 5:8

తప్పిపోయిన కుమారుడు – లూకా 15:18

**6. పశ్చాత్తప్తులకు వాగ్దానాలు (1సమూ 7:3)**

ప్రార్థనకు జవాబు – 2ది.వృ. 7:14

పాపక్షమాపణ 6 యెషయా 55:7

ఉదాహరణలు :

ఆహాబు – 1రాజులు 21:27

యెషీయా – 2రాజులు 22:19

ఎజ్రా కాలంనాటి ఇశ్రాయేలు జాతి – ఎజ్రా 10:1

యోబు – యోబు 42:1,6

నీనెవె ప్రజలు – యోనా 3:6,9

పేతురు – మార్కు 14:72

తప్పిపోయిన కుమారుడు – లూకా 15:21

సుంకరి – లూకా 18:13

దేవునివైపు మళ్లుట

1రాజులు 8:48; కీర్తన 78:34; యెషయా 19:22; 30:15; 55:7; హోషేయా 6:1; 14:1; మలాకీ 3:7; లూకా 15:20; 1పేతురు 2:25

విరిగిన మనస్సుతో వచ్చిన వారికి వాగ్దానాలు

కీర్తన 34:18; 51:17; యెషయా 66:2; యోవేలు 2:13; 2కొరి 7:10

## పరలోక రాజ్యము

1. లూకా 17:21; యోహాను 3:5; 18:36; రోమా 14:17; 1కొరి 4:20; 15:50

2. ప్రవేశ అర్హతలు

   దీనత్వం – మత్తయి 5:3

   సానుభూతితో సేవ జేయుట – మత్తయి 25:34,35

   దీక్ష – లూకా 9:62

   క్రొత్త జన్మ – యోహాను 3:3

   సహనం – అ.కా. 14:22

   విశ్వాస, ప్రేమలు – యాకోబు 2:5

3. శక్తితో వచ్చును

   దానియేలు 2:44; మార్కు 9:1; అ.కా 2:2,4; 1కొరి 4:20; ప్రకటన 11:17

4. సమీపములో ఉన్నది

   మత్తయి 3:2; 4:17; 10:7; లూకా 21:31

5. బోధించుట (దేవుని రాజ్యమును)

   మార్కు 1:14; లూకా 4:43; 8:1; 9:2; 16:16; అ.కా. 1:3; 8:12; 20:25; 28:23

6. క్రీస్తు రాజ్యము

   మత్తయి 16:28; లూకా 22:30; 23:42; యోహాను 18:36; ప్రకటన 17:14

## క్రీస్తు స్పర్శ

1. విశ్వాసంతో ఆయన్ను ముట్టుకున్న వారికి స్వస్థత చేకూరింది.

మత్తయి 9:20; 14:34-36; మార్కు 3:10; లూకా 6:19

2. ఆయన స్పృశించిన వారికి ఆరోగ్యము, ఆదరణ కలిగింది.

శుద్ధి చేసే స్పర్శ - మత్తయి 8:3

నెమ్మదినిచ్చే స్పర్శ - మత్తయి 8:15

వెలుగిచ్చే స్పర్శ - మత్తయి 9:29,30

అభయమిచ్చే స్పర్శ - మత్తయి 17:7

విడుదల కలిగించే స్పర్శ - మార్కు 7:33,35

చిన్నారులపై చేతులుంచుట - మార్కు 10:13,16

స్వస్థపరచే స్పర్శ - లూకా 22:51

3. మనుష్యులను యేసు నొద్దకు తెచ్చుట

రోగులను, మత్తయి 4:24; 8:16

పిచ్చివారిని, మత్తయి 9:32

సంఘం సాయం చేయటంలో విఫలమైన వారిని, మార్కు 9:17-20

నిస్సహాయులను, లూకా 5:18,19

గ్రుడ్డివారిని, లూకా 18:40

అన్వేషకులను, యోహాను 1:41,42; 12:20-22

సందేహించువారిని, యోహాను 1:45,46

పాపిష్టి వారిని, యోహాను 8:3

దుఃఖితులను, యోహాను 11:28

**విశ్వాసము**

1. లూకా 17:5; రోమా 10:17; 14:23; గలతీ 5:6; హెబ్రీ 11:1; యాకోబు 2:17; యోబు 5:4

2. విశ్వసించుటకు కారణాలు

విజయం వాగ్దానం చేసినందున - 2ది.వృ. 20:20

ప్రాథమిక విధి - యోహాను 6:25,29

స్వీయ రక్షణ ఆయుధము - ఎఫెసీ 6:16 (1థెస్స 5:8)

1తిమోతి 1:19; 6:12; హెబ్రీ 10:22)

భక్తిలో తప్పనిసరి - హెబ్రీ 11:6

ప్రార్థనలో తప్పక వుండాలి - యాకోబు 1:5,6

ప్రేమ జోడించాలి - 1యోహాను 3:23

3. విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చుట

హబక్కూకు 2:4; రోమా 5:1; గలతీ 3:6; ఫిలిప్పీ 3:9

4. విశ్వాసమును బట్టి ఆశీర్వాదాలు

మత్తయి 8:13; 9:29,30; మత్తయి 17:20; మార్కు 9:23

5. విజయవంతమైన విశ్వాసానికి ఉదాహరణలు

అబ్రాహాము - ఆది 22:8

కాలేబు - యెహోషువ 14:12

యోనాతాను - 1సమూ 14:6

దావీదు - 1సమూ 17:37

యెహోషాపాతు - 2ది.వృ. 20:12

యోబు - యోబు 19:25

ముగ్గురు యూదు బందీలు - దానియేలు 3:17

పౌలు - అ.కా. 27:25

పూర్వకాలపు విశ్వాస వీరులు - హెబ్రీ 11:33

**క్రీస్తు పరిచర్య మూలంగా కలిగిన 'అనేక' ఆశీర్వాదాలు**

1. అనేక దయ్యాలను వెళ్లగొట్టాడు (మత్తయి 8:16; మార్కు 1:34)
2. అనేక అద్భుతాలు చేశాడు (మత్తయి 13:58)
3. అనేకులు, ఆయనను ముట్టుకొన్న వారందరు స్వస్థత పొందారు (మత్తయి 14:36; మార్కు 3:10; 6:56)
4. అనేకులను స్వస్థపరిచారు (మార్కు 1:34; 3:10)
5. అనేకుల బాధ బాగు చేశాడు (లూకా 7:21)
6. అనేకులకు దృష్టి ప్రసాదించాడు (లూకా 7:21)
7. అనేకులు ఆయన నామమందు విశ్వాసముంచిరి (యోహాను 2:23; 4:39-41; 7:31; 8:30; 10:42)

8. అనేక అద్భుతాలు చేశాడు (యోహాను 11:47; 12:37)
9. అనేక నాయకులు ఆయనపై నమ్మకం పెట్టారు (యోహాను 12:42)
10. అనేక సూచక క్రియలు జరిగించాడు (యోహాను 20:30; 21:25)
11. అనేక సంగతులు బోధించాడు (మత్తయి 13:3; మార్కు 6:34)
12. అనేకుల కొరకు ఆయన ప్రాణమును క్రయధనముగా అర్పించాడు (యోహాను 20:28)
13. అనేకుల పాపక్షమాపణ కొరకు తన రక్తము చిందించాడు (మత్తయి 26:28)
14. మృతులను అనేకులను లేపాడు (మత్తయి 27:52)
15. మనకు ఆదర్శంగా అనేక శ్రమలను అనుభవించాడు (మార్కు 8:31; 1పేతురు 4:1)
16. అనేక (విస్తార) పాపములు క్షమించెను (లూకా 7:47)
17. అనేకులకు కుమారులయ్యే అధికారం అనుగ్రహించాడు (యోహాను 1:12)
18. అనేక మంచి క్రియలను చూపెట్టాడు (యోహాను 10:32)

## పన్నెండుమందికి అప్పగించిన నాలుగు విధాల పరిచర్య

1. తనతో వుండుట (మార్కు 3:14)
2. సువార్త ప్రకటించుట (మార్కు 3:14; 6:12; 16:15-20; మత్తయి 10:7,20; లూకా 9:2-6; అ.కా. 1:8)
3. స్వస్థపరచుట (3:15; 6:13; 16:15-20; మత్తయి 10:1-8; లూకా 9:1,6; అ.కా. 1:8)
4. దయ్యాలను వెళ్లగొట్టుట (3:15; 6:13; 16:15-20; మత్తయి 10:1-8; లూకా 9:1-6)

## మంచినేలను విత్తినవారు (మార్కు 4:20)

1. దేవుని వాక్యం వినువారు (20వ) తన మాట వినమని దేవుడు దాదాపు 155 పర్యాయాలు పరిశుద్ధ గ్రంథంలో హెచ్చరించాడు. ఒక్కసారి కూడ తన మాటలు గ్రహించుట కష్టం అనిగాని, ప్రత్యేకమైన వివరణ అవసరమని గాని సూత్రప్రాయంగా కూడ చెప్పలేదు. బైబిలులో వున్నది వున్నట్టు నమ్మితే బైబిలు సందేశం తేటగా అర్థమవుతుంది.
2. స్వీకరించాలి. మనిషికి చిక్కంతా ఇక్కడే వచ్చి పడుతుంది. మనుషులు బైబిలును అర్థం చేసికోకపోతే, తిరస్కరించే అవకాశము వుంటుంది.
3. ఫలించుట, దేవుని వాక్యం విని, విశ్వసించినప్పుడు ఫలిస్తాం (యెషయా 55:11)

## ప్రకృతి శక్తులపై పట్టు సాధించిన వ్యక్తులు

1. మోషే (నిర్గమ 7:14-25; 9:13-35; 10:21-27; 14:16)
2. యెహోషువ (యెహో 10:12)
3. సమూయేలు (1సమూ 7:9-12)
4. ఏలీయా (1రాజులు 18:42-46; 2రాజులు 1:10-15; 2-8; యాకోబు 5:17)
5. ఎలీషా (2రాజులు 2:14; 3:16-20; 4:1-7; 42-44; 6:1-7; 8:1-2)
6. రానైయున్న శ్రమల కాలంలోని ఇద్దరు సాక్షులు (ప్రకటన 11:3-11)
7. రానైయున్న క్రీస్తు విరోధి (ప్రకటన 13:2; 2థెస్స 2:8-12)

## రక్తస్రావరోగి స్వస్థతలో పది మెట్లు

1. ఆమె దుస్థితి (మార్కు 5:25)
2. అన్ని రకాల వైద్యం చేయించుకొన్నది (26వ)
3. ఆమె తన దగ్గర వున్నదంతా ఖర్చు చేసింది (26వ)
4. యేసును గురించి విన్నది (27వ)
5. యేసును ముట్టుకోవాలని తీర్మానించుకొన్నది (27వ)
6. ఎలా చెయ్యాలో ప్రణాళిక వేసుకొన్నది (27,28వ)
7. విశ్వాసం వినియోగించింది (28,34వ)
8. తక్షణమే స్వస్థత పొందింది (29వ)
9. స్వస్థత పొందినట్లు ఎరిగింది (33వ)
10. పూర్తిగా ఒప్పుకొన్నది (33వ)

**ఆత్మను భ్రష్టుపట్టించే 10 పాపాలు**

1. చెడుతలంపులు – ఇందులో ఊహలు, కుయుక్తులు, మోహము, కామాతురత, పోకిరితనం మొదలైనవన్నీ వున్నాయి. క్రీస్తుకు లోబరచని మానసిక చర్య ఏదైనా ఈ కోవక్రిందికే వస్తుంది. 2కొరి 10:5; మత్తయి 15:19 చూడండి.
2. వ్యభిచారం – మత్తయి 5:32
3. జారత్వం
4. హత్యలు
5. దొంగతనాలు
6. దురాశ – లూకా 12:15
7. దుష్టత్వం – కీర్తన 1:4
8. మోసము – కీర్తన 119:118
9. కామాతురత – గలతీ 5:19
10. చెడు దృష్టి – సామెతలు 23:7; 27:20; ప్రసంగి 1:8; యోహాను 2:16
11. దేవదూషణ – నిర్గమ 20:7
12. గర్వం – కీర్తన 101:5
13. అవివేకము – 2కొరి 11:1,17,21

**చెడు తలంపులు అనే పాపాలకు 24 ఉదాహరణలు**

1. సాధారణ దుష్టత్వం – ఆది 6:5; కీర్తన 64:5; యెషయా 59:7; 65:2
2. పగ, అసూయ – ఆది 50:20
3. బాధ్యతను తప్పించుకొనుట – ద్వి.కా. 15:9
4. అబద్ధ సాక్ష్యము – ద్వి.కా. 19:15–21
5. నిరాధారమైన తీర్పులు – న్యాయాధి 15:2
6. హత్య, మానభంగం – న్యాయాధి 20:5
7. ఊహించి తీర్పు తీర్చుట – 1సమూ 1:13
8. చంపుటకు కుట్ర పన్నుట – 1సమూ 18:25; నెహెమ్యా 6:2; ఎస్తేరు 3:6
9. దురాశ – 2ది.వృ. 32:1; యెహె 38:10–12; లూకా 12:15–21
10. గర్వం – ఎస్తేరు 6:6; కీర్తన 10:4
11. చెడు ఊహలు – యోబు 21:27; 2ది.వృ. 10:4–7
12. అసత్య భద్రత – కీర్తన 49:11
13. వ్యర్థత – కీర్తన 94:11; 119:113; యిర్మీయా 4:14
14. అవివేకము – సామెతలు 24:9
15. కుటిల పాలకులు – ప్రసంగి 10:20
16. చింత – మత్తయి 6:25–34; లూకా 12:11–26
17. నిందలు మోపుట – మత్తయి 9:3,4; 12:24,25; లూకా 5:21,23; 11:17
18. మతంలో అతిశయం – మత్తయి 15:1–20; మార్కు 7:1–22; లూకా 6:7,8
19. తమను తాము హెచ్చించుకొనుట – లూకా 9:46–48
20. దేవుని శక్తిని దురుద్దేశంతో, బహిరంగ ప్రదర్శనకు కారకులు (అ.కా. 8:18–24)
21. జ్ఞానానుసారం కాని మతాసక్తి – అ.కా. 26:9–18
22. మానవ జ్ఞానమును బట్టి అతిశయం – 1కొరి 3:18–21
23. పక్షపాతం – యాకోబు 2:1–4
24. అవిశ్వాసము, సందేహం – లూకా 24:38

**సిగ్గుపడకూడని రెండు విషయాలు**

1. క్రీస్తు – లూకా 9:26
2. ఆయన మాటలు

   ఎందుకంటే;

   1) అవి దేవుని మాటలు (యోహాను 3:34)

   2) అవి ఆత్మ (యోహాను 6:63)

   3) అవి జీవము (యోహాను 6:63,69)

   4) అవి తీర్పు తీర్చును (యోహాను 12:48)

   5) అవి అద్భుతమైనవి (యోహాను 14:10)

   6) దేవుడితో సమాధారపరచును (14:23)

   7) ప్రార్థనలకు జవాబు తెస్తాయి (యోహాను 15:7; కొరి 1:20)

**శ్రమపడడానికి, చావడానికి కూడా సిద్ధపడవలసిన రెండు విషయాలు**

1. క్రీస్తు కొరకు (మార్కు 8:35)
2. సువార్త కొరకు (మార్కు 8:35)

# క్రొత్త నిబంధనలో రోమన్ సైనికులు

యుద్ధంలో పాల్గొనటమే గాకుండా రోమన్ సైనికులకు అనేక బాధ్యతలు వుండేవి. అల్లర్లు జరిగినప్పుడు వీధుల్లో కాపలా కాసేవారు. యెరూషలేములో ఈ పనికోసం ఎప్పుడూ ఒక పటాలం వుండేది. యూదుల పండుగల సందర్భాల్లో నగరం ప్రజలతో క్రిక్కిరిసిపోతుంది గనుక సైనికుల సంఖ్యను మరింత పెంచేవారు. సైనికులు నేరస్థులకు కాపలాదారులుగా కూడా వ్యవహరించేవారు. నేరగాళ్లను ఒకచోట నుండి మరొక చోటకు మారిస్తే సైనికులు కూడా వారివెంట వెళ్లాలి. నేరస్థులను ఉరితీసే సమయం సైనికులు తప్పక వుండేవారు. ఎందుకంటే చివరి క్షణంలో అవసరమైతే నిలువరించడానికీ లేదా వాస్తవ శిక్ష అమలు చేయడానికి.

శతాధిపతి అంటే 100 సైనికులకు అధికారి. సాధారణంగా వీరు మామూలు సైనికులై వుంటారు. అయితే వారి ధైర్య సాహసాలు నమ్మకత్వాన్ని బట్టి పదోన్నతి కల్పిస్తారు. సువార్తలు, అపోస్తలుల కార్యంలో కొందరు శతాధిపతుల ప్రస్తావన వున్నది. ముఖ్యంగా ఇద్దరి పేర్లు ప్రస్తావించటం జరిగింది. వారు యూదులతో సత్సంబంధాలు కలిగి వున్నందున, యేసుక్రీస్తు పట్ల వారికున్న సానుకూల వైఖరిని బట్టి ఇద్దరి ప్రస్తావన చక్కగానే వున్నది.



యేసుప్రభువు కపెర్నహూములో వుండే శతాధిపతి దాసుణ్ణి స్వస్థపరిచాడు (మత్తయి 8:5-13; లూకా 7:1-10). స్థానిక యూదు నాయకులు అతణ్ణి తమ స్నేహితుడిగా అవసరమనువంటే ఇంకా కాస్త ఎక్కువగానే పరిగణించేవారు. ఎందుకంటే అతడు వారికోసం సమాజ మందిరం నిర్మించి పెట్టాడు. యేసుప్రభువును సిలువ వేసిన సైనికులకు నాయకత్వం వహించిన శతాధిపతి తాను విన్న వాటిని, చూచిన వాటిని బట్టి యేసు నిర్దోషి, దైవిక వ్యక్తి అనే నిర్ధారణకు వచ్చాడు (మత్తయి 27:54; మార్కు 15:39, 44 నుండి లూకా 13:47). అపోస్తలుల కార్యములు 10 అధ్యాయంలో కొర్నేలిని గూర్చి చదువుతాం. అతడు భక్తిగల వ్యక్తి, పేతురు పరిచర్యలో రక్షణ పొందాడు. పౌలును నిర్బంధించిన సందర్భంలో కొందరు పేరు ప్రస్తావించని శతాధిపతులు వున్నారు (అ.కా. 21:31 నుండి; 22:25; 23:17,23; 24:23). పౌలు ఇతర సైనికులకు రోమ్‌కు పంపినప్పుడు వారి కాపలా బాధ్యత నిర్వహించింది జూలియస్ అనే శతాధిపతి (అ.కా. 27:1). అతడు పౌలు సలహా కంటే ఓడ నావికుడు, యజమాని మాటకు అధిక ప్రాధాన్యత ఇచ్చినా, పౌలు పట్ల దయగా వ్యవహరించాడు (9-11 వచనాలు).

ఆరుగురు శతాధిపతుల క్రిందవున్న సేనను పటాలం అని పిలిచేవారు. దాని అధికారిని ట్రిబ్యూన్ అని వ్యవహరించేవారు (అ.కా. 21:31) .పౌలును నిర్బంధించి, యూదులు యెరూషలేములోని దేవాలయం లో వేలము, అల్లరికి పాల్పడినప్పుడు అక్కడ వున్న సేనలకు నాయకత్వం వహించిన ట్రిబ్యూన్ క్లాడియస్ లుసియస్ (అ.కా. 21:26 నుండి 23:17 నుండి). పటాలం ప్రస్తావన తరచు కనిపిస్తుంది. ఇటలీ పటాలం లోని సైనికుల్ని బహుశా ఇటలీలో చేర్చుకొని వుండవచ్చు (10:1) ఆగస్టీన్ పటాలము రోమ్ మొదటి చక్రవర్తి ఆగస్టన్ గౌరవార్థం పెట్టింది అయి వుండవచ్చు.

పది పటాలాలు కలిసి ఒక సేన అవుతుంది. దానికి ఒక లెగేట్ నాయకత్వం వహిస్తాడు. ఇందులో దాదాపు 6000 సైనికులు వుంటారు.

# పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా పాపం (మార్కు 3:22-30)

**(మత్తయి 12:22-32; లూకా 11:14-23 కూడా చూడండి)**

కొందరు శాస్త్రులు పనిగట్టుకుని యెరూషలేము నుండి వచ్చి ఎలాగైనా యేసుప్రభువు పని ఆపెయ్యాలని ప్రయత్నిస్తున్నారు. ఆయన అనుచరులే ఆయన్ను పిచ్చిపట్టినవాడు అన్నందున వీరికిక మంచి అవకాశం దొరికింది. అందువలన వీరు ఆయన్ను పూర్తిగా అపవిత్రాత్మ ఆవహించింది అంటున్నారు. అందువలన ప్రభువు వారిని ధైర్యంగా తన వద్దకు వచ్చి చూడమని ఆహ్వానించాడు.

యేసుప్రభువు దురాత్మలపై శక్తిగలవాడు అని తెలియజేసే గాథలలో ఇది మరొకటి.

### బయెల్జెబూలు పట్టినవాడు - (22వ)

ఇప్పుడు శాస్త్రులకు ఒక చిక్కు వచ్చి పడింది. దేవుని సాయంతో యేసు ప్రజలను స్వస్థపరుస్తున్నాడు అని చెబితే వారాయన్ను నమ్మాలి, తమ మార్గాలు మార్చుకోవాలి. అయితే, వారు ఆ పని చేయడానికి సిద్ధంగా లేరు. కనుక, యేసు అపవిత్రాత్మ శక్తితో, బయెల్జెబూలు సాయంతో దయ్యాలను వెళ్ళగొడుతున్నాడని చెబుతున్నారు.

బయెల్జెబూలు లేదా బయెల్జెబూబు ఒక అన్యదేవత పేరు. అది సాతానుకు మరో పేరో కాదో మనకు స్పష్టంగా ఆయన అద్భుతాలు చేశాడని మాత్రం ఒప్పుకొన్నారు.

### పరిసయ్యులు ఎవరు ?

దేవుని ధర్మశాస్త్రాన్ని పొల్లుపోకుండా పాటించాలని ప్రయత్నించే ఒక గుంపు. వీరు యాజకులు కాదు, వ్యవసాయం, వ్యాపారం మొదలైన వృత్తులను చేపట్టేవారు. వారిలో చాలామంది బాగా చదువుకున్న వారు కూడా కాదు. వారి ప్రధాన లక్ష్యం యూదులు అన్యుల సాంప్రదాయాలను అనుసరించకుండా చూడడం. "పరిసయ్యుడు" అనే పదానికి ప్రత్యేకించుకున్నవాడు అని అర్థం. దానికి మంచి మార్గమే మంటే దేవుని ధర్మశాస్త్రాన్ని నిక్కచ్చిగా పాటించడమని వారు భావించారు. పరిసయ్యులలో చాలామంది చిత్తశుద్ధి గలవారు. వారి తప్పులేమంటే.

1. శాస్త్రులు పాతనిబంధన ధర్మశాస్త్రానికి భాష్యం చెప్పినప్పుడు వారు అనేక నియమాలను వాటికి జోడించారు. అవి కూడా ధర్మశాస్త్రమంత ప్రాముఖ్యమైనవని పరిసయ్యులు భావించారు. తరచు వారు చేసే గొప్ప తప్పేమంటే శాస్త్రులు నియమించిన నియమాలను శ్రద్ధగా పాటిస్తున్నందున ధర్మశాస్త్రములోని "నీ తల్లిదండ్రులను సన్మానింపుము" అనే ఆజ్ఞను విస్మరించేవారు. అందువలన ఈ నియమాలకంటే దేవుని ఆజ్ఞలనే పాటించాలి అని ప్రభువు చెప్పాడు.
2. వారిలాగా ఈ నియమాలను శ్రద్ధగా పాటించని వారిని విమర్శించేవారు. అలాంటి వారిని 'పాపులు' అని పిలిచేవారు. వారు కష్టాల్లో వుంటే సాయం చేసేవారు కాదు (2:15 చూడండి).
3 శాస్త్రులు విధించిన నియమాలను త.చ తప్పకుండా పాటించినందుకు సంతృప్తి చెంది, ఆ విషయమై గర్వించేవారు కూడా (లూకా 18:11,12). వారు అనేక విషయాల్లో తప్పిపోతూనే దేవుని ధర్మశాస్త్రాన్ని పాటిస్తూ వున్నామని చెప్పుకొంటున్నందున యేసు వారిని "వేషధారులు" అన్నాడు. యేసు వారి బలహీనతల్ని ఎత్తి చూపినందున ఆయన్ని ద్వేషించారు శాస్త్రులు. ఇతరులు యేసును చంపటానికి కుట్ర పన్నుతుంటే వారితో చేతులు కలిపారు (3:6).

### శాస్త్రులు

వీరు పాత నిబంధన ధర్మశాస్త్ర ఉపదేశకులు. ఆ పని వారు ప్రతిరోజూ చేస్తునందుకు జీతం పుచ్చుకునేవారు శాస్త్రులలో అధివశాతం పరిసయ్యుల వర్గానికి చెందినవారు, అయితే వీరు బాగా చదువుకున్నందున పరిసయ్యులకు నాయకులయ్యారు. కొందరు శాస్త్రులు, పరిసయ్యులు గ్రామాలలోని సమాజ మందిరాలలోను, యూదుల అత్యున్నత న్యాయస్థానం సన్ హెడ్రిన్ సభలో కూడా ముఖ్య స్థానాల్లో వుండేవారు.

పాత నిబంధన ధర్మశాస్త్రాన్ని కంఠత చేసేటప్పుడు పూర్వపు శాస్త్రులు చెప్పిన వివరణలను కూడా బట్టీ పట్టేవారు. ఈరోజు పరిభాషలో చెప్పాలంటే వారు న్యాయ వాదులు. న్యాయస్థానాల్లో ధర్మశాస్త్ర సంబంధమైన చట్టాలకు భాష్యం చెప్పేవారు. అయితే వారు సమాజ మందిరంలో ఉపదేశించటం, బోధించటం కూడా చేసేవారు. ధర్మశాస్త్రము

లేదా చట్టము, మతము కలిసి వుండేవి. శాస్త్రులు వాటిని లేఖనాలలో నుండి తీసుకొని, రెంటినీ ఒకేవ్యక్తి బోధించేవాడు. వారిలో కొందరు మంచివారు అని మార్కు (12:28-34) తెలియజేస్తున్నాడు.

శాస్త్రులలో అధికశాతం బోధలోను జీవితంలోనూ తప్పుచేస్తున్నారని యేసుప్రభువు చెప్పాడు (12:38-40). పరిసయ్యులు ఏ విషయంలో తప్పుచేస్తున్నారో, అదే విషయాల్లో శాస్త్రులు కూడా తప్పు చేస్తూ వచ్చారు. వారి ప్రధాన బలహీనత ఏమంటే, వారికంటే ముందటి శాస్త్రులు ఎలా చేసేవారో అక్షరాలా అలా చేయడమే వారి మతం. జీవము గల దేవుడు ఇప్పుడు ఏం చెబుతున్నాడో వారు వినేవారే కాదు (1:22 చూడండి). అందువలన దేవుని కుమారుడు లేఖనాలకు నూతన రీతిలో భాష్యం చెబితే వారు వినటానికి ఇష్టపడలేదు (2:6; 3:22; 11:8).

### సాతాను సాతానును ఎలా వెళ్లగొట్టును (23వ)

1. దీనర్థమేమంటే, "తప్పొప్పులను గురించి మాటలాడే టప్పుడు మీ ఇంగిత జ్ఞానం వినియోగించండి. దొంగ తన జేబునుండే దొంగిలిస్తాడా ?అని యేసు ప్రశ్నించాడు" అప్పుడాయన వారికి రెండు చిన్న ఉపమానాలు, లేదా సామెతలు చెప్పాడు; మొదటిది విభక్త రాజ్యాన్ని గూర్చినది (23:26 ) రెండవది; విభక్త గృహాన్ని గూర్చినది (27వ).
2. చెడుగును చెడుగుతోనే తరమేయడం ఎప్పటికీ సాధ్యం కాదు. చాలామంది తల్లిదండ్రులు ఇక్కడే తప్పు చేస్తుంటారు. తమ పిల్లల కోపాన్ని మాన్పడానికి వారు కూడా కేకలేస్తుంటారు. ఫలితం వ్యతిరేకంగా వుంటుంది. ఒకదేశం మరొక దేశపు కౄరత్వాన్ని విమర్శించి, దానిని పారదోలడానికి యుద్ధం చేస్తుంది. యుద్ధం ప్రతి ఒక్కరినీ మరింత కౄరంగా మారుస్తుంది కదా ? దాని ద్వారా కౄరత్వం రూపుమాపటం వీలు పడదు (రోమా 12:21 చూడండి).
3. యేసుప్రభువు "ఉద్దేశం" సాతానును వెళ్లగొట్టడం. ఆయన పోరాటమంతా ఎన్నడూ నిద్రపోని ఆ బలమైన శతృవుపైనే. ఈ పోరాటం ఇప్పుడూ కొనసాగుతూనే వుంది. ఆయన నమ్మిన మనమంతా దానిలో పాలు పొందుతూ వున్నాం.

### "ఒక రాజ్యము తనకు తానే విరోధముగా వేరుపడిన యెడల..." (25వ)

సాతాను తనమీద తానే పోరాడుకోడు అని చెబుతున్నాడు ప్రభువు. అలా చేసే పక్షంలో వాడు ఎప్పుడో అంతమై వుండవాడు కదా !

ద్విమనస్కులను వర్ణించడానికి ఈ నానుడి ఉపయోగిస్తారు ? ఉదా॥ ఒక వ్యక్తి శరీరంలోని ఒక భాగం మంచి చేయాలంటే మరో భాగం చెడు చేయాలని వుంటుంది (రోమా 7:19). ఒక సంఘము కూడా రెండుగా విడిపోయే ప్రమాదం లేకపోలేదు (గలతీ 5:15). ద్విమనస్కుడైన వ్యక్తిగాని, విడిపోయిన సంఘం గాని సులభంగా బలహీన మయ్యింది. అయితే ప్రభువు ఇరువురునీ సమైక్యపరచగలడు.

### "బలవంతుడి ఇంటిలోకి ఎవరూ ప్రవేశించలేరు" (27వ)

ఇది రెండవ ఉపమానం. బలవంతుడు సాతానే. వాణ్ణి బంధించేది యేసుప్రభువే. సాతాను బలవంతుడే కాని మన ప్రభువు అమిత బలాఢ్యుడు. రెండువేల సంవత్సరాలనాడు ఆయన సాతానును సిలువలో చితకగొట్టాడు. ఇప్పుడు ఆయన బిడ్డలమైన మన మన కాళ్ల కింద సాతానును చితక ద్రొక్కటం దేవుని సంకల్పం (రోమా 16:20). అపొస్తలుడు పౌలు, "నన్ను బలపరచువానియందే నేను సమస్తము చేయగలను" అంటున్నాడు (ఫిలిప్పీ 4:13).

"సమస్త పాపములును, మనుష్యులు చేయు దూషణలన్ని వారికి క్షమింపబడును..." (28వ)

రెండే సందర్భాల్లో మనం దేవుని క్షమాపణ పొందలేం. 1) మనము పశ్చాత్తాపడనప్పుడు, 2) ఇతరులను క్షమించ డానికి నిరాకరించినప్పుడు (1యోహాను 1:2,9).

### పరిశుద్ధాత్మ విషయం దూషణ చేయువాడెప్పుడును క్షమాపణ పొందక నిత్యపాపము చేసినవాడై యుండును" (29)

### 1. పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా

పరిశుద్ధాత్మతో నిండిన యేసు, మంచి పనులు చేయటం శాస్త్రులు కళ్లారా చూచారు, అయినా వారు ఆ క్రియలు దయ్యానికి ఆపాదించారు కనుక, వారు పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా పాపం చేసే ప్రమాదంలో వున్నారు. చెడును మంచి, మంచిని చెడు అనే పాపంలో వున్నారు. ఉదా॥ ఒక వ్యక్తి, "ఇతరులు పొగడాలని ఆ పని చేశాడు" అన్నట్లయితే, "మొదటి వ్యక్తిలో పరిశుద్ధాత్మ లేదు" అని రెండవ వ్యక్తి చెప్పినట్లే, ఆత్మను నిరాకరించటం, దూషించటం అంటే ఇదే.

దీని ద్వారా వారు తమ హృదయ కాఠిన్యాన్ని, ఆయన సాక్ష్యాన్ని సంపూర్ణంగా తిరస్కరించటాన్ని వ్యక్తపరుస్తున్నారు. పరిశుద్ధాత్మ కార్యాన్ని దయ్యాల అధిపతి పనిగా అభివర్ణించటంతో వారు తమ హద్దు మీరారు. వారి హృదయాలు బండబారి పోయాయి. పశ్చాత్తాపపడే అవకాశం వారి చేజారిపోయింది.

దీనినే కొందరు "క్షమించరాని పాపం" అని పిలుస్తారు. వాస్తవంగా ప్రజలు పశ్చాత్తాప పడి, విశ్వాసంతో యేసు వైపు మళ్లితే దేవుడు క్షమించకుండా వుండే పాపము అంటూ ఏదీ లేదు. అయితే ఒక వ్యక్తి పాపం చేస్తూపోతే, అతడి మనస్సుకి ఎర్రగా కాలిన ఇనుప కడ్డీతో వాత వేసినట్లుగా, మనసు మొద్దుబారి పశ్చాత్తాపపడాలనే కోరిక కలగకుండా పోతుంది. ఫలితంగా అబద్ధాన్ని నమ్మి, చివరకు నిత్య నాశనానికి పోతారు. ఈ శాస్త్రుల స్థితి కూడా అంతే. దేవుడు యేసుక్రీస్తులో వెల్లడించిన సత్యాన్ని వారు నిరాకరించారు.

బలవంతుడుగా సాతాను ప్రజలను తన దాస్యంలో అణచివేసి వున్నాడు, రెండువేల సంవత్సరాలనాడు మహాశక్తి సంపన్నుడైన యేసు వచ్చి తన మాటచేత వాడిని బంధించి, వాడి ఇంటిని దోచుకున్నాడు. పరిశుద్ధాత్మ సాక్ష్యం నిరాకరించడమంటే ఈ గొప్ప పోరాటంలో సాతానుతో చేతులు కలపటమే.

అందుకే, ప్రభువు ఈ గంభీర వాక్కుల్ని చివర్లో జోడించాడు, "సమస్త పాపములును, మనుష్యులు చేయు దూషణలన్నియు వారికి క్షమింపబడును గాని పరిశుద్ధాత్మ విషయం దూషణ చేయువాడెప్పుడు క్షమాపణ పొందక నిత్యపాపము చేసినవాడై యుండును" (28,29వ). ఆ తరువాత వచనంలో వివరణ వున్నది, "ఎందుకనగా, ఆయన అపవిత్రాత్మ పట్టినవాడని వారు చెప్పిరి" (30వ).

ఈ మాటలు ఆశగల ఆత్మలు యేసుక్రీస్తును తెలుసుకోవటంలో నిరాశపరిచేవి గాక, క్రీస్తును గూర్చి పరిశుద్ధాత్మ ఇచ్చే సాక్ష్యమును నిరాకరించే వారికి గొప్ప హెచ్చరికగా వున్నాయి. వాతవేసిన మనస్సాక్షి గలవారు ఎలాగూ దేవుని వాక్యానికి స్పందించలేరు.

## పనికిమాలిన సాంప్రదాయం (మార్కు 7:1-23)

యేసుప్రభువు ఇంకా గలిలయ ప్రాంతాలలోనే పరిచర్య చేస్తున్నాడు. నజరేతు ప్రజలు ఆయన్ను తిరస్కరించిన తరువాత పన్నెండు మందిని సేవార్థం పంపించాడు (6:6-1-13). అయితే హేరోదు ఆయన్ను అనుమానంగానే చూస్తున్నాడు (6:14-29). ఆయన అయిదువేల మందికి ఆహారం పెట్టాడు (6:30-44); నీళ్లమీద నడిచాడు (6:45-52). జనసమూహాలు ఇంకా ఆయన్ను వెండిస్తూనే వున్నారు (6:53-56). ఇప్పుడు మరో సంక్షోభం ఎదురైంది.

ఆయన్ను చంపజూస్తున్నారు (3:6). నజరేతులో ఆయన తిరస్కారం (6:1-6). ఇప్పుడు సంక్షోభానికి కారణం ఆయన యూదు సాంప్రదాయాన్ని తిరస్కరించుట.

యెరూషలేములోని మత నాయకులకు యేసును గూర్చి ఇప్పటికే బాగా తెలిసిపోయింది. వారు యేసుపై దండెత్తడానికి పనిగట్టుకొని యెరూషలేము నుండి వచ్చారు. మార్కు 3:6లో చెప్పిన సమయం నుండి వారు ఆయన్ను చంపాలని ప్రయత్నిస్తూనే వున్నారు. ఇప్పుడు యెరూషలేము నుండి కొందరు అధికారులను, వేదశాస్త్ర పండితులను యేసు, ఆయన బోధ విషయం పరిష్కరించమని పంపించారు (7:1).

### 1. మతాసక్తికీ నిజమైన విశ్వాసానికీ ఎంతో తేడా వుంది

యెరూషలేము నుండి వచ్చిన పరిసయ్యులు యేసు, ఆయన శిష్యులు మత సాంప్రదాయాలు పాటించకపోవడం గమనించారు. ముఖ్యంగా భోజనానికి ముందు చేతులు కడుక్కోవటం (7:2). భోజనానికి ముందు చేతులు కడుక్కోవటంలో ఏమీ తప్పులేదు. ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో ఈ అలవాటు వుంది. అయితే, పరిసయ్యులు దానిని కాస్తా మతాచారం క్రిందికి మార్చారు. ఎవరైనా ఆ ఆచారం పాటించకపోతే వారిని చెడ్డవారిగా పరిగణిస్తారు.

పరిసయ్యులకు ఇలాంటి సాంప్రదాయాలు చాలా వున్నట్టు మార్కుతెలియజేస్తున్నాడు (7:3,4). ఈ సాంప్రదాయాలు పాత నిబంధనలోనివి కావు. మోషే ధర్మశాస్త్రంలో అవి కనిపించవు, వాటిని పాటించమని దేవుడు ఎప్పుడూ చెప్పలేదు.

మతము యొక్క లక్షణమే ఇది. చాలా మతాల్లో వారి ఆచార వ్యవహారాలు వుంటాయి. మతావలంబులు ఎవరైనా ఆ సాంప్రదాయాలను పాటించకపోతే చెడ్డవారుగా పరిగణిస్తారు. పాత నిబంధన దేవుని వాక్యమే, అయితే పరిసయ్యులు పాత నిబంధనలో లేని అనేక ఆచారాలను వాటికి కలిపారు. నేటి క్రైస్తవ సంఘాల్లో కూడా ఇలాంటి వాక్యములో లేని సాంప్రదాయాలు ఎన్నో గమనిస్తాం. యేసునందు విశ్వాసాన్ని మృతమైన మతంగా మార్చేస్తుంటారు. ప్రజలు కొత్త కొత్త ఆచారాలను కనిపెడతారు. నీవు పాటించకపోతే వారు తల్లక్రిందులైపోతారు. ఉదా, కొందరు లెంటు దినాలను చాలా నిష్టగా పాటిస్తారు, మెడలో

సిలువలు వేసుకుంటారు. కొందరు తెల్లబట్టలు ధరిస్తారు. ఎవరైనా రంగు బట్టలు ధరిస్తే వారికి భక్తి తక్కువ అని భావిస్తారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ జాబితా చాలా పెద్దదవుతుంది. ఈ ఆచారాలు పాటించకపోతే నీవు పాపం చేస్తున్నట్టు భావిస్తారు కూడా. పరిసయ్యులు యేసుప్రభువును అదేమాట అడుగుతున్నారు. "నీ శిష్యులెందుకు పెద్దల పారంపర్యాచారము చొప్పున నడుచుకోవటంలేదు..." (7:5). యేసుక్రీస్తునందు విశ్వాసముంచటం అంటే ఈ విధంగా ఆచారాలు పాటించడం కాదు.

## 2. యేసుప్రభువు వివరణ

ఈ విధమైన మతాన్ని మానవ సాంప్రదాయాలను పాటించడంగా యేసుప్రభువు విశ్లేషించాడు. మతస్తులు దేవుణ్ణి గురించి బోలెడంత మాటలాడుతారు వారి మతమంతా కొన్ని నియమాలు,మత సంబంధమైన కర్మకాండలు, ఇతరులు ఏం చేయాలో చెప్పటం (7:6-8) మాత్రమే. వారి మతమంతా అధికభాగం సాంప్రదాయంతో కూడినది. చిన్న చిన్న కర్మకాండలు మొదట బాగానే వున్నట్టు అనిపించినా రాను రాను అవి కఠిన నియమాలుగా రూపాంతరం చెందుతాయి. ఫలితంగా ప్రజలు న్యాయము, కనికరము, దేవుని పట్ల విధేయత విడిచిపెట్టి మత కర్మకాండలవైపు మొగ్గు చూపుతారు.

## 3. అలాంటి మతమంతా డొల్ల

యేసుప్రభువు ఒక ఉదాహరణ యిచ్చాడు (7:9-10). తల్లిదండ్రులను సన్మానించే విషయం మోషే ధర్మశాస్త్రం చాలా ఖండితంగా చెబుతుంది. నిర్గమ 20:12లోని అయిదో ఆజ్ఞను మీరిన వారికి మరణశిక్ష విధిస్తుంది. పరిసయ్యులు మతకుయుక్తి పన్ని ఆజ్ఞను మీరడానికి వెసలుబాటు కల్పించుకున్నారు. కుమారులు తల్లిదండ్రులకు ఇవ్వవలసిన సొమ్ము "కొర్బాన్" అని చెబితే దానినుండి మినహాయింపు దొరుకుతుంది (7:11). మూల భాషలో ఈ పదానికి "కానుక" అని అర్థం. అంటే ఇప్పుడు ఆస్తి దేవుడికి అర్పిత మని భావం. అయితే, దానిని ఎప్పుడూ దేవునికి యివ్వటం జరగదు. ఆ మాట పలికినందున దానిని తల్లి దండ్రులు వాడుకోవటం వీలు కాదు. ఈ విధంగా ధర్మశాస్త్రానికి వక్రభాష్యం చెప్పి, తమకు అనుకూలంగా మార్చుకున్నారు (7:12,13).

ఇది మతపు ముసుగులో జరిగే మోసం, తల్లి దండ్రులులను నిర్లక్ష్యం చేయటానికి పన్నిన మత కుట్ర పరిసయ్యుల మతంతో ఇలాంటి కుతంత్రాలు మరెన్నో వున్నాయి (7:15).

## 4. నిజమైన విశ్వాసం హృదయ సంబంధమైనది

పరిసయ్యుల సంగతి పట్టించుకోకుండా యేసుప్రభువు ప్రజలను ఆలోచింపజేయడానికి ఒక ఉపమానం చెప్పాడు (7:14-16). తరువాత దానిని శిష్యులకు వివరించాడు (7:17,18). సాధారణంగా మత సాంప్రదాయాలు బాహ్య ప్రవర్తనకు సంబంధించినవిగా వుంటాయి. అయితే, వాస్తవంలో దేవుని దృష్టికి బాహ్య ఆచారం అంత ముఖ్యం కదా. ముఖ్యంగా చేతులు కడుక్కోవడం లాంటి చిన్న చిన్న మత కర్మకాండలు ఆయన అసలు పట్టించుకోడు. ఆహార పదార్థాలను గూర్చిన నియమాలు కూడా అంతే అప్రధానం. వ్యక్తికి వెలుపలివి ఏవీ అంత ప్రాముఖ్యం కానేకాదు (7:18,19). పవిత్ర, అపవిత్ర ఆహారం కూడా అంత ప్రాముఖ్యమైన విషయం కాదు. అది కడుపును తాకుతుందే గాని మనిషి వ్యక్తిత్వాన్ని తాకదు.

హృదయం అన్నిటికంటే ముఖ్యమైంది. పాపమంటే మత ఆచారాలు పాటించటం లేక పాటించకపోవటంలో వుండదు. హృదయంలో చోటు చేసుకునే దానిని బట్టి పాపము, నీతి వుంటాయి. స్త్రీ, పురుషుల సమస్య ఏమంటే, 'హృదయంలో' అంటే మనిషి వ్యక్తిత్వ కేంద్ర స్థానంలో పాపముతో జన్మించాం... హృదయంలో నుండి పాపము, ద్వేషము, అపవిత్రత పుట్టుకొస్తాయి (7:20-22). ఇవి మనిషి జీవితంలో నుండి పుట్టుకొస్తాయి. చేతులు కడుక్కోకపోవటం కాదు మనిషిని అపవిత్రత పరిచేది హృదయంలోని చెడును నియంత్రించకపోవటం అపవిత్రపరుస్తుంది. పరిసయ్యులు యెరూషలేము నుండి పనిగట్టుకొని యేసును తప్పుబట్టాలని వచ్చారు ఆయన సాంప్రదాయాలను పాటించటం లేదు గనుక విమర్శించవచ్చు అనుకున్నారు. అయితే, వారి హృదయాల మాటేమిటి ? ఆయనంటే వారికి విపరీతమైన ద్వేషం లేదా ? ఆయన విజయాన్ని చూచి వారు అసూయంతో రగిలి పోవటం లేదా ? హృదయం నిండా దుష్టత్వం వుంది భోజనం దగ్గర చేతులు శుభ్రంగా వుంటే ఏమిటి ప్రయోజనం?

మత సాంప్రదాయం పాపం కాదు. పాపం మనలోని స్వభావం నుండి పుడుతుంది. యేసుప్రభువు మనల్ని రక్షించి నప్పుడు నూతన హృదయం ఇస్తాడు. మతం హృదయాన్ని శుద్ధిచేయలేదు కాని యేసుప్రభువు చేయగలడు.

ఆలోచించండి
5:1-20

# పొంచి ఉన్న ప్రమాదం

పులిపిండి అనేది చాలా శక్తివంతమైన ఫంగస్. చాలా కొద్ది పిండిని పెద్ద రొట్టె అయ్యేలా పొంగజేస్తుంది. ద్రవాలను ఆల్కహాల్‌గా మారుస్తుంది. బాధాకరమైన రోగాలను కూడా కలిగిస్తుంది. యేసుప్రభువు పరిసయ్యులు, హేరోదును గురించి మాటలాడుతూ పులిపిండిని ప్రస్తావించినప్పుడు (మార్కు 8:15) శిష్యులు తత్తరపడిపోయారు. ఇంతకూ ఆయన భావమేమిటి ? పరిసయ్యులు, హేరోదు పులిపిండి అంటే ఏమై వుండవచ్చు ?

అయిదు వేలమందికి, నాలుగు వేలమందికి అద్భుత రీతిలో ఆహారం పెట్టిన విషయం యేసుప్రభువు తన శిష్యులకు గుర్తు చేశాడు (8:19-21; 6:35-44; 8:1-9). దానికి పరిసయ్యుల స్పందన ఎలాగుంది ? వారు ఆయనతో వివాదం పెట్టుకొని, ఒక అద్భుతం చేస్తే ఆయన్ను పరీక్షించాలని కోరారు (8:11). ఒక్క ముక్కలో చెప్పాలంటే - అన్ని వేలమందికి అద్భుతంగా ఆహారం పెట్టినా వారు నమ్మటానికి తిరస్కరించారు. అంతేకాదు యేసును ఏలాగైనా అంతమొందించాలనే దురుద్దేశంతో అంతకుముందే హేరోదుతోను, అతడి అనుయాయుల తోనూ చేతులు కలిపారు (3:6; 12:13). బాప్తిస్మమిచ్చే యోహాను విషయంలో కూడా హేరోదు చేసింది ఇదే (6:14-29).

అవిశ్వాసమనే భయంకర అంటు రోగాన్ని గూర్చి యేసుప్రభువు తన శిష్యులను హెచ్చరిస్తున్నాడు. పిండిలో పులియజేసే పదార్థం ఎలాగో అవిశ్వాసం కూడా మనిషిలో గూడుకట్టుకొని, దేవునికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేలా జీవితాన్ని సర్వనాశం చేస్తుంది. శిష్యుల మందబుద్ధి చూచి ప్రభువు విచారించాడు (8:17). బహుశా అవిశ్వాసమనే పులియజేసే పదార్థం వారిలో అప్పటికే పనిచేస్తూ వున్నది. మొట్టమొదటిసారి అద్భుతరీతిలో ఆహారం పంచిపెడితే, వారు దానిభావం గ్రహించలేకపోయారు (6:52), ఇప్పుడు రెండవ పర్యాయం కూడా అదే జరుగుతుంది.

తన శిష్యుల విశ్వాస స్థితి విషయం యేసుప్రభువు ఎంతో కలత చెందాడు. ప్రమాదం ముందున్నదని ఆయనకు తెలుసు. బలమైన శత్రువులు తనను పట్టుకుంటారని తన శిష్యులకు చెప్పరాని శ్రమలు వస్తాయని ఆయనకు తెలుసు. నెమ్మది, నెమ్మదిగా ప్రజలకు దూరం కావడానికి ప్రయత్నించాడు (8:26,30). శిష్యులు క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొనడానికి సిద్ధమయ్యేంత వరకు తన ప్రత్యర్థులకు తారసపడకుండా వుండాలని ఆయన తలంపు.

మన విశ్వాస జీవితానికి ఎలాంటి శ్రమలు మున్ముందు ఎదురు కాబోతున్నాయో మనలో ఎవరూ ఎరుగరు. మనము ఎన్నడూ ఊహించని శోధనలు, శ్రమలు ఎదురుకావచ్చు. మనకు ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోడానికి మనం సిద్ధమేనా ? లేక అవిశ్వాసమనే పులిపిండికి చోటిచ్చామా ? దేవునిపై మన నమ్మకాన్ని సడలించి, మన జీవితమంతా ఆయన్ను వ్యతిరేకించేలా అంతటా ప్రాకిపోయేలా చేస్తుంది అవిశ్వాసం, జాగ్రత్త.

# ఆఖరు వారంలో జరిగిన సంఘటనలు

## అంజూరపు చెట్టును శపించుట
**(మార్కు 14:12-14,29,21)**

మార్కు 11 అధ్యాయం 12-14 వచనాల్లో ప్రారంభ మైన ఈ కథ 20,21 వచనాల్లో ముగుస్తుంది. ఈ సందర్భంలో యేసుప్రభువు ఏంచేశాడో ఖచ్చితంగా చెప్పడం కష్టం. ఎందుకంటే మొత్తం కథ మార్కు వివరించలేదు. యేసుప్రభువు సిలువ మరణాన్ని పొందే ముందు ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ అయిదు వచనాలను కలిపి చదవాలి.

ఇంతకుముందే చెప్పినట్టు ఈ సందర్భంలో ఏం జరుగు తుందో చెప్పడం కష్టం కాని బహుశా ఈ క్రింది సంఘటనలు జరిగి వుండవచ్చు.

యేసు ఆయన శిష్యులు ప్రయాణమైపోతున్నారు. ఆకలేసింది. ఉన్నట్టుండి యేసు ఒక అంజూరపు చెట్టు చూశాడు. దానినిండా ఆకులే. శిష్యులు ఆశ్చర్యపడిపోయారు. శిష్యుల ఆశ్చర్యానికి రెండు కారణాలు వున్నాయి. ఒకటి, సంవత్సరంలోని ఆ కాలంలో అంజూరు చెట్టు నిండా ఆకులు వుండడం అరుదు. రెండవది, అంజూరు చెట్టు ఆకులు, పండ్లు ఒకేసారి కలిగి వుంటుంది. ఈ చెట్టుకు మాత్రం ఆకులు తప్ప మరేమి లేవు.

1. ఈ కథ చదివిన తరువాత కొందరు ఏమంటారంటే, అది ఫలించే కాలం కాదు కదా! అలాంటప్పుడు దానినుండి ఫలాలు ఆశించటం ఏం న్యాయం? యేసు పల్లె పట్టుల్లో పుట్టి పెరిగాడు. ఆయనకు ప్రకృతి బాగా తెలుసు. చెట్లు, చేమలు, ఋతువులు అన్నీ తెలుసు (మత్తయి 24:32 చూడండి). ఇంతకూ ఇక్కడ ఆయన చెబుతున్నదేమంటే "ఇదిగో, ఈ అంజూరపు చెట్టు చూడండి. ఇది మిగిలిన చెట్లకంటే ముందే ఆకులు కలిగివుంది. దీనినుండి ఎవరైనా ముందే పండ్లు ఆశించడం సహజం కదా! అయితే ఇందులో ఫలా లేమి లేవు. దీనికి ఏదో చీడ వచ్చినట్టు వుంది, ఇక ఇది ఎన్నడూ ఫలించదు".

మరో రోజు ఉదయాన్నే ఆ చెట్లును చూస్తే అది ఎండిపోతూ వుంది. పేతురు దానిని చూచి, "బోధకుడా, ఇదిగో నీవు శపించిన అంజూరపు చెట్టు ఎండిపోతుంది" (21వ) అన్నాడు. యేసుప్రభువు ఈ రీతిగా వివరించలేదు. ఇది కేవలం పేతురు వివరణ అని గమనించాలి.

2. ఈ కథను గురించి మరో రెండు వివరణలు కూడా వున్నాయి.

1) యేసుప్రభువు అంజూరపు చెట్టును గూర్చిన ఉపమానం ఒకటి చెప్పాడు (లూకా 13:6-9). తరువాత కొందరు ఆయనే స్వయంగా ఒక పండ్లు లేని అంజపూరపు చెట్టును చూచి శపించాడు అని చెబుతారు. మార్కు ఈ సంఘటన జరిగిన ఇరవై అయిదు సంవత్సరాలకే దీనిని గ్రంథస్తం చేశాడు గనుక మార్కు కథనమే నిజమని మనం నమ్మాలి.

2) "నీ పండ్లు ఎవరూ తినకుందురు" అని ప్రభువు అన్న మాటలు శపించటమే. యేసుప్రభువు తన శిష్యులకు వస్తు పాఠం నేర్పిస్తున్నాడు. ఎవరైనా దైనందిన జీవితంలో మతాన్ని అవలంబించకపోతే అలాంటివారు శాశ్వత జీవం పొందరు. దీనిద్వారా తాను దేవుడినని శిష్యులకు నేర్పిస్తున్నాడు అని కొందరి అభిప్రాయం.

అయితే యేసుప్రభువు మనందర్ని గాని, వస్తువుల్ని గాని శపించడం ఎక్కడ గమనించం. లేదా తాను దేవుడేనని నిరూపించుకోడానికి మాంత్రిక విద్య వినియోగించిన దాఖలాలు లేవు (8:12).

### "ఆకులు తప్ప మరేమి లేవు" (13వ)

ఆకులు మాత్రమే వుండి, "ఫలాలు" లేని మతం నిష్ఫలం. ఈ ఆకులు నేటి మతము, లేదా సంఘమునకు సంబంధించిన విధి విధానాలు, కర్మకాండలు, కట్టడాలు, సాంప్రదాయాలను సూచిస్తున్నాయి. వీటిని చూచి ఫలం ఆశించటం సహజం. ఉదా॥ మనకు కీడు చేసిన వారిని క్షమించడం, నిస్సహాయతలో వున్నవారిని ఆదుకోవడం, పనిలో నిజాయతీ, హృదయాలలో దేవుడు అనుగ్రహించు

శాంతిని అనుభవించటం. అయితే యూదు నాయకులు, ఆ మాటకొస్తే క్రైస్తవ నాయకులలో కూడా "ఆకులు" తప్ప మరేమి వుండటం లేదు (యోహాను 5:4,7; లూకా 6:46; యాకోబు 2:14,17). ఈ కథలో నేర్చుకొనే మొదటి పాపమిది.

"నీ పండ్లు ఎవరూ తినకుందురు గాక" (14వ). ఈ మాటలను బట్టి యేసుప్రభువుకు చెట్టుమీద కోపం వచ్చిందని భావించకూడదు. ఆయనకు ఆకలేసింది, తినడానికి అంజూరపు పండ్లు లేవు. అంటే మత్తయి 4:2-4 నుండి ఆయన ఈ రీతిగా చేయలేదని గ్రహిస్తాం. ఈ మాటలు ద్వారా ఇంతకూ ప్రభువు చెబుతున్నదేమంటే, ఫలాలు లేని మతము గాని, సంఘము గాని నిష్ప్రయోజనము, అప్పటికే, అది ఎండిపోవటం మొదలైంది. ఇది శపించుట కాదు, గొప్ప హెచ్చరిక (మత్తయి 7:19,26,27; 21:43). ఇది మనం నేర్చుకునే రెండవ పాఠం.

## దేవాలయాన్ని శుద్ధిచేయుట
### (మార్కు 11:15-19)

ఇశ్రాయేలు ప్రజలు వారి మత నాయకులు దేవుని సేవలో ఫలభరితంగా వుంటే, దేవాలయం నిజమైన ఆరాధన కేంద్రంగా విలసిల్లేది. అయితే దగ్గరనుండి దూర ప్రాంతాల నుండి ఆరాధించడానికి దేవాలయానికి వచ్చినవారు చూచిందేమిటి ? సంతగోల, రూకలు మార్చేవారి అవినీతి, బలికోసం పావురాలను అమ్మేవారి కేకలు, యూదేతరులు ఏకైక సత్య దేవుణ్ణి తెలిసికొని, ఆయన్ను ఆరాధించడానికి యెరూషలేములోని దేవాలయానికి వస్తారని పాతనిబంధన ప్రవక్తలు ఎంతోకాలం ముందే ప్రవచించారు (యెషయా 2:2-4 చూడండి). అయితే యూదేతరులు ఎవరైనా వచ్చి, చూస్తే వారికొరకు దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రాంతం సంతకోసం దురాక్రమణ చేసి వుండడం గమనిస్తారు. కనుక, ప్రభువు అకస్మాత్తుగా తన ఆలయంలోనికి వచ్చినపుడు (మలాకీ 3:1). అక్కడ వ్యాపారం చేసేవారిని తోలివేశాడు. యెషయా 56:7 ఉదహరించి దేవుని ఉద్దేశమేమిటో వెల్లడించాడు. "నా మందిరము సమస్త జనులకు ప్రార్థన మందిరమనబడును". యిర్మీయా ప్రవక్త తన కాలంలోని ప్రజలతో చెప్పిన మాటకూడా ఉటంకించాడు "నాదని చాట బడిన ఈ మందిరము మీ దృష్టికి దొంగల గుహయైనదా? (యిర్మీయా 7:11).

యేసుప్రభువు తన జీవిత కాలమంతా కరుణ క్రియలు, స్వస్థతలు జరిగిస్తూ గడిపాడు. అయితే ఫలించని అంజూరపు చెట్టుపై ఆయన గైకొన్న చర్య దేవాలయంలో జరుగుతున్న అవినీతిపై ఆయన నిరసించిన వైనం మనలను ఆలోచింప జేయాలి. ప్రజలు నాయకులు వాటిని గమనంచి, హెచ్చరిక నొందాలని ఆయన ఉద్దేశం.

### ప్రార్థన శక్తి :

దేవాలయంలో నుండి వ్యాపారులను తరిమివేసిన తరువాత, మరునాడు ఉదయం దారిన వెళ్తూ వుంటే అంజూరపు చెట్టు సమూలంగా ఎండిపోవడం చూచి శిష్యులు ఆశ్చర్యపడ్డారు. దేవుని ప్రజలు వారి జీవితాలలో ఏ రీతిగా నిష్ఫలులు, నిష్ప్రయోజకులయ్యారో ఇందులో శిష్యులు నేర్చుకొన్న గొప్ప పాఠం. అన్ని కాలాలకు సంబంధించి విశ్వాసాన్ని గూర్చిన పాఠం ఇందులో వున్నది.

వాస్తవంగా జరిగింది చూచి శిష్యులు ఆశ్చర్య పోవలసింది కాదు. ఎందుకంటే యేసుప్రభువు మాట శక్తి గలది. ఆయన చెప్పినమాట ఏదైనా నెరవేర్చడానికి ఆయనకు శక్తి వుంది (యెషయా 55:11). మనము దేవుని చిత్తాన్ని ఎరిగి ప్రార్థిస్తే ఆయన తప్పక జవాబిస్తాడని మనము ఎరుగుదుము. అది ఒకవేళ పర్వతంలాంటి గొప్ప సమస్యే కావచ్చు (11:23), మరేదైనా కావచ్చు. మనము దేవుని ఉద్దేశం తెలిసికొన్నప్పుడు విశ్వాసంతో ప్రార్థించవచ్చు. ఆయన ప్రణాళికను, ఉద్దేశాన్ని వెల్లడించమని అడగాలి. అప్పుడు మనం అడిగినవి పొంది వున్నాము అనే దృఢ విశ్వాసంతో ప్రార్థించాలి (24వ).

ఇతరులను క్షమించకపోతే మనలో దేవుని కార్యం జరగకుండా అవరోధం ఏర్పడుతుంది. మన దేవుడు క్షమించే దేవుడు, ప్రార్థనలో మనమాయనతో సహవాసం కలిగి వుండాలంటే మనము క్షమించాలి. అందుకే ఆయన తన శిష్యులకు క్షమాపణను గూర్చి ప్రార్థన నేర్పించాడు. మత్తయి 6:14,15, ''మీరు మనుష్యుల అపరాధములను క్షమించకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమించడు".

ప్రార్థనలో విశ్వాసాన్ని గురించి క్రొత్త నిబంధనలోని మరికొన్ని లేఖనభాగాలు చూడండి. హెబ్రీ 11; మత్తయి 17:20; లూకా 17:5,6; యాకోబు 1:5-8. ఇతరులను క్షమించటాన్ని గురించి మత్తయి 6:12-15; 18:21-35; లూకా 6:36,37; ఎఫెసీ 4:32; కొలస్సీ 3:13.

1. ఈ లేఖన భాగానికి సమాంతర లేఖనాలు మత్తయి 21:12-22; లూకా 19:45-48లోనూ కనిపిస్తాయి. యోహాను సువార్త ప్రారంభంలోనే (2:13-22) దేవాలయాన్ని శుద్ధిచేసిన సంఘటన చూస్తాం. బహుశా యేసుప్రభువు రెండు పర్యాయాలు దేవాలయం శుద్ధిచేసి వుండవచ్చు. అయితే, యోహాను కాలక్రమాన్ని బట్టి సంఘటన ప్రస్తావించలేదు. అయితే యేసుప్రభువు తన పరిచర్య కాలంలో చేసిన విభిన్న కార్యముల భావాన్ని ఇశ్రాయేలుకు, లోకానికి వెల్లడిస్తున్నాడు.

2. 12-14 వచనాలలో క్లిష్టతను భిన్నమైన రీతిలో అనేకులు వివరించడానికి ప్రయత్నించారు. అది చోటు చేసుకున్న సంవత్సరంలోని కాలం, అసలు పంటకంటే ముందు చిన్న చిన్న పండ్లు కాయటం మొదలైంది. ఇలాంటి ఉపమానాలు పాత నిబంధనలో కూడా వున్నాయి (యిర్మీయా 19:1-13; యెహెజ్కేలు 4,5 అధ్యాయాలు చూడండి). యిర్మీయా 7:20లోని పొలంలోని చెట్ల గురించి చదవడం కూడా ఆసక్తిదాయకంగా వుంటుంది.

3. యెరూషలేములో బలికోసం పశువుల్ని వృక్షాల్ని అమ్మే సంతలు నగరం వెలుపల ఒలీవల కొండమీద వుంటాయి. అయితే దీనికంటే కొద్దికాలం ముందు వరకు కూడా దేవాలయం ప్రాంగణంలోనే ఈ సంతను అనుమతించే వారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు దేవాలయం పన్ను యూదుల డబ్బులో గాని తూరు డబ్బులోగాని చెల్లించాలి. అందువలన వారు తమ డబ్బును మార్చు కునేవారు. యిర్మియా 17:27; జెకర్యా 14:21; మలాకీ 3:1 మొదలైన లేఖనాలు దేవాలయంలో యేసుప్రభువు చర్యల్ని లేఖనాలు ఎరిగినవారు అర్థం చేసుకోవడానికి సహాయపడతాయి.

## ద్రాక్షతోట - కౌలుదారులు

**(మార్కు 12:1-12)**

మత్తయి 21:33-46; లూకా 20:9-19 కూడా చూడండి.

యేసుప్రభువు తాను బంధించబడటానికి ముందు వారాల్లో యెరూషలేములో ఈ ఉపమానం చెప్పాడు. యూదుల నాయకులు ఇది విని, ఆయన్ను చంపాలని ఇంకా గట్టిగా తీర్మానించుకున్నారు. ఆయన జీవించిన కాలంలో వాస్తవంగా జరిగిన విషయాల్ని ఇక్కడ ప్రభువు చెప్పాడు. ఇక ధనవంతుడికి ద్రాక్షాతోట వున్నది. అతడు కొన్ని సంవత్సరాలపాటు మరో దేశం వెళ్తూ తన ద్రాక్షతోటను కొందరు రైతులకు కౌలుకు ఇచ్చాడు. డబ్బు రూపేణాగాక ప్రతి సంవత్సరం పంటలో కొంత కౌలుగా చెల్లించడానికి ఒప్పుకున్నారు. అతడు కౌలు వసూలు చేయడానికి మనుషుల్ని పంపగా, ఈ రైతులు వారిని అవమానపరిచి, కొందర్ని చంపారు కూడా. చివరకు అతడు తన కుమారుణ్ణి పంపించాడు. అతణ్ణి కూడా చంపారు. చివరకు వారు హత్యా నేరానికి గురై, ఆ పొలం వారినుండి తీసి క్రొత్తవారికి యివ్వడం జరిగింది.

### యేసుప్రభువు ముఖ్య ఉద్దేశం

ఈ కథ చెప్పటంలో యేసుప్రభువు ఉద్దేశం ఇది కావచ్చును. తాను దేవుని మెస్సీయానని వెల్లడించుట; యూదులను దేవునికి విధేయులై, పశ్చాత్తాపపడటానికి పిలవటానికి వచ్చినట్లు విశదం చెయ్యటం. ఈ కథలో, ముఖ్యంగా 6వ వచనంలో తనను అంగీకరించే మరో అవకాశాన్ని వారికి ఇస్తున్నాడు.

### ఉపమాన భావం

యేసుప్రభువు ఎప్పుడైనా ఒక ఉపమానం చెబితే, దానిని ఒకే ఒక పాఠం నేర్పించడానికి వినియోగించేవాడు. అయితే ఈ ఉపమానం వేరు. ఇది ఒక సాదృశ్య రూపకం (జాన్ బన్యన్ రచించిన "యాత్రికుని ప్రయాణం" లాంటిది). ఇందులోని కొన్ని పాత్రలు, వస్తువులు అప్పుడూ, ఇప్పుడూ జీవించి వున్న వ్యక్తులకు సాదృశ్యం కావచ్చును.

1. ఇశ్రాయేలు జాతి యెహోవా ద్రాక్షాతోట, యెషయా 5:1-7. దేవుడు వారిని ఈజిప్ట్ నుండి తీసుకొని వచ్చి, కనానులో స్థాపించి, అద్భుతరీతిగా వారిని కాపాడుతూ వారి ఆత్మల బాగోగులు చూసుకోవడానికి నాయకులను అనుగ్రహించాడు. ఆధ్యాత్మిక వ్యవసాయం ద్వారా వారి నుండి సమృద్ధియైన పంట రావాలని దేవుడు ఆశించాడు. అయితే కాపులు, లేదా ద్రాక్షతోట పనివారు తమ స్వార్థమే చూచు కున్నారు కాని, యెహోవాకు యివ్వవలసిన గౌరవం విషయంలో విఫలులయ్యారు. ఆయన వారిదగ్గరకు తన ప్రవక్తల్ని పంపినప్పుడు వారిని వెనక్కు పంపివేయటమో, అన్యమనస్కంగా వారిపట్ల ప్రవర్తించటమో, ఎవరైనా వారి

తప్పుల్ని వేలెత్తి చూపితే హింసించి, చంపటం కూడా చేశారు. శతాబ్దాల తరబడి వారి వైఖరి ఇదే. చివరకు దేవుడు తన ఏకైక కుమారుని పంపించాడు. దేవునిపట్ల ఇశ్రాయేలు జాతి ప్రేమ, నిబద్ధత దీనితో తేలిపోయింది. నాయకులు ఆయన్ను చూచి, ఆయన తనను గూర్చి చెప్పిన మాటలు విని కోపంతో రెచ్చిపోయి, "ఇతడు వారసుడు; ఇతని చంపుదము రండి, అప్పుడు స్వాస్థ్యము మనదగునని తమలో తాము చెప్పుకొన్నారు" (12:7).

2. యజమాని దేవుడే. ఆయన ఇశ్రాయేలు జాతిని ఎన్నుకొని, వారు ఫలించుటకు కావలసినదంతా చేశాడు. అయితే ఈ యజమానిని కొన్ని విషయాల్లో దేవుడితో పోల్చడానికి వీలులేదు. ఎందుకంటే ద్రాక్షాతోట యజమాని దానిని వదిలిపెట్టి వెళ్లిపోయాడు. దేవుడెన్నడూ తన ప్రజల్ని వదిలిపెట్టలేదు. ఎన్నడూ వదలిపెట్టడు.

3. కౌలుదారులైన రైతులు యూదుల మత నాయకులకు ముంగుర్తుగా వున్నారు.

ఈ దాసులు లేదా వార్తహరులు (2వ) యూదు నాయకులకు తమ విధులను తెలియచేయడానికి దేవుడు పంపిన ప్రవక్తలకు సాదశ్యంగా వున్నారు. వారిని తరచు హీనపరచి, చివరకు చంపటం కూడా జరిగింది (యిర్మియా 7:25,26; లూకా 13:34 చూడండి).

**ఇప్పుడు మరికొన్ని వివరాలు పరిశీలిద్దాం :**

"ఒక మనుష్యుడు ద్రాక్షతోట నాటించి... (1వ) అతడు చేసిన ఏర్పాట్లన్నీ ఇప్పటికీ పాలస్తీనాలో చూడవచ్చు. ఉదా. "కంచె" (రాళ్ళతో కట్టిన గోడ) "ద్రాక్షల తొట్టి" (పనివారు ద్రాక్షలను తొక్కిన తరువాత ద్రాక్షరసం సేకరించే స్థలం), గోపురము (మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో "మంచె" అని పొలాల్లో నిర్మిస్తారు).

"ఇంకను అతనికి ప్రియ కుమారుడు ఒకడుండెను..."

ఈ వచనంలో ప్రభువు తనను గూర్చియే మాటలాడు తున్నాడు. తాను దేవుని కుమారుడనని ఆయనకు తెలుసు. అయితే ఆయన సన్నిహిత మిత్రులు కూడా దీనిని గ్రహించలేదు. ఆయన మరణించి, లేచిన తరువాత క్రైస్తవులు ఆయనెవరో గ్రహించారు. ఇంతకూ వారేం చేయగలరు. ఆయన వారిని ఏమి చేయమంటున్నాడు ? తనను మెస్సీయా గా స్వీకరించమని కోరుతున్నాడు. యూదులు మెస్సీయాను దేవుని కుమారుడుగా గాక ఆయనను వార్తాహరుడుగా మాత్రమే భావించారు. "ఇల్లు కట్టువారు నిరాకరించిన రాయి మూలకు తలరాయి ఆయెను" (10వ). ఈ మాటలు పస్కా పండుగలో ఉపయోగిస్తారు. కీర్తన 118:22,23లోనివి ఈ మాటలు. ఈ మాటలు ద్వారా యేసుప్రభువు చెబుతున్నది ఎలా వుందంటే, నన్ను చంపుతారు, నా పని అయిపోయింది అని భావిస్తారు. నన్నొక పనికిరాని రాయిగా పరిగణిస్తారు. అయితే నా మరణం ద్వారా మానవజాతిని రక్షించడానికి దేవుడు నన్ను వాడుకొంటాడు. దేవుని ఎదుట నివసించునట్లు దేవుడు నన్ను లేపుతాడు" (ఫిలిప్పీ 2:7,9).

యేసుప్రభువును నమ్మిన మనం కూడా చాలాసార్లు లోకం దృష్టిలో ఎందుకూ పనికిరాని వారంగా కనిపించినా, దేవుడికి మనం ప్రయోజనకారులమే (8:35; 10:43; 1కొరి 1:27 చూడండి). "తమ్మును గూర్చి ఆ ఉపమానము చెప్పెనని వారు గ్రహించారు" (12వ).

1. ప్రధాన యాజకులు లేదా వారి ప్రతినిధుల ముందే ఈ కథ చెప్పటం జరిగింది. కొందరు ఆయన్ను అధికారులపై దాడి చేస్తున్న చెడ్డ వ్యక్తిగా పరిగణించారు. కొందరైతే ఆయన సత్యం చెబుతున్నట్టు వారిని తమ మార్గములు సరి చేసు కోవడానికి పిలుపు ఇస్తున్నాడని భావించారు. ప్రభువు హెచ్చరిస్తున్నది ఇలాంటి వారినే. నాయకులు నేడు కూడా బైబిలు చదివి "ఈ సందేశం నా ప్రజలకు అవసరం" అనుకుంటారే కాని "నాకు అవసరం" అనుకోరు. మంచి ప్రసంగం విని ఎదుటివారికి ఇది బాగా పనికివస్తుంది అనుకుంటారు కాని తమకు కాదు. ఎంత విచిత్రం.

2. ఈ హెచ్చరిక ఎవరికోసమో వారు ఆయన్ను చంపాలని కుట్రపన్ని మరింత పాపంలో కూరుకుపోయారు. యేసు ప్రభువును వెంబడించే అవకాశం కలిగిన తరువాత మనం అంతకు మునుపటి కంటే మంచివారమన్నా కావాలి. లేదా అంతకంటే చెడ్డవారమన్నా కావాలి. ఈ సమయంలో యేసు చెప్పినా లూకా 20:18 వచనం భావం అదే. మనము ఆయన్ను అంగీకరిస్తే దేవుని దగ్గరకు నడిపే "సోపానం" అవుతాడు. ఆయన తిరస్కరించినట్లయితే ఆ రాయి మనమీద పడుతుంది. ఇది తీర్పుకు సంకేతం.

3. ఈ హెచ్చరిక మనకు కూడా వర్తిస్తుంది. క్రైస్తవులంగా మనము ఆయన్ను తెలుసుకొనే అవకాశం కలిగింది, మన చేతుల్లో బైబిలు వున్నది, దేవుడు తన కుమారుని మనకోసం లోకానికి పంపాడని మనం ఎరుగుదుము; ఆయన తిరిగి లేచి పరిశుద్ధాత్మను పంపాడు, తన సంఘాన్ని స్థాపించాడు.

మనము హృదయపూర్వకంగా ఆయన్ను వెంబడించడానికి కావలసినవన్నీ ఆయన మనకు అనుగ్రహించాడు.

## సారాంశం

ఈ కథలోని ముఖ్య సత్యాన్ని పరిచయంలో చూచాం. ఇప్పుడు మరికొన్ని పాఠాలను పరిశీలిద్దాం.

**1. మనం గృహ నిర్వాహకులుగా వుండాలని దేవుని కోరిక.** యూదా నాయకులు రైతులు లేదా గృహ నిర్వాహకుల లాంటివారు. వారు "ఫలించాలని" దేవుడు ఆశించాడు. దీనర్థమేమంటే న్యాయంగా వ్యవహరించడం, దేవుని కరుణను గూర్చిన జ్ఞానాన్ని యూదేతరులతో పంచుకోవడం. అయితే వారు చెడ్డ గృహనిర్వాహకులుగా వున్నారు. మన సమయం, ఆస్తిపాస్తులు, మన పిల్లలు, మన పొలం, సువార్త మొదలైన విషయాల్లో గృహ నిర్వాహకులుగా వుండాలి. ఇవేమీ మనకు చెందినవి కావు.

**2. దేవుడే మన న్యాయాధిపతి :** విధేయత చూపటం లేక అవిధేయత చూపటం అనే స్వేచ్ఛను దేవుడు మనకు ప్రసాదించాడు. ద్రాక్షాతోట యజమాని రైతులకు స్వేచ్ఛ నిచ్చి వదిలి వెళ్ళినట్లు. అయితే ఒకానొక రోజు మనమంతా "యజమానికి" ఆయన వచ్చినప్పుడు లెక్క అప్పగించాలి (9వ). యేసు మాట తిరస్కరిస్తే వారికి విపత్తు ముంచుకు వస్తుందని యూదులను హెచ్చరించటం జరిగింది. వారు తిరస్కరించారు, ఆయన్ను సిలువ వేశారు. దాని వెంటే ఆపద ముంచుకొచ్చింది. యూదజాతి ఇక ఎంత మాత్రము దేవుడు ఎన్నుకొన్న జాతి కాకుండాపోయింది. యూదులంతా సగర్వంగా తమది అని చెప్పుకొనే యెరూషలేము నగరం క్రీ.శ. 70లో ధ్వంసమైపోయింది.

**3. దేవుని సహనం :** ఆ యజమాని ఒక దాసుని తరువాత మరొక దాసుణ్ణి పంపినట్లే (4,5,6వ). దేవుడు కూడ తన ప్రవక్తలను పంపుతూ వచ్చాడు (1తిమోతి 11:16 చూడండి). మనం పాపం విషయం పశ్చాత్తాపపడి, ఆయనను ఎక్కువగా సేవించాలని దేవుడు మనకు అనేక అవకాశాలు యిస్తూనే వుంటాడు, మనలో ఎవరినీ పనికిరానివారిగా ఆయన పరిగణించడు.

**4. దేవుడు ఓడిపోడు :** యూదుల నాయకులు యేసును చంపినా, మానవ జాతిని రక్షించే దేవుని ప్రణాళిక భంగం కాలేదు. మొదటి గుంపు రైతులు 'యజమానిని' మోసగించి నందున, వారి స్థానంలో ఇతరుల్ని ఆయన కనుగొన్నాడు, (9వ). కనుక దేవుడు మొదట యూదులకు అప్పగించిన పనిని నెరవేర్చడానికి యూదులు కాని వారిని పిలిచాడు.

నేడు కూడా దేవుడు తన పనిని జరిగించుకుంటాడు. ఆయన సంఘం ఆయన మాట వినకపోతే, ఇతరులను ఆ పనికి వినియోగించుకుంటాడు. రెండువందల సంవత్సరాల నాడు మన దేశంలో అతి కొద్దిమంది క్రైస్తవులు వుండేవారు. యేసుప్రభువు శిష్యుడు తోమా మలబారు ప్రాంతాలకు వచ్చినా, క్రైస్తవం ఇతర ప్రాంతాలకు వ్యాపించలేదు. కొంతకాలానికి చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ వారికి భారతదేశంలో సువార్త ప్రకటించే అవకాశం ఇచ్చాడు. అయితే వారు దానిని వినియోగించుకోలేదు. కనుక, దేవుడు ఈ రెండు వ్యవస్థలను దాటి విలియం కేరీ అనే పాత చెప్పులు కుట్టుకొనే పేద వ్యక్తిని ఆ పనికి ఎన్నుకొన్నాడు. విలియం కేరీ వచ్చి భారతదేశంలో అనేక భాషలలోకి బైబిలును అనువదించి, సువార్త బీజాలు వేశాడు. కనుక దేవుడు ఓడిపోలేదు. ఇప్పుడు భారతదేశమంతటా క్రైస్తవం వ్యాప్తి చెందింది.

# ప్రశ్నలు, ప్రశ్నలు, ప్రశ్నలు,

**(మార్కు 12:1-12)**

యేసుప్రభువు జీవితంలో చివరి మంగళవారాన్ని ప్రశ్నల రోజు అని పిలవొచ్చు. యేసుప్రభువు బోధలను, అధికారాన్ని ఎలాగైనా కించపరచాలని యూదా నాయకులు ప్రయత్నిస్తూ వున్నారు. అందువలన వారు యేసును చిక్కుల్లో పడవేసే ప్రశ్నలు బహిరంగంగా అడిగారు. 12వ అధ్యాయములో వారు యేసును అడిగిన మూడు ప్రశ్నలు (13-43వ), ఆయన దేవాలయంలో బోధిస్తూ వారిని అడిగిన ప్రశ్న (35-37) వున్నాయి.

1. పన్నుల విషయమై యేసును ప్రశ్నించి, ఎలాగైనా చిక్కుల్లో పెట్టాలని యూదు మతనాయకులు పరిసయ్యులు, హేరోదీయులు అనే రెండు వర్గాలను పంపించాడు. పరిసయ్యులు చాలా మత నిష్ఠగలవారు, రోమీయుల పాలన అంటే బొత్తిగా గిట్టదు. హేరోదీయులు రోమ్ క్రింద అధికారం నెరపుతున్న హేరోదు వంశికులను సమర్థిస్తున్నారు. వీరిద్దరు కలిసి ఈ ప్రశ్న అడిగారు. "కైసరుకు పన్నిచ్చుట న్యాయమా కాదా ?" ఆయన తన జవాబుతో ఇద్దరినీ సంతృప్తిపరచలేదు. ఆయన "అవును" అని చెబితే, ఆయన యూదుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వ్యతిరేకమని పరిసయ్యులు వేలెత్తి చూపుతారు. ఒకవేళ ఆయన "కాదు" అని చెబితే హేరోదీయులు అసంతృప్తికి

గురవుతారు. రోమన్ ప్రభుత్వానికి ఆయన వ్యతిరేకమని చూపెట్టుకుంటారు (లూకా 23:2లో ఆయన జవాబును ఆయనకు వ్యతిరేకంగా వినియోగించారు, అయితే అన్యాయంగా ఆ పని చేశారు). ఎలాగైనా ఆయననుండి "అవును" లేదా "కాదు" అనే జవాబు రాబట్టాలని శత్రువుల పన్నాగం. వారు ఆయనతో, "బోధకుడా, నీవు సత్యవంతుడవు, నీవు ఎవనిని లక్ష్యపెట్టనివాడవని మేమెరుగుదుము; నీవు మోమాటము లేనివాడవై దేవుని మార్గము సత్యముగా బోధించువాడవు" అన్నారు (14వ). కనుక వారు ఆయన నుండి "అవును" లేదా "కాదు" అనే జవాబు ఆశించారు.

**జవాబు**

తనను వారు చిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు వారి కుయుక్తిని ఆయన పసిగట్టాడు. వారు ఆశించిన దానికంటే ఎంతో తెలివైన జవాబు ఆయన దగ్గర వున్నది. ఆయన వారితో "ఒక దేనారము తెచ్చి చూపమని" అన్నాడు. ఆ రోజుల్లో యూదయలో రెండు రకాల నాణేలు చలామణిలో వుండేవి. 1. రోమా సామ్రాజ్యంలోని ఆ ప్రాంతంలో వినియోగించే రాగి నాణెం. 2. రాజ్యమంతటా వినియోగించే వెండి నాణెం. వ్యక్తిగత పన్ను వెండి నాణెంలో చెల్లించాలి. దీనిని దేనారము అంటారు. అది ఒక మనిషి ఒక్కరోజు కూలి (మత్తయి 20:2 చూడండి). దేనారం మీద చక్రవర్తి బొమ్మ, ఆయన పేరు వుండేవి. ఆ సమయంలో రోమ్ చక్రవర్తి టైబీరియస్ సీజరు (తిబిరి కైసరు) చక్రవర్తులందరికీ సీజరు లేదా కైసరు అనే బిరుదు వుంటుంది. ఆ నాణేన్ని వినియోగించినప్పుడల్లా ప్రజలు చక్రవర్తి అధికారాన్ని గుర్తిస్తున్నారన్న మాట. నాణెం మీద ఎవరి రూపము, పై వ్రాత వున్నాయి అని ప్రభువు వారిని అడిగాడు. అందుకు వారు "కైసరుని" అని జవాబిచ్చారు. అప్పుడు యేసు "కైసరువి కైసరునకు దేవునికి చెల్లించుడి" అని చెప్పాడు.

ఇంతకూ యేసుప్రభువు చెప్పిన జవాబు అర్థమేమిటి? నేటి దినాల్లో జీవించే మనకు ఇందులో ఏమైనా సందేశం వున్నదా?

### 1. ప్రభుత్వానికి, దేవునికి మన విధులు :

యేసుప్రభువు చెప్పిన మాట ఎలా వున్నదంటే "నాణెంపై వున్న బొమ్మ చక్రవర్తిది గనుక ఆయనకు చెందినది ఆయనకే ఇవ్వండి. మీ ఆత్మలపై వున్న రూపం దేవుడిది గనుక (ఆది 1:26-27 చూడండి). మిమ్మల్ని మీరు దేవునికి అర్పించుకోండి".

### 2. ప్రభుత్వానికి మనం చెల్లించే పన్నులు బహుమానాలు కాదు, వాస్తవంలో మనం తిరిగి చెల్లించే అప్పులు :

గ్రీకు భాషలో 15వ వచనం "మేము పన్ను చెల్లించాలా?" అని వున్నది. అయితే ప్రభువు "తిరిగి ఇవ్వండి" అంటున్నాడు. మనం ప్రభుత్వం నుండి ఎన్నో సదుపాయాలు అనుభవిస్తాం. ఉదా॥ రోడ్లు, వైద్యశాలలు, పాఠశాలలు, న్యాయస్థానాలు మొదలైనవి. క్రైస్తవులు దీనిని అంగీకరించి, వాటికొరకు పన్నులు చెల్లిస్తారు. వాస్తవంగా ఒక వ్యక్తి క్రైస్తవుడైన తరువాత అంతకుముందు కంటే నిజాయతీపరుడైన పౌరుడిగా వ్యవహరిస్తాడు (రోమా 13:1-7).

దీనర్థం పన్నులు విధించే రోమనుల పద్ధతులన్నీ మంచివని లేదా వారు యూదులతో వ్యవహరించే తీరు సరైనదని కానే కాదు. ఆయన బలహీనమైన దేశానికి వ్యతిరేకంగా బలవంతమైన దేశం పక్షం చేరలేదు. తిరుగుబాటు ఎల్లప్పుడూ తప్పు అని కూడా ఆయన చెప్పటంలేదు. మొత్తం మీద ఆయన ఉద్దేశం ఏమిటంటే "ఏ ప్రభుత్వమైనా అధికారంలో వున్నంతవరకు అది సమకూర్చే ప్రయోజనాలను బట్టి పన్నులు చెల్లించు. వారు ఒకవేళ మీపట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని భావించినా సరే, పన్నులు చెల్లించాలి."

**3. మన జీవితంలోని ఒక భాగంలో ప్రభుత్వానికి లోబడి, మరొక భాగంలో దేవుడికి లోబడమని ఈ వచనం చెప్పటం లేదు.** "రాజకీయాల్లో, యుద్ధంలో నేను కైసరుకు లేదా ప్రభుత్వానికి లోబడతాను. సంఘమునకు సంబంధించిన పనిలో దేవుడికి లోబడతాను" అని చెప్పటం సరికాదు. మన జీవితంలో ప్రతి అణువులో దేవునికి నిబద్ధులమై వుండాలి. దేవుడిపట్ల మన విధి నిర్వహించినట్లే ప్రభుత్వ విధిని నిర్వహిస్తాం. ఎందుకంటే దేవుడు సమస్తానికి అధిపతి.

### 4. క్రైస్తవుడు ప్రభుత్వానికి లోబడని సందర్భాలుంటాయా?

ఉదా॥ దేవుని చట్టాలకు వ్యతిరేకంగా ఏదైనా చెయ్యమని ప్రభుత్వం ఆదేశిస్తే (అ.కా. 4:19; ప్రకటన 18:1-4 చూడండి). ప్రభుత్వానికి దేవుడే తీర్పు తీరుస్తాడు.

## పునరుత్థానం

**(మార్కు 12:18-27)**

తరువాత ప్రశ్న సద్దూకయ్యులు యేసుప్రభువును అడిగినది. మార్కు సువార్తలో సద్దూకయ్యుల ప్రస్తావన రావటం ఇదే మొదటిసారి. ఈ వర్గంలోని సభ్యులంతా యెరూషలేములోని ప్రధాన యాజకుల కుటుంబానికి చెందిన

ఉన్నత కుటుంబాలకు చెందినవారు. వారిలో అత్యధికులు సంపన్నులు, పలుకుబడి గలవారు. వారు మరణం తరువాత జీవితం అంటే పునరుత్థానం వున్నదని నమ్మరు (అ.కా. 4:1,2; 5:17-26; 23:6-8) కూడా చూడండి. ఇప్పుడు వారు అడిగిన ప్రశ్నను పరిశీలిద్దాం.

## ప్రశ్న

వారి ప్రశ్న అర్థం చేసుకోవాలంటే ముందు యూదుల ఆచార వ్యవహారాలు అర్థం చేసుకోవాలి. వారి ఆచారాలు గిరిజన తెగల సాంప్రదాయాలకు దగ్గరగా వుంటాయి. పాత నిబంధన లోని మోషే ధర్మశాస్త్రం చెప్పేదేమంటే (ద్వికా 25:5,6) ఎవరైనా ఒక వ్యక్తి సంతానం లేకుండా మరణిస్తే అతడి భార్యను అతడి సోదరుడు భార్యగా స్వీకరించాలి. అప్పుడామెకు భర్త సంరక్షణ వుంటుంది, చనిపోయిన తన భర్తకోసం పిల్లల్ని కంటుంది. దీనిద్వారా అతడి వంశం, పొలం నిలబడతాయి.

సద్దూకయ్యులు చెప్పిన ఈ కథలో ఏడుగురు అన్నదమ్ములున్నారు. ఒక స్త్రీ ఒకరి తరువాత ఒకరికి వరుసగా భార్య వుంది. కానీ, ఎవ్వరికీ ఆమె ద్వారా సంతానం కలుగలేదు. చివరికి ఆమె కూడా చనిపోయింది. "పునరుత్థాన మందు వారిలో ఎవరికి ఆమె భార్యగా వుండును?" (23వ) 10:2; 11:28; 12:15లో అడిగిన ప్రశ్నలలాగే ఈ ప్రశ్న కూడా సత్యం తెలుసుకుందాం అని అడిగింది కాదు. యేసుప్రభువుపై దాడిచేయడానికి అడిగింది. ఆయనను చూచి ప్రజలు హేళన చేయాలని వారి భావన. ఎందుకు వారు ఇలా చెయ్యాలనుకుంటున్నారు? ఆయనంటే వారికి భయం. ఆయన బోధను ఆపకపోతే, తమ మార్గాలు మార్చుకోమని ఆయన వారికి కోరతాడు. ఆపని చెయ్యటం వారికి ఇష్టం లేదు. ప్రజల దృష్టంతా ఆయనమీదే వుంటుంది. వారిమీద కాదు. నేడు కూడా చాలామంది ఇలాంటి ప్రశ్నలే అడుగుతూ వుంటారు. "నన్ను వెంబడించు" అని యేసుప్రభువు ఇచ్చిన పిలుపును గూర్చి తీవ్రంగా ఆలోచించకుండా "కయీను భార్య ఎవరు?" "సిలువలో దొంగ బాప్తిస్మం పొందకుండానే ఎలా పరలోకం వెళ్లాడు?" మొదలైన ప్రశ్నలు అడుగుతూ వుంటారు. వారిమట్టుకు అది చాలా కఠినమైన ప్రశ్న. దేవుడికి కూడా అది కష్టమైనది అనుకున్నారు. యేసుప్రభువు పునరుత్థానాన్ని గురించి వారికి అర్థం కాలేదు. గనుక, మరణానంతర జీవితాన్ని గూర్చి ఊహించలేరు గనుక పునరుత్థానం లేదు అనే నిర్ధారణకు వచ్చారు.

## జవాబు

సద్దూకయ్యుల తలంపులు తప్పు అని ప్రభువు చెప్పాడు. ఎందుకంటే వారు "లేఖనములను గాని, దేవుని శక్తిగాని ఎరుగక పొరబడుతున్నారు". దేవుని శక్తి విషయానికి వస్తే ప్రస్తుత జీవితం కంటే భవిష్యత్ జీవితాన్ని భిన్నంగా దేవుడు చేయగలడు. ఒక వ్యక్తి చనిపోయి, లేచినప్పుడు ఇప్పటిలాగా రక్తమాంసాలు గల శరీరం పొందదు. కనుక, వివాహం, లైంగిక సంబంధాల ప్రసక్తే వుండదు. అది 'పరలోకంలోని దేవదూతల వంటి జీవితం. దీనిని గూర్చి మనం ఎక్కువగా చెప్పటానికి వీలుకాదు. అయితే అది పాపము, శ్రమలు లేని జీవితం, అన్నిటికంటే మిన్నగా "క్రీస్తుతో" వుండే జీవితం. పౌలు మాటల్లో చెప్పాలంటే "క్రీస్తుతో కూడా వుండే మేలైన జీవితం" (ఫిలిప్పీ 1:21-23).

పాత నిబంధనలో మరణానంతర జీవితం గురించి ఎక్కువగా చెప్పకపోయినా, ఈ మన భౌతిక శరీరం మరణించటంతో జీవితం అంతం కాదు అనేది మాత్రం తెలుస్తుంది. మోషేను దేవుడు మండుతున్న పొదలో కలసికొన్న దృశ్యాన్ని ప్రభువు సద్దూకయ్యులకు గుర్తు చేశాడు (నిర్గమ 3:1-6). ఆ భాగంలో దేవుడు "నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడను" అని మోషేకు వెల్లడించుకోవటం ఉటంకించాడు. దేవుడు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులను తన ప్రజలుగా పేర్కొన్నప్పుడు, వీరు చనిపోయినప్పుడు చేయి వదలడు కదా; వారు ఆయన చేతిలోనే వున్నారు. యేసుక్రీస్తు పునరుత్థానంతో సహా - దీనిని బట్టి మరణానంతరం జీవితం ఉన్నది అని గట్టిగా నమ్మటానికి ఆస్కారం కలుగుతుంది. దేవుడు మనల్ని ప్రేమించాడు, యేసుక్రీస్తు ద్వారా దేవుని ప్రేమ, సంకల్పం మనము ఎరుగుదము గనుక మరణమైనా, మరేదైనా దేవుని ప్రేమనుండి మనల్ని వేరుపరచలేదని రూఢిగా చెప్పగలం (రోమా 8:35-39) లేదా యోహాను 17:3లో చెప్పిన మాటల్నిబట్టి యేసుక్రీస్తు ద్వారా దేవుణ్ణి తెలిసికోవటమే నిత్యజీవం.

మరణానంతర జీవితాన్ని గురించి మరింతగా తెలుసు కోవాలంటే 1కొరింథి 15:35-37; 2 కొరింథి 4:16; 5:5; ప్రకటన 7:9-17; 22:1-5 మొదలగు లేఖనభాగాలు చదవండి. ఇక్కడ ఒక్క విషయం మనం గుర్తించాలి. రాబోయే జీవితాన్ని గురించి బైబిలు మనకు అర్థమయ్యే మాటల్లోనూ, చిత్రాల్లోనూ వర్ణిస్తుంది. అయితే ఆ జీవితం ఈ వర్ణనలన్నింటి కంటే గొప్పగా వుంటుంది.

**గమనిక :**

1. దీనికి సమాంతర లేఖనభాగాలు, మత్తయి 22:23-33; లూకా 20:27-40.

2. సద్దూకయ్యులు ధర్మశాస్త్ర గ్రంథాల సాధికారతను అంగీకరించారు గాని, ఇతర పాత నిబంధన పుస్తకాలను అదేస్థాయిలో అంగీకరించలేదు. అందువలన దానియేలు 12:2,3లాంటి భాగాలలో స్పష్టంగా వున్న పునరుత్థాన సత్యాన్ని వారు అంగీకరించలేదు. ఆసక్తికరమైన విషయమేమంటే యేసుప్రభువు జవాబు చెప్పినప్పుడు ధర్మశాస్త్రం నుండి ఉదహరించాడు.

3. వితంతు వివాహాల విషయంలో యూదుల భావన ఎలా వుండేదంటే పురుషుడికి అతడి మొదటి భార్య మధ్య సంబంధమే ప్రధానమైనది.

## ఏది గొప్ప ఆజ్ఞ
**(12:28-37)**

సువార్తలో యేసుప్రభువు అనేక పర్యాయాలు శాస్త్రులను విమర్శించటం చదువుతాం. ముఖ్యంగా వారు ధర్మశాస్త్రం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని విస్మరించి, చిన్న చిన్న నియమాలను చేసినప్పుడు ఆయన నిశితంగా విమర్శించేవాడు. 38-40 వచనాల్లో ఆయన విమర్శను గురించి వివరంగా చదువుతాం. అయితే శాస్త్రులలో మంచివారు, నిజాయితీపరులు లేకపోలేదు. ఇప్పుడు మనం పరిశీలించే లేఖనభాగంలో ఒక ప్రశ్నతో అలాంటి శాస్త్రి ఒకడు వచ్చాడు.

**ఆజ్ఞలలో ఏది గొప్పది ?**

యూదులు, ముఖ్యంగా వారు బోధకులు తరచు ఈ ప్రశ్నను తర్కించేవారు. "మొట్టమొదటి ఆజ్ఞ ఏది ?" అన్నిటికంటే ముఖ్యమైన ఆజ్ఞ ఏది ? అన్నిటికంటే ప్రాముఖ్యం కాని ఆజ్ఞ ఏది అని వారు తర్జన భర్జన పడేవారు. ధర్మశాస్త్రం మొత్తంలో 613 ఆజ్ఞలు వున్నాయి. వాటిలో 365 ప్రజలు ఏమి చేయకూడదో తెలియజేసేవి (అనగా సంవత్సరంలో రోజుకు ఒకటి). 248 ఆజ్ఞలు ఏమి చేయాలో తెలియజేసేవి. ఇప్పుడు సమస్య ఏమంటే వీటన్నిటిలో ఏది ప్రాముఖ్యమైనది?

**జవాబు :**

1. అవును, అన్నిటికంటే ప్రాముఖ్యమైన ఆజ్ఞ ఒకటి వున్నది, అదే ప్రేమను గూర్చిన ఆజ్ఞ. 30వ వచనం దేవుణ్ణి ప్రేమించటాన్ని గూర్చినది, 31 వచనం ఇతరుల్ని ప్రేమించటాన్ని గూర్చినది. అయితే ఈ రెండు వచనాల భావం ఒక్కటే "ప్రేమ కలిగి వుండాలి" (రోమా 13:10). ఇంతకూ ప్రేమించడమంటే ఏమిటి ? (31 వచనం వివరణలో చూస్తాం).

2. దేవుణ్ణి ప్రేమించటం, ఇతరులను ప్రేమించటం అనేవి జంటగా వుంటాయి. ఈ రెంటిలో ఏది ముఖ్యమైనది అని అడక్కూడదు. ఎందుకంటే రెండూ ప్రాముఖ్యమైనవే. ఇది యూదులకు కొత్త బోధ. వారికి ద్వికా. 6:4 నుండి "దేవుణ్ణి ప్రేమించడం" తెలుసు;? అలాగే లేవీ 19:18 నుండి "నీ పొరుగువారిని ప్రేమించుము" అనే ఆజ్ఞ కూడా తెలుసు. అయితే ఈ రెండు ఆజ్ఞలను కలిపి ఒకే ఆజ్ఞగా ఎన్నడూ చెప్పటం జరగలేదు.

రెండు రకాల ప్రజలకు ఈ బోధ ముఖ్యంగా అవసరమైంది.

1. పొరుగువారి పట్ల, కుటుంబం పట్ల ప్రేమ కలిగి వుండటం చాలా ముఖ్యం. అయితే దేవుణ్ణి ఆరాధించటం అనేది దాని అవసరత ఉన్నవారికే అని చెప్పేవారి కోసం (వాస్తవంలో తమ దేవుని ఆత్మలో నిండి ఆరాధించేవారు తమ పొరుగువారికి బాగా సాయపడేవారు).

2. ఇతరుల పట్ల కంటే దేవునిపట్ల తమ విధి ముఖ్యము అని చెప్పేవారికి 1యోహాను 4:20 చెప్పేదేమంటే ఇతరులను ప్రేమించటం ద్వారానే దేవుణ్ణి బాగా ప్రేమించగలుగుతాం. దేవుణ్ణి మనం మనోవాక్కాయ కర్మలద్వారా ప్రేమించాలని పై వచనాలు తెలియ జేస్తున్నాయి.

3. శాస్త్రి యేసుప్రభువు చెప్పిందంతా గ్రహించాడు. అందువలన ప్రభువు "అతడు దేవుని రాజ్యానికి దూరంగా లేడు" అని చెప్పాడు (34వ).

**తాత్పర్యం**

"ఓ ఇశ్రాయేలూ, వినుము, మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు" (29వ).

పాత నిబంధన లేఖనాన్ని ఒకదాన్ని ఉదహరించి ప్రభువు జవాబు చెప్పాడు. ద్వి.కా. 6:4,5 ఆయన ఉదహరించాడు. యూదులందరు ఈ మాటలను "షెమ" అని వ్యవహరిస్తారు. దీనిని ప్రతిరోజూ వల్లిస్తారు. చిన్న చిన్న

కాగితాలమీద రాసుకుని నుదుట బాసికంగా కట్టుకుంటారు. ఇంటి ద్వారబంధముల మీద రాసిపెట్టుకుంటారు. నేటికీ యూదులు ఆ పని చేస్తారు. ప్రభువు తన జవాబులోని తరువాత భాగంలో (వ.31) లేవీ 19:18 నుండి ఉదహరించాడు.

1. యేసుప్రభువు అనేక లేఖన భాగాలకు క్రొత్త భాష్యం చెప్పినా, ఆయన పాత నిబంధనను విశేషంగా వినియోగించాడు. అది ఆయనదే కదా. క్రైస్తవులమైన మనం అది లేకుండా ఎలా మనగలుగుతాం.

2. మన దేవుడైన ప్రభువు అద్వితీయుడు. యేసుప్రభువు ఉదహరించిన షెమలోని మాటలు ఇవి. ఈ మాటలకు 'దేవుడు ఒక్కడే' అని అర్థం. ప్రతి జాతీ ఈ సత్యం గ్రహించాలి.

ఏలీయా కాలంలో యూదులు పంటలు పండాలని బయలుకు బలులు అర్పించేవారు. అయితే యుద్ధకాలంలో మాత్రం యెహోవాకు అర్పించేవారు. అంతకుముందు ఎప్పటి నుండో దేవుడు ఒక్కడే, మరెవ్వరూ లేరు అనే సత్యం తెలుసు. అయితే యూదులు భ్రష్టులై అన్యదేవతారాధన వైపు మళ్ళారు.

నీ పూర్ణ హృదయముతో... నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను" (30వ).

మనం హృదయపూర్వకంగా దేవుణ్ణి ప్రేమించాలి. పూర్ణాత్మ, పూర్ణ వివేకము, పూర్ణబలము అని మూడు వేరు వేరు పదాలు నొక్కిచెప్పటం కోసమే వినియోగించారు. దేవుణ్ణి హృదయపూర్వకంగా ప్రేమించే విధానమేమంటే :

1) ఆత్మతో ప్రేమించుట : దేవుణ్ణి ఘనపరచాలని మనసులో బలమైన కోరిక కలిగితే, అది చర్య గైకొనేలా నడిపించాలి.

2) మనస్సుతో ప్రేమించుట : మనము ఏమి నమ్ముతున్నామో దాన్ని గురించి అతికష్టం మీద ఆలోచిస్తాం (1పేతురు 3:15).

3) మన అనుభూతులతో ప్రేమించుట : దేవుడికి అంగీకార యోగ్యమైన రీతిలో మన అనుభూతులు వుండాలి. ఆయన్ను ఆరాధించే విషయంలో మన అనుభూతుల్ని, ఆనందాల్ని, దుఃఖాలను వినియోగిస్తాం.

### "నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించాలి".

**1. ప్రేమించాలి :** మనం ఎవరినైనా ప్రేమిస్తే, దేవుడు మానవాళికి అనుగ్రహించిన శ్రేష్ఠమైన వాటిని వారు అనుభవించాలని మనసారా కోరుకుంటాం. వారు ఆ స్థితిలో కొనసాగడానికి అవసరమైతే, వారు మనకు కీడు చేసినా సరే, శ్రమలు అనుభవించడానికైనా సిద్ధపడతాం. ఒక వ్యక్తిని ఆకర్షణీయమైన వ్యక్తిగా పరిగణించడమంటే ప్రేమించటమని కానేకాదు. యేసుప్రభువు ఎలా ప్రేమించి, జీవించాడో గమనించి "ప్రేమంటే" ఏమిటో గ్రహిస్తాం.

**2. పొరుగువారిని :** యూదులు లేవీ 19:18లోని వాక్యభాగం చదివినప్పుడు "పొరుగువారు" అంటే మరొక "యూదుడు" అని భావించారు. అయితే ప్రభువు లూకా 10:25-37లో మన కుటుంబ సభ్యులనో, మన జాతివారినో మన కులం వారినో లేదా మనల్ని ప్రేమించిన వారినో ప్రేమించటమే గాక అక్కరలో వున్న ఎవరినైనా ప్రేమించటమని స్పష్టం చేశాడు.

**నిన్ను వలె :** మనలను మనం ప్రేమించుకోవాలని దేవుని ఆజ్ఞ. ఎందుకంటే మనం దేవుని పిల్లలం, ఆయన పోలికలో సృష్టింపబడినవారం (ఆది 1:27; 1కొరి 3:16,17 చూడండి). ఆయన బిడ్డలలో ఎవరినైనా చిన్నచూపు చూడటం తప్పు కనుక మన శరీర బాగోగులు చూచుకుంటూ, మనస్సులో వృద్ధి పొందించుకుంటూ, దేవునితో స్నేహం చేసేలా మన ఆత్మలకు శిక్షణ యివ్వటం మన విధి. మనం ఎవరినైనా ప్రేమిస్తే వారు తప్పుచేస్తే క్షమిస్తాం కదా. అలాగే మనం తప్పు చేస్తే కూడా మనల్ని మనం క్షమించుకోవాలి.

### "ప్రేమించడం అన్ని బలులకంటే శ్రేష్ఠం" (33వ)

ఆ శాస్త్రి యేసు బోధను అర్థం చేసికొన్నాడు. దేవాలయానికి వెళ్లి, ఒక పశువునంతా బలి యిచ్చేదానికంటే హృదయంలో దేవుని పట్ల, పొరుగు పట్ల ప్రేమ కలిగి వుండటం చాలా ప్రాముఖ్యం అని అతడు గుర్తించాడు. అదేరీతిగా ప్రార్థన కూడికలు, బైబిలు అధ్యాయనానికి క్రమం తప్పక హాజరవుతూ దేవుణ్ణి గూర్చి సరైన అభిప్రాయాలు కలిగివుండి, సంఘ కార్యక్రమాలలో సరైన పనులు చేస్తూ వుండడం అన్నీ ప్రాముఖ్యమైనవే. అయితే మన హృదయంలో దేవునిపట్ల, ఇతరులపట్ల ప్రేమ లేకపోతే అవి ప్రాముఖ్యమైనవి కానేకావు.

### "నీవు దేవుని రాజ్యమునకు దూరముగా లేవు" (34వ)

యేసుప్రభువు అతడి వైఖరి గమనించినందున ఈ మాట అన్నాడు (10:21లోని మాటలతో పోల్చండి). దేవుని సేవించాలని తన దగ్గరకు సత్సంకల్పంతో వచ్చేవారిని యేసుప్రభువు ప్రోత్సహిస్తాడు.

"దూరంగా లేవు" అంటే అర్థమేమిటి ? రాజ్యములో లేదు అనే గదా. అతడు యేసుప్రభువు మాటలు గ్రహించాడు గాని, ఆయన్ను వెంబడించాలని ఇంకా తీర్మానం చేయలేదు. అతడి జీవితం దేవుడి చేతికి సంపూర్ణంగా ఇంకా అప్పగించలేదు.

## మెస్సీయ ఎవరు?
### (మార్కు 12:35-37)

మత్తయి 22:41-46; లూకా 20:41-44 కూడా చూడండి.

ఇంతవరకూ యెరూషలేం ప్రజలు లేదా నాయకులు యేసును ప్రశ్నలు అడిగారు. ఇప్పుడు ఆయన వారిని ఒక ప్రశ్న అడుగుతున్నాడు. దీనిని ప్రశ్న అనటం కంటే సమస్యాపూరణం లేదా పొడుపు కథ లాంటిది అనవచ్చు. 'కుమారుడు యజమాని కూడా ఎలా అవుతాడు ?" మెస్సీయా వచ్చినప్పుడు ఆయన దావీదు వంశం నుండి లేదా దావీదు కుమారుడుగా వస్తాడు. దావీదు కూడా ఆయన్ను ప్రభువు లేదా యజమాని అని సంబోధించాడు. దీనికి మీ వివరణ ఏమిటి?

ఇశ్రాయేలీయులలో మెస్సీయా దావీదు వంశం నుండి పుడతాడని సామాన్య ప్రజానీకమంతటికీ తెలుసు. శాస్త్రులు, రబ్బీలు ఆ విషయం బోధించేవారు. దీనికి ఆధారం తన సింహాసనంపై కూర్చుంచడానికి వారసుడు లేకుండాపోడు అని వాగ్గేయకారుడు - రాజు ఆయన దావీదుకు దేవుడు చేసిన వాగ్దానమే (1రాజులు 2:4; కీర్తన 13:11). దావీదు సంతతి దేవుని వాక్యానికి విధేయులై నడచుకున్నప్పుడే ఈ వాగ్దానం నెరవేరుతుంది అనేది వాస్తవమే అయినా కీర్తన 89:1-4, 34-37లో షరతులు లేని వాగ్దానం ఒకటి వున్నది. కనుక, మెస్సీయా దావీదు కుటుంబం నుండి వస్తాడనే మాట ముమ్మాటికీ నిజం. అయితే ఇశ్రాయేలులోని బోధకులు మెస్సీయా దేవుని కుమారుడు కూడా అని వెల్లడించే ఇతర లేఖనాలను విస్మరించారు. అందువలన ప్రభువు కీర్తన 110 ఉదహరించి, వారినుండి వివరణ కోరి, సవాలు చేశాడు. "క్రీస్తు, దావీదు కుమారుడని శాస్త్రులు చెప్పుచున్నారేమి ?" నేను నీ శత్రువులను నీకు పాదపీఠముగా ఉంచువరకు నీవు నీ కుడివైపున కూర్చుండమని ప్రభువు (యెహోవా) నా ప్రభువుతో (అదోనై) చెప్పెను అని దావీదే పరిశుద్ధాత్మ వలన చెప్పెను". తరువాత ఆ లేఖనభాగం ఆయన వివరించాడు. దావీదు పేర్కొన్న మెస్సీయా, తన ప్రభువుగా గుర్తించిన ఆయన నిత్య సింహాసనంపై అధిష్ఠించే దైవిక వ్యక్తి అని దావీదు గుర్తించాడు. మహోన్నతుడైన దేవుని కుడిప్రక్కన కూర్చుండేది కూడా ఆయనే. దానికి జవాబు మనకు తెలుసు. వారికి మాత్రం తెలియలేదు. వివరించ ప్రయత్నించడానికి కూడా జంకారు. మానవుడిగా యేసు దావీదు కుమారుడు. దైవిక స్వభావాన్ని బట్టి దేవుని కుమారుడు ఆయన మానవ సంబంధమైన తండ్రిలేకుండా కన్యగర్భమున జన్మించాడు. నరావతార మర్మమంతా ఈ కీర్తనలోని మాటలో దాగి వుంది.

ఈ సందర్భంలోనే "సామాన్య జనులు ఆయన మాటలు సంతోషములో వినుచుండిరి" అని రాసి వున్నది. శాస్త్రుల జీవితానికీ, వారు చెప్పే మాటలకు బొత్తిగా పొంతన వుండదు గనుక శాస్త్రులు బిక్కమొహం వెయ్యటం చూచి ప్రజలు సంతోషించి వుండవచ్చు.

యేసుప్రభువు ఈ సందర్భంలో మత నాయకుల కుటిల తలంపులను వారి దుష్ప్రభావాన్ని గూర్చి సామాన్య ప్రజానీకాన్ని హెచ్చరించాడు.

"శాస్త్రులను గూర్చి జాగ్రత్తపడుడి" (30వ) అని ప్రభువు హెచ్చరించాడు. ఎందుకంటే వారు అందరికీ కనిపించాలని, ప్రజలు తమ భక్తిని బట్టి పొగడాలని ఆశిస్తారు. వారి వస్త్రధారణ ప్రత్యేకంగా వుంటుంది. అందరూ తమను గుర్తించాలని వారి తపన. నిలువుటంగీలు ధరించి వీధులలో ప్రజలు వారికి అభివాదం చేసినప్పుడు పొంగిపోతారు. సమాజమందిరాలలో, విందులలో అగ్రస్థానాలు కోరుకుంటారు. దీనంతటిలో మనం గమనించేదేమిటి ? ఈ మతనాయకుల బతుకులు ఎలా వున్నా ప్రజలు మన్నన మర్యాదలు మాత్రం పుష్కలంగా కావాలి. నేటికీ ఈ గోత్రికులు మనమధ్య వున్నారు. వారి విషయం జాగ్రత్త.

వారు చేసే దుర్మార్గపు పనులు 39 వచనంలో ప్రస్తావించటం జరిగింది. విధవరాండ్ర ఇండ్లు తాకట్టు పెట్టుకొని అప్పులిస్తారు. వారు తిరిగి చెల్లించలేనప్పుడు ఆ ఇండ్లను స్వాధీనం చేసికొంటారు. ఇంకా ఎన్నో చేసి పైకి భక్తి ముసుగు వేసికొంటారు. బహిరంగ స్థలాల్లో దీర్ఘ ప్రార్థనలు చేస్తారు.

అయితే ఒకానొక రోజు రాబోతుంది ఆ రోజు ప్రతి ఒక్కరూ దేవుడికి లెక్క అప్పగించవలసి ఉంటుంది. హృదయ రహస్యాలన్నీ బట్టబయలవుతాయి. ఇలాంటి వేషధారులు తగిన ప్రతిఫలం పొందుతారు.

ఆలోచించండి 5:1-20

# యేసు - మానవ వర్గాలు (కులాలు)

**యేసు సురోఫొనికే (సిరియా - ఫొనీషియా జాతులకు చెందిన) స్త్రీతో మాటలాడటం జాతి, వర్గ వైఖరులను గూర్చిన కొన్ని జటిలమైన సమస్యలను లేవనెత్తుతుంది (మార్కు 7:24-30; మత్తయి 15:21-28). యేసుప్రభువు అంతర్జాతీయ రక్షకుడు, లోకమంతటికి చెందినవాడు అనే ప్రఖ్యాతి ఈ వైఖరికి విరుద్ధంగా కనిపిస్తుంది.**

**యేసు, సురోఫోనికే స్త్రీ మధ్య జరిగిన సంభాషణ**

| అన్య స్త్రీ | యేసు |
|---|---|
| యేసు సాయం అర్థించింది (మార్కు 7:25) | ఆమెకు అందుబాటులో లేకుండటానికి ప్రయత్నించాడు (మార్కు 7:24) |
| దయ్యం పట్టిన తన కూతురు పట్ల కనికరం చూపమని వేడుకొన్నది (7:25,26; మత్తయి 15:72) | ఆమె కేకలను పట్టించుకోలేదు (మత్తయి15:23)<br>ఆమెను పంపించి వేయాలని శిష్యులు చెప్పిన మాటతో ఏకీభవించినట్లుంది (మత్తయి 15:23,24) |
| ప్రభువా అని (మార్కు 7:28; మత్తయి 15:25) | తాను యూదుల కోసమే వచ్చినట్లు చెప్పాడు (మత్తయి 15:24) |
| "దావీదు కుమారుడా" అని సంబోధించింది (మత్తయి 15:22) | |
| 'కుక్క' అని పిలిచినా అభ్యంతరం చెప్పలేదు (మార్కు 7:28; మత్తయి 15:27) | ఆమెను కుక్కగానే పరిగణించాడు (సాధారణంగా యూదులు అన్యులను కుక్కలుగా పరిగణిస్తారు (మార్కు 7:27; మత్తయి 15:26)<br>యూదురాలు కాదు గనుక, దేవుని బిడ్డ కాదు, కనుక సాయం వీలుకాదు అనే భావం వెలిబుచ్చాడు (మత్తయి 15:24,26) |
| యూదులతో ఆయన పని ముగిసిన తరువాతే మిగిలి పోయిన ముక్కలు ఇమ్మని ప్రాధేయపడింది (మార్కు 7:28; మత్తయి 15:27) | |

ఆమె పట్టువీడని విశ్వాసం చూచి, యేసు ఆమెను శ్లాఘించి, ఆమె కుమార్తెను స్వస్థపరిచాడు (మార్కు 7:29; మత్తయి 15:28). అయితే ఆయన ఆమెతో వ్యవహరించిన తీరు ఎలా వుంది ? ఆ స్త్రీ చిత్తశుద్ధితో, గొప్ప గౌరవ భావంతో వచ్చింది. అయితే, యేసు ఆమెను పరుషమైన మాటలతో నిరాకరించాడు. ఆయన అలా ఎందుకు చేసినట్టు. ఇతర జాతులకు, కులాలకు చెందిన వారిపట్ల మనము కూడా అలా వ్యవహరించాలని దేవుని ఉద్దేశమా ?

ఇక్కడ ఒక విషయం మనం గ్రహించాలి. యేసుప్రభువు మాటలు ఆ స్త్రీ కంటే, శిష్యులకే ఎక్కువగా వర్తిస్తాయి. ఇశ్రాయేలులో నశించిన గొర్రెల యొద్దకే గాని, మరెవ్వరి యొద్దకు తాను పంపబడలేదు" అని చెప్పిన మాటలు బహుశా

వారికోసమే అయి వుంటాయి (మత్తయి 15:24). ఆమె కుమార్తెను స్వస్థపరచి, ఆమెను పంపివేయవలసిందిగా శిష్యులు కోరారు. అయితే, అందుకాయన నిరాకరించాడు. దానికి కారణం వారిలో గూడుకట్టుకొని వున్న జాత్యహంకారం, తాము ప్రత్యేక జనాంగమనే గర్వం.

ఈ సంఘటనను యేసు ఒక సజీవమైన ఉపమానంగా మలచుకొని, అన్యులపట్ల వారి వైఖరి ఎంత కఠినమైందో శిష్యులకు తెలియజేయాలనుకున్నాడు ). ఈ సంఘటన జరిగిన తూరు గలిలయ ప్రాంతానికి 50 మైళ్ళ దూరంలో వుంటుంది. శిష్యులు పుట్టి పెరిగిన ప్రాంతం కూడా గలిలయ. అయితే, తూరు సంస్కృతి పూర్తిగా భిన్నమైనది. గ్రీకు సంస్కృతి అధికంగా వుంటుంది. ఎక్కువగా అన్యులు నివసిస్తారు. వారిలో అనేకులు యేసును గూర్చి మరింత తెలుసుకోవడానికి అంతకుముందే దక్షిణంగా వచ్చారు (మార్కు 3:8). ఇప్పుడు యేసు మరో సంస్కృతి గురించి నేర్పించడానికి శిష్యులను ఉత్తరంగా తీసుకొనిపోతున్నాడు.

ఆ స్త్రీతో మాటలాడిన తరువాత శిష్యులు ఏవిధంగా ఆమెతో వ్యవహరించి వుండాలో ఆ రీతిగా ఆయన ఆమెతో వ్యవహరించాడు. వారెన్నడూ మరచిపోని రీతిలో వారికొక పాఠం నేర్పించాలి అనుకున్నాడాయన. ఆమె కుమార్తెను యేసు స్వస్థపరచడం అనేది యేసు ఇశ్రాయేలీయుల కోసమే వచ్చాడనే వాదనను కొట్టివేసింది.

## ➡ తెలుసుకుందాం 8:27-33 | "నీవే క్రీస్తువు"

**"నీవే క్రీస్తువు" (మార్కు 8:29) అంటూ పేతురు సీజరియ ఫిలిప్పి వద్ద (8:27) చేసిన ప్రకటన చిరస్మరణీయం.**

పాత నిబంధన కాలంలో ఈ నగరం కనానీయుల బయలు దేవతారాధన కేంద్రం. తరువాత గ్రీకుల బయలు స్థానంలో పానుని నిలిపారు. చివరకు రోమీయులు ఆ స్థానంలో తమ చక్రవర్తుల విగ్రహాలు నిలిపి, పూజింప మొదలుపెట్టారు. యేసుప్రభువు తన శిష్యులను పాలస్తీనా వెలుపలికి కొనిపోయి, అన్యదేవతారాధన కేంద్రమైన నగరానికి తీసుకుని వచ్చాడు. అక్కడ ఆయన శిష్యులను రెండు ప్రాముఖ్యమైన ప్రశ్నలు అడిగాడు.

- ❖ నేను ఎవరినని ప్రజలు చెప్పుకొంటున్నారు ? (8:27)
- ❖ నేను ఎవరినని మీరు భావిస్తున్నారు ? (8:29)

మొదటి ప్రశ్నకు జవాబు చాలా సులభమైనది. ప్రజలు ఆయన్ను ఇంచుమించు బాప్తిస్మమిచ్చే యోహాను, ఏలీయా ప్రవక్త లేదా ఏదో ఒక పాత నిబంధన ప్రవక్తకు సమానమైన వాడు అని భావిస్తున్నారు. హేరోదు రాజు సలహాదారులు కూడా ఆయన్ను అలాగే పరిగణించారు.

అయితే, యేసుక్రీస్తు విషయంలో పేతురు తన మనసులో ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చాడు. కనుక, వెంటనే ఒకడుగు ముందుకేసి రెండవ ప్రశ్నకు ఈవిధంగా జవాబిచ్చాడు. "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" (మార్కు 8:29; మత్తయి 16:16).

పేతురు జవాబు చెబుతూ వుండగా బహుశా యేసుప్రభువు దగ్గర్లోనే వున్న పెద్ద పెద్ద కొండరాళ్లను చూచినట్లుంది. అందుకే కాబోలు ఆయన ఈవిధంగా స్పందించాడు "సీమోను బర్‌యోనా ('యోనా కుమారుడు సీమోనా' అని అర్థం). నీవు ధన్యుడవు... నీవు పేతురువు. ఈ బండమీద నా సంఘమును కట్టుదును" (మత్తయి 16:17,18).

''బండ'' అంటే పేతురు వెల్లడించిన రీతిలో "విశ్వాసపు పునాది" అని కొందరు అర్థం చేసికొన్నారు. మరికొందరైతే, దేవుడు తన సంఘాన్ని పేతురు అనే పునాది మీదే నిర్మించాడు, ఆయన వారసులు ఆ పరంపరను కొనసాగించారు అని నమ్ముతున్నారు. ఇంకా కొందరు యేసుప్రభువు వినియోగించిన భాషపై వ్యాఖ్యానించారు. పేతురు అనే పేరుపైన ప్రభువు భాషాంతరమైన అలంకారిక ప్రయోగం చేశాడు. తన సంఘాన్ని బండలాంటి తనపైనే నిర్మిస్తానని ప్రభువు భావమని చెబుతారు.

అసలిక్కడ ప్రాముఖ్యమైన విషయమేమంటే రోమన్ చక్రవర్తి గౌరవార్థం పేరు పెట్టిన ఆ నగరపు నీడలో ప్రభువు నిలుచుండి తానే దేవుని కుమారుడిని అని ప్రకటించాడు. ఆయన యూదుల మెస్సీయాకంటే మించినవాడు, ఆయన సర్వలోక రక్షకుడు.

# యెరూషలేము విధ్వంసాన్ని గూర్చిన ప్రవచనం

**(మార్కు 13:1-23)**

ఇశ్రాయేలు జాతి దేవుని విషయంలో నిష్ఫలంగా వుంది. అయినా శిష్యులకు అదేమీ పట్టినట్లు లేదు. వారు హేరోదు రాజు దేవాలయాన్ని విస్తరించిన చలువరాళ్లను చూచి మెచ్చుకోలుగా ప్రశంసిస్తూ ఉన్నారు.

**1. శిష్యులు అనవసరంగా పవిత్ర కట్టడాల పట్ల ఆరాధనా భావం పెంచుకున్నట్టు కనబడుతుంది (13:12).**

ఎజ్రా కాలంలో పునర్నిర్మించిన దేవాలయం చాలా చిన్నది. అది ప్రార్థనా కేంద్రంగా, రక్తబలితో దేవుణ్ణి సమీపించ డానికి సంకేతంగా నిలిచింది.

దేవుడు కూడా దేవాలయాన్ని సమాదరించినట్లు కనిపిస్తుంది. యేసుప్రభువు దేవాలయాన్ని తన తండ్రి ఇల్లు అనీ (లూకా 2:49). సకల జాతులకు ప్రార్థన మందిరం (మార్కు 11:7) అనీ పేర్కొన్నాడు. అయితే దేవాలయంలో ఏమీ లేదు. దానిని వినియోగించే ప్రజలు దేవుణ్ణి ఎరగకపోతే కట్టడం వల్ల ప్రయోజనమేమిటి? హేరోదు దేవాలయ విస్తరణ కార్యక్రమాన్ని చాలా ఏళ్ళు చేపట్టాడు. అయినా, అతడు నిర్మాణ కార్యక్రమానికి, దేవుడిపట్ల అతడి ప్రేమకు బొత్తిగా పొంతన లేదు. మనం చూపవలసిన దానికంటే కట్టడాలపట్ల ఎక్కువ మక్కువ చూపుతూ వుంటాం. అది ప్రయోజనకరమే గాని తప్పనిసరేం కాదు.

యేసుప్రభువు శిష్యులలాగా పవిత్ర కట్టడాలను చూచి విస్మయం చెందలేదు. ఆ అవకాశాన్ని తీసుకొని ఆయన దేవాలయంలోని ఒక్కరాయి కూడా ఒకదాని మీద ఒకటి నిలవదు అని చెప్పటానికి వినియోగించుకున్నాడు. క్రీ.శ. 70లో జరుగనైయున్న యెరూషలేము నాశనం విషయం ఆయన ముందే సూచిస్తున్నాడు ఇక్కడ.

**2. శిష్యులు సమయాన్ని గూర్చి, సూచనను గూర్చి ప్రశ్న అడిగారు (13:34).**

యేసుప్రభువు సూచించిన దాన్నిబట్టి వారు తత్తరపడి వెంటనే ఆయన్ను ఒక ప్రశ్న అడిగారు. "ఇవి ఎప్పుడు జరుగును? ఇవన్నియు జరగబోవు కాలమునకు ఏ గురుతు కలుగును?" అది యెరూషలేము విధ్వంసానికి సంబంధించిన ప్రశ్న. ఒక నిర్దిష్టమైన సూచన ద్వారా యెరూషలేము నాశనం తథ్యమని వారు తెలుసుకుంటారు.

భవిష్యత్తు తెలుసుకోవాలని ప్రజలకు ఆసక్తి మెండు. భవిష్యత్తులో ఏం జరగబోతోంది, ఎలా జరగబోతోంది మొదలైన విషయాల పట్ల సమాజంలోని అన్ని వర్గాలు అమితాసక్తిని కనబరుస్తూ ఉన్నట్టుంది. భవిష్యత్తును తెలుసుకోవటం కోసం కొన్నిసార్లు ప్రజలు జ్యోతిష్యం, క్షుద్ర విద్యలు, మంత్ర తంత్రాలవైపు మళ్ళుతూ వుంటారు. యేసుప్రభువు బోధలలో కొన్ని ప్రవచనాలున్నా, మనం అనవసరమైన ఆసక్తిని వ్యక్తం చేస్తూ వుంటాం. అందువలన భవిష్యత్ సంభవాల కాలాన్ని గురించి సూచనల గురించి అమితాసక్తి కనబరుస్తూ వుంటాం. శిష్యుల వ్యవహారం అలాగే వుంది.

**3. యేసుప్రభువు భయంకర సంఘటనలను ప్రస్తావించాడు కాని అవి అంతము సమీపంగా వుందనే నిర్ధారణ కాదు (13:5-8).**

ఈ వచనాలను తీసుకొని అనేకులు రెండవ రాకడకు సూచనలుగా చెప్పడం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. మార్కు 13లో ఇంతవరకు యేసుప్రభువు రెండవ రాకడను గూర్చి ప్రస్తావించనే లేదు. ఇక్కడ ప్రస్తావించింది యెరూషలేము పతనం మాత్రమే. 5-8 వచనాల్లోని సంభవాలు యుగాంతపు సూచనలు కావు.

అంత్యదినాలను గూర్చి తమకు అంతా తెలుసు అని ఎవరైనా చెబితే వారి విషయంలో శిష్యులు మోసపోకుండా జాగ్రత్తగా వుండాలి. అలాగే మనం కూడా (13:5).

**నకిలీ మెస్సీయాలు రావటం చివరి దినాల సూచన కాదు (13:6)**

అనేకులు యేసుప్రభువు పేరు చెప్పుకొని వచ్చి, తామే మెస్సీయాలమని ప్రకటించుకొంటారు అని యేసుప్రభువు

హెచ్చరించాడు. అపో.కా. 8:9లో మనకు ఒక దృష్టాంతం వున్నది. దీనిని మనం అంత్య దినాలకు సూచనగా గైకొన టానికి వీలులేదు. నకిలీ మెస్సీయాలు వచ్చినంత మాత్రాన అంతం వచ్చినట్టు కాదు.

### రాజకీయ అస్థిరతలు అంత్యకాల సూచన కాదు (13:7,8)

యేసుప్రభువు యుద్ధాలను గూర్చి హెచ్చరించాడు. కాని అంతము వెంటనే రాదు అని చెప్పాడు. లోకాంతానికి సంబంధించిన సూచనల జాబితా ఆయన ఇవ్వటం లేదు. ప్రపంచ చరిత్ర అంతటా యుద్ధాలు, యుద్ధ సమాచారాలు నెలకొన్నాయి. అయినా అవి లోకాంతానికి రుజువులు కాదు. ప్రపంచం వ్యాప్తంగా జాతుల మధ్య వైషమ్యాలు నెలకొంటాయి (జనము మీదికి జనము లేచుట). రాజకీయ కారణాలను బట్టి యుద్ధాలు (దేశం మీదికి దేశం)జరుగుతాయి. అయితే శిష్యులు తమ పని అయిపోయింది, అంతం రాబోతుంది అని చేతులు దులిపేసుకోవటానికి వీలులేదు.

### భూకంపాలు, కరువులు అంత్యదినాల సూచనలు కాదు (13:8)

యేసుప్రభువు కాలం నుండి యెరూషలేము ధ్వంసమైన క్రీ.శ. 70 మధ్యకాలంలో అనేక కరువులు, భూకంపాలు చోటుచేసుకున్నాయి. అపో.కా. 11:28లోని కరువు బాగా తెలిసిందే. అయినా అలాంటి సమయంలో యెరూషలేము నాశనం కాని, లోకాంతము కాని సంభవించలేదు.

'ఇవి ప్రసవ వేదనలకు ప్రారంభం మాత్రమే' అనే వచనాన్ని జాగ్రత్తగా గమనించాలి. ఈ సూచనలు అంత్య కాలాన్ని సూచించటం లేదు, అంత్యకాల ఆరంభాన్ని మాత్రమే సూచిస్తున్నాయి. ప్రపంచ చరిత్ర పుటలలో మరో నూతన అధ్యాయం ప్రారంభం కాబోతుందన్న మాట. క్రీ.శ. 33–70 మధ్యకాలంలోని సంఘటనతో చరిత్రలో ఒక అంకం ముగిసి, మరో అంకం ప్రారంభం కాబోతుంది. ఇశ్రాయేలులో ఈ కాలంలోని సంభవాలు యెరూషలేము పతనానికి దారి తీస్తాయి కాని, ప్రపంచ సౌవార్తీకరణ అనే మరో నూతన అధ్యాయం చరిత్రలో ప్రారంభం కాబోతుంది. ప్రజలకు అంత్య దినాల సూచనలంటే ఆసక్తి మెండు, అయితే ఆరంభానికి సంబంధించిన సూచనలు ముఖ్యమైనవి.

**4. యెరూషలేము పతనానికి దారితీసే స్థితి అపొస్తలులకు నూతన సవాళ్ళను తెచ్చిపెడుతుంది (13:9–13).** అపొస్తలులు, రాజ్యాధినేతలతో యేసు ప్రభువును గూర్చి మాటలాడే అవకాశం లభిస్తుంది (13:9). యెరూషలేము విధ్వంసానికి ముందు కాలంలో అన్నిదేశాలకు సువార్త ప్రకటించాలనే ఆసక్తి ఎక్కువ వుంటుంది (13:10). లోకాంతాన్ని గూర్చిన సూచన ఏదైనా వున్నది అంటే ఇది సమస్త దేశాలకూ సువార్త ప్రకటించటమే.

విపత్కర పరిస్థితుల్లో ఏమి మాటలాడాలో వారికి అనుగ్రహించటం జరుగుతుంది (13:11). అయితే తమ సన్నిహితులు, రక్త సంబంధులే వారిని అధికారులకు అప్పగిస్తారు (13:12). విపరీతమైన ద్వేషానికి గురవుతారు (13:13). అయితే స్థిరంగా నిలిచినవారు సురక్షితంగా వుండి, చివరకు బహుమానం పొందుతారు. యెరూషలేము పతనం సందర్భంలో క్రైస్తవులు ఎవ్వరూ నాశనమైన దాఖలాలు లేవు. యెరూషలేములోని క్రైస్తవులు పెరయలోని పెల్ల అనే నగరానికి పారిపోయారు (యూసిబియస్ "మత చరిత్ర" నుండి 3:5:3).

**5. యెరూషలేము త్వరలో నాశనమవుతుందనటానికి భయంకరమైన సూచన దేవాలయంలో హేయవస్తువును నిలుపుట.** 'నాశనకరమైన హేయ వస్తువు' అనేది దానియేలు 9:27; 11:31; 12:11 నుండి తీసికొన్న పరిభాష, యెరూషలేములోని అతి పవిత్ర స్థలంలో యూదేతరులు (అన్యులు) ప్రవేశించటాన్ని గూర్చిన ప్రత్యేక ప్రవచనం అది. 'చదువువాడు గ్రహించు గాక' అనే మాటలు యేసు ప్రభువు కలిపాడు. శిష్యులు పాత నిబంధన చదివి, దానిని గ్రహించాలని ఆయన అభ్యర్థిస్తున్నాడు.

ఆయన మాటలు నెరవేరే హేయ క్రియ జరిగినప్పుడు యెరూషలేము పతనం సమీపించింది అని వారు గ్రహించాలి. పారిపోవటానికి చర్యలు తీసుకోవాలి (13:14–16). (వాస్తవంగా రోమనులు తమ సంకేతాలను వారి వెంట తెచ్చి, దేవాలయంలో వాటికి బలులు అర్పించారు, ఈ విషయం జోసెఫస్ అనే యూదు చరిత్రకారుడు 'యూదుల యుద్ధాలు' అనే గ్రంథంలో రాశాడు). ఆ కాలం యెరూషలేము ప్రజలకు విపరీతమైన శ్రమల రోజులు అని ప్రభువు చెప్పాడు (13:17). పారిపోయే కాలం చలికాలంలో రాకుండా అపొస్తలులు ప్రార్థించాలి (13:18). శ్రమలు విపరీతంగా వుంటాయి (13:19). అయితే దేవుడు ఏర్పరచుకొన్న వారికోసం ఆ దినాలను తక్కువ చేయటం జరుగుతుంది. యూదులకు ప్రపంచ రక్షణ ప్రణాళికలో భాగమున్నందున వారు పూర్తిగా

నిర్మూలం కారు. దేవుడు ఏర్పాటు చేసుకొన్న వారి నిమిత్తం భవిష్యత్తు అంతటిలో ఇశ్రాయేలు జాతి నాశనం కాకుండా భద్రపరచటం జరుగుతుంది (13:20). ఈ విషయాన్ని గురించి యేసుప్రభువు మరికాస్త చెప్పాడు (లూకా 21:23,24 చూడండి), రోమా 11:11-55; 25-32లో పౌలు దీనిని మరింత విడమర్చి చెప్పాడు.

యెరూషలేము పతనానికి ముందు మోసగాళ్లు అనేకులు బయలుదేరతారు. సంక్షోభ సమయాల్లో సాధారణంగా అబద్ధ ప్రవక్తలు కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తారు. అయితే అలాంటి వారిని గూర్చి ముందే హెచ్చరించటం జరిగింది (13:21-22).

➥ తెలుసుకుందాం 8:27-33

## పట్టణాల్లోని ప్రజల ప్రాధాన్యతలు

**ప్రపంచంలో తమ చుట్టూ వున్న అనేక అవసరతలను చూచి విశ్వాసులు చలించిపోతున్నారు. ఎక్కడ ప్రారంభించాలి? వారు తమ ప్రత్యేకతను ఎలా చాటుకోగలరు? ఎవరు బాగా అవసరతలో వున్నారు?**

యేసుప్రభువు గలలీ సరస్సు దాటి ఆవలి ప్రాంతం చేరుకోగానే ప్రజల అవసరాలు తీర్చాడు (మార్కు 5:21). ఇందులో ఆయన మనకు అనేక పాఠాలు నేర్పిస్తున్నాడు. చాలా క్లిష్ట పరిస్థితిలో వున్న ఇద్దరు ఆయనకు తటస్థపడ్డారు. వారిలో ఒక వ్యక్తి సమాజంలో ఉన్నతస్థితి, గౌరవ ప్రపత్తులు వున్న సమాజమందిరం అధికారి అతడి పన్నెండేళ్ల కుమార్తె చావుబతుకుల్లో వున్నది (5:22-24). మరొక వ్యక్తి ఒక అనామక స్త్రీ, రక్తస్రావ రోగానికి పనికిరాని కాయకల్ప చికిత్సలెన్నో చేసింది (5:25-28).

ఇంత గొప్ప స్థితిలో ఆ అధికారి, యేసుప్రభువును మొట్టమొదట కలుసుకున్నాడు. అయితే, యేసు పట్టణం వదిలివెళ్తూ వుండగా ఊరూ పేరు లేని స్త్రీ అకస్మాత్తుగా వచ్చి ఆయన్ను పట్టుకొంది. ఆమె నిస్సహాయస్థితిలో ఆ పనిచేసింది. ఏదో అద్భుతం జరిగితే తప్ప ఆమె బతకటం అసాధ్యమని అందరికీ తెలుసు.

పన్నెండేళ్లుగా జీవిస్తూ వున్న ఒక బాలిక (5:42), పన్నెండేళ్లుగా చస్తూ వున్న ఒక స్త్రీ (5:25) యేసుప్రభువు ఏం చేస్తాడు?

పరిస్థితి మరింత జటిలం చేస్తూ ఆ స్త్రీ యేసును ముట్టుకొన్నందున ఆయన సాంప్రదాయం ప్రకారం అపవిత్రుడయ్యాడు (లేవీ 15:25-27). సాంకేతికంగా ఆ బాలికకు మరుసటి రోజుదాకా ఆయన సాయం చేసే వీలు లేదు. అయితే యేసుగాని, ఆ స్త్రీ గాని ఆ విషయం బొత్తిగా పట్టించుకున్నట్టే లేదు. తక్షణమే స్వస్థత కలగటం చూచి ఆ స్త్రీ ఉబ్బితబ్బిబ్బైపోయింది. తనలో నుండి ప్రభావం బయలు వెడలినట్లు యేసు గ్రహించాడు (మార్కు 5:29,30). గుంపులు మీద పడుతున్నా విశ్వాసంతో ఆమె తనను ముట్టుకోవడం ఆయన ప్రత్యేకంగా గుర్తించగలిగాడు.

యేసు ఆమెను "కుమారీ" అని సంబోధించాడు (5:34). బహుశా ఆయన ఆమె యూదురాలు అని సూచిస్తూ వుండవచ్చు. ఇలాంటి సందర్భంలోనే మరొకచోట ఒక స్త్రీని ఆయన అబ్రాహాము కుమార్తె అని పేర్కొన్నాడు (లూకా 13:16). అయితే ఆ మాట ఆమెను అధికారి కుమార్తెతోబాటు సమాన స్థాయికి చేర్చింది - బాధలోవున్న వ్యక్తిగా యాయీరు పట్ల ఆయన సానుభూతి కలిగి వున్నాడు. అందుకే కాబోలు పరిస్థితులు విషమించినా యాయీరు విశ్వాసం చెక్కుచెదరలేదు (మార్కు 5:35,36).

నేటి ప్రపంచంలో నెలకొని వున్న అవసరాలను ఏ ఒక్క విశ్వాసీ వ్యక్తిగతంగా తీర్చలేడు. అయితే, ఇక్కడొక ప్రశ్న. యేసుప్రభువు మనలను ఏమైనా చెయ్యమంటున్నాడా? మార్కు 5లో అలాంటి సూచన ఏదైనా వున్నది అనుకుంటే వ్యక్తుల అక్కరలు తీర్చడంలో మనవంతు బాధ్యత మనం నెరవేర్చాలి. ఆయనకు చావుబతుకుల్లో వున్న వృద్ధ స్త్రీలైనా, మంచి వయసులో వున్న విద్యార్థినులైనా ఒక్కటే.

# మనుష్యకుమారుని రాకడ

**(మార్కు 13:24-37)**

ఇంతకుముందే మనం గమనించినట్లు మార్కు 13:1-23లో ప్రభువు చెప్పినవన్నీ యెరూషలేము పతనానికి సంబంధించనవి. ఇప్పుడు మార్కు 13:32-37 ప్రభువు తన రెండవ రాకడను గూర్చి వివరిస్తున్నాడు. అయితే 30-32 వచనాలు విషయంలో బైబిలు పండితుల మధ్య బేదాభిప్రాయాలు వున్నాయి. "ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఆకాశము, భూమియు గతించును గాని నా మాటలు గతింపవు. ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు".

మార్కు 13:21-31లో యేసుప్రభువు రెండవ రాకడను గూర్చిన ప్రస్తావన వున్నది. అయితే తన తరంలోనే అది సంభవిస్తుందని యేసుప్రభువు పొరబడి వుంటాడు అని కొందరి అభిప్రాయం. యేసుప్రభువును గురించి అలాంటి అభిప్రాయం సరైన క్రైస్తవులెవ్వరూ వ్యక్తం చెయ్యరు.

కొందరు 'తరము' అనే పదము ఇశ్రాయేలును సూచిస్తుంది అని అభిప్రాయపడ్డారు. ఈ సంగతులు జరిగేంత వరకు ఇశ్రాయేలు జాతి గతించిపోదు అని చెబుతారు. అయితే 'తరము' అనే పదం అర్థం అది కాదు.

కొందరైతే 24-31 వచనాలు యేసుప్రభువు రెండవ రాకడకు సంబంధించినవే. ఒక తరంలో జరిగే సంభవాల విషయం యేసుప్రభువు తప్పుగా ఏమీ మాటలాడలేదు అంటారు. ఈ వ్యాఖ్యాతలు 30 వచనం యేసుప్రభువు కాలంలో ప్రారంభమై నిరవధికంగా కొనసాగే చర్యలను సూచిస్తున్నట్టు చెబుతారు. అయితే ఈ వ్యాఖ్యాతలు 30 వచనం విషయం చెప్పే భాష్యాలు నాకు నమ్మశక్యంగా లేవు.

కొందరు 24-31 వచనాలు యెరూషలేము నాశనాన్ని సూచిస్తున్నాయి అంటున్నారు. వారితో నేను ఏకీభవిస్తున్నాను.

మార్కు 13:24-31 యేసుప్రభువు రెండవ రాకడకు ముంగుర్తుగా యెరూషలేము నాశనాన్ని సూచిస్తున్నాయి.

మనుష్య కుమారుని రాకడ అంటే యేసుప్రభువు రెండవ రాకడ అని ఎల్లప్పుడూ అర్థం చేసుకోవటానికి వీల్లేదు. దానియేలు 7:13లో రాజ్యము స్వీకరించడానికి మనుష్య కుమారుడు తండ్రి దగ్గరకు వచ్చినట్లు గమనిస్తాం. యేసు ప్రభువు పునరుత్థానము, ఆరోహణములలో యేసుప్రభువు తండ్రి దగ్గరకు వచ్చి తన రాజ్యము స్వీకరించినట్లు గమనిస్తాం. పరిశుద్ధాత్మ కుమ్మరింపు, సంఘ విస్తరణ, యెరూషలేము పతనము ఇవన్ని కూడా మనుష్య కుమారుడు మేఘములపై రావటంగానే భావించారు. అంటే దానియేలు 7:13 నెరవేర్పు అన్నమాట.

మార్కు 13:24,25లోని భాష అక్షరార్థం కాదు. ఒక నగరం పతనం ద్వారా సంభవాలలో జరగనైయున్న పెనుమార్పులను తెలియజేసే పాత నిబంధన భాష అది. ఇశ్రాయేలు శత్రువుల పతనానికి వినియోగించిన భాష (యెషయా 13:10; 4:4; యెహె 32:7). ఇప్పుడు ఇశ్రాయేలుకే అన్వయించటం జరిగింది. అలాంటి సంఘటనలు కంటికి కనిపించే రీతిలో యుగాంతానికి ముందే చోటు చేసుకోవచ్చు (లూకా 23:44 చూడండి). అయితే ఇప్పుడు యుగాంతానికి సంబంధించిన భాష నగరాలు, రాజ్యాల పతనానికి వినియోగించటం జరిగింది. ఇక్కడ ఇశ్రాయేలు ప్రత్యేక స్థాయి ముగిసినట్లు యేసుప్రభువు సూచించాడు. దేవాలయం నాశనంతో దేవుడు ఒక నూతన దినాన్ని ఆవిష్కరించాడు. దానితో రక్షణ పొందటానికీ మోషే ధర్మశాస్త్రానికీ, ఎలాంటి సంబంధంలేకుండా పోయింది.

యెరూషలేము పతనం యేసుప్రభువు తన రాజ్యము లోనికి వచ్చాడనటానికి రుజువు. యేసుప్రభువు తదనంతర తరం దానిని కళ్లారా చూస్తారు. మనుష్య కుమారుడు మేఘారూఢుడై వచ్చుట చూచెదరు. అంటే దానియేలు 7:13 నెరవేర్పు అన్నమాట. దానియేలు 7:13 అంచెలంచెలుగా నెరవేరుతుంది. రాజ్యము పొందటానికి యేసుప్రభువు తండ్రి దగ్గరకు వచ్చాడు. అది తన తరంలోనే జరుగుతుందని యేసుప్రభువు పదే పదే చెప్పాడు. 1) మత్తయి 16:27; మార్కు 8:38; లూకా 9:26; 2) మత్తయి 10:23; 3) మత్తయి 24:30; మార్కు 13:26; లూకా 21:27; 4) మత్తయి 26:64; మార్కు 14:62; లూకా 22:69. మత్తయి 20:64లో అది ఇది మొదలుకొని వాస్తవం అవుతుందని చెప్పటం జరిగింది. అలాగే లూకా 21:27. మత్తయి

28:18లో కూడా దానియేలు 7:13,14 నెరవేర్పు (1) యేసుప్రభువు పునరుత్థానం తరువాత ఆరోహణం చెంది రాజ్యాధికారంలో తండ్రి దగ్గరకు వచ్చినప్పుడు నెరవేరింది. (2) యెరూషలేము పతనంతో అది నెరవేరింది. దానిమీద తీర్పు విధించటంలో యేసుప్రభువు తన మహిమ గల సింహాసనంపైన కూర్చుని వున్నాడని తేటతెల్లమయ్యింది. (3) యేసుప్రభువు కనిపించే రీతిలో రెండవసారి వచ్చినప్పుడు అది నెరవేరుతుంది. మార్కు 13:1-25లో వున్నదంతా యెరూషలేము పతనానికి సంబంధించిందే అలాగే 26 వచనం కూడా.

27 వచనంలోని "దూతలు" సువార్త ప్రకటించే భూలోక వార్తాహరులను సూచిస్తూ వుండవచ్చు. "దూతలు" అనే పదానికి 'వార్తాహరులు' అనే అర్థం కూడా వున్నది. ఒకవేళ అక్షరాలా దేవదూతలు అనుకొనే పక్షంలో పాత నిబంధనలో దేవుని ప్రజలు ముందుకు సాగాలంటే బూర ఊదటం జరగాలని మనం గుర్తుంచుకోవాలి (సంఖ్యాకాండం 10:2లో ఇశ్రాయేలీయులు తమ ప్రయాణంలో ముందుకు సాగటానికి బూరలు ఊదినట్లు గమనిస్తాం; యెషయా 27:13 కూడా చూడండి - అక్కడ మహా విమోచనకు సంకేతంగా బూర ఊదటం చూస్తాం).

28-31 వచనాలు ఈ సంఘటనలు త్వరలోనే చోటు చేసుకోనున్నట్లు, అంటే అపొస్తలుల కాలంలోనే అని తెలియ జేస్తున్నాయి. వసంతకాలం త్వరలో రానైయున్నది. అంటే ఆహ్లాదకరంగా వుండే ఆ ఋతువులో అనేక సంఘటనలు చోటుచేసుకోవచ్చు. సంఘము యొక్క మొదటి తరాలు గొప్ప విస్తరణను ఆధ్యాత్మిక శక్తిని అనుభవించాయి.

ఈ విషయాలన్నీ కూడ వ.24-31 యెరూషలేము పతనాన్ని సూచిస్తున్నాయనే వాస్తవాన్ని వెల్లడి స్తున్నాయి.

యేసుప్రభువు సిలువలో మరణించిన దాదాపు నలభై సంవత్సరాలకు ఇశ్రాయేలు లోకానికి వెలుగును ప్రసరింప జేసే ప్రత్యేక జాతిగా వుండకుండా పోయింది. మోషే ధర్మ శాస్త్రం నిలిచిపోయింది. దేవాలయం నేలమట్టమైంది. జంతు బలులు నిలిచిపోయాయి. పస్కా ప్రాయశ్చిత్త దినం మొదలైన ప్రత్యేక పండుగలు దేవుడు ఇక ఎంతమాత్రము కోరటం లేదు. ఇశ్రాయేలు నుండి దేవుడి రాచరిక శక్తి విరమించు కోవటమైంది. యెరూషలేము ధ్వంసమైంది.

వ.32-37 యేసుప్రభువు రెండవ రాకడను సూచిస్తున్నాయి.

యెరూషలేము నాశనాన్ని శిష్యులలో కొందరు కళ్ళారా చూస్తారు కాని, యేసుప్రభువు రెండవరాకడ ఎప్పుడో ఎవరికీ తెలియదు. "నాశనకరమైన హేయ వస్తువు" నిలవటం అనేది ప్రారంభ సంఘటన కావచ్చు. అయితే రెండవ రాకడకు అలాంటి మరో సంఘటన లేదు. ఎందుకంటే యేసుప్రభువు రెండో రాకడ కాలం ఎప్పుడో ఎవరికీ తెలియదు.

యేసుప్రభువు అంతిమ రాకడ ఎవరికీ బొత్తిగా తెలియదు. దేవదూతలకు తెలియదు. యేసుప్రభువు ఇంకా భూలోకంలోనే వున్నాడు గనుక ఆయనకు కూడా తన రెండో రాకడ ఎప్పుడో ఖచ్చితంగా తెలియదు.

యేసుప్రభువు అంతిమ రాకడ మనం మెలకువగా వుండి ప్రార్థనలో కనిపెట్టునట్లు ప్రోత్సహించడానికే.

యేసుప్రభువు రావాలనుకుంటే (ఏదో ఒక రూపంలో) ఎప్పుడైనా రావచ్చు. కనుక మనం ఆయన రాకడకోసం ఎల్లప్పుడు సిద్ధపడి వుండాలి.

యేసుప్రభువు అంతిమ రాకడ ఆలస్యమవుతుంది. యేసుప్రభువు త్వరలో వచ్చెయ్యాలని ఆదిమ సంఘం మొండిగా కోరుకోలేదు. మార్కు 13:35, ఇతర లేఖనభాగాలు ఆలస్యం తప్పక వుంటుందని బోధిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇంటి యజమాని నిరవధిక కాలం దేశాంతరం పోయినట్లు వుంటుంది.

యేసుప్రభువు అంతిమ రాకడ అనేది మన మెలకువను పరీక్షించేది. మనం అనుకోని గడియలో యేసు వస్తాడు. ఆయన ఎప్పుడైనా రావచ్చు అని మనం నమ్ముతూ వున్నాం గనుక మనం వెంటనే సిద్ధపడి వుండాలనేది యేసు కోరిక.

యేసుప్రభువు సెలవిచ్చిన చివరి మాట 'మెలకువగా వుండండి'. మనం మెలకువగా వుండటం అభ్యాసం చేసు కోవాలి. మనం ఎలా జీవిస్తున్నామో, ఎంత నమ్మకంగా వున్నామో అనే విషయాలను ఆయన ఎప్పుడైనా వచ్చి పరీక్షించడానికి మనం సిద్ధపడి వుండాలి.

యేసుప్రభువు ఒకే రీతిలో రావాలని లేదు. ఆయన అంతిమ రాకడ కాకపోతే, మరో రూపంలో వస్తాడని ఆశించాలి. కొన్నిసార్లు యేసుప్రభువు చేసే పని లోకాంతం కాకపోవచ్చు. మన ప్రపంచం అంతం కావచ్చు. కొన్నిసార్లు మనల్ని తీసుకొనిపోవటానికి ఆయన రావచ్చు. కొన్నిసార్లు ఆయన వచ్చి మన జీవితాల్లో 'ఏం జరుగుతుందో' పరీక్షించాలని అనుకోవచ్చు. ఆయన చూచినదాన్ని బట్టి మనకు ప్రతిఫల మివ్వవచ్చు, శిక్షించనూ వచ్చు. కనుక మనం కనిపెట్టి వుండాలి.

తెలుసుకుందాం
1:16

## ప్రళయ దినం రాబోతుందా ?

నేటి ప్రపంచ సంభవాలను పరిశీలిస్తే, చరిత్ర ముగింపు ఎలా వుంటుందో అని ఆందోళన చెందక మానం. ఇప్పటి విషయాలే అలా వుంటే అంత్యకాలం ఎలా వుండబోతుందో అని ఆశ్చర్యపోతూ ఆందోళన చెందుతూ వుండవచ్చు. మారణాయుధాలను ఇబ్బడి ముబ్బడిగా తయారు చెయ్యటం, మత సంబంధమైన ప్రళయకాల ప్రవక్తలు చేసే హెచ్చరికలు, చిగురుటాకుల్లా వణికిపోతున్న ఆర్థిక వ్యవస్థలు, ఆయా దేశాల్లోని అల్లకల్లోల పరిస్థితులు మనసుల్ని కలవరపరుస్తుంటాయి.

మార్కు 13 అధ్యాయంలో (మత్తయి 24:1-51; లూకా 21:5-36 కూడా) యేసుప్రభువు చెప్పిన మాటలు ఈ విషయాల్నే చర్చిస్తున్నాయి. ఆ మాటలు ఆయన శిష్యులపై చెరగని ముద్రవేశాయి. అసలు ఈ చర్చకు మూలకారణం శిష్యులు నగరంలోని ఒక భవనం యొక్క గట్టితనాన్ని గూర్చి చేసిన వ్యాఖ్యతే (మార్కు 13:1). అలాంటి కట్టడాలు ఎంత తాత్కాలికమో యేసుప్రభువు జవాబులో స్పష్టం చేశాడు (13:3). ఆయన ఇంకా చాలా ముందుకు వెళ్ళి చరిత్ర ముగింపులో సంభవింపనైయున్న సంగతుల వివరాల్లోకి వెళ్ళి, విశ్వాసులు ఎదుర్కోనున్న గడ్డు పరిస్థితులను కూడా వెల్లడించాడు (13:4-37) ఆయన విషయాన్ని పక్కదోవ పట్టించకుండా, క్రింది అంశాలపై మాటలాడాడు.

- మోసము, యుద్ధాలు, కరువులు, భూకంపాలు వేదనలకు ప్రారంభ సంఘటనలుగా పేర్కొన్నాడు (13:5-8).
- తన అనుచరులు రాజులు, అధిపతులు, సభల యెదుట ఎలా పరీక్షల్ని ఎదుర్కొనేది సూచించాడు (13:9-11).
- కుటుంబ సభ్యులే ఒకరిమీద ఒకరు ఏవిధంగా తిరుగుబాటు చేసుకుంటారో చెప్పాడు (13:12,13).
- చివరకు దుఃఖము, మోసము, ఏవిధంగా రాజ్యమేలేది, అయితే దేవుడు ఆ కాలాన్ని కుదించే విషయం కూడా చెప్పాడు (13:14-25).
- ఆయన తన వారికోసం ఎట్టకేలకు రానైయున్నాడు (13:15-31).
- అయితే, ఆయన ఎప్పుడు వచ్చేదీ ఖచ్చితంగా ఎవరికీ తెలియదు. అందువలన ఆయన అనుచరులు దేవుని సేవలో నిమగ్నమై, కనిపెడుతూ వుండాలని హెచ్చరించాడు (13:32-27).

యేసుప్రభువు తన అనుచరుల నమ్మకమైన సేవను, నిశ్శబ్దతను ఆ పటిష్ఠ భవనంలో పోల్చాడు (13:2,9,13,33-37). మానవ నిర్మిత కట్టడాలు ఎప్పుడో ఒకసారి కూలిపోయి, శిథిలమవుతాయి. కాని, దేవుని నీతికార్యాలు శాశ్వతకాలం నిలుస్తాయి. అందువలన విశ్వాసులు తమ కొరకు స్మారక చిహ్నాలు, భవనాలు నిర్మించుకొనుట, ఈ సంప్రదాయాల విషవలయంలో చిక్కుబడిపోక, దేవుణ్ణి నమ్మకంగా సేవిస్తూ, స్థిరంగా వుండిపోవాలి.

**తెలుసుకుందాం 5:21-43**

## తొలిశిష్యుడు పేతురు

తనను వెంబడించమని యేసుప్రభువు పిలిచిన మొట్టమొదటి శిష్యుడు జాలరి పేతురు (మార్కు 1:16-18). ఎప్పుడూ శిష్యుల జాబితాలో అగ్రభాగాన పేర్కొనడం జరిగింది (3:14-16). ఆదిమ విశ్వాసులకు అతడు సహజసిద్ధ నాయకుడు. యేసుప్రభువు ప్రారంభించిన ఉద్యమాన్ని కొనసాగించడానికి దేవుడు ఎంపిక చేసుకొన్న సాధనం పేతురు. పేతురు "ప్రథమాలలో" కొన్ని :

- యేసును క్రీస్తుగా గుర్తించిన మొదటి అపొస్తలుడు (మత్తయి 16:13-17)
- నీళ్ళమీద నడిచిన మొట్టమొదటి సాధారణ వ్యక్తి (మత్తయి 14:28-30)
- పునరుత్థానుడైన ప్రభువును చూచిన మొట్టమొదటి అపొస్తలుడు (లూకా 24:34; 1కొరి 15:5)
- పరిశుద్ధాత్మ ఆగమనం తరువాత మొట్టమొదటి ప్రసంగం చేశాడు (అ.కా. 2:14-40)
- యూదులకు, యూదేతరులకు మధ్యనున్న అడ్డుగోడను కూలగొట్టిన మొట్టమొదటి అపొస్తలుడు (అ.కా. 10:1-18)

సువార్తను రాసిన మొట్టమొదటి అపొస్తలుడు. ఆదిమ సంఘ సాంప్రదాయం ప్రకారం పేతురు రోమ్‌లో చనిపోయాడని చెబుతారు. పేతురు పరిచారకుడు మార్కు తన సువార్త రాయటానికి కారణం పేతురు ప్రసంగం అని పాపియాస్ (క్రీ.శ. 125) అనే ఆది సంఘ పితరుడు అభిప్రాయపడ్డారు.

మార్కు సువార్తలో

# క్రీస్తు చిత్తరువులు

**ఈ శీర్షికన మత్తయి సువార్తలో యేసుక్రీస్తు చిత్తరువులు కొన్ని చూచాం. మార్కు సువార్తలో అలాంటివి మూడు మాత్రమే వున్నాయి. వాటిని పరిశీలన చేద్దాం.**

## పరిశుద్ధుడు

"నీవెవడవో నీకు తెలియును. నీవు దేవుని పరిశుద్ధుడవు" (మార్కు 1:24)

యేసుప్రభువు "పరిశుద్ధుడు" లేదా "ప్రతిష్ఠితుడిగా ప్రసిద్ధి చెందాడు.

పేతురు పెంతకోస్తు ప్రసంగంలో యేసుక్రీస్తును పరిశుద్ధుడిగా (అ.కా. 2:27) అభివర్ణించాడు. పౌలు కూడా తన బోధలో అదే పని చేశాడు (అ.కా. 13:35). యేసుప్రభువు తనను స్వయంగా "పరిశుద్ధుడిగా" వెల్లడించుకొన్నాడు (ప్రకటన 3:7). ఆయన పాపరహితుడిగా జన్మించాడు. పరిపూర్ణమైన పవిత్ర జీవితం జీవించాడు. ఆయన దైవిక లక్షణాలలో పరిశుద్ధత ఒకటి.

షేక్స్పియర్ జన్మస్థలం స్ట్రాట్‌ఫర్డ్‌లో ఆయన జన్మించి నాలుగు వందల సంవత్సరాలైన సందర్భంగా ఒక శిలాఫలకం రాయించారు "1514–1914 – అలాంటి వ్యక్తిని మనమిక ఎన్నడూ చూడం". సాహితీపరంగా చూస్తే అది ముమ్మాటికీ నిజం. షేక్స్పియర్ ఆయనకు ఆయనే సాటి. ఆధ్యాత్మిక జగత్తులో పరిశీలిస్తే మన ప్రియ ప్రభువుకు సాటియైనవారు మరొకరు లేనేలేరు. ఆయన పవిత్రత అసమానమైనది, ఊహకు అందనిది. ఆయన మనుషుల కంటే దేవదూతల కంటే సెరాపుల కంటే, ప్రధాన దేవతలందరికంటే మించిన వాడు. ఈ సత్యం టెన్నిసన్ పద్యంలో తేటగా చూస్తాం.

బలవంతుడా దేవుని కుమారుడా, నీ అపార ప్రేమ నీ ముఖము మేమెన్నడూ చూడలేదు. విశ్వాసంతో, కేవలం విశ్వాసంతోనే వీక్షించగలం, నిరూపించలేని చోట విశ్వాస ముంచాం, నీవు మానవుడివి, దైవంగా కనిపించావు, మహోన్నత మైన పవిత్ర మానవ మూర్తిని నీవు, మా చిత్తాలన్నీ నీ పాదాక్రాంతం చేస్తున్నాం.

పరిశుద్ధుడవైన క్రీస్తూ, నీ దైవ స్వభావంలో నన్ను పాలివాడిగా చెయ్యి.

## సహోదరుడు

ఇతడు మరియ కుమారుడు కాడా? ఇతడు యాకోబు, యోసేపు, యూదా, సీమోను అనువారి సహోదరుడగు వడ్లవాడు కాడా? ఇతని సోదరీమణులందరు మనతో వున్నారు కారా? (మార్కు 6:3).

యేసును సోదరుడిగా ఎరిగిన పిల్లలు కనీసం ఆరుగురు నజరేతులోని ఆ పేద కుటుంబంలో వున్నారు. యేసు ఆ కుటుంబంలో పెద్దన్న పాత్ర వహించి వుంటాడనటంలో ఎలాంటి సందేహం లేదు. యాకోబు, యోసేపు, యూదా, సీమోను మిగిలిన సోదరీలకు యేసు పెద్దన్నగా తప్పక సాయం చేసి వుంటాడు. రద్దీగా వుండే వీధుల్లో గుండా వారిని జాగ్రత్తగా నడిపించుకుంటూ, వేగంగా పరుగులు తీసే రథాల క్రింద పడకుండా కాపాడే బాధ్యత ఆయనదే. తల్లికి ఇంటి పనుల్లో చేదోడు వాదోడుగ వుండేవాడు. బావి నుండి నీళ్ళు తీసుకు రావటం, ఇరుగు పొరుగులకు కబుర్లు చెప్పటం మొదలైన పనులు చేస్తుండేవాడు.

యోసేపు మరణించినప్పుడు కుటుంబ జ్యేష్ఠుడిగా తల్లి మెడచుట్టూ చేతులు వేసి ఊరడించిన క్షణాలు వుండే వుంటాయి. తండ్రి ప్రక్కన వుండి నేర్చుకున్న కుటుంబ వృత్తి ద్వారా ఇప్పుడు కుటుంబ జ్యేష్ఠుడిగా కుటుంబ పోషణ చేపట్టాడు. యేసు ప్రేమగల, నమ్మకమైన సోదరుడు.

సువార్తలలో ఒక సంఘటన ఈ బిరుదుకు లోతైన ఆధ్యాత్మిక భావం చేకూరుస్తుంది. ''ఆయన జన సమూహములతో ఇంకను మాటలాడుచుండగా ఇదిగో ఆయన తల్లియు సహోదరులను ఆయనతో మాటలాడ గోరుచు వెలుపల నిలిచియుండిరి... అప్పుడాయన శిష్యుల వైపు చూడగా ఈ మాటలు అన్నాడు". ఇదిగో నా తల్లియు, నా సహోదరులును; పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు, నా తల్లియు అనెను" (మత్తయి 12:46–50). ప్రతి విశ్వాసికీ యేసు పెద్దన్న.

పెను మంచు తుఫానులో చిక్కుకొన్న ఒక లారీ డ్రైవర్ విషయం వార్తా పత్రికలో వార్త వచ్చింది. ఆ రాత్రి ప్రయాణం చెయ్యొద్దు అని అతడి భార్య బ్రతిమాలింది. ఎందుకంటే పెను తుఫాను రాబోతుందని వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. అయితే అతడు తప్పక చేరవలసిన సరుకులు వున్నందున వెళ్ళిపోయాడు. దారిలో అతడిమీద తుఫాను తీవ్రంగా కొట్టింది. లారీ నడపటం అసాధ్యమైంది. అతడు ఆ పెద్ద లారీని రోడ్డు ప్రక్కన ఆపి, నిద్రపోయాడు. అతడు నిద్రలేచినప్పుడు ఎక్కడ చూచినా చిమ్మ చీకటి. అతడు ముప్పై అడుగుల ఎత్తున పేరుకుపోయిన మంచుక్రింద కూరుకుపోయాడు. అతడు లారీ రహదారి మీద కొంచెం కూడా కనిపించటం లేదు. అతడు తలుపులు తెరవటానికి వీలులేకపోయింది. అతడు చిక్కుబడిపోయాడు. అయిదు రోజులు రాత్రింబవళ్లు మంచు సమాధిలో వుండిపోయాడు. అయితే అతడేమీ కంగారుపడలేదు. అతడు నింపాదిగా, రక్షించే వారి కోసం కనిపెడుతూ కూర్చున్నాడు. చివరకు అతణ్ణి రక్షించారు. "నీ వేం భయపడలేదా" అని అడిగితే "లేదు, ఎందుకంటే నా సోదరుడు నా కోసం వెదుకుతూ వుంటాడని నాకు తెలుసు. నేను కనపడ్డదాకా అతడు నిద్రపోడని నాకు తెలుసు. నా మనసు నిండా మా అన్న నా కోసం పట్టువదలకుండా వెదుకుతూ వున్న చిత్రమే మెదులుతూ వున్నది". ఈ సంఘటన సామెతలు 17:17లోని మాటలకు బలమైన దృష్టాంతం. "నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును. దుర్దశలో అట్టివాడు సహోదరుడుగా వుండును". రక్త సంబంధం ద్వారా గాని, ఆధ్యాత్మిక సంబంధం ద్వారా గాని అలాంటి సోదరుడున్న వ్యక్తి నిజంగా ధన్యుడు. యేసుప్రభువు స్నేహం జీవితంలో గొప్ప ఆధిక్యత, మహా ఆశీర్వాదం.

యేసుప్రభువుకు వున్న అనేక బిరుదులు మనం పాడుకునే పాటల్లో చోటు చేసుకున్నాయి. ఈ బిరుదు మినహాయింపేమీ కాదు. "ఆనందంతో నిన్ను ఆరాధించెదము" అనే హెన్రీ వేన్ డైక్ పాటకు బీతోవెన్ సంగీతం సమకూర్చాడు. అందులో ప్రభువు ఈ బిరుదు వున్నది.

*"క్షమించువాడవు, ఇచ్చువాడవు నీవే, సదా ఆశీర్వదించు వాడవు, స్తుతులకు యోగ్యుడవు*

*జీవించువారి ఆనంద ఊటవు, సముద్రమంత లోతైన ప్రేమ*

*క్రీస్తూ నీవే మా తండ్రివి. మా సోదరుడివి. ప్రేమతో జీవించే వారంతా నీ వారే*

*పరస్పర ప్రేమ మాకు నేర్పించు.*

*యేసుప్రభూ, మా సోదరుడిగా మాతో నీకున్న ప్రత్యేక బాంధవ్యాన్ని బట్టి నీకు కృతజ్ఞతలు.*

## వడ్రంగి

"ఇతడు వడ్రంగి కాడా ?" (మార్కు 6:3)

క్రొత్త నిబంధనలో 'వడ్రంగి' అనే పదానికి గ్రీకులో 'టెక్టాన్' అని వున్నది. దీనికి కమ్మరి, శిల్పి, నిర్మాత అని అర్థాలున్నాయి.

యేసుప్రభువు సృష్టి శిల్పి అని బైబిలు చెబుతుంది. "కలిగి వున్నదేదియు ఆయన లేకుండా కలుగలేదు (యోహాను 1:3). ఈ లోకంలో సుత్తెను పట్టి పని చేసిన చేతులే అనంత ఆకాశంలోని నక్షత్ర సముదాయాల్ని, సృష్టి విచిత్రాలన్నిటినీ మలిచాయి. నజరేతులోని వడ్రంగి శాలలో కర్రలను చిత్రిక పట్టి నునుపు చేసిన ఆ చేతులే నక్షత్రాలను, గ్రహాలను వాటి పరిపూర్ణ రూపంలో, ఖచ్చితత్వంతో రూపించాయి.

పరలోక వడ్రంగి నరావతారమనే అద్భుతం ద్వారా నజరేతు వడ్రంగి అయ్యాడు. మన అంశంలోని ప్రశ్న ఒక సబ్బాతు రోజున ఆయనంటే పట్టని నజరేతు వాసులు అడిగింది. లేఖనాలలో ఆయన బాల్యాన్ని తెలియజేసే గవాక్షం మనకు అదొక్కటే. ఈ కొద్ది పదాలు ఆయన మౌన సంవత్సరాలను గూర్చి ఎంతో తెలియచేస్తున్నాయి. ఆయన దైనందిన జీవిత విశేషాలను ఆవిష్కరిస్తుంది.

మిగతా సువార్తలలో యోసేపు ప్రస్తావన లేకపోయి నందున ఆయన చనిపోయి వుంటాడని భావించాలి. అందు వలన తన తండ్రి వడ్రంగి శాలలో నేర్చుకొన్న వృత్తినే జ్యేష్ఠుడిగా తన కుటుంబ పోషణకు చేపట్టాడు. తన సోదరీ, సోదరులు పెద్దవాళ్లయ్యాక ఆయన తన అసలు పని చేపట్టాడు. తన బట్టల మీద పడ్డ కట్టెల దుమ్ము దులిపేసుకొని, ప్రజల హృదయాల్లో దేవుని రాజ్యం నిర్మించడానికి ఆయన బయలు దేరాడు.

వడ్రంగిగా యేసుక్రీస్తు చిత్తరువు మానవ జీవితంతో ఆయనను సమైక్యపరుస్తుంది. ఇప్పుడు చేతిలో రాజదండము పట్టుకొన్న ఆయనే ఒకప్పుడు చేతిలో ఉలి, బాడిసెలు పట్టుకున్నాడని తెలుసుకోవటం ఎంత ఊరట కలిగిస్తుంది! యేసుక్రీస్తు మానవతను గూర్చిన చక్కటి చిత్రపటం ఇది. తరచు ఆయన చేతులు చిత్రికపడుతూ వుండగా గాయాలయ్యేవి. ప్రతిరోజూ ఆయన పనిచేస్తూ వుండగా, కలప తనకు లొంగేలా చేసుకోవటం మూలాన ఆయన

చేతులు ఒక కార్మికుడి చేతుల్లాగా మొద్దుబారి వుంటాయి. చేపలు పట్టేవాళ్ళు, గాళ్ళు కొట్టేవారు వ్యవసాయదారులు ఆయన చేతులను చూచి సగౌరవంగా ఆయన్ను వెంబడించ గలరు. చెమటోడ్చడమంటే ఏమిటో ఆయనకు తెలుసు. మన కష్టాలు, అలసట, బరువు బాధ్యతలు ఆయన బాగా ఎరుగును.

వడ్రంగిగా యేసుప్రభువు మానవ శ్రమకు శాశ్వత గౌరవం చేకూర్చాడు. మనమంతా సమిష్టి శ్రామిక కుటుంబ సభ్యులం. మనం సమాజం నుండి ఎన్నో మేలులు అనుభవిస్తూ వుంటాం గనుక, మనం కూడా సమాజ శ్రేయస్సుకు చేయూతనివ్వాలి. యేసుప్రభువు తన జీవితంలో అధికభాగం వడ్రంగిగా పనిచేసినందున మన శ్రమకు విలువ కలిగింది. ఆయన పని వలన ఎద్దులు నునుపైన కాడిని మోయ గలిగాయి. పిల్లలు చేతులతో చేసిన బొమ్మలతో ఆనందంగా ఆడుకోగలిగారు. వడ్రంగి నిర్మించిన ఇండ్లలో కుటుంబాలు సౌఖ్యంగా నివసించగలిగారు.

ఒకనాడు నజరేతులో కలపను నునుపు చేసిన ఆయన చేతులు, నేడు కూడా ఆయనకు అర్పించుకున్న జీవితాలను దేవుని నిత్య రాజ్యానికి ప్రయోజనకరమైన పనిముట్లుగా మార్చగలవు.

ఆలోచించండి 15:6-15

## "ఇతడు కాదు బరబ్బ"

విచిత్ర పరిస్థితులను బట్టి తప్ప బరబ్బ పేరు చరిత్రలో అనామకంగానే మిగిలిపోయి వుండేది. అందరిలాగే అతడొక షికారీ (ఈటె మనిషి). రోమన్‌లను, పాలస్తీనా నుండి తరిమెయ్యాలనే తలంపుతో రోమన్ అధికారిని చంపిన వ్యక్తి. అప్పుడప్పుడు పరిస్థితులు అనుకూలిస్తే పెద్ద సమస్యలే సృష్టించేవాడు. ఉదాహరణకు క్రీ.పూ. 6లో గలిలయకు చెందిన యూదా అనేవాడు పన్నుకు వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశాడు. అయితే, రోమన్‌లు వెంటనే రంగంలోకి దిగి, అతణ్ణి ఉరితీసి చంపి, అతడి అనుచరులందరినీ చెదరగొట్టాడు.

అదే రీతిలో అధికారులు బరబ్బను హత్య, తిరుగుబాటు నేరాలపై నిర్బంధించారు (మార్కు 15:7; లూకా 23:19). మున్ముందు వారు అనుభవించబోయే శిక్ష ఏమిటో ఖైదీలకు బాగా తెలుసు - రాజకీయ నేరస్తుల కోసమే రోమన్‌లు నియోగించే భయంకరమైన సిలువ శిక్ష తిరుగుబాటుదారులను ఎత్తైన కొయ్య సిలువకు బహిరంగంగా మేకులతో దిగగొట్టి చంపటం అనేది రాజకీయ తిరుగుబాటుదారులకు ఒక గొప్ప హెచ్చరిక కూడా.

అయితే, బరబ్బ ఆ విధంగా చనిపోవటం లేదు. యేసును నిర్బంధించటం ప్రధాన యాజకుడు కయప (మత్తయి 26:3-5 వద్ద వ్యాసం చూడండి); హేరోదు, పిలాతు (లూకా 23:6-12). మొదలగు వారి రాజకీయ కుతంత్రాలు; పస్కా పండుగ సందర్భంగా ఒక ఖైదీని విడుదల చేసే సాంప్రదాయం (మార్కు 15:6). ఇవన్నీ కలిసి బరబ్బ విడుదలకు మార్గం సుగమం చేశాయి.

గుంపులు వేసిన కేకలు చివరకు అతడికి స్వేచ్ఛను ప్రసాదించాయి (యోహాను 18:40). బరబ్బను విడుదల చెయ్యమని ప్రజలు కోరినప్పుడు పిలాతు నమ్మలేకపోయాడు. వారు పదే పదే యేసును సిలువ వేయమని కేకలు వేస్తుంటే "మీ రాజును సిలువ వేయమంటారా?"(19:15) అని పిలాతు ప్రశ్నించాడు. ఆ సమయంలో ప్రధాన యాజకుడు "మాకు కైసరు తప్ప మరొక రాజు లేదు" అంటూ ఖరాఖండిగా చెప్పారు. దానితో గవర్నరు బరబ్బను విడుదల చేశాడు. ఎంత విచిత్రం. రోమా ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన వ్యక్తిని "కైసరు తప్ప మరొక రాజు లేదు" అనే మాటలకు తలొగ్గి విడిచిపెట్టడం వింతగా లేదూ.

తెలుసుకుందాం 1:21

# సమాజ మందిరం


**యేసుప్రభువు కాలంలో సమాజమందిరాలు ఎక్కడపడితే అక్కడ కనిపించేవి (మార్కు 1:21). సమాజ మందిరం అనే పదం గ్రీకు భాషలోని "సునగోగు" నుండి వచ్చింది. ఈ పదానికి సభ లేదా సమావేశం అని అర్థం. యూదులు లేఖన పఠన, భాష్యం చెప్పటం, ప్రార్థన మొదలైన వాటికి కేంద్రంగా సమాజ మందిరాలను ఉపయోగించేవారు. వాస్తవంగా అక్కడ బోధించడం కంటే మోషే ధర్మశాస్త్రం నుండి ఉపదేశించడమే ఎక్కువగా జరుగుతుంది.**

బబులోను చెరకాలంలో సమాజ మందిరాలు ప్రారంభ మయ్యాయి. (యెహెజ్కేలు 14:1లో వివరంగా నేర్చు కుంటాం.) దేవునితో సహవాసం కోసం పరితపిస్తున్న చెరలోని యూదులకు దేవాలయం లేనందున స్థానికంగా ధర్మశాస్త్ర పఠనకు, ఆరాధన కొరకు చిన్న చిన్న గుంపులుగా సమావేశమయ్యేవారు. చెరలోనున్న కొందరు యూదులు తరువాత కాలంలో స్వ దేశానికి తిరిగి వచ్చారు. అక్కడ జెరుబ్బాబెలు దేవాలయాన్ని పునర్ని ర్మించాడు. ఎజ్రా అనే శాస్త్రి ధర్మశాస్త్ర పఠనాన్ని, ప్రార్థనను ప్రోత్సహించాడు (నెహెమ్యా 8 అధ్యా.). అయితే, యూదులలో అధిక సంఖ్యాకులు పర్షియాలోనే వుండి పోయారు, కొందరు ఇతర స్థలాల్లో ముఖ్యంగా ఈజిప్ట్‌లోని అలెగ్జాండ్రియా కు వలసపోయారు. పాలస్తీనా వెలుపల, పాలస్తీనాలో కూడా యూదుల సమాజ మందిరాల్లో సమావేశమయ్యే వారు ఇవి సామాజిక జీవిత కేంద్రాలుగా మారాయి.

కొన్ని సమాజ మందిరాలు న్యాయస్థానాలుగా కూడా వ్యవహరించేవి. దోషులను శిక్షించడం, కొరడా దెబ్బల శిక్ష విధించడం కూడా చేసేవి (మత్తయి 10:17; 23:34). అదే సమయంలో అవి చిన్న పిల్లలకు విద్యగరిపే బాలశిక్షక కేంద్రాలుగా కూడా పనిచేసేవి. యూదుల సమాజిక జీవితమంతా సమాజ మందిరాల చుట్టూ పెనవేసుకుపోయేది.

యేసుప్రభువు కాలం నాటికి సమాజ మందిరాలు బాగా సుస్థిరమయ్యాయి. వాటికి సాంప్రదాయక కార్య నిర్వాహకులు కూడా వుండేవారు. వారిలో ముఖ్యులు పెద్దలు: భక్తిగల, గౌరవనీయ వ్యక్తులు సమాజ మందిరపు విధి విధానాలను నియంత్రించేవారు. సాంప్రదాయం ప్రకారం సమాజ మందిరపు ప్రధానాధికారి ప్రారంభంలో వుండే అగ్రపీఠం మీద కూర్చుండేవాడు (మత్తయి 23:6 చూడండి).

**అధికారి :** ఈ వ్యక్తిని పెద్దలు నియమిస్తారు. అతడు భవన నిర్వహణ, కార్యక్రమాలు సజావుగా జరగటం చూసుకునే వాడు. కొన్నిసార్లు ఒకరికంటే ఎక్కువమంది అధికారులు వుండేవారు. ఒక పర్యాయం యాయీరు అనే అధికారి తన కూతురు స్వస్థత విషయం యేసుప్రభువు దగ్గరకు వచ్చాడు (మార్కు 5:21-43).



**పరిచారకుడు (ఖజ్జాన్) :** మందసంలో వుండే పవిత్రమైన గ్రంథపు చుట్టల నిర్వహణ బాధ్యత ఈ వ్యక్తిదే. అంతే కాకుండా దీపాలను వెలిగించడం, మందిరాన్ని శుభ్రంగా వుంచడం కూడా చేసేవాడు. ఎవరైనా వ్యక్తి నేరం చేసినట్లు ఋజువై, పెద్దల సభ కొరడా దెబ్బల శిక్ష విధిస్తే, దానిని అమలు చేసేది ఈ అధికారే. వారమంతా పిల్లలకు చదవటం నేర్పిస్తూ వుంటాడు.

**సమాజ మందిరపు ప్రతినిధి :** ఇది తాత్కాలిక పదవి మాత్రమే. ప్రతి కార్యక్రమానికీ ముందు లేఖన పాఠం చదవటం, ప్రార్థనలో ప్రజలను నడిపించడం, ఉపదేశించడం లేదా వ్యాఖ్యానించడం కోసం సమర్థుడైన వ్యక్తిని సమాజ మందిరపు అధికారి నియమిస్తాడు. నజరేతులోని సమాజ మందిరంలో ఈ పనికి యేసుప్రభువును ఎంపిక చేశారు (లూకా 4:16-20).

**దుబాసి :** లేఖనాలు హీబ్రూ భాషలో రాసి వున్నాయి. యేసు ప్రభువు కాలం నాటికి పాలస్తీనాలోని యూదులలో అధిక శాతం అరామీ అనే హీబ్రూకు సంబంధించిన మాండలికం మాటలాడేవారు. అయితే హీబ్రూ అర్థం కానందున అనువాదకుణ్ణి పిలిపించుకునేవారు.

**దానధర్మాలు చేసేవారు :** ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు పేదలకు దానం చేసే డబ్బును లేదా వస్తువులను స్వీకరించే వారు. సమాజ మందిరం ఏర్పడాలంటే కనీసం పదిమంది యూదు పురుషులు వుండాలి. రోమన్ సామ్రాజ్యమంతటా అనేక పట్టణాల్లో పౌలు అనేక సమాజ మందిరాలను చూసాడు. వాటిలో కొన్ని; దమస్కు (అ.కా. 9:2); సలామీ(13:5); పిసిదియలోని అంతియొకయ (13:14); 1థెస్స (17:1); బెరయ (17:10); ఏథెన్సు (17:16,17); ఎఫెసు (19:1,8). పౌలు ఏ పట్టణంలోనైనా సువార్త ప్రకటించడానికి వెళ్ళినప్పుడు తప్పక మొదట సమాజ మందిరంలో బోధించి ఆ తరువాత ప్రజా బాహుళ్యం దగ్గరకు వెళ్లేవాడు.

సమాజ మందిరపు ఆరాధన విధానం క్రైస్తవ ఆరాధనా విధానాన్ని అధికభాగం ప్రభావితం చేసిందనటంలో ఆశ్చర్య మేమీ లేదు; యూదుల ఆరాధన లేఖన పఠనంతో (షెమ) ప్రారంభమయ్యేది. 'షెమ' అనగా వినుట. ద్వి.కా. 6:4 భాగం "షెమ"తో ప్రారంభమవుతుంది. "ఇశ్రాయేలూ, వినుము మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా". ప్రజలు యెరూషలేము వైపు చేతులు చాచివుండగా నాటి ఉపదేశకుడు సమాజాన్ని ప్రార్థనతో నడిపిస్తాడు. ప్రార్థన ముగింపులో ప్రజలు "ఆమెన్" అని పలుకుతారు.

ఆ రోజుకు ఎంపిక చేసిన వక్త ధర్మశాస్త్ర భాగాన్ని చదివితే అనువాదకుడు దానిని అరామీ భాషలోకి అనువదిస్తాడు. ఆ తరువాత ప్రవక్తల గ్రంథాల నుండి ఒక భాగం చదివితే, దానిని కూడా అరామీ భాషలోకి సాధారణంగా కూర్చుని అనువదిస్తారు. ప్రసంగించడం లేదా భాష్యం చెప్పడం చేసేవారు. ప్రసంగం తరువాత అక్కడ యాజకుడు ఎవరైనా వున్నట్లయితే ఆశీర్వచనం పలుకుతాడు. ప్రజలు "ఆమెన్" చెబుతారు. ప్రారంభంలో క్రైస్తవులు అధికశాతం యూదులే గనుక వారి కూడికలలో సమాజ మందిర ఆరాధన క్రమాన్నే అనుసరిచారు.

## మీ సాక్ష్యం చెవిటోడి చెవిలో శంఖం ఊదినట్లుందా ?

**మీతో పనిచేసేవారు, మీ పొరుగువారు యేసుక్రీస్తు విషయం బొత్తిగా గిట్టనట్టు ఉంటున్నారా? కొందరు బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారా? వారు నీ మీద విషం వెళ్ళగక్కుతున్నారా?**

మనం సాక్ష్యులుగా వుండాలని యేసుప్రభువు పిలిచాడు (అ.కా. 1:6-8) దానర్థం ఇతరులను మార్చుమని కాదు. మార్పు లేదా పరివర్తన అనేది పరిశుద్ధాత్మ పని (యోహాను 16:8-11). అంటే సాక్ష్యమిచ్చినప్పుడు మన సందేశానికి ఎంతమంది స్పందించారనే దాన్నిబట్టి బేరీజు వేయకూడదు. అలా అనుకుంటే, యేసుప్రభువు చాలాసార్లు విఫలమైనట్టే లెక్క, ఆయన సందేశం విన్నవారు. ఆయన్ను వెంబడించానవారు సైతం కొన్నిసార్లు బొత్తిగా అయిష్టత వ్యక్తం చేశారు (యోహాను 6:60-66).

యేసుప్రభువు చెప్పిన నాలుగు రకాల నేలల కథ చెబుతున్న రీతిలో మనుషులు ఆధ్యాత్మిక విషయానికొస్తే వివిధ రకాలుగా వున్నారు (మార్కు 4:3-20). రైతులు ఒక పని చేయలేరు. అదేమంటే నేలను మార్చటం. అయితే, మంచి విత్తనాలు, మంచి ఎరువులు వేసి పొలానికి కావలసిన అన్ని సదుపాయాలు మాత్రం ఏర్పాటు చెయ్యొచ్చు. లోపల విశ్వాసం వుంటే అది మొలకెత్తుతుంది (1కొరి 3:7-9). ఆ పని చెయటంలో ఒక మార్గమేమంటే మన దైనందిన జీవితంలో విశ్వాసానికి పనిపెట్టాలి (ఫిలిప్పీ 2:12,13; యాకోబు 2:14-26). అదే సమయంలో దానిని మనవద్దే దాచుకోక, ఇతరులు కూడా ఆలోచించునట్లు దానిని అందుబాటులో వుంచాలి (మార్కు 4:21-23). ఇతరులు ఎలా ప్రతిస్పందిస్తారు అనేది దేవునికి, వారికి మధ్య విషయం. అలాగని, ఇతరుల స్పందనతో మనకేమీ సంబంధలేనట్టు అంటీమట్టనట్టుగా వుండమని కూడా కాదు. దేవుడు మనల్ని ప్రేమించాడని లేఖనం చెబుతుంది. ప్రజల్ని మార్చగలిగేది మనం కాదు - పరిశుద్ధాత్మ, ఇతరులు ఎలా స్పందించారు అనేదాన్ని ఆధారం చేసికొని మన విశ్వాసాన్ని అంచనా వేసుకోవటం తగదు. అలా చేస్తే మనద్వారా విశ్వాసులైన వారు సరైన పునాది లేనివారుగ వుంటారు. డి.యల్.మూడీ అనే పేరున్న సువార్తికుడి జీవితంలోని ఒక సంఘటన చెబుతారు. మూడీగారు ఒకరోజు దారినపోతూ వుంటే మురికి కాలువలో ఒకడు తప్పతాగి పడివున్నాడు. ఎవడో ఆ గుంపులో మూడీని ఎగతాళి చేస్తూ, "మూడీగారూ, ఇతడు మీరు మార్చినవాడే నండీ" అన్నాడట. వెంటనే మూడీ నిట్టూర్చి "నేను మార్చబట్టే వాడిక్కడ పడి వున్నారు. దేవుడు మార్చివుంటే ఇలా జరిగేది కాదు" అన్నారట.

# హేరోదు అంతిప

తమ పాపాలు వేలెత్తి చూపటం, అదీ అందరి ఎదుట ఎవరికిష్టం వుంటుంది ? చేసిన తప్పు విషయంలో అపరాధ భావన కంటే మనం చేసిన తప్పును బహిర్గతం చేసినందున కలిగే అవమానమే బలమైనది. అపరాధ భావన, అవమాన భారము రెండూ అనుభవిస్తున్న వ్యక్తి హేరోదు అంతిప.

హేరోదు క్రూరమైన రాజ్యకాంక్ష, తన సోదరుడి భార్య హేరోదియను అక్రమంగా పెళ్లాడటం అందరికీ తెలిసిందే. ఒక వ్యక్తి హేరోదు పాపాన్ని బట్టబయలు చేశాడు. అతడు అరణ్యములో బోధిస్తూవుంటే, వేలాదిమంది అతడి సందేశం వినటానికి వెళ్ళారు. హేరోదు వ్యభిచార వివాహాన్ని యోహాను బహిరంగంగా ఎండగట్టడం అందరికీ తెలిసిన విషయమే. యోహాను నోరు మూయించాలని హేరోదియ కంకణం కట్టుకొన్నది. పరిష్కార మార్గంగా హేరోదు యోహానును కటకటాల వెనక్కు నెట్టించాడు.

హేరోదుకు యోహానంటే ఇష్టం. బహుశా తనతో సత్యమే చెప్పిన బహు కొద్దిమందిలో యోహాను ఒకడు కావచ్చు. అయితే తన పాపం విషయం అతడు వేలెత్తి చూపటం మాత్రం అతడికి మింగుడు పడలేదు. పైపెచ్చు ప్రజలకు వారి నాయకుల పాపాల్ని పదేపదే గుర్తు చెయ్యటం అతడికి బొత్తిగా నచ్చలేదు. అయితే, యోహానును చంపడానికి అతడు జంకాడు. ఆ ఆలోచన విరమించుకున్నాడు. కాని, తరువాత హేరోదియ అతడిపై వత్తిడి తెచ్చి, యోహానును చంపించింది. దీని ద్వారా హేరోదులో అపరాధ భావన పెరిగింది గాని తరగలేదు.

యేసును గూర్చి వినగానే, హేరోదుకు యోహాను గుర్తొచ్చాడు. యేసు విషయం ఏం చెయ్యాలో అతడికి పాలుపోలేదు. యోహాను విషయంలో పునరావృతం కావటం అతడికి ఇష్టంలేదు. అందువలన యేసు యెరూషలేముకు చివరిసారిగా వెళ్ళేముందు ఆయన్ను బెదిరించి వదిలేయాలను కున్నాడు. యేసు విచారణ సమయంలో వారిరువురూ కొద్దిసేపు తటస్థపడ్డారు కాని, యేసు హేరోదుతో మాటలా డటానికి విముఖత చూపాడు. యోహాను మాటలు హేరోదు చెప్పిన మాటలకంటే యేసు చెప్పేది కూడా ఎక్కువేమీ లేదు. హేరోదు ద్వేషము, దూషణ మాటలు వెళ్లగక్కాడు. మెస్సీయా వార్తహరుణ్ణే తిరస్కరించిన హేరోదుకు మెస్సీయాను తిరస్కరించటం ఒక లెక్కా?

ప్రతి మనిషినీ దేవుడు తనను తాను సాధ్యమైనంత మంచి విధానంలో వెల్లడి చేసుకుంటాడు. మన దృష్టి తనవైపు మరల్చటం కోసం ఆయన తన వాక్కును, భిన్న పరిస్థితులను మన మేధస్సును, ఇతరులను వినియోగించుకుంటాడు. ఆయన మనల్ని విడువక వెంటాడుతాడే గాని బలవంతం చెయ్యడు. హేరోదులాగా దేవుని సందేశాన్ని తిరస్కరించటం గొప్ప విషాదం. నీ జీవితంలోకి ప్రవేశించాలని దేవుడు చేస్తున్న ప్రయత్నాలు నీవెరుగుదువా? ఆయన్ను నీ జీవితంలోకి ఆహ్వానించావా?

**బలము**

- తిబెరయ నగరాన్ని నిర్మించాడు, ఇతర నిర్మాణాలను కూడా పర్యవేక్షించాడు.
- రోమీయుల పక్షంగా యూదయ ప్రాంతాన్ని పాలించాడు.

**బలహీనతలు, పొరబాట్లు**

- అధికారం కోసం తహతహ చెందాడు.
- వత్తిడికి తలొగ్గి తీర్మానాలు వాయిదా వేశాడు లేదా తప్పుడు తీర్మానాలు చేశాడు.
- తన సవతి సోదరుడు ఫిలిప్పు భార్యను పెళ్లాడటం కోసం తన భార్యకు విడాకులు ఇచ్చాడు.
- బాప్తిస్మమిచ్చే యోహానును ఖైదు పాలు చేసి, ఆ తరువాత శిరచ్ఛేదానికి ఆజ్ఞాపించాడు.
- యేసును సిలువ వేసిన విషయంలో అతడి పాత్ర తక్కువ.

**అతడి జీవితం నేర్పే పాఠాలు**

- దురాశపూరిత జీవితం సాధారణంగా స్వీయ నాశనంతో అంతమవుతుంది.
- మంచి చేసే అవకాశాలు సాధారణంగా మనం చేసే తీర్మానాల రూపంలో వస్తాయి.

**ముఖ్య వివరాలు**

- స్థలం : యెరూషలేము
- వృత్తి : గలిలయ, పెరయ ప్రాంతాలలో రోమన్ గవర్నరు.
- బంధువులు : తండ్రి: మహా హేరోదు, తల్లి: మల్తాసే; మొదటి భార్య: నాలుగో అరెత రాజు కుమార్తె; రెండవ భార్య: హేరోదియ
- సమకాలికులు : బాప్తిస్మమిచ్చే యోహాను, యేసు, పిలాతు
- మూలవాక్యం : "యోహాను మాటలు వినినప్పుడు ఏమి చేయను తోచక పోయినను సంతోషముతో వినుచుండెను" (మార్కు 6:29).

హేరోదు అంతిపను గూర్చి సువార్తలలోను, అ.కా. 4:27; 13:1లో కూడా ప్రస్తావించటం జరిగింది.

## పునరుత్థాన సాక్ష్యాలు - యేసుక్రీస్తు ప్రత్యక్షతలు

చనిపోయిన వ్యక్తులు సాధారణంగా తిరిగి లేవరు. మరణమనేది అనివార్యం, ఏ మనిషీ దానిని తప్పించుకోలేడనేది చారిత్రక సత్యం. మనిషి పుడతాడు, గిడతాడు. అయితే యేసుప్రభువు దానికి మినహాయింపు ఆయన ఆ కాలచక్రాన్ని ఛేదించాడు. ఆయన సమాధి నుండి లేచుట ద్వారా మరణాన్ని జయించాడు (మార్కు 16:1-8). ఆయన అనుచరులలో అనేకులకు కనిపించి, ఆయన దానిని నిరూపించాడు కనుక, యేసు మరణ బంధకాలను ఛేదించాడు గనుక, క్రైస్తవులంగా మరణం తరువాత జీవితం వుందని మనం నిరీక్షణ కలిగి వుండవచ్చు (1కొరింథీ 15:12-24; 35-38).

**సమాధి వద్ద :** ఆదివారం పొద్దుటే మగ్దలేనే మరియకు, యాకోబు తల్లి మరియకు, సలోమికి యేసుప్రభువు ప్రత్యక్షమయ్యాడు (మత్తయి 28:1-10; మార్కు 16:1-11; లూకా 24:1-12; యోహాను 20:1-18).

యెరూషలేములో ఆదివారం ప్రభువు పేతురుకు కనిపించాడు (లూకా 24:34; 1కొరి. 15:5).

ఎమ్మాయి మార్గంలో ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు బాటసారులకు యేసు కనిపించాడు (లూకా 24:13-32)

మేడగదిలో ఆదివారం సాయంకాలం యేసు పదిమంది శిష్యులకు కనిపించాడు (మార్కు 16:14; లూకా 24:36-43; యోహాను 20:19-25. మరల వారం తరువాత తోమా వుండగా కనిపించాడు (యోహాను 20:26-29; 1కొరింథి 15:5).

గలిలయలో యేసు పదకొండుమంది శిష్యులకు కనిపించాడు (మత్తయి 28:16-20; మార్కు 16:15-18). అయిదు వందలమంది అనుచరులు కూడా యేసును చూచారు. బహుశా ఇది కూడా గలిలయలోనే అయివుండ వచ్చు (1కొరింథీ 15:6).

గలిలయ సముద్రంపై ఒక రోజు ఉదయాన్నే ఏడుగురు శిష్యులు చేపలు పడుతూ వుండగా కనిపించి విస్తారంగా చేపలు పట్టేలా సాయం చేశాడు (యోమాను 21:1-23).

ఒలీవల కొండపైన పునరుత్థానుడైన 40 రోజుల తరువాత పదకొండుమంది శిష్యులకు, ముఖ్యులైన స్త్రీలకు, తన సోదరులకు, ఇతరులకు యేసు కనిపించి తన సందేశాన్ని లోకమంతటికీ కొని పొమ్మని ఆజ్ఞాపించాడు. అప్పుడాయన పరలోకానికి ఆరోహణ మయ్యాడు (లూకా 24:46-53; అ.కా. 1:3-14).

దమస్కు దారిలో తార్సువాడైన సౌలును మిట్టమధ్యాహ్న వేళ సంధించాడు. ఈ సంఘటన సౌలు రక్షణకు దారితీసింది (అపో.కా. 9:1-9; 1కొరి 15:8).

ఆలోచించండి 13:33

## విలువల విషయంలో రాజ్య దృక్పథం

తన అనుచరులు మారుతున్న కాలాల్ని పసిగట్టాలని యేసుప్రభువు కోరుతున్నాడు (మార్కు 13:33). ఇది చరిత్ర దృక్పథంతోనే కాదు, అంతకంటే మించి ఆయన రాజ్య దృక్పథంతో బేరీజు వేసుకోవాలి. విశ్వాసులంగా మనం నిత్యత్వానికి వారసులం గనుక మన విశ్వాసం ఇప్పుడు, ఇక్కడ మన స్థితిగతులకంటే సాధించిన వాటికంటే ఎంతో గొప్పదై వుండటం చాలా ముఖ్యం. అలాగని ఇప్పుడు, ఇక్కడ జీవించే జీవితం ప్రాముఖ్యమైంది కాదని అర్థం కాదు. మనం ఆయన రాజ్యంకోసం, మనకు తటస్థపడే వారందరికీ సేవ చెయ్యాలని ఆయన కోరుతున్నాడు.

నీవు దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నావు? పెద్ద పెద్ద కట్టడాలు కట్టడానికా? వ్యాపారంలో అనుకున్న లక్ష్యాలు సాధించడానికా?ఆస్తిపాస్తులు కూడబెట్టుకోడానికా ? ఉద్యోగ జీవితంలో పైమెట్టు ఎక్కడానికా? వాస్తవంగా ఇవేవీ తప్పుకాదు. అయితే, వీటిని పోగొట్టుకుంటావనుకో, నీ నమ్మకం కుప్పకూలుతుందా? వీటిపై నీ విలువ ఆధారపడి వుంటే నిచ్చెన పై మెట్టెక్కిన తరువాత ఏం జరుగుతుంది? నిచ్చెన భిన్నమైన గోడమీద అనుకున్నట్టు గమనిస్తావు.

అసలు చిక్కేమిటంటే విలువ విషయంలో దేవుడి దృక్పథానికి, లోక వ్యవస్థ దృక్పథానికీ ఎంతో తేడా వున్నది. లోక దృక్పథం వాస్తవంగా తల్లక్రిందులుగా వుంది. లోకంలో మన పనిపాటల ద్వారా తనను సేవించాలని దేవుడు పిలిచాడు. ఇది ఈ రోజున కొరవడింది. అందుకు భిన్నంగా నేటి సంస్కృతి నేర్పేదేమంటే ఏదో ఒక వృత్తిని చేపట్టి, దానిలో అంతకంతకు పైకి ఎగబాకాలని, ఫలితంగా స్వార్థం పెచ్చుమీది, స్వీయనాశనానికి దారితీస్తుంది.

జీవితంలో పై మెట్టెక్కటం అనే భావనలా అపార్థానికి గురిచేస్తుంది. ఒక వ్యక్తి పైకి ఎదిగే కొద్దీ అతడి గుర్తింపు, విలువ, భద్రత అతడు చేసే పని స్వభావం మీద అధికంగా ఆధారపడుతుంది. ఒకవేళ మన ఉద్యోగం, బిరుదులు, పెద్ద మొత్తంలో పొందే జీతభత్యాలు ఉన్నపళంగా ఊడిపోతే ఏమవుతుంది? చాలా సందర్భాల్లో త్రాగుడు, మాదక ద్రవ్యాలకు బానిసలు కావటం, భార్య పిల్లల్ని హింసించటం, విడాకులు, చివరకు ఆత్మహత్యా ప్రయత్నం మొదలైన సమస్యలన్నిటికీ మూలం ఉద్యోగం పోవటమే. మన ప్రాధాన్యత మనం చేసే పని మీద ఆధారపడి వుంటే అది పోవటంతోటే ఇది కూడా పోతుంది.

దేవుడు మనల్ని ఉన్నతమైన, స్థిరమైన విలువకు పిలుస్తున్నాడు. మనము దేవుని పిల్లలం, ఆయన రాజ్యంలో బాధ్యతగల ప్రజలుగా సత్కార్యములు చేస్తూ వుండాలని దేవుడు మనల్ని పిలిచాడు. అదీ మన అసలు గుర్తింపు, దానినుండే మనకు విలువ రావాలి (2ఎఫెసీ 2:10). ఇదీ మన పిలుపు లేదా దేవుడు అప్పగించిన పని లేఖనాల ప్రకారం మన పిలుపు.

- తిరుగులేనిది (రోమా 11:29)
- దేవుని నుండి కలిగినది : మనము క్రీస్తు మహిమలో పాలివారం కావాలని ఆయన కోరిక (2థెస్స 2:14)
- దేవుడు ముందే మనల్ని వీటి కొరకు సృష్టించాడు (ఎఫెసీ 2:10)
- తనను సేవించడానికి శక్తిని దేవుడే అనుగ్రహిస్తాడు. ఆయనపట్ల నమ్మకంగా వుండే శక్తి కూడా ప్రసాదిస్తాడు (1కొరి. 1:7–9).
- మన అసలైన గుర్తింపు, మనం చేసే పని నుండి కలుగుతుంది (2పేతురు 2:5,9)
- శ్రమలలో గుండా మనల్ని ముందుకు నడిపిస్తుంది (1పేతురు 2:19–21).
- మనం ఎలాంటి పరిస్థితుల్లో వున్నా నిశ్చింతంగా వుండ గలం (1కొరి. 7:15–24).
- లక్ష్యసాధన ధ్యేయంగా గాక శాశ్వత లక్ష్య సాధనపై దృష్టి నిలుపుతాం (ఫిలిప్పీ 3:13–4:1)

అన్నిటి కంటే మిన్నగా విశ్వాసులు శీలసంపద వృద్ధి చేసుకుంటూ, ఇతరులకు సేవచేస్తూ, దేవునికి నమ్మకంగా వుండాలని పిలుపు పొందారు. సమాజంలో మనం ఎంత ఉన్నత స్థానంలో వున్నా, ఎలాంటి వృత్తిలో వున్నా ఇవన్నీ

సాధించటం వీలవుతుంది. వీటిని నెరవేర్చబూనుకుంటే మనకు గొప్ప సంతృప్తి, విలువ కలుగుతుంది. మన ఉద్యోగం ఉన్నా, ఊడిపోయినా పౌలుతో కలిసి ఈ మాటలు చెప్పగలం: "దేవుని ప్రేమించు వారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని ఎరుగుదుము" (రోమా 8:28). (చాలామంది మధ్యవయస్సు వచ్చిన తరువాత జీవితంలోని ద్వితీయార్ధంలో ఏం సాధిస్తామా అంటూ తాపత్రయపడుతూ వుంటారు. ముఖ్యంగా వృత్తిలో ఒక దశకు లేదా ఉన్నత స్థానానికి చేరుకున్నవారు ఇలా తలపోస్తారు. అయితే మలిదశ జీవితం అర్ధవంతంగా, ఆత్మ తృప్తినిచ్చేదిగా వుండాలంటే కీర్తన 71 ధ్యానించాలి. అందులో తగిన సూచనలున్నాయి.)

## పన్నెండు మంది అపొస్తలులు

ఈ పన్నెండు మందిని అపొస్తలులు అని పిలిచారు. ఎందుకంటే వారు యేసుప్రభువు సందేశాన్ని ఇతరులకు ప్రకటించడానికి ప్రభువు పంపించాడు (గ్రీకు భాషలో "అపొస్తొలోస్" అనగా వార్తాహరులు). బోధించడానికి, దయ్యాలను వెళ్లగొట్టడానికి, రోగులను స్వస్థపరచడానికి ప్రభువు పంపిన పన్నెండు మంది శిష్యుల్ని అపొస్తలులు అని మార్కు 6:7లో పేర్కొనటం జరిగింది. ఇదే పదం ఇతర చోట్ల కూడా కనిపిస్తుంది. మత్తయి 10:2; లూకా 6:13. లూకా సువార్తలో మరో అయిదు చోట్లకూడా ఈ పదం ప్రయోగించారు (లూకా 9:10; 11:49; 17:5; 22:14; 24:10 చూడండి).

యేసు అనుచరులలో అనేకులను శిష్యులు, లేదా విద్యార్థులు అని పిలవొచ్చు. ఎందుకంటే వారు యేసు బోధనలను విని, స్వీకరించాడు. అయితే, యేసు బహుకొద్ది మందిని మాత్రమే ఎంపిక చేసికొని ప్రపంచ సావార్తీకరణ భారం వారి భుజాలమీద మోపాడు. ఈ పన్నెండు మంది యేసుక్రీస్తు అంతరంగిక బృందమయ్యారు (మత్తయి 19:28 భాషను బట్టి చూస్తే ఈ పన్నెండుమందీ ఇశ్రాయేలు పన్నెండు గోత్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లుంది. మత్తయి తన సువార్తను యూదులను మనసులో పెట్టుకొని రాసినందున ఈ చిత్రం వారిపై గట్టి ముద్రవేసే అవకాశం వున్నది).

ఈ పన్నెండు మంది యేసుతో ఉన్నారు, వారు అన్నిటికంటే ముఖ్యంగా ఆయన బోధలు విన్నారు. ఆయన సేవకు వారు ప్రత్యక్ష సాక్షులు, అప్పుడప్పుడు మెట్టికాయలు కూడా తిన్నారు. శుభవార్త ప్రకటించి ఇతరులకు సేవ చేయటంలో వారు యేసుతో చేతులు కలిపారు. ఈ పన్నెండు మందిలో పేతురు, యోహాను, యాకోబుకు యేసుక్రీస్తుకు నమ్మిన బంట్లు అని చెప్పొచ్చు. ఎందుకంటే యాయీరు కుమార్తెను లేపడం, రూపాంతరం, గెత్సెమనే తోటలో ఆయన ప్రార్థన చేయటం వారుమాత్రమే చూచారు. విచారకరమైన విషయమేమంటే ఈ పన్నెండు మందిలో అత్యంత సన్నిహితులు అని చెప్పుకొనే ఈ ముగ్గురిలో కూడా అసంతృప్తి బీజాలు నాటడంలో సాతాను కృతకృత్యుడయ్యాడు. ఫలితంగా ఇస్కరియోతు యూదా యేసును అప్పగించాడు. కేవలం మూడు సంవత్సరాలలో వీరిని ప్రభువు విశ్వాసంతో కూడిన నాయకులుగా తీర్చిదిద్దాడు. ఆయన పునరుత్థానం తరువాత వారికి పరిశుద్ధాత్మ శక్తినిచ్చి భూదిగంతాల వరకు సాక్షులుగా వుండమని పంపించాడు (మార్కు 16:15,16; అ.కా. 1:4; 5:2:1–21).